సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 315

సోమవారం 5-2-2024




'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'



గెలుపు తలుపు తట్టేదెవరు?

రనపట్టులో రెండో టెస్టు.. ఇంగ్లండ్ విజయ లక్ష్యం 399 పరుగులు - 14లో



లోతుగా తెలుసుకున్నాకే!

యులిప్‌లలో చార్జీలు ఎక్కువే.. ఈక్విటీలతో పోలిస్తే ప్రతిఫలంలో వెనుకే - 15లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కాంగ్రెస్‌కు అవగాహన లేదు

దేశాన్ని దశాబ్దాలపాటు పాలించిన కాంగ్రెస్‌కు పూజనీయ స్థలాల గొప్పదనంపై అవగాహన లేదంటూ ప్రధాని మోదీ దుయ్యబట్టారు.

వివరాలు 6లో ▸



దౌత్య ఆఫీసులో ఐఎస్‌ఐ ఏజెంట్

మాస్కోలోని భారత దౌత్య కార్యాలయంలో పనిచేస్తూ ఐఎస్‌ఐకి సమాచారం చేరవేస్తున్న ఓ అధికారిని యూపీ ఏటీఎస్ అరెస్ట్ చేసింది.

వివరాలు 6లో ▸



బీజేపీలో చేరాలని ఒత్తిడి

బీజేపీలో చేరాలని తనతోపాటు, ఆప్ నేతలపై ఒత్తిడి తెచ్చేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆరోపించారు.

వివరాలు 6లో ▸



గిరిజనుల తరఫున పోరాటం

గిరిజన ప్రజలకు జల్-జంగిల్-జమీన్‌పై హక్కులు కల్పించేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని ఆ పార్టీ నేత రాహుల్ చెప్పారు.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

బాబు పలుగుపోట్లు మర్చిపోతే ఎలా?

- ముఖ్యమంత్రి జగన్‌ది రాక్షస రాజ్యమంటూ పేట్రేగిన రామోజీ
- మెడికల్ కాలేజీ ముసుగులో మాన్సాస్ ట్రస్టు భూములమ్మి సొమ్ముచేసుకున్న టీడీపీది రామరాజ్యమా?
- అదే దేవదాయ శాఖ భూముల రక్షణకు జగన్ సర్కారు పటిష్ట చట్టం తెస్తే తట్టుకోలేరెందుకు?

- వివరాలు 5లో

ఈనాడు 'చావు' తెలివి..

- వ్యక్తిగత కారణాలతో ఉద్యోగిని మరణిస్తే ప్రభుత్వంపై రామోజీరావు అభాండాలు
- చావలి-1 ఆర్బీకే ఎరువుల బకాయి కేవలం రూ.16 మాత్రమే
- కానీ, ఈ వాస్తవాలకు ముసుగేసి ఆర్బీకేల సిబ్బంది మనోస్థైర్యం దెబ్బతినేలా నీచపు రాతలు

12 లో



ఏలూరులోని ప్రభుత్వ వైద్య కళాశాల

వైద్య విద్యలో నవశకం

ప్రభుత్వ వైద్య విద్యా రంగంలో సీఎం జగన్ సంచలన నిర్ణయాలు

రూ.8,480 కోట్లతో రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలలు

- ఇప్పటికే ఐదు కళాశాలల్లో తరగతులు ప్రారంభం
- వచ్చే విద్యా సంవత్సరంలో మరో ఐదు మొదలు
- 2025-26లో మిగిలిన 7 కాలేజీలు అందుబాటులోకి
- ఆధునిక వసతులతో నూతన మెడికల్ కళాశాలలు
- కొత్తగా 2,550 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి
- మన విద్యార్థులకు వైద్య విద్య అవకాశాలు మెరుగు
- ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు చేరువ

2 లో



సొంతూరిలోనే మెడిసిన్..

“మాది నంద్యాల. సీఎం జగన్ నంద్యాలలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేయడంతో కౌన్సెలింగ్‌లో మొదటి ప్రయారిటీ ఇచ్చా. అక్కడే సీటు వచ్చింది. ఉంటున్న ఊళ్లోనే ఎంబీబీఎస్ చదవడం నా అదృష్టం. కొత్త వైద్య కళాశాలల ద్వారా ఎంబీబీఎస్ సీట్లు పెరగడంతో తాముంటున్న చోట వైద్య విద్య చదవాలన్న నాలాంటి విద్యార్థుల కలలను ప్రభుత్వం నెరవేరుస్తోంది.

- వినయ్ కుమార్‌రెడ్డి, వైద్య విద్యార్థి, నంద్యాల వైద్య కళాశాల

సీబీఐ విచారణలో కాకాణికి క్లీన్‌చిట్

- నెల్లూరు న్యాయస్థానంలో చోరీతో ఆయనకు సంబంధం లేదు
- గతంలో పోలీసులు అరెస్టు చేసిన ఆ ఇద్దరే నిందితులు
- ఏపీ పోలీసుల విచారణ సక్రమంగానే సాగింది
- టీడీపీ నేత సోమిరెడ్డి ఆరోపణలన్నీ అవాస్తవం
- న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేసిన సీబీఐ

సాక్షి, అమరావతి: నెల్లూరు న్యాయస్థానంలో ఫైళ్ల గల్లంతైన కేసులో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చింది. ఫైళ్ల గల్లంతు వ్యవహారంతో కాకాణికి ఏమాత్రం సంబంధం లేదని, ఈ కేసులో ఏపీ పోలీసులు సక్రమంగానే దర్యాప్తు చేశారని తేల్చిచెప్పింది. రాష్ట్ర పోలీసులు దర్యాప్తు జరిపి నిందితులుగా పేర్కొన్న సయ్యద్ హయత్, షేక్ ఖాజా అనే ఇద్దరు వ్యక్తులే నెల్లూరు న్యాయస్థానంలో ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలతోపాటు ఫైళ్లను కూడా అపహరించినట్లు నిర్ధారించింది. మంత్రి కాకాణి ఆ ఫైళ్లను దొంగతనం చేయించారన్న టీడీపీ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసింది. ఈమేరకు విజయవాడలోని ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జ్- మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ న్యాయస్థానంలో సీబీఐ దాఖలు చేసిన చార్జ్‌షీట్

మిగతా 3వ పేజీలో ▶



సీబీఐ విచారణకు చంద్రబాబు సిద్ధమా?

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

3 లో



9 నుంచి ఆడుదాం ఆంధ్రా ఫైనల్స్

- విశాఖలో 13వ తేదీ వరకు నిర్వహణ
- రాష్ట్రస్థాయి విజేతలకు భారీగా నగదు బహుమతులు
- దిగ్విజయంగా ముగిసిన జిల్లాస్థాయి పోటీలు
- ఫైనల్స్‌లో 2,964 మంది క్రీడాకారుల పోటీ
- క్రీడాకారుల ఖాతాల్లోకి నగదు బహుమతులు

- వివరాలు 2లో



నేటి నుంచి అసెంబ్లీ

- 'మండలి' కూడా.. ఉదయం 10గంటలకు గవర్నర్ ప్రసంగం
- అనంతరం బీఏసీ సమావేశం.. 7న ఓటాన్ అకౌంట్ బడ్జెట్

సాక్షి, అమరావతి: రాష్ట్ర శాసనసభ, శాసన మండలి సమావేశాలు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రసంగంతో ఈ సమావేశాలు ప్రారంభమవుతాయి. అనంతరం శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ(బీఏసీ) సమావేశమై ఈ సమావేశాలు ఎప్పటి వరకు నిర్వహించాలనేది నిర్ణయించనుంది. అదేవిధంగా త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ నెల 7వ తేదీన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి పూర్తి బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటికీ, ఆర్థిక సంవత్సరం తొలి మూడు నెలలకు (ఏప్రిల్ నుంచి జూన్ వరకు) ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు అసెంబ్లీ ఆమోదం పొందనున్నారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ద్వారా ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉద్యోగుల జీతభత్యాలు, సామాజిక పింఛన్లు, కొనసాగుతున్న వివిధ పథకాలు, కార్యక్రమాలకు అవసరమైన నిధుల వ్యయానికి అసెంబ్లీ ఆమోదం తీసుకోనున్నారు. అంతకుముందు ఈ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఆమోదించడానికి ఏడో తేదీ ఉదయం 8గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో కేబినెట్ సమావేశం జరగనుంది.

2,002 ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్క్

నక్కపల్లి వద్ద రూ.1,235 కోట్లతో ఏర్పాటు



- ఈపీసీ విధానంలో నిర్మాణానికి బిడ్లు ఆహ్వానించిన ఏపీఐఐసీ
- ఈ పార్క్ ద్వారా రూ.14,340 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా
- కొత్తగా 100కు పైగా ఫార్మా యూనిట్లతో 27,360 మందికి ప్రత్యక్ష ఉపాధి
- ఇప్పటికే రాష్ట్రంలో 300కుపైగా ఫార్మా యూనిట్లు.. రూ.41,500 కోట్ల ఉత్పత్తులు

సాక్షి, అమరావతి: అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద 2,001.8 ఎకరాల్లో బల్క్‌డ్రగ్ పార్క్ రూపుదిద్దుకోనుంది. ఈ బల్క్‌డ్రగ్ పార్కును ఈపీసీ విధానంలో నిర్మించడానికి ఏపీఐఐసీ టెండర్లు పిలిచింది. రూ.1,234.75 కోట్లతో బల్క్‌డ్రగ్ పార్కును డిజైన్ చేసి అభివృద్ధి చేసే విధంగా ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించింది. 2001.8 ఎకరాల్లో.. 139.07 ఎకరాల్లో ఉన్న చెరువులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఈ పార్కును అభివృద్ధి చేయనున్నారు. అభివృద్ధి చేసిన పార్కులో 1,009.85 ఎకరాల్లో ఫార్మా పరిశ్రమలు, 595.4 ఎకరాల్లో ఏపీఐ-డీఐఎస్ సింథసిస్, 414.1 ఎకరాల్లో ఫెర్మిటేషన్స్, 150 ఎకరాలు ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగించే విధంగా ఈ పార్కును అభివృద్ధి చేయనున్నారు. మార్చి 18 నాటికి

మిగతా 2వ పేజీలో ▶

పరువు కోసం 'ఉమ్మడి' సభలు



- తన సభలకు జనం రాకపోవడంతో జనసేనతో కలసి సభల నిర్వహణకు చంద్రబాబు ప్లాన్
- రెండు దఫాలు చంద్రబాబు, పవన్ చర్చలు
- సుదీర్ఘంగా చర్చించినా సీట్లపై తేల్చకుండా సందిగ్ధం
- బీజేపీ నుంచి స్పష్టత వచ్చే వరకు వేచి చూడాలని నిర్ణయం

12 లో

ఇదండీ సంగతి



కామ్రేడ్లను అలానే వెనకేసుకొస్తే మిమ్మల్ని కూడా క్షమించరట!

చిన్న పరిశ్రమ ధగధగ

ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం

సింగిల్ విండో ద్వారా అనుమతులు.. ప్రోత్సాహకర రాయితీలు

- సత్వరమే స్పందిస్తున్న అధికార యంత్రాంగం
- ప్రతి జిల్లాలోనూ ఉద్భవిస్తున్న పారిశ్రామికవేత్తలు
- వందలాది మందికి ఉపాధి కల్పించే దిశగా ప్రయాణం

ఓ ప్రయత్నం పది మందికి ఉపాధి చూపించేందుకు మార్గమైంది. చిన్నపాటి సంకల్పం ఎంచుకున్న రంగంలో విజయపథానికి దారిచూపింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తే... ప్రతి జిల్లా పారిశ్రామికంగా పురోగమిస్తుందని రుజువైంది. విశాఖపట్నంలో అత్యాధునిక డెంటల్ ల్యాబ్... నెల్లూరు జిల్లా పొదలకూరులో బయో మాస్ బ్రికెట్స్... బాపట్ల జిల్లా బల్లికురవ మండలంలో మారుతి గ్రానైట్స్... ఇలా ఏర్పడిన చిన్న పరిశ్రమలే. ఇప్పుడు వందలాదిమందికి ఉపాధి కల్పిస్తూ... పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుతూ పదిమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అందుకు ప్రతి జిల్లాలో పుట్టుకొస్తున్న ఎంఎస్ఎంఈలే సాక్ష్యం.





కరోనా విలయం నుంచి... విజయపథానికి

గ్రానైట్ ఫ్యాక్టరీతో పది మందికి ఉపాధి వ్యవసాయం వదిలి పారిశ్రామిక పయనం





కర్షకుడి నుంచి కర్మాగార స్థాపన వరకూ..

పొదలకూరులో బయో మాస్ బ్రికెట్స్ పరిశ్రమ స్థాపన

10 లో






ఆ డెంటిస్ట్ కల అలా సాకారమైంది

విశాఖలో అత్యాధునిక డెంటల్ ల్యాబ్‌కు శ్రీకారం

విద్యార్థుల ఎదుగుదలే

ప్రభుత్వ 'సంకల్పం'



- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు లైఫ్ స్కిల్స్‌పై రాష్ట్ర సర్కార్ శిక్షణ
- నిత్య జీవితంలో సమస్యలను అధిగమించేలా తర్ఫీదు
- ఈ ఏడాది 1,300 హైస్కూళ్లలో ప్రారంభం
- మూడేళ్లలో మొత్తం 6,790 ఉన్నత పాఠశాలలకు ఈ కార్యక్రమం విస్తరణ
- దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో అమలు

16 లో

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

భయం పోయి ప్రశాంతంగా చదువుకుంటున్నా..



నేను కర్నూలు కృష్ణానగర్‌లో మా తాత, అమ్మ సంరక్షణలో ఉంటున్నా. అమ్మ షేక్ స్వాలేహా బేగం ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్. నెలకు రూ.10 వేలు వేతనం. తాత షేక్ సర్దార్ పటేల్ రిటైర్డు ప్రైవేటు ఉద్యోగి. అమ్మ ఆదాయంతో ఇల్లు గడవడం కష్టమే. ఈ పరిస్థితుల్లో నా చదువుపై బెంగ పెట్టుకున్నా. ఇంటర్మీడియట్‌లో 93 శాతం మార్కులు, ఏపీ ఈఏపీ సెట్‌లో 15వేల ర్యాంకు సాధించా. ఇంటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పై చదువులు ఎలా చదవాలో అర్థం కాలేదు. ఈ తరుణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేవుడిలా ఆదుకుంది. స్థానిక రవీంద్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్‌లో బీటెక్(సీఎస్‌ఈ)లో జాయిన్ అయ్యా. ఫీజు రీయింబర్స్‌మెంట్ నాకు వర్తించింది. జగనన్న విద్యా దీవెన కింద మూడేళ్లకు రూ.1.05 లక్షలు, వసతి దీవెన కింద రూ.30 వేలు విడుదలయ్యాయి. ఫీజుల భయం పోయింది. ప్రశాంతంగా చదువుకుంటున్నాను.

ఇప్పుడు ఫైనలియర్ బీటెక్. క్యాంపస్ సెలక్షన్‌లో అసెంచర్ కంపెనీలో అసోసియేట్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగానికి ఎంపికయ్యా. ఏడాదికి రూ.6.5లక్షల వేతనం. మా అమ్మగారికి వైఎస్సార్ చేయూత కింద ఏటా రూ. 18,750లు వంతున వచ్చింది. ప్రభుత్వం మాలాంటి పేద, మధ్య తరగతి విద్యార్థులను ఇలా ఆదుకోవడంతో చాలా మందికి మంచి ఉద్యోగావకాశాలు లభించాయి. నేను, కుటుంబ సభ్యులు ఎంతో ఆనందంగా ఉన్నారు. సీఎం సర్‌కు ధన్యవాదాలు.

– తయ్యిబా ఫాతిమా, బీటెక్ విద్యార్థి, క్రిష్ణానగర్
(జి.రాజశేఖర్‌నాయుడు, విలేకరి, కర్నూలు అర్బన్)

సమాజంలో మా గౌరవం పెరిగింది



నేను టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం భాసూరు గ్రామంలో భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులతో పాటు, వృద్ధురాలైన తల్లితో కలసి జీవిస్తున్నాను. రోజురోజుకూ రెడీమేడ్ దుస్తులు మార్కెట్‌లో విరివిగా లభిస్తున్న పరిస్థితుల్లో టైలరింగ్‌కు ఆదరణ తగ్గిపోయింది. దానివల్ల మాకు వచ్చే అరకొర ఆదాయం కూడా తగ్గిపోయింది. కుటుంబ పోషణ మరీ కష్టంగా తయారైంది. గత టీడీపీ హయాంలో రేషన్ బియ్యం పథకం తప్ప ఇంకేమీ వర్తించలేదు. ఈ తరుణంలో జగనన్న ప్రభుత్వం ఏర్పడ్డాక సంక్షేమ పథకాలు మమ్మల్ని ఆదుకున్నాయి. మా అమ్మకు వృద్ధాప్య పింఛన్ అందుతోంది. నా భార్యకు చేయూత కింద ఏటా రూ. 18,750లు వస్తోంది. నా మనవడు చదువుకుంటుండటంతో పెద్దకోడలు రాజ్యలక్ష్మి ఖాతాకు అమ్మఒడి డబ్బులు జమవుతున్నాయి. కొడుకు ఈశ్వరరావుకు సర్వేయర్‌గా గ్రామ సచివాయంలో ఉద్యోగం వచ్చింది. ఆర్థికంగా చేయూత లభిస్తుండడంతో కష్టాలు ఒక్కొక్కటి గెట్టెక్కాయి. సహచరులు, బంధువుల మధ్య కుటుంబానికి గౌరవం పెరిగింది. ఈశ్వరరావు సార్ ఉన్నారా... అంటూ నా కొడుకు కోసం వచ్చేవారు మాకు ఇస్తున్న మర్యాద వెలకట్టలేనిది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో మాకు సొంత ఇల్లు వచ్చింది. ఆయన బిడ్డ జగన్ ప్రభుత్వంలో సమాజంలో మరింత గౌరవం పెరిగింది.

– కదారు మోహనరావు, భాసూరు
(మారోజు కళ్యాణ్‌కుమార్, విలేకరి, పాలకొండ)

ఖర్చు లేకుండా రెండుసార్లు శస్త్రచికిత్స



నేను సాధారణ రైతును. నాకు భార్య, ఒక కొడుకు, కూతురు ఉన్నారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం లుకలాంలో నాకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. అన్నీ అనుకూలిస్తే నాలుగు వేళ్లు నోటికెళ్లేవి. లేకుంటే అప్పులు చేయాల్సి వచ్చేది. కునికిన నక్కపై తాటిపండు పడ్డట్టు నాలుగేళ్ల క్రితం కిడ్నీలో రాళ్లు చేరాయి. తెలియక అశ్రద్ధ చేయడంతో కిడ్నీలు మరింత పాడయ్యాయి. వైద్యులకు చూపిస్తే ఇన్‌ఫెక్షన్ వల్ల కిడ్నీలు పోయే ప్రమాదం ఉందన్నారు. చికిత్సకు రెండు లక్షల వరకూ ఖర్చవుతుందన్నారు. అంత మొత్తం వెచ్చించలేక సతమతమయ్యాను. అయితే నాకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని ఆరోగ్య మిత్ర చెప్పడంతో వారి ద్వారా విశాఖలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేరా. పైసా ఖర్చు లేకుండా చికిత్స చేశారు. ప్రస్తుతం నయం అయింది. ఇప్పుడు ఆరోగ్యంగా జీవించగలుగుతున్నాను. గడిచిన ఏడాదిలో మళ్లీ రాళ్లు చేరితే ఆరోగ్యశ్రీ ద్వారానే ఆపరేషన్ చేయించుకున్నా. నాలాంటి వారికి ఎందరికో ఈ పథకం ప్రాణదానం చేసినట్టయింది. ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన వైఎస్సార్ పేరును నా కుడి చేయిపై పచ్చబొట్టు వేయించుకున్నా. కొడుకు, కూతురికి పెళ్లిళ్లయ్యాయి. వారు వేరేగా ఉంటున్నారు. జగనన్న అమలు చేస్తున్న వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా ఠంఛన్‌గా రూ. 13,500లు చొప్పున వస్తోంది. నా భార్య రమణమ్మకు వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా రూ. 45 వేలు వచ్చింది. చేయూత పథకం ద్వారా ఏటా రూ. 18,750 వంతున వచ్చింది. మా ఆర్థిక పరిస్థితి ఇప్పుడు చాలా బాగుంది.

– శానాపతి సూర్యనారాయణ(రోహిణి) లుకలాం
(మామిడి రవి, విలేకరి, నరసన్నపేట)

వైద్య విద్యలో నవశకం

ప్రభుత్వ వైద్య విద్యా రంగంలో సీఎం జగన్ సంచలన నిర్ణయాలు

రూ.8,480 కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలలు



ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన విజయనగరం వైద్య కళాశాల

సాక్షి, అమరావతి: ఇప్పుడు వైద్య సేవలే కాదు.. వైద్య విద్య కూడా మనకు చేరువైంది. ఒకపక్క ప్రజారోగ్య సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మరోపక్క మన విద్యార్థుల వైద్య విద్య కలలను సైతం సాకారం చేశారు. కోట్లుంటేనే డాక్టర్ కోటు సాధ్యమనే నానుడిని తొలగిస్తూ ఒకేసారి పెద్ద ఎత్తున వైద్య కాలేజీల ఏర్పాటుతో మెడికల్ మిరాకిల్ చేశారు! స్వాతంత్య్రం వచ్చాక రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో ఏర్పాటైన మెడికల్ కాలేజీల సంఖ్య 11. గత నాలుగున్నరేళ్ల కృషి ఫలితంగా కొత్తగా సాకారమవుతున్న ప్రభుత్వ వైద్య కళాశాలల సంఖ్య ఏకంగా 17. వైద్య ఆరోగ్య రంగానికి ప్రభుత్వం ఎంత ప్రాధాన్యమిస్తోందో చెప్పేందుకు ఇది చాలు! 'పేదలకు ఉచితంగా విద్య, వైద్యం అందించడం ప్రభుత్వాల బాధ్యత. ఈ రెండింటినీ ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తేనే పేదలకు నిజమైన ప్రయోజనం చేకూరుతుంది..' ఈ సిద్ధాంతాన్ని మనస్ఫూర్తిగా విశ్వసిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మనిషి ప్రాణం విలువ తెలిసిన మనసున్న పాలకుడిగా ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా చర్యలు చేపడుతున్నారు. గత సర్కారు హయాంలో నరకానికి నకళ్లుగా మారిన ప్రభుత్వాస్పత్రుల రూపురేఖలను మార్చడానికి రూ.16 వేల కోట్లకుపైగా నిధులతో నాడు-నేడు కార్యక్రమాన్ని చేపట్టారు. ఏకంగా 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు ద్వారా పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను చేరువ చేస్తున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి వినూత్న కార్యక్రమాల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్యులను రప్పించి మారుమూల ప్రాంతాలవారికీ వ్యయ ప్రయాసలు లేకుండా ఉచితంగా వైద్య సేవలందిస్తున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ చికిత్స పరిమితిని ఏకంగా రూ.25 లక్షలకు పెంచి ప్రతి ఒక్కరికీ సంపూర్ణ వైద్య భరోసా కల్పిస్తున్నారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, ఎంబీబీఎస్ సీట్లు ఇలా

సంవత్సరం	కళాశాలలు	సీట్లు
2019-20	12 (పద్మావతి మెడికల్ కళాశాలతో కలిపి)	2,360
2023-24	17	3,110
2024-25	22	3,860
2025-26	29	4,910

నూతన వైద్య కళాశాలల కోసం ప్రభుత్వం చేసే ఖర్చు ఇలా.. (రూ. కోట్లలో)

కొత్తగా ప్రారంభించినవి		2024-25లో ప్రారంభించేవి		2025-26లో ప్రారంభించేవి	
విజయనగరం	500	పాడేరు	500	పిడుగురాళ్ల	500
మచిలీపట్నం	550	మార్కాపురం	475	పెనుకొండ	475
రాజమండ్రి	475	మదనపల్లె	475	పాలకొల్లు	475
ఏలూరు	525	పులివెందుల	500	నర్సీపట్నం	500
నంద్యాల	475	ఆదోని	475	పార్వతీపురం	600
				బాపట్ల	505
				అమలాపురం	475



ఏలూరు వైద్య కళాశాలలోని డిజిటల్ క్లాస్ రూమ్



ఏలూరు వైద్య కళాశాలలోని ల్యాబ్

ఇక అందిన ద్రాక్ష..

అందని ద్రాక్ష లాంటి వైద్య విద్యను పేద, మధ్య తరగతి విద్యార్థులకు చేరువచేస్తూ రూ.8,480 కోట్లతో రాష్ట్రంలో ఏకంగా 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. వీటి ద్వారా అన్ని ప్రాంతాల ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను చేరువ చేస్తున్నారు. ఇప్పటికే 5 కొత్త మెడికల్ కళాశాలలను ప్రారంభించగా వచ్చే విద్యా సంవత్సరంలో మరో ఐదు ఆరంభం కానున్నాయి. మిగిలిన 7 కాలేజీలను 2025-26లో ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. కొత్త మెడికల్ కళాశాలల ద్వారా 2,550 ఎంబీబీఎస్ సీట్లను విద్యార్థులకు అదనంగా అందుబాటులోకి తెస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం (2023-24) నుంచి విజయనగరం, ఏలూరు, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలలను ప్రారంభించి ఒకే ఏడాది 750 ఎంబీబీఎస్ సీట్లలో అడ్మిషన్లు చేపట్టి రికార్డు సృష్టించారు. రాష్ట్రంలో మొదటి వైద్య కళాశాల ఆంధ్రా మెడికల్ కాలేజీ 1923లో ఏర్పాటైంది. అప్పటి నుంచి 2019 వరకు 96 ఏళ్లలో ప్రభుత్వ రంగంలో ఏర్పాటైన మెడికల్ కాలేజీలు 11 మాత్రమే. వచ్చే విద్యా సంవత్సరంలో మార్కాపురం, మదనపల్లె, పాడేరు, పులివెందుల, ఆదోని మెడికల్ కాలేజీలను ప్రారంభించనున్నారు. ఒకేసారి ఇన్ని వైద్య కళాశాలలను అందుబాటులోకి తేవడం ప్రజారోగ్యం పట్ల సీఎం జగన్ నిబద్ధత, దార్శనికతకు నిదర్శనం.

ఉద్యోగాలు.. ఉపాధి

కొత్త మెడికల్ కాలేజీల రాకతో విద్య, వైద్య సదుపాయాలు మెరుగుపడటంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) నిబంధనలకు అనుగుణంగా ప్రతి చోటా అత్యాధునిక బోధనాస్పత్రి, వైద్య కళాశాలలను నిర్మిస్తున్నారు. వైద్యులు, సిబ్బంది పోస్టులను కొత్తగా సృష్టించి భర్తీ చేయడం ద్వారా ఉద్యోగాలు లభిస్తాయి. నిర్మాణం, ఇతర రంగాలపై ఆధారపడిన వారికి ఉపాధి సమకూరుతుంది.

రెండు రకాల లాభాలు

కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుతో రాష్ట్ర విద్యార్థులకు వైద్య విద్య అవకాశాలు పెరగడంతోపాటు పరిసర ప్రాంతాల్లోని పేద ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుతాయి. ఇప్పటివరకు జిల్లా, ఏరియా ఆస్పత్రులున్న చోట బోధనాస్పత్రులు అందుబాటులోకి వస్తున్నాయి. వీటి ద్వారా నిపుణులైన వైద్యుల సేవలు పేద ప్రజలకు అందనున్నాయి. ఒక ఎంబీబీఎస్ బ్యాచ్ పూర్తై బయటకు వచ్చే సమయానికి ప్రతి కొత్త వైద్య కళాశాలలో 600 పడకల సామర్థ్యంతో ఆస్పత్రులు కార్యకలాపాలు నిర్వహిస్తుంటాయి. గత ఏడాది ప్రారంభించిన ఐదు వైద్య కళాశాలలకు అనుసంధానంగా నడిచే బోధనాస్పత్రుల్లో కిడ్నీ, న్యూరో, కార్డియాలజీ, క్యాన్సర్ లాంటి సూపర్ స్పెషాలిటీ విభాగాలను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో అధునాతన వైద్య పరికరాలు, ల్యాబ్‌లు ఏర్పాటు కావడంతో వైద్యం, రోగనిర్ధారణ సేవల్లో నాణ్యత పెరుగుతుంది. రేడియాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ విభాగాల ఏర్పాటుతో వివిధ రకాల వ్యాధులు, జబ్బులపై పరిశోధన జరుగుతుంది. ఎంబీబీఎస్ విద్యార్థులు నాలుగేళ్ల అనంతరం హౌస్ సర్జన్‌లుగా అందుబాటులోకి వస్తారు. వీరు 24/7 ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండటంతో రోగులకు నిరంతరాయంగా సేవలు అందుతాయి. అంతేకాకుండా ఐదేళ్ల తర్వాత పీజీ సీట్లు కూడా వస్తాయి. వీటి ద్వారా స్పెషలిస్ట్ వైద్యుల సంఖ్య పెరుగుతుంది. జిల్లాలోనే పెద్దాస్పత్రులు సమకూరడంతో ప్రజలు వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన శ్రమ, ఖర్చు ఉండదు.

నాడు ప్రైవేట్‌కు పట్టం..

నాకంటే విజనరీ ఎవరున్నారు? అంటూ తరచూ బుకాయించే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సుదీర్ఘ కాలం అధికారంలో కొనసాగినా కూడా విద్య, వైద్య రంగాల అభివృద్ధికి చేసిన కృషి శూన్యం. 2014 నుంచి నాలుగేళ్ల పాటు కేంద్రంలో అధికారాన్ని పంచుకుని కూడా ఒక్క ప్రభుత్వ వైద్య కళాశాలనూ తేలేదు. కనీసం ఆ ప్రయత్నమూ చేయలేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూ ప్రైవేట్ వైద్య కళాశాలలను ప్రోత్సహించారు. 'ప్రభుత్వ రంగంలో కళాశాల ఏర్పాటు చేయాలంటే రూ.350 కోట్లు అవుతుంది. ఏటా రూ.30 కోట్లు ఖర్చు చేయాలి. మేం ప్రైవేట్ వైద్య కళాశాలల ఏర్పాటును ప్రోత్సహిస్తాం' అని చంద్రబాబు సర్కారులో వైద్య శాఖ మంత్రిగా పనిచేసిన కామినేని శ్రీనివాసరావు సాక్షాత్తు అసెంబ్లీలో ప్రకటించారు.

విప్లవాత్మక నిర్ణయం



17 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుతో ప్రభుత్వ రంగ కళాశాలలు రెట్టింపవుతాయి. ఇది ప్రజారోగ్య పరిరక్షణలో విప్లవాత్మక నిర్ణయం. 75 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయాలు లేవు. గిరిజన జనాభా అత్యధికంగా ఉండే పాడేరు ప్రాంతంలో సీఎం జగన్ కొత్తగా ప్రభుత్వ వైద్య కళాశాలను అందుబాటులోకి తెస్తుండటం హర్షించదగ్గ విషయం.

– డాక్టర్ బాబ్జీ, వీసీ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం

పక్క జిల్లాలోనే సీటు..



మాది శ్రీకాకుళం. పొరుగు జిల్లాలోని వైద్య కళాశాలలో సీటు రావడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం కొత్తగా ఈ ఏడాది ఐదు మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తేవడంతో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య పెరిగింది. నాకు పక్క జిల్లాలోనే సీటు వచ్చింది. మా కాలేజీలో అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ఉన్నారు. కార్పొరేట్ కళాశాలలకంటే మెరుగైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పించింది.

– బడగాల మనస్విని, వైద్య విద్యార్థిని, ప్రభుత్వ వైద్య కళాశాల, విజయనగరం



మచిలీపట్నం వైద్య కళాశాల



రాజమండ్రి వైద్య కళాశాల

2,002 ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్క్

▶ మొదటి పేజీ తరువాయి

బిడ్డింగ్ ప్రక్రియ పూర్తిచేసి పనులు అప్పగించనున్నారు. చైనా నుంచి ఫార్మా దిగుమతులను తగ్గించుకోవాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మూడు బల్క్‌డ్రగ్ పార్కులను ఏర్పాటు చేయడానికి ముందుకొస్తే.. 16 రాష్ట్రాలతో పోటీపడి ఆంధ్రప్రదేశ్ ఈ పార్కును కైవసం చేసుకున్న విషయం విదితమే. తొలుత కాకినాడ వద్ద నిర్మించడానికి ప్రయత్నం చేయగా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేయాలన్న నిబంధన మేరకు నక్కపల్లి వద్ద పార్కును అభివృద్ధి చేస్తున్నారు.

ఫార్మాహబ్‌గా ఏపీ

ఈ బల్క్‌డ్రగ్ పార్కుతో రాష్ట్రం ఫార్మాహబ్‌గా ఎదగనుంది. ఇప్పటికే రాష్ట్రంలో 300కు పైగా ఫార్మా కంపెనీలున్నాయి. ఈ బల్క్ డ్రగ్ పార్కు అందుబాటులోకి వస్తే 100కు పైగా ఫార్మా కంపెనీలు కొత్తగా ఏర్పాటవుతాయని అంచనా వేస్తున్నారు. వీటిద్వారా 27,360 మందికి ప్రత్యక్షంగా ఉపాధికి లభిస్తుందని అంచనా. ప్రస్తుతం దేశీయ ఫార్మా ఉత్పత్తుల్లో రాష్ట్రం 16 శాతం వాటాతో మూడోస్థానంలో ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.41,500 కోట్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు వస్తుండగా.. అందులో రూ.8,300 కోట్లకుపైగా ఎగుమతులు జరుగుతున్నాయని అంచనా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2,400 ఎకరాల్లో అభివృద్ధి చేసిన జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలో ఇప్పటికే మైలాన్, ఫైజర్, డాక్టర్ రెడ్డీస్, అరబిందో వంటి 60కి పైగా దిగ్గజసంస్థలు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఈ బల్క్ డ్రగ్ పార్కు అందుబాటులోకి వస్తే అంతర్జాతీయ కంపెనీలు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

బలపడుతున్న శ్రీసిటీ-జపాన్ వ్యాపార బంధం



జపాన్‌లో భారత రాయబార కార్యాలయ అధికారితో శ్రీసిటీ బృందం

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీసిటీ-జపాన్ వ్యాపార బంధం భవిష్యత్‌లో మరింత బలోపేతం అయ్యే దిశగా శ్రీసిటీ మార్కెటింగ్ బృందం 2 రోజులుగా జపాన్‌లో చర్చల ద్వారా చొరవ చూపుతోందని ఏపీ ప్రభుత్వ సలహాదారు (పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు)ఆర్.శివశంకర్, శ్రీసిటీ మార్కెటింగ్ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టోక్యో ఆటోమోటివ్ వరల్డ్ ఎక్స్‌పోలో పాల్గొనడంతో పాటు, ప్రస్తుతం జపాన్‌లో పర్యటిస్తూ చురుకైన మార్కెటింగ్ ప్రణాళికలను అనుసరిస్తోందని పేర్కొన్నారు. జపాన్‌లోని భారత రాయబారి, జపాన్ ప్రభుత్వం అక్కడి పరిశ్రమలకు చెందిన సీనియర్ అధికారులతో శ్రీసిటీ బృందం సమావేశాలు నిర్వహిస్తోందని, జపాన్‌లో భారత రాయబారి జార్జ్ తో రెండు రోజులుగా నిర్వహించిన సమావేశంలో ఏపీ ప్రభుత్వ సలహాదారు ఆర్.శివశంకర్, శ్రీసిటీ డీజీఎం (మార్కెటింగ్) గోపి కృష్ణ పాల్గొని శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలపై చర్చించారు. శ్రీసిటీ ప్రయత్నాలు మంచి ఫలితాలు సాధిస్తాయని, జపాన్‌తో శ్రీసిటీ వ్యాపార బంధం మరింత బలోపేతం అవుతుందంటూ శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి చెప్పారు.

9 నుంచి ఆడుదాం ఆంధ్రా ఫైనల్స్

విశాఖలో 13వ తేదీ వరకు నిర్వహణ



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రా మెగా టోర్నీ తుదిఘట్టానికి చేరుకుంది. గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా ఐదుదశల పోటీల్లో దిగ్విజయంగా నాలుగింటిని దాటుకుని ఫైనల్స్‌కు చేరుకుంది. ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు విశాఖ వేదికగా విజయగీతిక మోగించనుంది. దేశచరిత్రలో కనీవినీ ఎరుగనిరీతిలో 1.22 కోట్ల మంది క్రీడాకారులు, వీక్షకుల రిజిస్ట్రేషన్లతో ఆడుదాం ఆంధ్రా రికార్డు సృష్టించింది. గ్రామ/వార్డు సచివాలయం, మండల స్థాయిలో ప్రతిభకు పెద్దపీట వేస్తూ నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలకు నగదు బహుమతులను అందిస్తోంది.

8 క్రీడా మైదానాల ఎంపిక

ఆడుదాం ఆంధ్రా మెగా టోర్నీ ఫైనల్స్ కోసం విశాఖలో ఎనిమిది క్రీడా మైదానాలను తాత్కాలికంగా గుర్తించారు. క్రికెట్ పోటీలను రైల్వే స్టేడియం, ఆంధ్ర మెడికల్ కాలేజీ, జీవీఎంసీ ఇందిరాప్రియదర్శిని, డాక్టర్ వైఎస్సార్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలోని గ్రౌండ్-బి, బ్యాడ్మింటన్ పోటీలను జీవీఎంసీ ఇండోర్ స్టేడియం, వాలీబాల్ పోటీలను ఆంధ్ర యూనివర్సిటీ అవుట్‌డోర్, కబడ్డీని ఏయూ జిమ్నాస్టిక్స్ ఇండోర్ హాల్స్, ఖోఖోను ఏయూ జిమ్నాజియం అవుట్‌డోర్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వీటిని పర్యవేక్షించేందుకు ప్రభుత్వం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా పరిషత్ సీఈవో స్థాయి అధికారులను ఇన్‌చార్జీలుగా నియమించింది.

పారదర్శకంగా నగదు బహుమతుల ప్రదానం

15 ఏళ్లకు పైబడిన పురుషులు, మహిళలను క్రికెట్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్ వంటి కాంపిటీటివ్ క్రీడలతోపాటు నాన్-కాంపిటీటివ్‌లో సంప్రదాయ మారథాన్, టెన్నీకాయిట్, యోగాలోను పోటీలు నిర్వహించారు. ఇప్పటివరకు 38,08,741 మంది క్రీడాకారులు (23,81,621 మంది పురుషులు, 14,27,120 మంది మహిళలు) నమోదు చేసుకున్నారు. ఇందులో గ్రామ/వార్డు స్థాయిలో మొత్తం 24,46,538 మంది క్రీడాకారులు (13,92,764 మంది పురుషులు, 10,53,774 మంది మహిళలు) పాల్గొన్నారు. వారిలో మండల స్థాయికి 17,10,456 మంది క్రీడాకారులు (8,55,228 మంది పురుషులు, 8,55,228 మంది మహిళలు) పోటీపడ్డారు. వారిలో 85,842 మంది క్రీడాకారులు (42,921 మంది పురుషులు, 42,921 మంది మహిళలు) నియోజకవర్గస్థాయిలో సత్తాచాటారు. నియోజకవర్గస్థాయిలో తొలి మూడుస్థానాల్లో నిలిచిన జట్లకు (51,164 మంది క్రీడాకారులు పాల్గొంటే 28,513 మంది విజేతలు) నగదు బహుమతులు పొందారు. జిల్లాస్థాయి పోటీల అనంతరం ఫైనల్స్‌కు 1,482 మంది పురుషులు, 1,482 మంది మహిళలు.. మొత్తం 2,964 మంది అర్హత సాధించారు. ఆయా క్రీడల్లో తొలి మూడుస్థానాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పారదర్శకంగా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు బహుమతులను జమచేసేందుకు శాప్ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

స్థాయిల వారీగా ఆడుదాం ఆంధ్రా విజేతలకు నగదు బహుమతులు ఇలా..

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖోలో ఒక్కో జట్టుకు..

స్థానం	నియోజకవర్గ స్థాయి	జిల్లా స్థాయి	రాష్ట్రస్థాయి
ప్రథమ	35,000	60,000	5,00,000
ద్వితీయ	15,000	30,000	3,00,000
తృతీయ	5,000	10,000	2,00,000
బ్యాడ్మింటన్ డబుల్స్‌లో..			
ప్రథమ	20,000	35,000	2,00,000
ద్వితీయ	10,000	20,000	1,00,000
తృతీయ	5,000	10,000	50,000

సీబీఐ విచారణలో కాకాణికి క్లీన్‌చిట్

▶ మొదటి పేజీ తరువాయి

తాజాగా వెలుగులోకి వచ్చింది.

అన్ని కోణాల్లో సమగ్ర విచారణ...

నెల్లూరులోని నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ న్యాయస్థానంలో 2022 ఏప్రిల్ 13వతేదీ రాత్రి కొందరు ఆగంతకులు దొంగతనానికి పాల్పడి ఎలక్ట్రానిక్ ఉపకరణాలతోపాటు పలు పత్రాలను అపహరించారు. దీనిపై మర్నాడు కేసు నమోదు చేసిన నెల్లూరు పోలీసులు దర్యాప్తు చేసి దొంగతనానికి పాల్పడ్డ సయ్యద్ హయత్, షేక్ ఖాజాలను అరెస్ట్ చేసి వారి నుంచి ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ఆదేశాలతో రిమాండ్‌కు పంపారు. ఈ ఉదంతంపై టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వ్యతిరేకంగా న్యాయస్థానంలో దాఖలైన కేసులో ఆధారాలను గల్లంతు చేసేందుకు చోరీకి పురిగొల్పారని అభాండాలు వేశారు. ఈ ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి కాకాణి దీనిపై సీబీఐ విచారణకు సిద్ధమని ప్రకటించారు. ఈ క్రమంలో న్యాయస్థానం ఆదేశాలతో ఈ కేసు విచారణ చేపట్టిన సీబీఐ అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు జరిపింది. రెండేళ్లపాటు దర్యాప్తు చేసి 88 మంది సాక్షులను విచారించి రూపొందించిన 403 పేజీల చార్జ్‌షీట్‌ను న్యాయస్థానానికి సమర్పించింది. ఈ వ్యవహారంతో మంత్రి కాకాణికి ఎలాంటి సంబంధం లేదని సీబీఐ నిర్ధారించింది. ఏపీ పోలీసులు ఈ కేసును సక్రమంగానే విచారించారని స్పష్టం చేసింది. చార్జ్‌షీట్‌లో సీబీఐ ప్రధానంగా పేర్కొన్న అంశాలివీ..

కాకాణికి సంబంధం లేదు...

నెల్లూరు న్యాయస్థానంలో ఫైళ్ల గల్లంతు వ్యవహారంతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదు. మంత్రి కాకాణి, ఆయన పీఏలు, సన్నిహితుల ఫోన్ కాల్స్ డేటాను సీబీఐ విశ్లేషించింది. న్యాయస్థానం సిబ్బందితోగానీ, ఈ కేసుతో సంబంధం ఉన్న వారితోగానీ, దర్యాప్తు అధికారులతోగానీ మంత్రి కాకాణి, ఆయన అనుచరులు ఫోన్‌లో మాట్లాడినట్టు ఎలాంటి ఆధారాలు లభించలేదు. పోలీసు అధికారులతో బందోబస్తు ఏర్పాట్ల గురించి అతి స్వల్ప వ్యవధి కాల్స్ మాత్రమే ఉన్నాయి. ఈ దొంగతనం కేసులో అరెస్ట్ చేసిన నిందితులు సయ్యద్ హయత్, ఖాజా రసూల్‌తో మంత్రి కాకాణికి ఎలాంటి సంబంధాలు లేవన్నది నిర్ధారణ అయింది. నిందితుల నుంచి పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను ఎవరూ ట్యాంపర్ చేయలేదని తిరువనంతపురంలోని సీ–డాక్ పరీక్షల్లో నిర్ధారణ అయింది.

దొంగతనాలే ప్రవృత్తి..

ఈ కేసులో ఏపీ పోలీసులు అరెస్ట్ చేసిన ఇద్దరు నిందితులు సయ్యద్ హయత్, ఖాజా రసూలే నెల్లూరు న్యాయస్థానంలో దొంగతనానికి పాల్పడ్డారు. నేర చరిత్ర ఉన్న వారిద్దరిపై 15 కేసులు నమోదయ్యాయి. వాటిలో ఏడు కేసుల్లో శిక్ష పడగా మిగిలిన కేసులు విచారణలో ఉన్నాయి. మద్యం, గంజాయి వ్యసనాలకు అలవాటు పడిన నిందితులిద్దరూ దొంగతనాలనే వృత్తిగా చేసుకున్నారు. నిందితుల భార్యలు కూడా వారికి దూరంగా ఉంటున్నారు. నిందితులు తమ తల్లుల ఫోన్లను మాత్రమే వినియోగిస్తున్నారు. వారిద్దరే నెల్లూరు న్యాయస్థానంలో చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. ల్యాప్‌టాప్, ట్యాబ్, మొబైల్ ఫోన్లను తస్కరించి మిగిలిన పత్రాలను సమీపంలోని కాలువలో పారేశారు. తాము అపహరించిన వస్తువులు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వ్యతిరేకంగా ఉన్న కేసుకు సంబంధించినవి అనే విషయం నిందితులకు తెలియదు. పోలీసులు వారిద్దరి నుంచి ల్యాప్‌టాప్, ట్యాబ్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కాలువలో పారేసిన రబ్బరు స్టాంపులు, రౌండ్ సీళ్లు, స్టాంపు, స్టాంప్ ప్యాడ్‌లు మాత్రం లభ్యం కాలేదు.

సోమిరెడ్డి ఆరోపణలు అవాస్తవం

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర పోలీసులకు వ్యతిరేకంగా టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని సీబీఐ తేల్చి చెప్పింది. ఆయన చేసిన 14 ఆరోపణలను విడివిడిగా ప్రస్తావిస్తూ అవన్నీ నిరాధారణమని పేర్కొంది. నెల్లూరు న్యాయస్థానంలో దొంగతనానికి పాల్పడ్డ సయ్యద్ హయత్, ఖాజా రసూలపై విచారణ కొనసాగించాలని సీబీఐ పేర్కొంది.

సీబీఐ విచారణకు చంద్రబాబు సిద్ధమా?

పారదర్శకంగా నెల్లూరు పోలీసుల విచారణ: మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): కోర్టులో ఫైల్స్ మిస్సింగ్ కేసులో తనపై వచ్చిన ఆరోపణలను పటాపంచలు చేస్తూ సీబీఐ క్లీన్‌చిట్ ఇచ్చిందని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను మంత్రిగా ప్రమాణం చేసిన మూడు రోజులకే కోర్టులో ఫైల్స్ మిస్సింగ్ ఘటన చోటు చేసుకుందని, ఈ కేసును విచారించిన ఎస్పీ విజయారావు పూర్తి వివరాలను వెల్లడించారని గుర్తు చేశారు. టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తనపై బురద చల్లేందుకు దీన్ని తనకు ఆపాదిస్తూ ఆరోపణలు చేశారన్నారు. చంద్రబాబు, లోకేశ్ కూడా తనపై ఆరోపణలు చేశారన్నారు. ఏడాదిపాటు క్షుణ్ణంగా విచారించిన సీబీఐ అధికారులు 88 మందిని విచారించి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారని చెప్పారు.

ఆ ముగ్గురూ సమాధానం చెప్పాలి

తనకు సంబంధం లేని ఫైల్స్ చోరీ కేసులో చంద్రబాబు తనపై నిందలు వేశారని, లోకేశ్ కూడా కోర్టు దొంగ అంటూ తనపై నిందలు మోపారని, ప్రజలు నాలుగుసార్లు తిరస్కరించిన సోమిరెడ్డి తనపై దురుద్దేశంతో ఆరోపణలు చేశారని కాకాణి పేర్కొన్నారు. సీబీఐ ఇచ్చిన నివేదికతో ఆ ముగ్గురు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. వాస్తవాలు తెలుసుకోకుండా సీపీఐ రామకృష్ణ కూడా విమర్శలు చేశారన్నారు. పోలీసులు అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారంటూ లోకేశ్ పలు దఫాలు విమర్శలు చేశారన్నారు. పోలీసులు ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా పారదర్శకంగా విచారణ నిర్వహించారనేందుకు ఈ కేసే ఉదాహరణ అని తెలిపారు.

బాబు కుమ్మక్కు రాజకీయాలు

నిజం గెలవాలంటూ పర్యటిస్తున్న నారా భువనేశ్వరి నిజంగానే అలా కోరుకుంటుంటే చంద్రబాబుపై ఉన్న కేసులపై సీబీఐ విచారణ జరిగితే నిజం గెలుస్తుందని మంత్రి కాకాణి వ్యాఖ్యానించారు. చంద్రబాబు సీబీఐ విచారణకు సిద్ధమేనా? అని మంత్రి సవాల్ విసిరారు. తనకు అనుభవం ఉందంటూ ప్రగల్భాలు పలికే చంద్రబాబు నిత్యం అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్‌తో రాజకీయంగా తలపడలేక కుమ్మక్కు రాజకీయాలకు తెర తీశారని ధ్వజమెత్తారు.


మావాళ్లను నిర్బంధించి కండువాలు వేశారు

• ఎమ్మెల్సీ భరత్

కుప్పం (చిత్తూరు జిల్లా): తమ పార్టీకి చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులను టీడీపీ నేతలు నిర్బంధించి కండువా కప్పారని, తరువాత వారు టీడీపీలో చేరారని తప్పుడు ప్రచారం చేశారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ భరత్ విమర్శించారు. ఆయన ఆదివారం కుప్పంలో మాట్లాడారు. శాంతిపురం మండలం


సమావేశంలో ఎమ్మెల్సీ భరత్‌తో మురళి, చంద్ర

మఠం పంచాయతీ సర్పంచ్ మురళి, ఎంపీటీసీ సభ్యుడు చంద్రలను నిర్బంధించి టీడీపీ కండువా కప్పి వారు పార్టీలో చేరారని టీడీపీ నేతలు చెప్పారన్నారు. కుప్పంలో వైఎస్సార్‌సీపీ గెలుపును ఆపలేరని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులకు డబ్బులు ఎరగా చూపి టీడీపీలోకి లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మఠం సర్పంచ్ మురళి, ఎంపీటీసీ సభ్యుడు చంద్ర మాట్లాడుతూ కొందరు టీడీపీ నేతలు మాట్లాడదాం రమ్మని చెప్పడంతో నమ్మి వెళ్లిన తమను గదిలో పెట్టి టీడీపీ కండువా వేశారని చెప్పారు. వైఎస్సార్‌సీపీని వీడబోమని తెలిపారు.



"ప్రేమలో ఎల్లప్పుడూ కొంత పిచ్చితనం ఉంటుంది. కానీ పిచ్చితనంలో ఎల్లప్పుడూ కొంత హేతువు ఉంటుంది.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి
సోమవారం, 5 ఫిబ్రవరి 2024

ఫస్ట్-రేట్ రచయిత

సెకండ్-రేట్ రచయితల్లో తాను మొదటి వరుసలో ఉంటానని చెప్పుకొన్నాడట సోమర్‌సెట్ మామ్. ఆయన దృష్టిలో బాల్జాక్, డికెన్స్, టాల్‌స్టాయ్, దోస్తోవ్‌స్కీ ప్రపంచం చూసిన నలుగురు గొప్ప నవలాకారులు. పాఠకులను సాహిత్యం వైపు ఆకర్షించడమే కొందరు రచయితల విలువైన కాంట్రిబ్యూషన్ అవుతుంది. ఇక్కడ కూడా మామ్ మొదటి వరుసలో ఉంటారు. ఆంగ్ల అనువాద కథలతో పరిచయం ఉండే తెలుగు పాఠకులకు దాదాపుగా తగిలే మొదటిపేరు విలియమ్ సోమర్‌సెట్ మామ్. అత్యధిక కాపీల అమ్మకం, అత్యంత పేరు, అత్యధిక సంపాదనలతో చాలా విధాలుగా ఒక కమర్షియల్ రచయిత కూడా కలలు కనలేని జీవితాన్ని మామ్ అనుభవించాడు. హాలీవుడ్ సినిమాలకు పనిచేశాడు, దేశదేశాలు తిరిగాడు, అత్యంత ప్రముఖులతో విలాసవంతమైన టూర్లు, డిన్నర్లల్లో పాల్గొన్నాడు. తన గురించి మామ్ ఏమని చెప్పుకొన్నా, ఆయన 'ద మూన్ అండ్ సిక్స్‌పెన్స్', 'ద పేంటెడ్ వీల్', 'కేక్స్ అండ్ ఎయిల్', 'ద రేజర్స్ ఎడ్జ్' గొప్ప నవలలుగా పేరొందాయి. ఇక మామ్ మాస్టర్‌పీస్‌గా చెప్పే 'ఆఫ్ హ్యూమన్ బాండేజ్' ప్రపంచ గొప్ప నవలల్లో ఒకటిగా నిలిచిపోయింది. నూటికి పైగా కథలు, పదులకొద్దీ నాటకాలు, నవలలు... ఎంత విస్తృతంగా రాశాడో అంత ఆదరణ పొందిన మామ్‌కు ఇది నూటా యాభయ్యో జయంతి సంవత్సరం.

మామ్ జీవితంలోనూ ఒక రచనకు కావాల్సినంత డ్రామా, కన్నీళ్లు, కష్టాలు, ట్విస్టులు ఉన్నాయి. గొప్ప ఆంగ్ల రచయితల్లో ఒకడిగా పేరు తెచ్చుకున్న ఆయన ఆంగ్లాన్ని చిన్నతనంలో సాటి విద్యార్థులు హేళన చేసేవారు. కారణం, జన్మకు ఆంగ్లేయుడు అయినా, పుట్టింది ఫ్రెంచ్ గడ్డ మీద. అలా ఫ్రెంచ్ ఆయన మొదటి భాష అయింది. ఫ్రెంచ్ గడ్డ మీద పుట్టిన అందరూ ఫ్రెంచ్‌వాళ్లే అవుతారనీ, తప్పక మిలిటరీలో చేరాల్సిందేననీ శాసనం వచ్చినప్పుడు ఆ స్థానీయతను తప్పించుకోవడానికి మామ్ కుటుంబం ఫ్రాన్స్‌లోని బ్రిటిష్ దౌత్య కార్యాలయాన్ని ఆశ్రయించింది. అందులోనే మామ్‌కు జన్మనిచ్చింది(1874 జనవరి 25) వాళ్ల తల్లి. అలా బ్రిటన్ ఎంబసీలో జన్మించడం వల్ల మామ్ బ్రిటనీయత స్థిరపడిపోయింది. వాళ్ల గ్రేట్-అంకుల్ గుర్తుగా పెట్టిన సోమర్‌సెట్ అనే మధ్యపేరు ఆయనకు నచ్చలేదు. ఇంట్లో విల్లీ అని పిలిచేవాళ్లు. మామ్‌కు ఎనిమిదేళ్ల వయసున్నప్పుడే తల్లి క్షయవ్యాధితో చనిపోయింది. ఆ లోటు ఆయనకు ఎప్పుడూ తీరలేదు. 'అది ఎప్పుడూ పూర్తిగా మానని గాయం'గానే ఉండిపోయింది. వృద్ధుడయ్యాక కూడా తల్లి ఫొటోను మంచం పక్కనే ఉంచుకునేవాడు. ఆ తర్వాత రెండేళ్లకే తండ్రి చనిపోవడం మరో దెబ్బ. అప్పుడు బ్రిటన్‌లోని చిన్నాన్న దగ్గరికి వచ్చాడు. ఆ కొత్త ఇల్లు, వాతావరణం బాగున్నప్పటికీ, తల్లిదండ్రులు లేని చింత, కొత్త సమాజంలో కలవలేకపోవడం, సిగ్గరి కావడం వంటి కారణాల వల్ల ఇట్టే మాట్లాడేవాడు కాదు. అది క్రమంగా నత్తిగా మారి జీవితాంతం ఆయనతో ఉండిపోయింది. తాత, తండ్రి న్యాయవాదులు అయినప్పటికీ మామ్ ఆ బాటలోకి పోకపోవడానికి ఈ నత్తి కూడా ఒక కారణం.

డాక్టర్ కాబోయి యాక్టర్ అవడంలా కాకుండా, నిజంగానే డాక్టరీ చదివినా దాని జోలికి పోకుండా రంగస్థలంలో ప్రాక్టీస్ చేశాడు మామ్. నాటకాలతో ముందు ప్రజాదరణ పొందినా తర్వాత నవలలు, కథల మీద మాత్రమే దృష్టిసారించాలని నిశ్చయించుకున్నాడు. ఒక చదవదగ్గ కథకు మెటీరియల్ రాకపోతే తానెవరి సమక్షంలోనూ గంటసేపు కూడా గడపనని అనేవాడు. ఆయనకు ఏదైనా కథావస్తువే. దానికి తగినట్టే ఆయన జీవితం కూడా అనుభవాల పుట్ట. యువకుడిగా మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటన్ సీక్రెట్ ఇంటెలిజెన్స్ సర్వీస్ కోసం కొన్నాళ్లు స్విట్జర్లాండ్‌లో గూఢచారిగా పనిచేశాడు. ఫ్రెంచ్ నాటక రచయిత అన్నది అప్పుడు ఆయన కవర్. తర్వాత, రష్యాలోనూ బోల్షివిక్కులకు వ్యతిరేకంగా, జర్మన్ నిఘా నెట్‌వర్క్ మీద సమాచారాన్ని పంపాడు. మెన్షివిక్కులకు మద్దతు ఇవ్వాలన్నది బ్రిటన్ ఆలోచన. జర్మనీలో చదువుకున్నందువల్ల మామ్‌కు జర్మన్ వచ్చు. ఈసారి అమెరికా పబ్లిషర్ అనేది కవర్. అయితే ఈ అనుభవాలను రచనలుగా తెచ్చాడుగానీ అధికార రహస్యాల చట్టాన్ని ఇవి ఉల్లంఘిస్తుండటంతో చాలావాటిని కాల్చేశాడు. అయినా గూఢచర్య కథలు రాసిన తొలి గూఢచార రచయిత మామ్ అయ్యాడు. జేమ్స్ బాండ్ సిరీస్ రాయడానికి ఇయాన్ ఫ్లెమింగ్‌కు ప్రేరణగా నిలిచాడు. కానీ గూఢచర్యంలో పనిరోజులు ఒకేవిధంగా ఉండి విసుగు పుట్టిస్తాయనీ, చాలా రోజులు నిరర్థకమనీ వ్యాఖ్యానించాడు.

ఇటీవల వచ్చిన మలయాళ సినిమా 'కాదల్'లో హోమోసెక్సువల్ అయినప్పటికీ హీరోకు ఒక కూతురు ఉంటుంది. దాంపత్య బంధపు ఒత్తిడి అది. మామ్ కూడా లైంగిక ధోరణి రీత్యా హోమోసెక్సువల్. పదేళ్ల వివాహ బంధంతో ఆయనకు ఒక కూతురు. కానీ తర్వాత వివాహం నుంచి విముక్తం అయ్యి స్నేహితులతో స్వేచ్ఛాజీవితం గడిపాడు. తల్లి దూరమవడం మొదలు తన జీవితంలోని అపసవ్యతలన్నింటి కారణంగా, జీవితాంతం దేవుడి మీద అవిశ్వాసిగా ఉన్న మామ్ తన ఆత్మకథాత్మక నవలను చివరి దశలో చదువుకున్నా కన్నీళ్లు కార్చకుండా పూర్తిచేసేవాడు కాదు. ఇంకేది కలిపినా డిజైన్ పాడవుతుందని తెలిసినప్పుడు ఆర్టిస్ట్ ఇక దాన్ని వదిలేసినట్టుగా, తాను రచయితగా సంతృప్తికర దశలో ఉన్నప్పుడే జీవితాన్ని చాలించాలని మామ్ ఆశపడ్డాడు. అన్నింటి విషయంలో జరిగినట్టుగానే ప్రకృతికి ఆయన విషయంలో వేరే లెక్కుంది. కోరుకున్న ముప్పై సంవత్సరాల తర్వాత, అన్ని వృద్ధాప్యపు సమస్యలతో పాటు 91 ఏళ్ల నిండుతనం కూడా ఇచ్చిగానీ ఆయన్ని సాగనంపలేదు.

మనం ఎందుకు పట్టించుకోం?

కామెంట్



కరణ్ థాపర్

భారత రాజకీయాల గురించి ఒక శోచనీయమైన, దురదృష్టకరమైన నిజానికి నితీశ్ కుమార్ ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచారా? ఈ విధమైన అవకాశవాదం, పదేపదే మిత్రపక్షాలను మార్చటం ఏ పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశంలోనూ ఆమోదయోగ్యమైనది కాదు. అది ఆ నాయకుడి విశ్వసనీయతను, పార్టీ ప్రతిష్ఠను నాశనం చేస్తుంది. నితీశ్ కుమార్ పిల్లిమొగ్గలతో పోల్చలేం కానీ, 2010లో యూకేలో కన్జర్వేటివ్‌లతో లిబరల్స్ పొత్తు పెట్టుకున్నప్పుడు అదొక నీతిమాలిన చర్యగా పరిగణన పొందింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికలలో లిబరల్ పార్టీ కుప్పకూలింది. మరి ఈ 'దుముకుళ్లను' మన ఓటర్లు ఎందుకు సమ్మతిస్తారు? తమను గెలిపించిన వారికి ద్రోహం చేసి వెళ్లిన రాజకీయ నాయకులకు మన ఓటర్లు ఎందుకు శిక్ష విధించరు?

నాయకులు పార్టీని వదిలి వెళ్లడం, వేరే పార్టీలో చేరడం మన అందరికీ బాగా తెలిసిన విషయమే. మనం ఆశించినంతగా ఏమీ వారు అసాధారణమైన వ్యక్తులు కారు. కానీ నితీశ్ కుమార్ అంత బుద్ధిహీనమైన పని చేసి ఉండాల్సింది కాదని మీరు అంగీకరిస్తారా? ఆయన అలా చేయకుండా ఉండలేరని అందరూ ఊహిస్తున్నదే అయినప్పటికీ ఆయన ప్రవర్తన నాకు నిజంగా చాలా దిగ్భ్రాంతిని కలుగజేసింది. ఆత్మగౌరవం గల ఒక మనిషి – రాజకీయ నాయకుడే అయినా – తన సొంత రాజకీయ మనుగడ కోసం తను కట్టుబడి ఉండవలసిన విలువల్ని, సిద్ధాంతాలను వెనక్కు నెట్టేయగలిగినంతగా దిగజార గలడని నేను నమ్మలేకపోయాను.

2013 నుండి, నితీశ్ తన వ్యక్తిగత రాజకీయ జీవితాన్ని ముందుకు తీసుకెళ్లడానికి హఠాత్తుగా కూటములను మార్చేయటం ఇది ఐదోసారి. అయితే నా సహోద్యోగి అశోక్ ఉపాధ్యాయ అనటం ఏమిటంటే – మీరు కనుక నితీశ్ 1994లో సమతా పార్టీని స్థాపించడం కోసం లాలూ ప్రసాద్ యాదవ్‌తో, జనతాదళ్‌తో తెగతెంపులు చేసుకోవటాన్ని కూడా లెక్కలోకి తీసుకుంటే ఆయన అలా చేయడం ఆరోసారి అవుతుందని!

నేను అంతగా ఎందుకు ఆశ్చర్యపోయానని మీరు నన్ను అడగవచ్చు. రెండు కారణాలు. నితీశ్ మళ్లీ అలాంటి పని చేస్తాడని నేను ఊహించలేదు. అలా చేస్తే కనుక విశ్వసనీయత ప్రమాదంలో పడిపోయే స్థాయికి ఆయన ఇప్పటికే చేరుకుని ఉన్నారని నా భావన.

ఆయన అలా చేస్తాడని నేను అనుకోకపోవటానికి రెండో కారణం మరింతగా నిస్సందేహమైనది. బీజేపీతో తిరిగి కలిసే అవకాశంపై ఆయన, ఆయన్ని తిరిగి రెండోసారి కూటమిలోకి చేర్చుకునే విషయమై బీజేపీ... 'అసలు అలాంటి ఆలోచనే లేదన్నట్లు'గా స్పష్టం చెయ్యటం జరిగింది.

ఏడాది క్రితమే 2023 జనవరి 30న, "ఏదో ఒక రోజు మీరు బీజేపీలో తిరిగి కలుస్తారా?" అని అడిగినప్పుడు నితీశ్ ఇలా అన్నారు: "మర్ జానా కబూల్ హై, ఉస్ కే సాథ్ జానా హమ్‌కో కభీ కబూల్ నహీ హై. యే అచ్ఛీ తరహ్ జాన్ లీజియేగా." (చావనైనా చస్తాను కానీ, వాళ్లతో వెళ్లి కలిసేది లేదు. దీనిని మీరు సరిగ్గా అర్థం చేసుకోవాలి.)

తర్వాత కొన్ని వారాలకు 2023 ఫిబ్రవరి 25న ఇదే ప్రశ్న హోం మంత్రి అమిత్ షాకు ఎదురైంది. బీజేపీ నితీశ్‌ను మరొకసారి అక్కున చేర్చుకోటానికి సుముఖంగా ఉందా? 'ది హిందూ'లో వచ్చిన దానిని బట్టి అమిత్ షా ఈ విధంగా సమాధానం చెప్పారు: "ఆయా రామ్, గయా రామ్‌లు ఇక చాలు. నితీశ్ కుమార్‌కు బీజేపీ తలుపులు శాశ్వతంగా మూతపడ్డాయి."



'ఇండియా' కూటమిని వీడి తిరిగి ఎన్డీయేలో చేరిన నితీశ్ కుమార్

సరే, నితీశ్ కుమార్ ఏడాది క్రితం స్పష్టంగా మరణం కంటే అధ్వాన్నం అని భావించిన దానినే ఇప్పుడు కోరుకున్నారు. ఇక 'ఎప్పటికీ' అనేది అమిత్ షా ఉద్దేశంలో కేవలం తాత్కాలికం అని మాత్రమే కాదు, హాస్యాస్పదంగా అది ఎంతో స్వల్పకాలిక వ్యవధి అని కూడా!

ఈ వైఖరులపై అవమానకరమైన మాటలు వచ్చి పడటంలో వింతేమీ లేదు. నితీశ్‌ని పల్టూరామ్, పల్టూమార్, పల్టూపుత్ర అంటున్నారు. శశి థరూర్ అయితే సహజంగానే ఇప్పుడంతగా వాడుకలో లేని ఆంగ్ల పదాన్ని నితీశ్‌కు అన్వయించడం కోసం తవ్వి తీశారు. 'స్నోలీగోస్టర్' అనే మాట అది. 'తెలివైన, కానీ విలువల్లేని వ్యక్తి' అని ఆ మాటకు అర్థం.

ఏమైనా ఈ పరిణామంపై నా ఆందోళన ఇక్కడితో ఆగటం లేదు. భారతదేశ రాజకీయాల గురించి విచారం వ్యక్తం చేయదగిన, దురదృష్టకరమైన ఒక నిజానికి నితీశ్ కుమార్ సాక్ష్యంగా నిలిచారా? ఈ విధమైన అవకాశవాదం, పదేపదే మిత్రపక్షాలను మార్చటం అనేది ఏ ప్రధాన పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశంలోనూ ఆమోదయోగ్యమైనది కాదు. పైగా ఖండించదగినది. అది ఆ నాయకుడి విశ్వసనీయతను, పార్టీ ప్రతిష్ఠను నాశనం చేస్తుంది. నితీశ్ కుమార్ పిల్లి మొగ్గలతో పోల్చలేం కానీ, 2010లో బ్రిటన్‌లో లిబరల్స్ అనేవాళ్లు కన్జర్వేటివ్‌లతో పొత్తు పెట్టుకున్నప్పుడు అదొక నీతి మాలిన చర్యగా పరిగణన పొందింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికలలో ఓట్లు రాబట్టలేక లిబరల్ పార్టీ కుప్పకూలింది... ఇండియాలో జరగని విధంగా!

మన భారతీయులం భిన్నంగా ఎలా ఆలోచిస్తామో, భిన్నంగా ఎలా స్పందిస్తామో చూపించటానికి అరుణాచల్‌ప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్ కొన్ని ఉదాహ రణలు మాత్రమే. మధ్యప్రదేశ్‌లో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీని అధికారంలోకి తీసుకు రావటానికి కాంగ్రెస్‌ను విడిచిపెట్టి బీజేపీలో చేరినవారు పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుంటూ గత ఏడాది డిసెంబర్ ఎన్నికల్లోనూ భారీ మెజారిటీని సాధించారు.

ఈ దుముకుళ్లను మన ఓటర్లు ఎందుకు సమ్మతిస్తారు? తమను గెలిపించిన వారికి ద్రోహం చేసి వెళ్లిన రాజకీయ నాయకులకు మన ఓటర్లు ఎందుకు శిక్ష విధించరు? ప్రజాసేవ కంటే, నమ్మిన సిద్ధాంతాల పట్ల నిబద్ధత కంటే తమ ప్రయోజనాలకు, సంపాదనకు ప్రాధాన్యం ఇస్తున్నారని స్పష్టంగా తెలుస్తూనే ఉన్నా ఎందుకు మన ఓటర్లు పట్టించుకోరు?

ఎందుకు అన్నదానిపై అనేక విధాలైన అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నా కూడా నా దగ్గర సమాధానమైతే లేదు. వాటిల్లో ఒక అభిప్రాయం... అలాంటి రాజకీయ నాయకులు తమ నియోజకవర్గాలకు కావలసినవన్నీ చేసిపెడుతుంటారని; అలాగే వారి నేర్పరితనం, రాజకీయ చలనశీలత వారిపై వ్యతిరేకతను కాక, ప్రజల మన్ననను పొందేలా చేస్తోందని! కానీ ఆ అభిప్రాయాలు సరైనవని అనిపించేవి కావు. సాకులు లేదా, అనుకూల వాదనలు. లేదంటే నిలబడని సమర్థింపులు.

చివరికి చెప్పొచ్చేదేమంటే, లోపం మనలో ఉన్నదే కానీ, మన తలరాతలో ఉన్నది కాదు. తెలిసే మనం ఇలాంటి నాయకులకు, తమ స్వార్థం కోసమే తప్ప మరింత గొప్ప లక్ష్యాలకు, గొప్ప ప్రజా ప్రయోజనాలకు కట్టుబడి ఉండని వారికి – వాళ్లెప్పుడైనా ప్రజలకు కొంత మేలు చేస్తే చేసి ఉండొచ్చుగాక – ఓటు వేస్తాం. అది కొనసాగినంత కాలం భారతదేశ నితీశ్‌కుమార్‌లు మన రాజకీయాలను స్వేచ్ఛగా నడిపిస్తూనే ఉంటారు. మన భవిష్యత్తును కూడా!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

క్షీణతకు నాంది



భారత్ ఒకప్పుడు గొప్ప సముద్ర వాణిజ్యం కలిగివుంది. 'కుట్టిన ఓడల్లో' మనం అరేబియా, ఆగ్నేయాసియా ప్రయాణించాం. కానీ ఎప్పుడైతే బ్రాహ్మణులు 'సముద్రయానం' వల్ల కుల బహిష్కరణ జరుగుతుందని ధర్మశాస్త్రాల్లో ప్రకటించారో అప్పట్నుంచీ సముద్ర వ్యాపారం క్షీణించింది. సముద్రయానం చేసి వచ్చిన దురాక్రమణదారుల చేతిలో ఓడిపోయాం.

– దేవ్‌దత్ పట్నాయక్, రచయిత

మరింత ప్రయోజనం



అంత పెద్ద ఆలయాలు ఎందుకు? మళ్లీ అదే ప్రశ్న. నేను ఇప్పుడూ ఇచ్చే జవాబు: అంత పెద్ద మాల్స్, విమానాశ్రయాలు ఎందుకు? 'మాల్స్, విమానాశ్రయాలు జనానికి ఉపయోగం, వాటివల్ల బిజినెస్ జరుగుతుంది'. 'ఆలయాల వల్ల కూడా జనానికి ఉపయోగమే. అలాగే క్యాష్ ఫ్లో అవుతుంది, ఇంకా మంచి మార్గంలో'!

– స్వామి సమర్పణానంద, ఆధ్యాత్మిక గురువు

వాళ్లను మించి...



మహిళలు మరింత దయాపూరితంగా, హింసకు దూరంగా ఉంటారని అనుకోవడం నా అమాయకత్వం. ఒక మహిళగా ఉండటం అంటే ఏమిటో తెలియజెప్పిన మా అమ్మలాంటి మహిళలు అరుదైపోతున్నారు. ఇప్పటి సాధికార మహిళలు పిచ్చి స్త్రీవాదపు ఉత్పత్తుల్లా మారిపోయి, దుర్గుణాల్లో పురుషులను మించి పోతున్నారు. పురుషుల మంచి లక్షణాలను స్వీకరించేవారు కొందరే ఉంటున్నారు.

– మధు పూర్ణిమా కిశ్వర్, రచయిత్రి

మగవాళ్ల తీరు



మహిళల పట్ల జరిగే అసభ్య ప్రవర్తనలకు సంబంధించి తమ మగ స్నేహితులను ఎదుర్కోవడంలో చాలామంది మగవాళ్లు పిరికివాళ్లలా వ్యవహరిస్తారు. ఎందుకంటే, వాళ్ల దృష్టిలో మహిళల భద్రత కన్నా, మగవాళ్ల సమ్మతికి విలువ ఎక్కువ.

– జెన్ని, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

కంటికి కూడా బాగుండాలా?



డాక్టర్లు, హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్‌ను తీసుకునేటప్పుడు కొన్ని కార్పొరేట్ హాస్పిటల్స్ విద్యార్హతలతో పాటు చూపులకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నాయని ఒక డాక్టర్ స్నేహితురాలు నాతో క్యాజువల్‌గా చెప్పింది. అది వికారం, మన పద్ధతి కాదని ముందయితే కొట్టేశాను. కానీ ఇప్పుడాలోచిస్తుంటే అందులో కొంతైనా నిజం ఉందేమో అనిపిస్తోంది.

– కార్తీక్ బాలచంద్రన్, ఎండోక్రైనాలజిస్ట్

ఇన్ బాక్స్

ప్రోగ్రామ్ డివిజన్ శాపగ్రస్థమయిందా?

ప్రసార భారతి వచ్చినప్పటి నుండి 'కార్యక్రమ' విభాగం తన తేజోప్రభను కోల్పోతూ ఉంది. కర్ణుడి చావుకి కారణాలు అనేకం అన్నట్లు 'ఆకాశ దర్శన్'ల కార్యక్రమ విభాగం దీన, హీన స్థితికి అనేక కారణాలు. నిచ్చెన మెట్ల సమాజంలో ఎన్ని దొంతరలు ఉన్నాయో అంతకంటే మిన్నగా ఈ విభాగంలో ఉండటం కూడా ఒక వాస్తవం. దీనితో వీరిలో ఒకరంటే ఒకరికి పడదు. బొమ్మకు శబ్దం అంటే చిన్న చూపు. అసలు ప్రసార భారతి జననంతోనే కార్యక్రమ హననం ప్రారంభమయింది. అగర్వాల్ కమిషన్ నుంచి ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి కమిషన్ దాకా ఇచ్చిన సూచనలూ, ఆ తరువాత చట్టసభల సభ్యుల, ఆ యా రంగాల్లోని నిష్ణాతుల అభిప్రాయాలను ఎవ్వరూ పట్టించుకోలేదు.

న్యూస్ డివిజన్ మొదలుకుని కెమెరా డివిజన్ వరకు అందరూ కార్యక్రమ డివిజన్‌లో వాటా సాధిస్తూ భాగస్వాములు కావటం విశేషం. ప్రోగ్రామ్ డివిజన్ మీద కనీస అవగాహన లేకుండా, శాసిస్తూ, నియంత్రిస్తూ, ఆధిపత్యం చేయటం ఇక్కడే సాధ్యం. ప్రసార భారతిలో ఇంజనీరింగ్ డివిజన్ ఎప్పుడూ పెద్దన్నే. వర్తమాన ప్రభుత్వ రంగ ప్రసార మాధ్యమాల చరిత్ర చూస్తే ప్రసార మాధ్యమాలకి ఆయువు పట్టు అయిన కార్యక్రమ విభాగం బలి పశువుగా మారి తన ఉనికిని కోల్పోయే స్థితికి నెట్టివేయబడిందని బోధపడుతుంది. ఇప్పటికీ వీరి రోదన అరణ్యరోదన గానే ఉండటం అత్యంత బాధాకరం.

ప్రమోషన్స్ లేక, తోటి డివిజన్లతో పోటీ పడలేక కునారిల్లటం నేటి నిజం. మరో వైపు గతంలో కంటే ప్రోగ్రామ్ డివిజన్ మీద పని ఒత్తిడి పెరిగింది. బడ్జెట్‌లో ప్రోగ్రామ్ వాటాలో కోతలు, కొత్త కొత్త నియమ నిబంధనలు నియంత్రణ పరిస్థితిని మరింత అధ్వాన్నంగా మారుస్తున్నాయి. ఇన్ని విపరీత ధోరణుల మధ్య ఉన్న అతి కొద్ది మంది కూడా పదవీ విరమణ సమయం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడటం శుభపరిణామం కాదు.

తెలుగు రాష్ట్రాలలోని దూరదర్శన్, ఆకాశవాణి కేంద్రాలలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్యను చూసినా పరిస్థితి బోధపడుతుంది. పాము తన పిల్లలను తాను తిన్నట్లు ప్రోగ్రామ్ విభాగం స్వర్ణయుగంలోని పెద్దలు స్వార్థపూరితంగా స్వప్రయోజనాల కోసమే పని చేయటం కూడా ఈ డివిజన్‌ను కోలుకోలేని దెబ్బతీసిందంటారు కొందరు. ఇక ఇప్పటి ప్రసార భారతిలోని కొత్త తరం త్రిశంకు స్వర్గంలో ఉన్నారు. అడకత్తెరలో పోకచెక్కలా ఇరుక్కున్నారు. ముందుకు పోలేక వెనుకకు రాలేక తీవ్ర మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారు.

– వలేటి గోపీచంద్, విశ్రాంత కార్యక్రమ నిర్వాహకులు, ఆకాశవాణి

ఓ తెనాలి – తత్ దిన పత్రిక

సందర్భం



పి. విజయ బాబు

ఆ పత్రిక కార్యాలయం అంతా సందడి సందడిగా ఉంది. ఇన్‌చార్జి క్యాబిన్‌లో నుంచి పొగలు సెగలు వస్తున్నాయి.

బయట డెస్క్‌లో జర్నలిస్టు ధర్మారావు దిగాలుగా కూర్చుని ఉన్నాడు. అతని సహచరుడు లోకనాథం అతని దగ్గరకు వచ్చి, 'ఏం బ్రదర్ డల్‌గా ఉన్నావ్? క్యాబిన్ నుంచి పొగలు సెగలు వస్తున్నాయి. బాస్ ఏమైనా తిట్టాడా?' అని అడిగాడు. 'అంతేగా?' అన్నాడు.

'ఎందుకయ్యా! రోజూ ఇలా. ఒకప్పుడు నువ్వు రాసే ఐటమ్స్ అంటే ఇటు పత్రికలోను అటు జనంలోనూ ఎంత హాట్ హాట్‌గా ఉండేవి? అంత చేయి తిరిగిన జర్నలిస్టువి, కాస్త మనసు కూడా చంపుకొని మసాలా వార్తలు రాశావనుకో! నీ అనుభవానికి ఆ మసాలా తోడైతే వేడి వేడి మిరపకాయ బజ్జీల్లా ఉండవా నీ ఐటమ్స్? ఎందుకయ్యా! జర్నలిజం విలువలు, తొక్కా అంటూ నిన్ను నువ్వే పనిష్ చేసుకుంటావు? మనకు కావలసింది జీతం, ప్రశాంతంగా ఉండటం. సమాజం, నైతికత, బాధ్యత అంటూ పనికి మాలిన బిల్డప్పులు ఎందుకు? నేను రోజూ ఇలా చెబుతూనే ఉంటాను, నువ్వు మాత్రం మనసు మార్చుకోక తిట్లు తింటూనే ఉంటావు. ఇంతకీ అసలు ఏం జరిగింది?' అడిగాడు లోకనాథం.

'గాంధీనగర్‌లో ఒక మానవీయ కోణానికి సంబంధించి మంచి స్టోరీ రాశాను. అది తీసుకెళ్లి ఇస్తే నా మొహం మీద విసిరేసి, ఇప్పుడు ఈ స్టోరీలు ఎవడికి కావాలి? ఆ రోజులు పోయాయని ఎన్నిసార్లు చెప్పను? ఇప్పుడు కావాల్సిందంతా స్పైసీ... 'సాగర సంగమం' సినిమాలో స్టెప్పులు కావాలి... అమృతాలు, ఆవులు, గేదెలు ఎవడికి కావాలి అన్నట్టుగా, నామీద ఇంత ఎత్తున ఎగిరేడు' గద్గద స్వరంతో చెప్పాడు ధర్మారావు. 'మరి నేను చెప్పేది అదే. తెలివితేటలు ఉండగానే సరిపోదు. కాస్తంత లౌక్యం కూడా కావాలి బతకాలంటే. సరే సరే నాకు టైం అయిపోతుంది' అంటూ లోకనాథం కేబిన్ తలుపు తీసుకొని లోపలికి వెళ్లాడు.

పొగలు సెగలు కక్కుతున్న ఇన్‌చార్జి చింపిరి జుత్తుతో సిగరెట్ల మీద సిగరెట్లు తాగుతూ కనిపించాడు. 'రావయ్యా రా! నీ కోసమే చూస్తున్నా. బ్యానర్ స్టోరీ రెడీ అయిపోయింది. సెకండ్ ఐటమ్ ఏం వేద్దామా అని చూస్తున్నాను. టైం అయిపోతూ ఉంది. ఇంకా ఏం డిసైడ్ కాలేదు. నువ్వేమైనా వండుకొచ్చావా?' ఆత్రంగా అడిగాడు ఇన్‌చార్జి.

'మీరేం కంగారు పడకండి సార్! నేను ఉన్నాగా? చిల్లీస్ చికెన్, చికెన్ 65, చైనీస్ నూడుల్స్... ఏమైనా సరే అరగంటలో వండి వార్చేస్తా? ఇప్పుడు మన పత్రికతో ఏ డ్రైనేజీ గానీ, మూసీ నది గానీ పోటీ పడలేవు. మీకెందుకు కంగారు? ఇదిగోండి ఇది చూడండి. ఇది నా వంటకం కాదు గాని ఒక తెనాలి అవాకులు చవాకులు. భలే గమ్మత్తుగా ఉన్నాయి ఆరోపణలు' అంటూ చేతిలో ఉన్న ప్రింట్ అవుట్



అందించాడు.

సీరియస్‌గా ఐటెం చదవడం మొదలు పెట్టాడు ఇన్‌చార్జి.

హెడ్డింగ్ చూశాడు: 'సజ్జలకే 140 కోట్లు.'

* 'ప్రభుత్వ సలహాదారులకు 680 కోట్లు వ్యయం.
* 89 మంది సలహాదారులకు అంత ప్రజాధనం వెచ్చించడం అవసరమా?
* నాదెండ్ల మనోహర్ ధ్వజం

ఇన్‌చార్జి ముఖంలో టెన్షన్ చెరిగిపోయి పెదాల మీద చిరునవ్వు మొదలైంది.

'ఇదీ ఐటమ్ అంటే.. ధర్మారావు గాంధీనగర్‌లో పేదల బతుకులు అది ఇది అంటూ చెత్త ఐటమ్ తెచ్చాడయ్యా! దాంతో నా మూడంతా పాడైపోయింది. ఇదీ మసాలా అంటే. అవును గానీ మనలో మాట, ఒక్క సజ్జలకే 140 కోట్లు అంటాడు ఏంటయ్యా?

సలహాదారులకి 680 కోట్లా? అసలు అంత బడ్జెట్టే లేదు కదయ్యా!

ఈ తెనాలి బుర్రేమైనా చెడిపోయిందా? లేదంటే లోకేష్‌కి పోటీగా తయారవుదాం అనుకుంటున్నాడా?' అడిగాడు ఇన్‌చార్జి.

"అదేం కాదు సార్! తెనాలి నుంచి పోటీ చేయాలనుకుంటున్నాడు. తెనాలిలో తనకు టిక్కెట్ వస్తుందో రాదో అనేది ఒక టెన్షన్. తీరా టికెట్ దక్కించుకున్నా అసమ్మతి సెగతో మళ్ళీ ఓడిపోతానేమో అని భయం పట్టుకుంది. దాంతో పూర్తిగా 'తెనాలి' అయిపోయాడు. అందుకే ఏది పడితే అది మాట్లాడుతున్నాడు."


'నిజమేనయ్యా! కానీ ఐదేళ్లకి కోటీ నలభై లక్షలు కాబోలు. దాన్ని అర్థం చేసుకోలేక 140 కోట్లనేసినట్టున్నాడు. బడ్జెట్లో లేని డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయి? పైగా సలహాదారులు ఉన్నది 46 మందేగా 89 మంది ఎక్కడి నుంచి వచ్చారు? ఓకే... నువ్వే చెప్పావుగా? అతగాడు మైండ్ చెడి తెనాలి అయిపోయాడని. సరే ఏదైతే అదవుతుంది? ఈరోజు మనకి చికెన్ 65 లాంటి మసాలా స్టోరీ దొరికింది. పాఠకులు ఇవన్నీ ఎక్కడ పట్టించుకుంటారు? మన పత్రికకు ఇంగువ కట్టిన గుడ్డ లాంటి ఇమేజ్ ఉండనే ఉందిగా! బాస్ అయితే హ్యాపీ ఫీల్ అవుతాడు. తిట్టుకుంటే జనాలు 'తెనాలి'ని తిట్టుకుంటారు. సరే సరే నువ్వు మాత్రం ఈ మూడు నెలలు మూసీ నది మన పేపర్‌ని చూసి కుళ్లుకునేంత మురుగు స్టోరీలు ఇవ్వాలి సుమా!' అంటూ స్టోరీకి రంగులు హంగులు అద్దే పనిలో పడ్డాడు ఇన్‌చార్జి. 'తప్పకుండా సార్! ఇక నేను వస్తా' అంటూ లోకనాథం క్యాబిన్ తలుపు తీసుకొని చిద్విలాసంగా నవ్వుకుంటూ బయటకు వచ్చాడు. ఒక మూల దీనంగా కూర్చున్న సిసలైన జర్నలిస్టు ధర్మారావు వైపు జాలిచూపు విసిరేసి, 'బాబుని చూసైనా నేర్చుకోడు జాబు నిలబెట్టుకోవాలని ఆలోచించడు' అని తనలో తను సణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

చిత్త శాంతి

వ్యాసుడు లోక కల్యాణం కోసం, సమస్త మానవాళికి సుబోధకంగా ఉండేటట్లు మహా భారతాన్ని రచించాడు. ప్రజలు తెలుసుకోదగిన జ్ఞానమంతా భారతంలోనే ఉందని పెద్దలు చెబుతారు. అంత గొప్ప గ్రంథాన్ని రచించి కూడా వ్యాసుడు చాలా అసంతృప్తినీ, అశాంతినీ అనుభవించాడు. తన అశాంతికి కారణమేమిటా అని ఆలోచిస్తుండగా అక్కడికి నారదుడు వస్తాడు.

నారదుని చేతిలో ఉండే మహతి అనే వీణ నుంచి నారాయణ నామం నిరంతరం ధ్వనిస్తూ ఉంటుంది. ఆయన నోటి నుండి వెలువడే హరి నామ సంకీర్తనా అమృత ప్రవాహంలో యోగులు పరవశించి పోతారు. అటువంటి నారదుడు విచారంగా ఉన్న వ్యాసుని చూసి కారణం అడుగుతాడు. వ్యాసుడు తనకు కలుగుతున్న అశాంతిని గురించి చెప్పి, కారణం చెప్పమంటాడు. అప్పుడు నారదుడు,'నువ్వు నీ గ్రంథంలో విష్ణు కథలు కొంచెం మాత్రంగానే చెప్పావు. సమగ్రంగా చెప్పలేదు. వాసుదేవుని గుణగణాలు అందంగా వర్ణించి చెప్పాలి. హరినామ సంకీర్తన ప్రధానంగా చెయ్యకపోవటమే నీ మనసులో కొరతకూ, అశాంతికీ కారణం. మానవులందరి భవబంధ విముక్తి కోసం భగవంతుని లీలలు హృద్యంగా వర్ణించు. జనుల వ్యధలు తొలగించు. ఈ విశ్వమంతా విష్ణుమయం. శ్రీహరి లీలావతారాలలోని విక్రమ విశేషాలను వర్ణించు. నీకు చిత్తశాంతి లభిస్తుంది' అని చెబుతాడు.



జ్యోతిర్మయం

అప్పుడు వ్యాసుడు ఆశ్రమానికి వెళ్లి తన చిత్తంలో భగవంతుని దర్శించాడు. ఏ మహా గ్రంథాన్ని విన్నంత మాత్రాన లౌకికమైన సంసారబంధాలపై విరక్తి కలిగి మాధవునిపై అచంచలమైన భక్తి ఆవిర్భవిస్తుందో అటు వంటి మహా గ్రంథాన్ని... భక్తుల పాలిట కల్పవృక్షమైన మహా భాగవతాన్ని రచించాడు. చిత్తశాంతి పొందాడు.

భాగవతం చదివే, వినే సహృదయ భక్తులకు చిత్త శాంతి లభిస్తుంది. ఇది సద్యో ముక్తిదాయక గ్రంథం.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.దశమి ప.12.40 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.3.47 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** ఉ.9.16 నుండి 10.54 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.35 నుండి 1.20 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.36 వరకు, **అమృతఘడియలు:** సా.6.56 నుండి 8.32 వరకు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.35, **సూర్యాస్తమయం:** 5.53.

క్లుప్తంగా...

వేతనం పెంపుపై సమగ్ర శిక్ష సిబ్బంది హర్షం

చిలకలపూడి (మచిలీపట్నం): సమగ్ర శిక్షలో పనిచేస్తోన్న సిబ్బందికి 11వ పీఆర్‌సీ వర్తింపజేస్తూ 23% వేతన పెంపుపై సమగ్ర శిక్ష పార్ట్‌ టైం ఇన్‌స్ట్రక్టర్ల సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షురాలు నారగాని విజయశ్రీ ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు శివకుమారిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డిని కలిశారు. జయశ్రీ మాట్లాడుతూ ఏళ్ల తరబడి విద్యాశాఖలో డ్రాయింగ్‌ క్రాఫ్ట్‌, పార్ట్‌ టైం ఇన్‌స్ట్రక్టర్లుగా అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నామని తెలిపారు. 11వ పీఆర్‌సీకి సంబంధించి అన్ని శాఖల్లో 23% వేతనాన్ని పెంచగా సమగ్ర శిక్షలో వేతనాలు పెంచలేదనీ, సంఘ సభ్యులు పలు దఫాలుగా చర్చించడంతో ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హర్షణీయమని ఆమె అన్నారు. సీఎం జగన్‌, మంత్రి బొత్సకు జిల్లా పీటీఐ సంఘం తరఫున విజయశ్రీ కృతజ్ఞతలు తెలిపారు.

రైతుపై ఏనుగు దాడి


చికిత్స పొందుతున్న వెంకటాచలం

గుడుపల్లె (చిత్తూరు జిల్లా): రైతుపై ఏనుగు దాడి చేసిన ఘటన చిత్తూరు జిల్లాలో జరిగింది. గుడుపల్లె మండలంలోని అత్తినత్తం గ్రామానికి చెందిన వెంకటాచలం (32) శనివారం రాత్రి పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఏనుగు అడ్డంగా రావడంతో అక్కడే పడి పోయాడు. ఏనుగు అతడి వద్దకు వచ్చి కాలిపై తొక్కి వెళ్లిపోయింది. గాయపడిన వెంకటాచలం రాత్రంతా అక్కడే ఉండిపోయాడు. ఆదివారం ఉదయం స్థానికులు గుర్తించి అతడిని కుప్పం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. కాగా, కర్ణాటక రాష్ట్ర సరిహద్దుల్లో అత్తినత్తం గ్రామం ఉండటంతో ఏనుగులు అప్పుడప్పుడూ ఈ మార్గం గుండా వస్తుంటాయని స్థానికులు చెబుతున్నారు. గతంలో ఓ ఏనుగు ఇలాగే దాడి చేయగా ఓ వ్యక్తి మృతి చెందాడు.

అంబేడ్కర్‌ చూపిన బాటలో వైఎస్‌ జగన్‌ పాలన

మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు



గుంటూరు (నగరం పాలెం): బీఆర్‌ అంబేడ్కర్‌ బాటలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు రావెల కిషోర్‌బాబు అన్నారు. గుంటూరులోని పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కడుపు నిండిన వారికి, కాలే కడుపులతో ఉన్న వారికి యుద్ధం జరగనుందని అన్నారు. అసమానతలు తొలగించే ఒక విప్లవకారుడు సీఎం వైఎస్‌ జగన్‌ అని, నిటారుగా ఉన్న కుల వ్యవస్థను సమాంతరంగా, సహజంగా తీర్చిదిద్దేందుకు జగన్‌ కృషి చేస్తున్నారని చెప్పారు. వైఎస్‌ జగన్‌ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరుతెన్నులపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్‌ విసిరారు.

టీడీపీ వాళ్లే దాడులు చేశారు

వ్యక్తిగత కారణాలతో తాను టీడీపీని వీడానని కిషోర్‌బాబు చెప్పారు. తనపై టీడీపీ వాళ్లే దాడులు చేశారని, టీడీపీ నేతల వల్లే అవమానాలు జరిగాయని చెప్పారు. తనపై భౌతికంగా దాడులు చేశారని గుర్తుచేశారు. ఆత్మగౌరవం లేనిచోట ఎలా పనిచేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీలోకి అధికారం కోసం రాలేదని, ప్రజాసేవ కోసం వచ్చానని, తన పిల్లలను కూడా కార్యకర్తల్లా సిద్ధం చేస్తానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీలను అక్కున చేర్చుకుని ముందుకు తీసుకెళుతోందన్నారు.

తంబళ్లపల్లె టీడీపీలో వర్గపోరు

బి.కొత్తకోటలో ఎన్నారై నేత సభకు ముఖ్య నేతల డుమ్మా

బి.కొత్తకోట: టీడీపీ–జనసేన ఆత్మీయ సమ్మేళనం పేరుతో ఆదివారం అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటలో ఎన్నారై నిర్వహించిన సభకు టీడీపీ నాయకులు దూరంగా ఉన్నారు. తంబళ్లపల్లె టీడీపీ టికెట్‌ ఆశిస్తున్న ఆ ఎన్నారై ఇటీవలే తెరపైకి వచ్చారు. ఈ సభకు టీడీపీ తరఫున ముఖ్యనేతలెవరూ హాజరవలేదు. సభావేదిక తెరపై పవన్‌ కళ్యాణ్‌ వీడియోల ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చారని మరో వర్గం టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జనసేన నేతలకు ప్రాధాన్యమిచ్చి ఆహ్వానించారని, టీడీపీ ముఖ్యులకు పిలుపులేదని చెబుతున్నారు. సభలో మాట్లాడేందుకు జనసేన కార్యకర్తలకే ఎక్కువ అవకాశం ఇవ్వడంపైనా అసహనం వ్యక్తం చేశారు. తంబళ్లపల్లెలో టీడీపీ ఎమ్మెల్యేలు గెలిచినా ఏనాడు కార్యకర్తలకు న్యాయం జరగలేదని రిటైర్డ్‌ వీఏఓ తాతిరెడ్డి సభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో నాయకులకు ఏం సమాధానం చెప్పాలో దిక్కుతోచలేదు. సభలో మాట్లాడిన జనసేన నాయకులు.. టీడీపీ టికెట్‌ ఆశిస్తున్న ఎన్నారైకి మద్దతుగా టికెట్‌ ఇవ్వాలని డిమాండ్‌చేస్తారనుకుంటే దానికి విరుద్ధంగా టికెట్‌ ఎవరికిచ్చినా పనిచేస్తామన్నారు. సమ్మేళనానికి హాజరైన రాయచోటి టీడీపీ నేత బాల సుబ్రమణ్యం రాజంపేట ఎంపీ అభ్యర్థిగా ప్రకటించుకున్నారు. తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో రైతు సమస్యలపై ప్రశ్నిస్తానన్నారు. కాగా, ఈ సభ నిర్వహించిన ఎన్నారై టీడీపీలో గతంలో ఎక్కడా చురుగ్గా పాల్గొనలేదు. పార్టీకోసం పనిచేసిన నాయకులకు టీడీపీలో ప్రాధాన్యత లేదని ఆ పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

బాబు పలుగుపోట్లు మర్చిపోతే ఎలా?

- సీఎం జగన్‌ది రాక్షస రాజ్యమంటూ పేట్రేగిన రామోజీ
- చరిత్రలోనే తొలిసారి దుర్గగుడి అభివృద్ధికి ప్రభుత్వ ఖజానా నుంచి రూ.70 కోట్లు ఇవ్వడం జగన్‌ చేసిన పాపమా రాజ'గురవింద'?



సాక్షి, అమరావతి: నిత్యం చంద్రబాబు మత్తులో జోగుతున్న ఈనాడు రామోజీరావు ఆ మైకంలో పడి పూర్తి ఉన్మాదిగా మారిపోయారు. ఎందుకంటే.. టీడీపీ హయాంలో కృష్ణానది ఒడ్డున పవిత్ర దేవాలయాలు కూల్చేస్తే సిగ్గులేకుండా కళ్లుమూసుకున్న ఆయన.. ఇప్పుడు మనోభావాలు దెబ్బతినడం గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా ఉంది. క్షేత్రస్థాయిలో వాస్తవాలకు.. ఈనాడులో తరచూ ప్రచురించే కథనాలకు ఎక్కడా పోలిక లేదనేది జగమెరిగిన సత్యం.

చరిత్రలోనే ఎప్పుడూలేని విధంగా ఏపీలో దేవాలయాల అభివృద్ధి విస్తృతంగా జరుగుతోంది. దేవదాయ శాఖ రూ.539 కోట్లతో 815 పురాతన ఆలయాల పునరుద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణంతో పాటు టీటీడీ ఆధ్వర్యంలో రాష్ట్ర నలుమూలలా 2,872 ఆలయాల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఇదంతా సీఎం వైఎస్‌ జగన్‌ హయాంలో చేపట్టడాన్ని రామోజీ తట్టుకోలేకపోతున్నారు. అందుకే ఆయన విషపుత్రిక 'ఈనాడు'లో 'జగనన్న పాపాలు–భక్తుల మనోభావాలపై జగన్‌ గొడ్డలి వేటు' అంటూ చేతికొచ్చింది రాసిపారేశారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు రోడ్లకు అడ్డంగా ఉన్నాయనే నెపంతో విజయవాడలో ఒకే రాత్రి పదుల సంఖ్యలో గుళ్లను పలుగుపోట్లతో నేలమట్టం చేసిన విషయం ఆయన మర్చిపోయారు. అలాంటి చంద్రబాబును 'ఈనాడు' నిత్యం కీర్తిస్తుంది. కానీ, ఆ కూల్చిన గుళ్లను పునర్నిర్మించి ప్రారంభించిన సీఎం జగన్‌ను మాత్రం రాక్షసుడిగా పోల్చడమంటే రామోజీ పైశాచికత్వం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది.

ట్రస్టు భూములు అమ్మినోళ్లపై ఎందుకంత ప్రేమ?

ఫ్యాక్ట్‌ చెక్‌

2014లో బాబు అధికారంలోకి వచ్చిన వెంటనే విజయనగరంలో మెడికల్‌ కాలేజీ నిర్మాణం పేరుతో విశాఖ పరిసరాల్లో దేవదాయ శాఖకు చెందిన నాలుగు వందల ఎకరాలకుపైగా మాన్సాస్‌ ట్రస్టు భూములను అమ్మకానికి పెట్టారు. కానీ, కాలేజీపై నిర్మాణాన్ని గాలికొదిలేశారు. ఆ ఐదేళ్లలో 70ఎకరాల వరకు విక్రయించి రూ.వందల కోట్లను పోగేసుకున్నారు. ఇలా దేవదాయ శాఖకు చెందిన అనేక భూములను కొల్లగొట్టేందుకు చంద్రబాబు చేయని ప్రయత్నంలేదు. సీఎం జగన్‌ మాత్రం.. భవిష్యత్తులో ఆలయాల భూములను ఎవరూ ఆక్రమించుకునేందుకు వీల్లేకుండా ఓ ఆర్డినెన్స్‌ తీసుకొచ్చారు. ఇది దేవదాయ శాఖ చరిత్రలో పెద్ద విప్లవాత్మక నిర్ణయం. దేవుడి భూములను కాపాడేందుకు ఇలాంటి పటిష్ట చట్టాలు తీసుకురావడం ఈనాడుకు నచ్చడంలేదు. అందుకే సీఎం జగన్‌ నిర్ణయంపై అక్కసు ప్రదర్శిస్తోంది.

బాబు పాలన రామరాజ్యమా?

చంద్రబాబు హయాంలో విజయవాడ దుర్గగుడిలో క్షుద్రపూజలు చేశారని పెద్ద దుమారం చెలరేగింది. బెంజ్‌సర్కిల్‌ పరిసరాల్లో దుర్గగుడికి చెందిన విలువైన భూములను అధికారులు వ్యతిరేకించినప్పటికీ తక్కువ లీజుకే బాబుకు అత్యంత సన్నిహితుడి విద్యాసంస్థకు టీడీపీ సర్కార్‌ కట్టబెట్టింది. సీఎం జగన్‌ ప్రభుత్వం విజయవాడ దుర్గగుడి ఆలయ అభివృద్ధికి ఎప్పుడు లేనంతగా ప్రభుత్వ ఖజానా నుంచి రూ.70 కోట్లను మంజూరు చేసింది. రామోజీకి చంద్రబాబు ప్రభుత్వం రామరాజ్యంగానూ, ఆలయాలను అభివృద్ధి చేస్తున్న జగన్‌ సర్కారు రాక్షస ప్రభుత్వంలా కనిపిస్తుంది.

భక్తుల కమిటీలకే ఆలయాల నిర్వహణ..

దేవదాయ శాఖ పరిధిలోని చిన్నా, పెద్ద ఆలయాలు అన్నింటికీ టీడీపీ నేతలే ట్రస్టు బాధ్యతల్లో ఉండేవారు. సీఎం జగన్‌ ఏడాదికి రూ.5 లక్షల లోపు ఆదాయం ఉండే ఆలయాలన్నింటినీ ఆయా ఆలయాల వంశపారంపర్య ధర్మకర్తలకు, స్థానిక భక్తుల కమిటీలకు అప్పగిస్తోంది. దేవదాయ శాఖ పరిధిలో 25 వేలకు పైగా ఆలయాలు, సత్రాలు ఉండగా.. రూ.5 లక్షలు పైబడి ఆదాయమున్న 1,400 ఆలయాలకే ప్రభుత్వం ట్రస్టు బోర్డులు నియమిస్తోంది.

ధార్మిక పరిషత్‌ కథ ఇంతే..

దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల నిర్వహణకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని వివిధ స్వామీజీలు, రిటైర్డు జడ్జిలు, రిటైర్డు దేవదాయ శాఖ అధికారులు సభ్యులుగా ఉండే ధార్మిక పరిషత్‌కు వర్తింప జేస్తూ 2009లోనే అప్పటి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం చట్టం చేసింది. దీంతో ప్రభుత్వం జోక్యం చాలావరకు తగ్గింది. అయితే, 2014–19 మధ్య చంద్రబాబు దాని ఏర్పాటును నిర్లక్ష్యంచేశారు. ఆలయాల భూములను టీడీపీ నేతలు ఇష్టానుసారం వాడుకునేందుకు వీలుగా కేవలం ఐదారుగురు అధికారులతో తాత్కాలిక పరిషత్‌ ఏర్పాటుచేశారు. అదే సీఎం జగన్‌ ప్రభుత్వం 2022లో ధార్మిక పరిషత్‌ను పూర్తిస్థాయిలో ఏర్పాటుచేసింది. కానీ, దేవదాయ శాఖకు స్వయం ప్రతిపత్తి లేకుండా చేసిన చంద్రబాబు ప్రభుత్వాన్ని 'ఈనాడు' గొప్పగా ఊహించుకుంటూ జగన్‌ సర్కారును రాక్షస రాజ్యంగా ఈనాడు అభివర్ణిస్తూ పేట్రేగిపోతోంది.

పవిత్ర శాఖపై ప్రేలాపనలా!?

ప్రభుత్వానికి మంచి పేరు రాకుండా అవాస్తవాలతో పచ్చమీడియా విషం

- గుడులు కూలగొట్టిన చంద్రబాబు గురించి ఏనాడైనా రాశారా?
- దేవదాయ శాఖలో రూ.1,400 కోట్లకు పైగా అభివృద్ధి పనులు కనిపించడంలేదా?
- రామోజీ రాతలపై డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఫైర్‌



తాడేపల్లిగూడెం: 'నేల ఈనిందా.. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లుగా దెందులూరు సభకు జనతరంగం ఉవ్వెత్తున కదలి రావడం పచ్చరాతల రామోజీకి, అబద్ధాల చంద్రబాబుకు నచ్చినట్లులేదు. ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా ఒక పవిత్ర శాఖకు అసత్యాలను ఆపాదిస్తూ ఒక కథనాన్ని 'ఈనాడు'లో వండివార్చారు.. అవన్నీ పచ్చి అబద్ధాలు'.. అంటూ ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మండిపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

జగన్‌ అంటే నిజం.. అబద్ధాలకు కేరాఫ్‌ చంద్రబాబు.. క్షుద్ర రాతలు రామోజీ నైజం. దెందులూరులో జరిగిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం విజయవంతమైతే ఆ నిజాలు రాయకుండా 'భక్తుల మనోభావాలపై జగన్‌ గొడ్డలి వేటు' అంటూ వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదారి పట్టించేలా ఇష్టారాజ్యంగా రాతలు రాశారు. వాస్తవాలను బయటపెడితే ఎక్కడ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందోనని పచ్చమీడియా విషం కక్కుతోంది. ఈనాడు అధినేత రామోజీరావు ఏ రకంగా జగన్‌ను, చంద్రబాబును పోలుస్తారు. చంద్రబాబు చెప్పే అబద్ధాలకు వత్తాసు పలికేందుకు ఆయనకు సిగ్గుండాలి. కనకదుర్గమ్మ ఆలయంలో సిఫార్సు లేకుండా అమ్మవారిని ప్రశాంతంగా దర్శించుకునే విధంగా టికెట్లు పెడితే వాస్తవాలు తెలీకుండా ఎల్లో మీడియా ఇష్టానుసారం రాస్తోంది. దేవాలయాల్లో అవినీతి లేకుండా సేవలందిస్తున్నాం.

బాబుకు ఆలయాల గురించి ఏం తెలుసు?

విజయవాడలో ఆలయాలను కూలగొట్టి విగ్రహాలను వాహనాల్లో వేసిన చంద్రబాబుకు అసలు దేవాలయాల గురించి ఏం తెలుసు? ప్రభుత్వం మీద బురద జల్లడానికి ఆనాడు ఉద్దేశపూర్వకంగా రథం తగలబెట్టించారు. చంద్రబాబు ఏనాడైనా అర్చక స్వాములకు ఒక్క రూపాయి పెంచిన దాఖలాలున్నాయా? అదే సీఎం జగన్‌ అర్చక స్వాములకు రూ.5వేల నుంచి రూ.10 వేలకు.. రూ.10 వేలు తీసుకునే అర్చకులకు రూ.15 వేలకు వేతనాలు పెంచారు. రాష్ట్రంలో ఆరువేల ఆలయాలకు నిత్య ధూపదీప నైవేద్యాలకు నిధులు అందిస్తున్నాం. సీఎం జగన్‌ దేవుడి ఆస్తులను కాపాడటానికి దేవదాయ శాఖలో ప్రత్యేకంగా చట్టం చేశారు. ఈ విషయాన్ని ఎల్లోమీడియా ప్రచురించిందా? కనకదుర్గ గుడిలో టికెట్ల విషయం, అన్నవరంలో పురోహితుల విషయం, రామతీర్థంలో విగ్రహం తల తొలగించిన విషయం, రథాన్ని దహనం చేసిన విషయాలను ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా ఉద్దేశపూర్వకంగా ఆ పత్రికలో ప్రచురిస్తారుగానీ, గుడులు కూలగొట్టిన దుర్మార్గుడి గురించి ఈనాడులో రాశారా? అసలు దేవదాయ శాఖలో జరుగుతున్న అభివృద్ధి కనిపించడంలేదా? కనక దుర్గమ్మ ఆలయంలో గతంలో క్షుద్రపూజలు జరిగితే 'ఈనాడు' ఎందుకు పట్టించుకోలేదు? ప్రజలను వంచించిన చంద్రబాబుకు పట్టం కట్టేందుకు 'ఈనాడు' కృషిచేస్తోంది. రామోజీ, చంద్రబాబు కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటే ఎవ్వరూ చూస్తూ ఊరుకోరు.

రూ.1,400 కోట్లతో అభివృద్ధి పనులు..

ఇక దేవదాయ శాఖలో రూ.1,400 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సీజీఎఫ్‌ కింద రూ.550 కోట్ల నిధులిచ్చాం. శ్రీవాణి ట్రస్టు ద్వారా 3,600 దేవాలయాలను నిర్మిస్తున్నాం. సీఎం సూచన ప్రకారం నిపుణుల సలహాలతో రూ.225 కోట్లతో దుర్గగుడికి మాస్టర్‌ ప్లాన్‌, సింహాచలం అభివృద్ధికి రూ.215 కోట్లతో మాస్టర్‌ ప్లాన్‌, శ్రీశైలం ఆలయం సమీపంలో 220 గదులతో గణపతి సదన్‌, రూ.40 కోట్లతో సాల మండపం, అన్ని సౌకర్యాల కల్పన కోసం రూ.70 కోట్ల వ్యయం చేయడం భక్తుల మనోభావాలను గౌరవించడం కాదా!? కాణిపాకం, అన్నవరం, ద్వారకాతిరుమల దేవస్థానాల్లో రూ.70 కోట్ల నుంచి రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం. నిజానికి.. ప్రజలను ఓట్లువేసే యంత్రాలుగా చూసే వ్యక్తి చంద్రబాబే. ఇలాంటి నాయకులతో రాష్ట్ర ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలి.

భగవన్నామస్మరణతో ముక్తికి మార్గం

శ్రీ వేంకటేశ్వర ధార్మిక సదస్సులో ఆధ్యాత్మిక వేత్తలు


అనుగ్రహభాషణం చేస్తున్న తిరుమల రామానుజ పెద్ద జీయర్‌ స్వామి, చిన్న జీయర్‌ స్వామి

తిరుమల: తిరుమల ఆస్థాన మండపంలో జరుగుతోన్న శ్రీ వేంకటేశ్వర ధార్మిక సదస్సు ఆదివారం రెండో రోజుకు చేరింది. సదస్సులో తిరుమల పెద్ద జీయర్‌ స్వామి, చిన్న జీయర్‌ స్వామి పాల్గొన్నారు. సదస్సుకు ముందు వీరు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామికి పూజలు నిర్వహించి, హారతి సమర్పించారు. తిరుమల పెద్దజీయర్‌ స్వామి అనుగ్రహ భాషణం చేస్తూ..దేశవ్యాప్తంగా ఉన్న పీఠాధిపతులు, మఠాధిపతులను ఆహ్వానించి శ్రీవారి పాదాల చెంత ధార్మిక సదస్సు నిర్వహించడం సంతోషకరమన్నారు. తిరుమల చిన్నజీయర్‌ స్వామి అనుగ్రహభాషణం చేస్తూ.. భగవన్నామస్మరణతో భక్తులు తమ కష్టాలను దూరం చేసుకుని, ముక్తి మార్గం వైపు పయనించవచ్చన్నారు.

సనాతన ధర్మాన్ని ఏనాడూ వ్యతిరేకించలేదు

తాను అభ్యుదయ రాజకీయాల్లో ఉన్న సమయంలో కూడా భగవంతుడిని, సనాతన హిందూ ధర్మాన్ని వ్యతిరేకించలేదని టీటీడీ చైర్మన్‌ భూమన కరుణాకరరెడ్డి చెప్పారు. ధార్మిక సదస్సులో ఆయన ప్రారంభోపన్యాసం చేస్తూ.. ధార్మిక సదస్సులో స్వామీజీలు అందించే సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుని సనాతన హైందవ ధర్మం పరిఢవిల్లేలా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. సనాతన హిందూ ధర్మాన్ని వ్యాప్తి చేయడంలో భాగంగా హిందూ ధర్మంపై అపారమైన గౌరవం, విశ్వాసం గల ఇతర మతాల వారిని ఆహ్వానించేందుకు తిరుమలలో ఏర్పాట్లు చేయాలని టీటీడీ యోచిస్తున్నట్లు చెప్పారు. ఇతర మతాల భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వస్తే శ్రీవారి పాదకమలాల వద్ద హిందూ ఆచారాలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలపై శిక్షణ ఇస్తామని చెప్పారు. కాగా, ధార్మిక సదస్సులో 57 మంది స్వామీజీలు ప్రత్యక్షంగా, పరోక్షంగా అనుగ్రహభాషణం అందించారని, ఈ విధంగా సదస్సు విజయవంతమైందని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. మహనీయుల ఉపన్యాసాలను రికార్డ్‌ చేశామని, వీటిని తీర్మానాలుగా చేసి మఠాధిపతులు, పీఠాధిపతులు సమక్షంలో మీడియా ప్రతి నిధుల ముందు టీటీడీ చైర్మన్‌ ప్రవేశపెడతారని తెలిపారు. వచ్చే బోర్డు సమావేశంలో వీటిని ఆమోదిస్తామన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ వి.గోపాలకృష్ణారావు, తెలంగాణ ఎమ్మెల్యే వాకాటి శ్రీహరి, బీజేపీ నేతలు పొంగులేటి సుధాకర్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి ప్రసాదాలను, శేష వస్త్రాలను అందజేశారు.


ఆలయం వెలుపల జస్టిస్‌ గోపాలకృష్ణారావు

హత్యాయత్నం కేసులో టీడీపీ నేతల అరెస్ట్‌

- మంత్రి రోజా కార్యాలయ నిర్వాహకుడిపై తిరుత్తణిలో హత్యాయత్నం
- హత్యకు తెలుగుయువత నేతల కుట్ర
- విచారణలో వెల్లడించిన నిందితులు



నిందితులు నవీన్‌, చిరంజీవి


పరుశురామ్‌

తిరుత్తణి/నగరి (చిత్తూరు జిల్లా): ఏపీ మంత్రి రోజా కార్యాలయ నిర్వాహకుడు ప్రతీష్‌పై ఈ నెల 2వ తేదీన తమిళనాడులోని తిరుత్తణిలో జరిగిన హత్యాయత్నం కేసులో ముగ్గురు తెలుగుదేశం పార్టీ నేతల్ని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. దీంతో ప్రతీష్‌పై హత్యాయత్నం తెలుగుదేశం కుట్రేనని స్పష్టమైంది. తెలుగుయువత నాయకులైన నిందితులు టీడీపీ నగరి ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్‌ అనుచరులే. వీరిని ఆదివారం నగరి, తిరుత్తణి సరిహద్దులోని తాళవేడు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో హత్యాయత్నం చేసింది తామేనని చెప్పడంతో నగరి మండలం మేళపట్టుకు తెలుగుయువత మండల ఉపాధ్యక్షుడు నవీన్‌ అలియాస్‌ వెట్టు నవీన్‌, నాయకులు నగరి మున్సిపాలిటీ కీళపట్టు బీసీ కాలనీకి చెందిన చిరంజీవి, నింద్ర మండలం వైఎస్‌ కండ్రిగకు చెందిన పరశురాం అలియాస్‌ మధులను అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించారు.

హత్యకు తెలుగు యువత మండల అధ్యక్షుడి కుట్ర

ప్రతీష్‌ను హత్యచేసేందుకు తెలుగుయువత మండల అధ్యక్షుడు చిట్టిబాబు ప్రణాళిక రూపొందించినట్లు నిందితులు పోలీసులకు తెలిపారు. ఈ కేసు వివరాలను తిరుత్తణి సీఐ మార్టిన్‌ ప్రేమ్‌రాజ్‌ విలేకరులకు వివరించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గత అసెంబ్లీ ఎన్నికల్లో భానుప్రకాష్‌పై ఆర్కే రోజా గెలవడాన్ని జీర్ణించుకోలేని తెలుగుదేశం వర్గీయులు ఆమెపై కక్షపెంచుకున్నారు. ఈసారి ఎన్నికల్లో తెలుగుదేశం గెలవాలంటే.. రోజా తరఫున కీలకంగా వ్యవహరిస్తున్న ఆమె కార్యాలయ మేనేజర్‌ ప్రతీష్‌ను హత్యచేయాలని తెలుగుయువత నగరి మండల అధ్యక్షుడు చిట్టిబాబు కుట్రపన్నారు. అతడితో నవీన్‌, చిరంజీవి, పరశురాం చేతులు కలిపారు. నగరిలో హత్యచేస్తే రాజకీయరంగు పులుముకుంటుందని, అందువల్ల ప్రతీష్‌ను అతను ఉండే తిరుత్తణిలోనే హత్యచేయాలని నిర్ణయించుకున్నారు. అందరూ తిరుత్తణిలో బసచేశారు. ప్రతీష్‌ వాకింగ్‌ చేసే ప్రదేశాన్ని రాత్రి ఒంటిగంట సమయంలో పరిశీలించి వచ్చిన చిట్టిబాబు హత్యచేయడానికి అనువుగా ఉందని మిగిలినవారికి చెప్పారు. ఆ సమయంలో ఎవరైనా వస్తే సమాచారం అందించడానికి నింద్రకు చెందిన ముగ్గురు కిరాయి మనుషుల్ని ఏర్పాటు చేసుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున వాకింగ్‌కు వచ్చిన ప్రతీష్‌పై ఇనుపరాడ్లతో దాడిచేసి తీవ్రంగా కొట్టారు. తలపై కొట్టే సమయానికి ప్రతీష్‌ చెయ్యి అడ్డుపెట్టడంతో చేతికి బలమైన గాయమైంది. ఇంతలో సమీపంలో ఉన్న జనం కేకలు వేయడంతో ఇప్పుడు మిస్‌ అయింది.. మరోసారి వేసేస్తాం.. అని అరుస్తూ ముళ్లకంపల మధ్య దాచి ఉంచిన బైక్‌ మీద పరారయ్యారు.

పార్టీ నాయకులకు సన్నిహితం

హత్యాయత్నం కేసులో నిందితులు పార్టీ నాయకుడు గాలి భానుప్రకాష్‌తో పలు కార్యక్రమాల్లో పాల్గొనడంతోపాటు లోకేశ్‌ పాదయాత్రలో సైతం పాల్గొన్నారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుతో సెల్ఫీ తీసుకునే చనువు కూడా వారికి ఉంది.

అభ్యర్థులు దొరక్క చంద్రబాబు మల్లగుల్లాలు

మంత్రి అంబటి రాంబాబు


రామును సత్కరిస్తున్న మంత్రులు, తదితరులు

నెహ్రూనగర్‌(గుంటూరు ఈస్ట్‌)/సత్తెనపల్లి: పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచేపోయేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌ వచ్చే ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రి అవుతారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. ఏపీ వేర్‌ హౌస్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌గా నియమితులైన మామిడి రాము అభినందన సభ గుంటూరు నగరంలోని హౌసింగ్‌ బోర్డులో ఆదివారం జరిగింది. మంత్రి అంబటి మాట్లాడుతూ రా.. కదలిరా అంటూ చంద్రబాబు ఏ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏ అభ్యర్థిని నిలబెట్టుకోవాలో తెలియక మల్లాగుల్లాలు పడాల్సిన పరిస్థితి నెలకొందని చెప్పారు. మంత్రి విడదల రజినీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు సీఎం జగన్‌ తగిన సమయంలో తగిన విధంగా న్యాయం చేస్తారన్నారు. ప్రభుత్వ విప్‌ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలకు 175 గెలిపించేలా కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌ మాట్లాడుతూ జగన్‌ సీఎం అయ్యాక కార్పొరేషన్లకు పట్టిన బూజు దులిపి డైరెక్టర్లు, చైర్మన్ల పదవులు కేటాయిస్తున్నారని తెలిపారు. కాగా,బాబు, పవన్‌లు లింగమనేని ఇంట్లో భేటీ అయ్యారని.. వారు ఇలా భేటీ అవుతూనే ఉంటారని కానీ ఏదీ తేలదని మంత్రి అంబటి అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో గర్భిణుల కోసం ఆధునికీకరించిన వార్డును ఆదివారం ఆయన ప్రారంభించారు.

అరణ్యం బాటపట్టిన పెద్దపులి

- పశువుల మందపై దాడిచేసి ఆవును చంపేసిన వ్యాఘ్రం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఫారెస్ట్‌, వైల్డ్‌ లైఫ్‌ అధికారులు
- బంధించేందుకు రంగంలోకి దిగిన నిపుణుల బృందం
- పాపికొండలు అభయారణ్యం సమీప గ్రామాల్లో టెన్షన్‌ టెన్షన్‌


ఆవు కళేబరాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్‌ అధికారులు

బుట్టాయగూడెం: పాపికొండలు అభయారణ్యం నుంచి మైదాన ప్రాంతంలోకి చొరబడిన పెద్దపులి శనివారం రాత్రి తిరిగి అభయారణ్యంలోకి చేరుకున్నట్లు అటవీ శాఖ అధికారులు చెప్పారు. పులి అభయారణ్యంలోకి చేరుకునే సమయంలో శనివారం రాత్రి ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం కొవ్వాడలో పశువుల మందపై దాడి చేసింది. గ్రామానికి చెందిన కుంజం కొవ్వాడయ్య అనే గిరిజన రైతుకు చెందిన ఆవును చంపి.. ఆ కళేబరాన్ని ఊరి చివర అటవీ ప్రాంతంలోని పొలాల్లో వదిలేసిందని గ్రామస్తులు తెలిపారు. సబ్‌ డీఎఫ్‌వో వెంకయసుబ్బయ్య, ఫారెస్ట్‌ రేంజ్‌ అధికారులు దావీదురాజు, కృష్ణకుమారి, ప్రభాకర్‌ అక్కడికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. పులి నాగన్నగూడెం కొండవైపు నుంచి అడవిలోకి వెళ్లిపోయినట్టు నిర్ధారించారు. పులి కదలికలను గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లో 10 ట్రాప్‌ కెమెరాలు ఏర్పాటు చేశారు.

రెండు వారాలపాటు హడలెత్తించిన పులి

జనవరి 22న బుట్టాయగూడెం మండలం కోపల్లి బీట్‌ అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన ఎద్దుపై పెద్దపులి దాడి చేసింది. అక్కడి నుంచి కొయ్యలగూడెం, ద్వారకా తిరుమల, నల్లజర్ల, దెందులూరు, గోపాలపురం మండలాల్లో సంచరించింది. ఫారెస్ట్‌, వైల్డ్‌ లైఫ్‌ అధికారులు పొలాల్లో ఉన్న పాద ముద్రలను గుర్తించి అవి పెద్దపులివేనని నిర్ధారించారు. నాగార్జున సాగర్‌, శ్రీశైలం టైగర్‌ రిజర్వ్‌ ఫారెస్ట్‌ నిపుణుల బృందాన్ని రంగంలోకి దింపారు. ట్రాప్‌ కెమెరాలు ఏర్పాటు చేసి పులిని గుర్తించి బంధించే ఏర్పాట్లు చేసినా పులి చిక్కకుండా ఎక్కడ నుంచి బయలుదేరిందో మళ్లీ అక్కడికే శనివారం రాత్రికి చేరుకున్నట్లు అధికారులు చెప్పారు. ట్రాప్‌ కెమెరాలో పెద్దపులి సంచరించిన దృశ్యాలు చిక్కాయి. అది పాపికొండల అభయారణ్యంలో సంచరించే పులా లేక బయటి ప్రాంతం నుంచి వచ్చిందా అనే విషయాన్ని తేల్చేపనిలో అధికారులు నిమగ్నమయ్యారు.



కన్నుల పండువగా కోలాటం

శ్రీకాకుళంలోని స్థానిక ఎన్టీఆర్‌ మున్సిపల్‌ హైస్కూల్‌ మైదానంలో కళింగ వైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో వెయ్యి మంది మహిళలు ఆదివారం కోలాటం ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన వరల్డ్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డులో నమోదైంది. కార్యక్రమానికి ఎస్పీ జీఆర్‌ రాధిక హాజరై నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్‌ చైర్మన్‌ అంధవరపు సూరిబాబు, రాష్ట్ర అధ్యక్షుడు కోణార్క్‌ శ్రీను, జిల్లా అధ్యక్షుడు తంగుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్‌

అంతరిక్ష వీధిలో ట్రాఫిక్ జామ్!

పెనుముప్పుగా ఉపగ్రహ వ్యర్థాలు | వాటి సంఖ్య 24 వేల పై చిలుకే! | 13 వేలదాకా యాక్టివ్ ఉపగ్రహాలు

అంతరిక్ష వీధి ఉపగ్రహాలతో కిక్కిరిసిపోతోంది. అగ్ర రాజ్యాలు మొదలుకుని చిన్నాచితకా దేశాల దాకా కొన్నేళ్లుగా ఎడాపెడా ఉపగ్రహ ప్రయోగాలు చేపడుతున్నాయి. స్పేస్ ఎక్స్ వంటి బడా ప్రైవేట్ ఏజెన్సీలు కూడా వీటికి తోడయ్యాయి. దాంతో అంతరిక్ష ప్రయోగాల సంఖ్య అడ్డూ అదుపూ లేకుండా పెరుగుతూ వస్తోంది. అలా అంతరిక్షంలో ఉపగ్రహాల సంఖ్యా విపరీతంగా పెరుగుతోంది. దాంతోపాటే ఉపగ్రహ సంబంధిత వ్యర్థాల పరిమాణమూ నానాటికీ పెరిగిపోతోంది. ఈ ధోరణి అంతరిక్ష సంస్థలతోపాటు సైంటిస్టులను ఇప్పుడు బాగా కలవరపెడుతోంది...

- సాక్షి, నేషనల్ డెస్క్

2023లో ప్రపంచవ్యాప్తంగా విజయవంతంగా జరిగిన ఉపగ్రహ ప్రయోగాలెన్నో తెలుసా? ఏకంగా 2,917! అప్పుడెప్పుడో 1957లో అమెరికా తొలిసారిగా స్పుత్నిక్ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి ప్రయోగించి చరిత్ర సృష్టించింది. అప్పటి నుంచి 1987 దాకా 30 ఏళ్లలో జరిగిన మొత్తం అంతరిక్ష ప్రయోగాల కంటే కూడా ఒక్క 2023లో విజయవంతంగా ప్రయోగించిన ఉపగ్రహాల సంఖ్యే చాలా ఎక్కువట! ప్రస్తుతం అంతరిక్షంలో ఏకంగా 12,930 ఉపగ్రహాలు భూమి చుట్టూ తిరుగుతున్నాయి! ఇవిగాక అంతరిక్షానికి చేరాక విఫలమైనవి, కొంతకాలం పాటు పని చేసి చేతులెత్తేసినవి, కాలపరిమితి తీరి భూమితో లింకులు తెగిపోయినవి కనీసం 24 వేల పై చిలుకే ఉంటాయట! ఇవన్నీ కూడా భూమి చుట్టూ అలా తిరుగుతూనే ఉన్నాయి. మొత్తమ్మీద యాక్టివ్ ఉపగ్రహాలు, వ్యర్థాలూ కలిపి 10 సెంటీ మీటర్ల కంటే పెద్ద 'అంతరిక్ష వస్తువుల' మొత్తం సంఖ్య 2023 చివరికల్లా ఏకంగా 37 వేలు దాటిందని గణాంకాలు ఘోషిస్తున్నాయి! అంతకంటే చిన్నవాటి సంఖ్యకైతే అయితే లెక్కాపత్రం లేదు. మొత్తమ్మీద అంతరిక్షంలో ఇలాంటి వ్యర్థాల పరిమాణం 2020 చివరికే 8 వేల టన్నులు దాటిపోయిందట!



వీటితో ప్రమాదాలెన్నో...

ఈ అంతరిక్ష వ్యర్థాలతో ప్రమాదాలు ఇన్నీ అన్నీ కావు...

- భూ కక్ష్యలో తిరుగుతున్న యాక్టివ్ ఉపగ్రహాలను ఇవి ఢీకొనే ముప్పుంటుంది. అదే జరిగితే అత్యంత వ్యయప్రయాసలతో ప్రయోగించిన ఉపగ్రహాల ఆయువు అర్ధాంతరంగా తీరిపోతుంది.
- 1981లో కాస్మోస్ 1275 ఉపగ్రహం ఇలాగే అంతరిక్ష వ్యర్థాలను ఢీకొని పేలిపోయింది.
- 1996లో ఫ్రాన్స్‌కు చెందిన బుల్లి ఉపగ్రహం సెరీస్‌ను కూడా 1986లో పేలిపోయిన ఏరియన్ ఉపగ్రహపు శకలాలు ఢీకొన్నాయి.
- 2006లో రష్యా ఉపగ్రహం ఎక్స్‌ప్రెస్ కూడా గుర్తు తెలియని శకలం దెబ్బకు శాశ్వతంగా మూగబోయింది.
- 2009లో టెరా, 2010లో ఆరా 2013లో జియోస్ వంటి పలు ఉపగ్రహాలు ఇలాగే బుల్లి శకలాల బారినపడ్డాయి.
- 2009లోనైతే 950 కిలోల బరువున్న కాస్మోస్ 2251, 560 కిలోల ఇరీడియం33 ఉపగ్రహాలు పరస్పరం ఢీకొని పేలిపోయాయి. వినువీధిలో రెండు భారీ ఉపగ్రహాలు గుద్దుకోవడం అదే తొలిసారి!
- అంతరిక్ష వ్యర్థాల సంఖ్య ఇలాగే పెరుగుతూ పోతే కొన్నాళ్లకు భూ దిగువ కక్ష్యలోకి ఉపగ్రహాలను పంపడమే అసంభవంగా మారవచ్చు.

ఐఎస్ఎస్‌కూ ముప్పే

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు కూడా ఈ వ్యర్థాలతో పెను ముప్పే పొంచి ఉండటం మరింత ఆందోళనకరం. 2019 నాటికే ఐఎస్ఎస్‌ను 1,400కు పైగా బుల్లి వ్యర్థాలు ఢీకొట్టాయట. వీటి బారినుంచి కాపాడుకునేందుకు షీల్డింగ్ వ్యవస్థ ఐఎస్ఎస్‌లో ఉంది. కానీ ఐఎస్ఎస్ తాలూకు బయటి భాగాలకు మాత్రం ఆ రక్షణ లేదు. పైగా వాటిని వ్యర్థాలు ఢీకొనే ముప్పు మరింత ఎక్కువ! వ్యర్థాలు ఢీకొట్టనున్నాయన్న హెచ్చరికలతో ఐఎస్ఎస్ సిబ్బంది ఇప్పటిదాకా మూడుసార్లు సమీపంలోని సూయజ్ క్యాప్సూల్లోకి వెళ్లి దాక్కోవాల్సి వచ్చింది!

రోజుకొకటి భూమ్మీద...

- ఈ అంతరిక్ష వ్యర్థాలు కక్ష్య నుంచి జారి క్రమంగా భూ వాతావరణంలోకీ ప్రవేశిస్తుంటాయి.
- చిన్నవైతే భూమి దాకా చేరకుండానే గాల్లోనే మండిపోతాయి.
- పెద్దవి మాత్రం భూమిపై పడుతుంటాయి.
- అలా గత 50 ఏళ్లుగా సగటున రోజుకు కనీసం మూడు వ్యర్థాలు కక్ష్య కోల్పోయి భూ వాతావరణంలోకి ప్రవేశిస్తున్నాయట.
- వాటిలో కనీసం ఒక్కటైనా భూమిపై పడుతూ వస్తోందని గణాంకాలు చెబుతున్నాయి!
- ఓజోన్ పొర దెబ్బ తినేందుకు ఇవి కూడా కారణమవుతున్నాయి.
- పైగా ఈ వ్యర్థాల దెబ్బకు సౌర తుఫాన్లు, కాస్మిక్ రేడియేషన్ బారినుంచి భూమిని కాపాడే మాగ్నెటోస్పియర్ కూడా దెబ్బ తింటోందని తాజా అధ్యయనంలో తేలింది.
- ఈ అంతరిక్ష వ్యర్థాల కట్టడికి ఇప్పటిదాకానైతే అంతర్జాతీయంగా ఎలాంటి చట్టం గానీ, దేశాల మధ్య ఒప్పందాలు గానీ లేవు.
- అయితే ఈ దిశగా ఐరాస తాలూకు పీస్‌ఫుల్ యూజెస్ ఆఫ్ ఔటర్ స్పేస్ కమిటీ 2007లో కొన్ని నిర్దేశాలు రూపొందించింది.



ఆదివారం కామన్వెల్త్ న్యాయాధికారుల సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, జస్టిస్ సూర్యకాంత్ తదితరులు

పర్యావరణ న్యాయంపైనా దృష్టి

కామన్వెల్త్ న్యాయాధికారుల సదస్సులో రాష్ట్రపతి ● సరిహద్దులు ప్రతిబంధకం కారాదు: అమిత్ షా

న్యూఢిల్లీ: వాతావరణ మార్పులు ప్రపంచానికి పెను సవాలుగా మారుతున్నాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆవేదన వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో పర్యావరణ న్యాయ సాధనకు కృషి చేయాల్సిన అవసరం చాలా ఉందని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ కామన్వెల్త్ న్యాయాధికారుల సదస్సును ఉద్దేశించి ఆదివారం ఆమె ఈ మేరకు పిలుపునిచ్చారు. ''భారత రాజ్యాంగం సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం గురించి స్పష్టంగా నిర్దేశించింది. ప్రజలకు అవన్నీ దక్కేలా చూడటం మనందరి ఉమ్మడి బాధ్యత. ఈ దిశగా కామన్వెల్త్ దేశాలన్నీ చొరవ తీసుకోవాలి'' అని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా తదితరులు పాల్గొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, న్యాయసాధన వంటి అంశాల్లో సరిహద్దులు ప్రతిబంధకంగా మారరాదని అమిత్ షా ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ''నేరగాళ్లకు భౌగోళిక సరిహద్దులేమీ ఉండవు. వారి ఆగడాలకు అంతులేకుండా పోతోంది. ఈ నేరగాళ్లకు ముకుతాడు వేయాలంటే దర్యాప్తు సంస్థలు, న్యాయ వ్యవస్థలు కూడా పరిమితులను దాటి పని చేయాలి'' అని పిలుపునిచ్చారు.

ఏ అవగాహనా లేదు!

కాంగ్రెస్‌పై మోదీ మండిపాటు
- పూజనీయ స్థలాల గొప్పదనం తెలియదు
- కొన్నేళ్లుగా దేశంలో భక్తి పర్యాటకానికి ఊపు
- దానితో నిరుపేదలకు కూడా మెరుగైన ఉపాధి
- అసోంలో 'కామాఖ్య కారిడార్'కు శంకుస్థాపన

గువాహటి: కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. స్వాతంత్ర్యానంతరం దేశాన్ని దశాబ్దాల పాటు పాలించిన వారికి పూజనీయ స్థలాల గొప్పదనంపై కనీసం అవగాహన కూడా లేకుండా పోయిందంటూ దుయ్యబట్టారు. రెండు రోజుల అసోం పర్యటనలో భాగంగా ఆదివారం రాష్ట్రంలో రూ.11,600 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం గువాహటిలో జరిగిన భారీ ర్యాలీని ఉద్దేశించి మాట్లాడారు. అసోంలోని కామాఖ్య ఆలయ కారిడార్ సిద్ధమయ్యాక ఈ శక్తి పీఠాన్ని సందర్శించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలి వస్తారన్నారు. ''కామాఖ్య కారిడార్ ఈశాన్య పర్యాటకానికి గేట్‌వేగా మారనుంది. అక్కడి పర్యాటక రంగమంతటికీ ఊపునిస్తుంది'' అని విశ్వాసం వెలిబుచ్చారు. ''ఇలాంటి మహిమాన్విత పూజనీయ స్థలాలెన్నో దేశవ్యాప్తంగా కొలువుదీరాయి. కానీ దశాబ్దాలపాటు దేశాన్నేలిన వారికి వాటి గొప్పదనం గురించిన అవగాహనే లేదు. పైగా వారి స్వార్థ, స్వీయ రాజకీయ లబ్ధి కోసం మన సంస్కృతీ సంప్రదాయాల పట్ల మనమే సిగ్గుపడే పరిస్థితులు కల్పించారు. తన మూలాలను, గతాన్ని విస్మరించిన ఏ దేశమూ అభివృద్ధి సాధించజాలదు. బీజేపీ పాలనలో గత పదేళ్లలో పరిస్థితులు మెరుగవుతూ వస్తున్నాయి. మన సంస్కృతీ సంప్రదాయాలను, వారసత్వాన్ని ఘనంగా గుర్తించుకుంటున్నాం. ఒక్క 2023లోనే కాశీకి ఏకంగా 8.5 కోట్ల మంది పర్యాటకులు పోటెత్తారు. ఉజ్జయినిని 5 కోట్లకు పైగా సందర్శించారు. అయోధ్యలో రామాలయం ప్రారంభమైన 12 రోజుల్లోనే పాతిక లక్షల మంది భక్తులు దర్శనాలు చేసుకున్నారు'' అని మోదీ వివరించారు. గత దశాబ్ద కాలంలో ఈశాన్య భారతానికి కూడా పర్యాటకులు రికార్డు స్థాయిలో పెరిగారన్నారు. భక్తి పర్యాటకం వల్ల నిరుపేదలకు కూడా మంచి ఉపాధి దొరుకుతుందన్నారు. ''బీజేపీ కార్యకర్తగా నేను అసోంలో పని చేశా. అప్పట్లో గువాహటిలో రోడ్ల దిగ్బంధం, బాంబు పేలుళ్లు నిత్యకృత్యంగా ఉండేవి. ఇప్పుడదంతా గతం'' అన్నారు. గువాహటిలో పలు మౌలిక రంగ ప్రాజెక్టులను మోదీ ఈ సందర్భంగా ప్రారంభించారు. రూ.498 కోట్ల విలువైన కామాఖ్య ఆలయ కారిడార్‌తో పాటు మరికొన్నింటికి శంకుస్థాపనలు చేశారు. ఫోర్ లేన్ హైవేలు, మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులు తదితరాలు ఇందులో ఉన్నాయి.



ఆదివారం గువాహటిలో జరిగిన ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

విపాసన.. ఒత్తిళ్లపై దివ్యాస్త్రం: మోదీ

ముంబై: నిరాశలు, ఒత్తిళ్లపై విపాసన ధ్యాన పద్ధతి దివ్యాస్త్రమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ''ప్రపంచానికి ప్రాచీన భారతదేశం అందించిన అత్యుత్తమ కానుకల్లో విపాసన ఒకటి. నేటి ఆధునిక జీవన శైలిలో భాగంగా మారిన ఒత్తిళ్లను దూరం చేసుకోవడానికి యువతతో పాటు అన్ని వయసుల వాళ్లకూ ఇదో చక్కని మార్గం'' అని చెప్పారు. విపాసన బోధకుడు ఎస్.ఎన్.గోయంకా శత జయంత్యుత్సవాలను ఉద్దేశించి ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. ''విపాసన ధ్యానపద్ధతి ఒక శాస్త్రం. చక్కని వ్యక్తిత్వ వికాస మార్గం. గోయంకా తన జీవితాన్ని సమాజ సేవకు ధారపోశారన్నారు. ''గోయంకా గురూజీతో నాకెంతో సాన్నిహిత్యముంది. ఆయన జీవితం బుద్ధుని స్ఫూర్తితో సాగింది. సమామూహికంగా ధ్యానం చేస్తే అద్భుత ఫలితాలుంటాయని ఆయన నొక్కిచెప్పేవారు. ఆయన కృషి వల్ల 80 దేశాల వాళ్లు ధ్యానం ప్రాధాన్యతను, ఆవశ్యకతను అర్థం చేసుకుని ఆచరిస్తున్నారు'' అని వివరించారు.

చిన్నతనంలో వివక్షకు గురయ్యా: సునాక్



లండన్: చిన్నతనంలో జాతి వివక్షకు గురయినట్లు భారత సంతతికి చెందిన బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ వెల్లడించారు. ఇంగ్లిష్ ఉచ్చారణలో యాస లేకుండా తన తల్లిదండ్రులు ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారని చెప్పారు. ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలను వెల్లడించారు. 'చిన్నప్పుడు జాతి వివక్షకు గురయ్యా. నాతోబుట్టువులనుద్దేశించి కొందరు చేసిన వెటకారం, వెక్కిరింపులను ప్రత్యక్షంగా చూశా. ఎంతో బాధేసింది'అని సునాక్ బాల్యాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. ఇప్పుడు తన పిల్లలు జాతి వివక్షను ఎదుర్కోవడం లేదని అన్నారు. తన భారతీయ వారసత్వం గురించి చెబుతూ సునాక్... ఆకారం, రూపం ఒక అవరోధంగా మారకూడదని తల్లిదండ్రులు తమకు చెప్పేవారన్నారు. భారతీయ తరహా యాస బయటపడకుండా మాట్లాడాలని వారు పదేపదే చెప్పేవారు. మేం మాట్లాడే భాషపై వారు ప్రత్యేకంగా దృష్టి పెట్టేవారు. అలా, సరైన అభ్యాసంతో బ్రిటిష్ యాసను మేం సరిగ్గా అనుకరించ గలిగేవాళ్లం. అది చూసి మా అమ్మ చాలా సంతోషించారు'అని సునాక్ అన్నారు. జాత్యహంకార ధోరణి ఏ రూపంలోనిదైనా ఆమోదం యోగ్యం కాదని రిషిసునాక్ చెప్పారు.

నేటి యువత సామర్థ్యం అద్భుతం

సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్



వడోదర: అవకాశాలను అందిపుచ్చుకుంటూ, ఎన్నో సవాళ్లను పరిష్కరిస్తున్న నేటి యువత సామర్థ్యం చూసి తనకు ఆశ్చర్యం కలుగుతోందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోవాలని, ఓటమిని అభివృద్ధికి బాటగా మలుచుకోవాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు. జీవితమంటే మారథాన్(సుదీర్ఘ 42 కిలోమీటర్ల పరుగు పందెం) వంటిదే తప్ప 100 మీటర్ల స్ప్రింట్(స్వల్ప దూరం పరుగు పందెం) కాదని ఆయన పేర్కొన్నారు. బరోడా లోని మహారాజా శాయాజీరావ్ యూనివర్సిటీ 72వ వార్షిక స్నాతకోత్సవాన్ని ఉద్దేశించి ఆదివారం జస్టిస్ డీవై చంద్రచూడ్ వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ ఏడాది యూనివర్సిటీ ప్రదానం చేసిన మొత్తం 346 బంగారు పతకాల్లో అత్యధికంగా 336 పతకాలు మహిళలు అందుకోవడాన్ని మన దేశం మారుతోందన డానికి నిజమైన గుర్తుగా ఆయన అభివర్ణించారు. 'చరిత్రలో ఇది ఒక ప్రత్యేకమైన సమయం. మునుపెన్నడూ లేనంతగా టెక్నాలజీ నేడు ప్రజలను అనుసంధానం చేస్తోంది. అదే సమయంలో వారిలో భయాలు, ఆందోళనలకు సైతం కారణమవుతోంది. ఎప్పటికప్పుడు కొత్త కొత్త వృత్తులు పుట్టుకొస్తున్నాయి. ఇవి సంప్రదాయ వృత్తులతో సంబంధం లేనివి. వీటిల్లో ఎవరికి వారు తమ ప్రయాణం సాగిస్తున్నారు. ఈ సమయంలో పట్టభద్రులుగా బయటికి వస్తున్న మీ అందరికీ ఇది ఉత్తేజకర సమయం. అదే సమయంలో అనిశ్చితిని, గందరగోళాన్నీ సృష్టిస్తాయి'అని హెచ్చరించారు.

భారత దౌత్య కార్యాలయంలో ఐఎస్ఐ ఏజెంట్



లక్నో: రష్యా రాజధాని మాస్కోలోని భారత దౌత్య కార్యాలయంలో కీలక విధుల్లో ఉంటూ పాకిస్తాన్ నిఘా విభాగం ఐఎస్ఐకి కీలక సమాచారం చేరవేస్తున్న ఓ అధికారి ఉత్తర ప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఏటీఎస్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లా షామహియుద్దీన్‌పూర్ గ్రామానికి చెందిన సతేంద్ర సివాల్ విదేశాంగ శాఖ ఉద్యోగి. ఇతడు మాస్కోలోని భారత దౌత్య కార్యాలయంలో ఇండియా బేస్డ్ సెక్యూరిటీ అసిస్టెంట్(ఐబీఎస్ఏ)గా పనిచేస్తూ 2021 నుంచి దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాడు. పాకిస్తాన్‌లోని ఐఎస్ఐ నెట్‌వర్క్‌తో టచ్‌లో ఉంటూ రక్షణ శాఖ కార్యకలాపాలు, విదేశాంగ శాఖ వ్యవహారాలు, భారత సైన్యం కదలికలకు సంబంధించిన కీలక సమాచారాన్ని వారికి చేరవేస్తున్నాడు. కీలక సమాచారం అందిస్తే భారీగా ప్రతిఫలం ముట్టజెపుతామంటూ పలువురు ఇతర అధికారులను సైతం తన వైపు తిప్పుకునేందుకు సతేంద్ర ప్రయత్నిస్తున్నట్లు యూపీ ఏటీఎస్‌కు ఉప్పందింది. దీంతో, ఏటీఎస్ బృందం ఇతడి కదలికలు, కార్యకలాపాలపై ఓ కన్నేసి ఉంచింది. ఆ మేరకు నిబంధనల ప్రకారం ఇతడిని ఇటీవల మీరట్‌లోని ఫీల్డ్ యూనిట్‌కు రప్పించి అధికారులు విచారించారు. నేరానికి పాల్పడినట్లు విచారణలో అంగీకరించడంతో సతేంద్ర సివాల్‌పై ఐపీసీ సెక్షన్ 121ఏతో పాటు అధికార రహస్యాల చట్టం–1923 కింద కేసులు నమోదు చేసినట్లు ఏటీఎస్ వివరించింది.

గిరిజనుల తరఫున పోరాటం: రాహుల్

ధన్‌బాద్: గిరిజన ప్రజలకు నీరు, అడవి, భూమి(జల్–జంగిల్–జమీన్)పై హక్కులను, గిరిజన యువతకు ఉపాధిని కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ఆదివారం ఆయన జార్ఖండ్‌లోని ధన్‌బాద్ జిల్లాలో జరిగిన రోడ్ షోలో ప్రసంగించారు. రాష్ట్రంలో జోడో యాత్ర మూడో రోజుకు చేరుకుంది. జిల్లాలోని తుండిలో శనివారం రాత్రి బస చేసిన రాహుల్ ఆదివారం గోవింద్‌పూర్ నుంచి తిరిగి యాత్రను మొదలుపెట్టారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం కాకుండా కాపాడటం, యువతకు గిరిజనులకు న్యాయం దక్కేలా చేయడమే యాత్ర ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఆర్థిక అసమానతలు, నోట్లరద్దు, జీఎస్టీ, నిరుద్యోగం వంటి సమస్యలు దేశంలోని యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం యాత్ర తిరిగి కొనసాగి బొకారో జిల్లాలోకి ప్రవేశించింది. బొకారో వైపు సాగుతూ గోధార్ కాళి బస్తీ వద్ద ఆయన బొగ్గు గని కార్మికులు, వారి పిల్లలతో ముచ్చటించారు. మధ్యాహ్నానికి యాత్ర బొకారో చేరుకుంది. భోజనానంతరం జినామోర్ నుంచి మొదలైన యాత్ర రామ్‌గఢ్ జిల్లాలోకి ప్రవేశించింది. జిల్లాలోని గోలా వద్ద జరిగిన ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడారు.

చిలీలో భీకర కార్చిచ్చు.. 64 మంది మృతి

శాంటియాగో: దక్షిణ అమెరికా దేశం చిలీని భీకర కార్చిచ్చు వణికిస్తోంది. జనసమ్మర్దం ఎక్కువగా ఉండే ప్రాంతాలను కార్చిచ్చు చుట్టివేయడంతో కనీసం 64 మంది చనిపోగా 1,100 నివాసాలు కాలి బూడిదైనట్లు అధికారులు తెలిపారు. వల్పరైజో ప్రాంతంలో చెలరేగుతున్న నాలుగు కార్చిచ్చులు అత్యంత ప్రమాదకరంగా మారాయని, వీటిని కట్టడి చేయడం ఫైర్ సిబ్బందికి కష్టసాధ్యంగా మారిందని అధ్యక్షుడు గాబ్రియెల్ బోరిక్ పేర్కొన్నారు. కొండ ప్రాంతాల్లో సైతం మంటలు వేగంగా విస్తరిస్తుండటంతో అక్కడ రక్షణ చర్యలకు ఆటంకం కలుగుతోందన్నారు. క్విల్పు, విల్లా అలెమన, తీరప్రాంత రిసార్టు పట్టణం వియా డెల్ మార్ ప్రాంతాలు బాగా దెబ్బతిన్నాయి. విల్లా ఇండిపెండెన్సియాలో సర్వమూ కాలిబూడిదై, ఆ ప్రాంతమంతా బూడిద విస్తరించుకుని ఉంది. దక్షిణ అమెరికాలో ఎల్ నినో కారణంగా అధిక ఉష్ణోగ్రతలు, పొడి వాతావరణ పరిస్థితులు కార్చిచ్చుకు ఊతమిస్తున్నాయి.

ఆక్రమిత ఉక్రెయిన్‌పై దాడి.. 28 మంది మృతి

మాస్కో: ఉక్రెయిన్‌లోని రష్యా ఆక్రమిత లిసిచాన్స్క్ నగరంలోని ఓ బేకరీపై జరిగిన దాడిలో 28 మంది మృతి చెందారు. రష్యా నియమించిన స్థానిక అధికారి ఈ విషయం వెల్లడించారు. బేకరీ కుప్పకూలిపోవడంతో శిథిలాల్లో చిక్కుకుపోయిన మరో 10 మందిని కాపాడినట్లు చెప్పారు. ఘటనపై ఉక్రెయిన్ అధికారులు స్పందించలేదు. ఈ శీతాకాలంలో సుమారు 930 మైళ్ల మేర విస్తరించి ఉన్న యుద్ధ క్షేత్రంలో ఎటువంటి మార్పులు చోటుచేసుకోలేదు. రష్యా, ఉక్రెయిన్ సైన్యాలు ఎక్కువగా దీర్ఘ శ్రేణి దాడులపైనే ఆధారపడ్డాయి. ఇలా ఉండగా, 24 గంటల వ్యవధిలో రష్యా బలగాలు పలు ప్రాంతాల్లో తమ సేనలపైకి పదేపదే దాడులతో ఒత్తిడి తీవ్రతరం చేసినట్లు ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది.

యెమెన్‌లోని హౌతీలపై అమెరికా దాడులు

వాషింగ్టన్: ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలపై దాడులకు పాల్పడుతున్న హౌతీలకు చెందిన యెమెన్‌లోని ప్రాంతాలపై అమెరికా, యూకే యుద్ధ విమానాలు దాడులు జరిపాయి. మొత్తం 13 ప్రాంతాల్లోని 36 హౌతీల లక్ష్యాలపై యుద్ధ నౌకల నుంచి క్షిపణులు, యుద్ధ విమానాల ద్వారా దాడులు జరిపినట్లు పెంటగాన్ తెలిపింది. దాడుల్లో బహ్రెయిన్, కెనడా, డెన్మార్క్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్‌లు కూడా పాలుపంచుకున్నట్లు వివరించింది. మరిన్ని దాడులకు తెగబడకుండా, హౌతీల సామర్థ్యాన్ని దెబ్బతీయడమే తమ ఉద్దేశమని తెలిపింది. వారం క్రితం జోర్డాన్‌లోని అమెరికా బలగాలపై డ్రోన్ దాడికి ప్రతిగా అమెరికా యుద్ధ విమానాలు శనివారం ఇరాక్, సిరియాల్లోని 85 లక్ష్యాలపై దాడులు జరిపిన విషయం తెలిసిందే.

బీజేపీలో చేరాలని ఒత్తిడి: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: బీజేపీ లక్ష్యంగా ఆప్ అగ్రనేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో చేరాలని తనతోపాటు, ఇతర ఆప్ నేతలపై కాషాయ దళ నేతలు ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. అయితే, తాము ఎలాంటి తప్పు చేయనందున అలా చేయబోమని స్పష్టం చేశారు. ఆప్ ఎమ్మెల్యేలకు బీజేపీ ఎరవేసిందన్న ఆరోపణలపై విచారణకు హాజరు కావాలని ఢిల్లీ పోలీసులు కోరడం, మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఈడీ పదేపదే నోటీసులివ్వడం వంటి పరిణామాల నేపథ్యంలో కేజ్రీవాల్ తాజాగా ఈ వ్యాఖ్యలు చేశారు. 'బీజేపీ నేతలు ఎలాంటి కుట్రలకు పాల్పడాలని చూసినా, ఎలాంటి ఫలితం ఉండదు. వాళ్ల కుట్రలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నా. వాళ్లకి తలొంచేదే లేదు. బీజేపీలో చేరితే ఏ ఇబ్బందులూ లేకుండా చేస్తామని చెబుతున్నారు. కానీ, ఆ పార్టీలో ఎట్టి పరిస్థితుల్లోనూ చేరబోను'అని కేజ్రీవాల్ ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో అన్నారు. ఆప్ నేతలపై పెట్టినవన్నీ తప్పుడు కేసులన్నారు.

కేంద్రానిది ఆర్థిక ఉగ్రవాదం: టీఎంసీ

కోల్‌కతా: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై పశ్చిమబెంగాల్ అధికార పార్టీ టీఎంసీ విరుచుకుపడింది. కేంద్రం ఆర్థిక సమాఖ్య ఉగ్రవాదానికి పాల్పడుతోందని ఆరోపించింది. టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రియాన్ ఆదివారం కోల్‌కతాలో మీడియాతో మాట్లాడారు. తామిచ్చే నిధుల వినియోగానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను బెంగాల్ ప్రభుత్వం అందజేయలేదంటూ కేంద్రం చేస్తున్న ఆరోపణలు అవాస్తవాలని ఆయన కొట్టిపారేశారు. బీజేపీని తీవ్రంగా వ్యతిరేకించే పార్టీ అధికారంలో ఉన్నందునే రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకుందని ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే ఇలాంటి విమర్శలు చేస్తోందని ఎంపీ ఒబ్రియాన్ అన్నారు. కాగ్ నివేదికలోని అంశాలను ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తూ వ్యతిరేక ప్రచారానికి బీజేపీ ప్రభుత్వం పూనుకుందని పేర్కొన్నారు.

నమీబియా అధ్యక్షుడు గీన్‌గోబ్ కన్నుమూత

హరారే: నమీబియా అధ్యక్షుడు హగె గాట్‌ఫ్రీడ్ గీన్‌గోబ్(82) మృతి చెందారు. కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్న గీన్‌గోబ్ హరారేలోని లేడీ పోహంబా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారని అధ్యక్షభవనం తెలిపింది. ప్రొస్టేట్ క్యాన్సర్ బారినపడినట్లు 2014లో గీన్‌గోబ్ స్వయంగా ప్రకటించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్నారు. 2015 నుంచి దేశాధ్యక్షుడిగా కొనసాగుతున్న గీన్‌గోబ్ పదవీ కాలం ఈ ఏడాదితో పూర్తి కావాల్సి ఉంది. వలస పాలన నుంచి బయటపడ్డాక నమీబియా మొదటి ప్రధానిగా 1990–2002 మధ్య తిరిగి 2008–12 సంవత్సరాల మధ్య గీన్‌గోబ్ బాధ్యతలు నిర్వహించారు.

వ్యవస్థలను బీజేపీ నిర్వీర్యం చేస్తోంది: ఖర్గే

త్రిస్సూర్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను క్రమబద్ధంగా నిర్వీర్యం చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ప్రతిపక్ష నేతలపై తప్పుడు, నిరాధార ఆరోపణలు చేసేందుకు ఈడీ, సీబీఐ, ఐటీ వంటి విభాగాలను ఆయుధాలుగా వాడుకుంటోందన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికలకు గాను ఆదివారం ఆయన కేరళ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. త్రిస్సూర్‌లోని తెక్కునాడు మైదాన్‌లో కాంగ్రెస్ నిర్వహించిన 'మహాజన సభ'నుద్దేశించి మాట్లాడారు. సమావేశంలో 25వేలకు పైగా బూత్ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగాయని, దేశంలో పేద, ధనిక అంతరాలు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయని, పేదలు మరింత పేదలుగా మారుతున్నారని అన్నారు.

సౌత్ కరోలినాలో బైడెన్ ఘన విజయం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కీలకమైన సౌత్ కరొలినాలో డెమోక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా మొట్టమొదటి నిర్ణయాత్మక విజయం సాధించారు. ఈ ఘన విజయంతో ఈ ఏడాది నవంబర్ 5వ తేదీన జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కు ప్రధాన ప్రత్యర్థిగా బరిలో నిలిచే అవకాశాలున్నాయి. నాలుగేళ్ల క్రితం ఆయన సౌత్ కరోలినా నుంచే డెమోక్రాటిక్ పార్టీ తరఫున విజయ పరంపర నమోదు చేసుకున్నారు. తాజా ఎన్నికలో బైడెన్‌కు 96.2 శాతం ఓట్లు పోలవగా ఆయనతో పోటీకి దిగిన మరీన్ విలియమ్సన్‌కు కేవలం 2.1 శాతం ఓట్లే దక్కాయి.

గ్రోత్ ఇంజిన్ ఈశాన్య రాష్ట్రాలే: కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రాలు అభివృద్ధి చెందకపోతే దేశం అభివృద్ధి చెందదని కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దేశానికి ఈశాన్య రాష్ట్రాలే గ్రోత్ ఇంజిన్ అని తెలిపారు. ఆదివారం ఢిల్లీలోని అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో నిర్వహించిన 'నార్త్ ఈస్ట్ సమ్మేళన్'కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానిగా మోదీ బాధ్యతలు తీసుకున్ననాటి నుంచి ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిపై ప్రత్యే దృష్టి సారించారని చెప్పారు. పదేళ్లుగా ప్రధాని మోదీ నేతృత్వంలో ఎన్నడూ లేని విధంగా ఈశాన్య రాష్ట్రాలు అభివృద్ధి చెందుతున్నాయని వివరించారు. స్థిరమైన ప్రభుత్వం, నాయకుడి వల్లే నార్త్ ఈస్ట్‌లో శాంతి నెలకొందని, అభివృద్ధి సాధ్యం అవుతోందన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. మావోయిస్టు మృతి

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు చనిపోయాడు. సోధి గజేంద్ర తదితర సుమారు 20 మంది మావోయిస్టులతో కూడిన కుంటా ఏరియా కమిటీ సమావేశమవుతున్నట్లు అందిన సమాచారంతో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా భేజీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నగరం, పంటాభేజీ గ్రామాల మధ్య ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఘటనలో ఒక మావోయిస్టు చనిపోయాడు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

సోమవారం ၊ 5 ၊ ఫిబ్రవరి ၊ 2024



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సినీనటులు కిరణ్ అబ్బవరం, రక్షిత్‌లు ఆదివారం దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.



కొండలమ్మ సన్నిధిలో జిల్లా జడ్జి

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మవారిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ సురేష్ అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలను అందించారు.

నేడు స్పందన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలోనూ కార్యక్రమం కొనసాగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



న్యూస్‌రీల్

జిల్లా వెబ్‌సైట్‌లో ఫైనల్ సెలక్షన్ లిస్టు

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌ఓ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు రాజమహేంద్రవరం ప్రాంతీయ సంచాలకులు జనవరి 12న జారీ చేసిన నోటిఫికేషన్‌లకు సంబంధించి దరఖాస్తులను పరిశీలించి ఫైనల్ సెలక్షన్ లిస్టును జిల్లా వెబ్‌సైట్‌లలో పొందుపరిచినట్లు జోన్–2 ఆర్డీ డాక్టర్ పి. పద్మా శశిధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 5న వారి ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో ఉన్న ఆర్డీ కార్యాలయంలో హాజరుకావాలని కోరారు.

ముగిసిన త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీతోత్సవాలు



విజయాడ కల్చరల్: స్థానిక దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో వారం రోజులుగా జరుగుతున్న శ్రీత్యాగరాజ స్వామి ఆరాధనా సంగీతోత్సవాలు ఆదివారం ముగిశాయి. సంగీత సన్మండలి సంగీత సంస్థ, ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చివరి రోజు నగరానికి చెందిన వందమందికి పైగా సంగీత విద్వాంసులు త్యాగరాజ స్వామి రచించిన ఘన రాగ పంచరత్న కీర్తనలు జగదానంద కారక, దుడుకుగల నన్నే, సాధించినే, కనకనరుచిరా, ఎందరో మహానుభావులు కీర్తనలను ఏకకాలంలో స్వరం తప్పకుండా గానం చేశారు. మోదుమూడి సుధాకర్, అంజరా సుధాకర్, వేమూరి విశ్వనాథ్, భమిడిపాటి శ్రీలలిత, పోపూరి గౌరీనాథ్, దర్భా మృధురవళి, సద్గురు చరణ్ ఫల్గుణ్ తోపాటు పలువురు సంగీత విద్వాంసులు గోష్టిగానంలో పాల్గొన్నారు.

11న బాడీ బిల్డింగ్ పోటీలు

పెనమలూరు: ఉమ్మడి కృష్ణా జిల్లా బాడీబిల్డింగ్ పోటీలు ఈ నెల 11వ తేదీన నిర్వహిస్తున్నామని బాడీ బిల్డింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఈదా రాజేష్, అధ్యక్షుడు బి.మనోహర్, కార్యదర్శి తాళ్లూరి అశోక్ తెలిపారు. కానూరులో ఆదివారం వివరాలు తెలుపుతూ ఈ నెల 11వ తేదీన 11వ మిస్టర్ ఉమ్మడి కృష్ణా జిల్లా బాడీబిల్డింగ్ పోటీలు కానూరు అశోక్ జిమ్ సహకారంతో గ్లోబల్ కిట్స్ పాఠశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. విజేతలకు నగదు బహుమతితో పాటు, సర్టిఫికెట్‌లు, పతకాలు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8686771358, 9985182645లో సంప్రదించాలన్నారు.

'అప్స' కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా గౌరీప్రసాద్



పెదన: ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్స) కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా పెడన విశ్వభారతి హైస్కూల్‌కు చెందిన అనుముకొండ గౌరీప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మచిలీపట్నంలోని మాస్టర్ కె. బాలబాను విద్యాలయంలో ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ కృష్ణాజిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో రెండేళ్ల పాటు పదవిలో కొనసాగేలా గౌరీప్రసాద్‌ను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ మేరకు గౌరీప్రసాద్ ఓ ప్రకటన జారీ చేశారు. ప్రైవేటు విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర కమిటీ సభ్యులు వి. సుందరం, కోమరగిరి చంద్రశేఖర్, కేవీజాన్, సీహెచ్ఎస్ఎన్ రాజు, గన్నవరం, అవనిగడ్డ, మచిలీపట్నం డివిజన్లకు చెందిన నాయకులు, సభ్యులు హాజరయ్యారు.

ప్రశాంతంగా ఎన్‌సీసీ పరీక్ష



పటమట(విజయవాడతూర్పు): మారిస్ స్టెల్లా కాలేజ్‌లో నేషనల్ క్యాడెట్ బీ సర్టిఫికెట్ పరీక్ష నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ పరీక్షలో కామన్ సబ్జెక్ట్ సర్వీస్ సబ్జెక్టులలో పరీక్ష నిర్వహించగా ప్రిసైడింగ్ ఆఫీసర్స్‌గా 4వ ఆంధ్ర గరల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలందర్ సింగ్, 17వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రాకేష్ యాదవ్, రాజ్ ముఖేష్ వ్యవహరించారు. ఈ పరీక్షకు 700మంది ఎన్‌సీసీ క్యాడెట్‌లు హాజరయ్యారు. సుబేదార్ మేజర్ రాజ్‌పాల్, ఆడం ఆఫీసర్ స్వాతి పాండే, ఆర్మీ, నేవీ అధికారులు, కెప్టెన్ శైలజ, సబ్ లెఫ్టినెంట్ స్వప్న, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు పరీక్షను పర్యవేక్షించారు.

నారీ సాధికారతకు చేయూత

మహిళలను వ్యాపారవేత్తలుగా మారుస్తున్న పథకం

- ఏటా రూ. 18,750 ఆర్థిక సహాయం
- మూడేళ్లలో రూ. 505.61 కోట్లు జమ
- ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న మహిళలు



చేయూత లబ్ధిదారులు కొనుగోలు చేసిన పాడి గేదెలు పరిశీలిస్తున్న జిల్లా అధికారులు(ఫైల్)

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి దృష్టిలో ఉంచుకొని పేద, నిరుపేదలకు 'నవరత్నాల పథకాల' ద్వారా అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. ముఖ్యంగా మహిళల సమగ్రాభివృద్ధి అజెండా, ఆర్థిక సాధికారతలో భాగంగా వైఎస్సార్ చేయూత పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. ఈ పథకాన్ని 2020 ఆగస్టు 12న ప్రభుత్వం ప్రారంభించింది. 45 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలకు నాలుగు దఫాలలో మొత్తం రూ.75,000 ఆర్థిక సహాయం అందించడానికి అమలు చేస్తున్న ప్రత్యేక సంక్షేమ కార్యక్రమం ఇది. మహిళా లబ్ధిదారులకు కుటుంబ స్థాయిలో మెరుగైన జీవనోపాధిని అందిపుచ్చుకునే విధంగా అవకాశాలను కల్పించడం, సంపద సృష్టి, ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా సుస్థిరమైన జీవనోపాధి కల్పించడమే ఈ పథకం లక్ష్యం.

వ్యాపారాల వైపు..

వైఎస్సార్ చేయూత పథకం కింద ప్రభుత్వం రిటైల్ వస్త్ర వ్యాపారంలో గుర్తింపు పొందిన లబ్ధిదారులకు మద్దతు ఇచ్చేందుకు బహుళజాతి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. పాడి రైతులకు పశువుల పెంపకం, పాల సేకరణ, ఆరోగ్య సేవలు, కిరాణా షాపులు, బట్టల షాపుల ఏర్పాటు, పండ్లు, కూరగాయలు, చిన్న జీవాలు కొనుగోలు వంటి వాటి కోసం ఆర్థిక సహాయం చేస్తోంది. జీవనోపాధి తరహా వ్యాపారాలు నడిపేందుకు అవకాశం కల్పించింది. మహిళా లబ్ధిదారుల పాడి పరిశ్రమ అభివృద్ధి, రిటైల్ రంగాలలో జీవనోపాధిని అభివృద్ధి చేసుకోవడం ద్వారా వారి కుటుంబ ఆదాయాలను పెంచుకుంటున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో లబ్ధి ఇలా..

ఎన్టీఆర్ జిల్లాలో మూడు విడతల్లో ఈ పథకం కింద రూ. 505. 61 కోట్లు ఆర్థిక సహాయం అందించింది. మొదటి విడతలో లబ్ధిదారుల సంఖ్య 82,601 మంది కాగా ఏటేటా లబ్ధిదారుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. మూడో విడతలో ఈ పథకం ద్వారా 95,210 మంది లబ్ధిపొంది జీవనోపాధిని పొందారు. మొదటి రెండు విడతల్లో లబ్ధిపొందిన మహిళల్లో 1948 మంది కిరాణా వ్యాపారం, 796 మంది వస్త్ర వ్యాపారం, 6,574 మంది పాడిపరిశ్రమ ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. 82,526 మంది సెర్ప్ చేపట్టే ఇతర ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

- ఎన్టీఆర్ జిల్లాలో మొదటి విడతగా 82,601 మంది లబ్ధిదారులకు రూ.154.88 కోట్లు ఆర్థిక సహాయం అందించారు.
- 2021–22 ఆర్థిక సంవత్సరంలో చేయూత రెండో విడతలో 91,845 మంది లబ్ధిదారులకు రూ.172.21 కోట్లు జమ చేశారు.
- మూడో విడతలో 95,210 మంది లబ్ధిదారులకు రూ.178.52 కోట్లు ఆర్థిక సహాయం అందించారు. ఇప్పుడు నాలుగో విడత నగదు సాయం ఈ నెలలోనే అందించేందుకు ప్రభుత్వ ఏర్పాట్లు చేస్తోంది.



విస్సన్నపేటలోని రామానగరంలో చేయూతతో వస్త్ర దుకాణం ఏర్పాటు చేసుకున్న మహిళ

మూడు విడతల్లో లబ్ధిపొందాను..



జగనన్న మాట ఇస్తే తప్పడు. 45 ఏళ్లు పైబడిన వాళ్లకు ఏటా రూ. 18,750 చొప్పున నాలుగేళ్లు రూ.75వేలు ఇస్తానని చెప్పాడు. కరోనా వంటి ఇబ్బందులు వచ్చినా మాట తప్పలేదు. నాకు మూడు విడతలు వైఎస్సార్ చేయూత అందింది. ఆ డబ్బులతో చీరలు కొనుగోలు చేసి ఇంటి వద్దనే అమ్ముకుంటున్నాను. జగనన్న ఇచ్చిన చేయూతతో మంచి ఆదయాన్ని సంపాదించుకుంటున్నాను.

– వెంకట్రావమ్మ, జమ్మవరం, వీరులపాడు మండలం

చేయూత జీవనోపాధి..



చేయూత పథకం నిరుపేద మహిళలకు వరం. లబ్ధిదారులు వస్త్రవ్యాపారం, కిరాణా దుకాణాలు, పాడి పరిశ్రమ ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లోని మహిళలు పాడి పరిశ్రమ ద్వారా రోజువారీ అదనపు ఆదాయం పొందుతున్నారు. తాము వ్యాపారం చేయాలన్న కల ఈ పథకం ద్వారా నెరవేరుతోంది. నాలుగో విడత పథకం అమలుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– కె. శ్రీనివాసరావు, పీడీ, డీఆర్‌డీఏ, ఎన్టీఆర్ జిల్లా

మరియమాతను ఆశ్రయిస్తే దీవెనలు



గుణదల (విజయవాడ తూర్పు): మరియమాతను ఆశ్రయించిన భక్తులకు సకల దీవెనలు లభిస్తాయని ఏలూరు మేత్రాసన గురువు ఫాదర్ తోట గాబ్రియేలు అన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో జరుగుతున్న నవదిన ప్రార్థనలు ఐదో రోజుకు చేరుకున్నాయి. ఆదివారం జరిగిన ప్రార్థనలకు ముఖ్య అతిథిగా హాజరైన ఫాదర్ గాబ్రియేలు మాట్లాడుతూ ఆరోగ్య ప్రదాయినిగా మరియతల్లి భక్తుల నీరాజనాలందుకుంటోందని తెలిపారు. మతాలు వేరైనా మానవులంతా ఒక్కటేనని పేర్కొన్నారు. మరియమాత భక్తులందరినీ తన అక్కున చేర్చుకుంటుందని వివరించారు. గుణదల పుణ్యక్షేత్రానికి మత భేదం లేకుండా సకల జనులు వచ్చి మరియ తల్లి దీవెనలు పొందుతారని చెప్పారు. ఏటా జరిగే మరియ మాత ఉత్సవాలకు అనేక ప్రాంతాల నుంచి లక్షలాది మంది యాత్రికులు ఈ పుణ్యక్షేత్రానికి చేరుకుని తమ మొక్కుబడులు చెల్లించుకుంటారని తెలిపారు. ఈ ఏడాది శతజయంతి ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా జరగటం విశేషమన్నారు. మరియమాత ఈ పుణ్యక్షేత్రంలో ఆవిర్భవించి నూరు వసంతాలు పూర్తి చేసుకోవడం ఆనందదాయకమన్నారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు దివ్య సత్ప్రసాదాన్ని అందించారు. అంతకు ముందు మఠకన్యలు, భక్తులు పెద్ద సంఖ్యలో కొండ పైన మేరిమాత స్వరూపం వద్దకు చేరుకున్నారు. మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్ మరియన్న, ఫాదర్ జాన్ పీటర్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- 20వ తేదీ వరకూ ఒకేషనల్ ప్రాక్టికల్స్
- సైన్స్ విద్యార్థులకు 11వ తేదీ నుంచి..



ఇంటర్మీడియెట్ విద్యార్థులు(ఫైల్)

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియెట్ విద్య అత్యంత కీలకం. ఇంటర్ పరీక్షల్లో సాధించే మార్కులు పైచదువులకు అండగా ఉంటాయి. సైన్స్ విద్యార్థులకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు అత్యంత కీలకం. ప్రాక్టికల్స్‌పై మనస్సు పెడితే ప్రతి సబ్జెక్ట్‌లో 30కి 30 మార్కులు తేలికగా సాధించొచ్చని సబ్జెక్ట్ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికే ప్రయోగ పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ నెల ఐదు నుంచి 20వ తేదీ వరకూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు సంబంధించి ఈ నెల ఐదో తేదీ నుంచి 20వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. సైన్స్ విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షలు 11 నుంచి 20వ తేదీ వరకూ కొనసాగుతాయి.

కృష్ణాజిల్లాలో..

కృష్ణాజిల్లాలో ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి 17,659 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. 77 కళాశాలల్లో 131 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయి. ఎంపీసీకి సంబంధించిన 10,530 మంది, బైపీసీకి సంబంధించి 5,620 మంది మొత్తం 16,150 మంది, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మొదటి సంవత్సరం విద్యార్థులు 734 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 775 మంది చొప్పున మొత్తం 17,659 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతారు. ఒకేషనల్ ప్రాక్టికల్స్ కోసం 16 కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు.

ఎన్టీఆర్ జిల్లాలో..

ఎన్టీఆర్ జిల్లాలో ప్రాక్టికల్ పరీక్షలకు 78,509 మంది విద్యార్థులు హాజరవుతారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు 70,200 మంది, 8,309 విద్యార్థులు ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. జనరల్ ప్రాక్టికల్ పరీక్షలకు 134 పరీక్ష కేంద్రాలను, ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు 20 కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు.

ప్రాక్టికల్ పరీక్షల షెడ్యూల్..

జనరల్, ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు రోజూ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ ప్రాక్టికల్స్ జరుగుతాయి. ఎంపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు సంబంధించి ఒక్కో సబ్జెక్టుకు 30 మార్కుల చొప్పున 60 మార్కులు ఉంటాయి. బైపీసీ విద్యార్థులకు నాలుగు సబ్జెక్టుల్లో 30 మార్కుల చొప్పున 120 మార్కులు కేటాయిస్తారు.

విస్తృత ఏర్పాట్లు..

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల ఎంపికతో పాటుగా వాటికి బాధ్యులను కేటాయించడం, పరీక్ష సామగ్రి తరలించటం వంటి కార్యక్రమాలను పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాకు జిల్లా ఒకేషనల్ విద్యాశాఖాధికారి సీఎస్ఎస్ఎన్ రెడ్డి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

పూర్తిస్థాయిలో పర్యవేక్షణ



రెండు జిల్లాల్లో ఈ నెల ఐదో తేదీ నుంచి జరిగే ప్రయోగ పరీక్షలకు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ కొనసాగే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. విద్యార్థులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇప్పటికే ఆయా కేంద్రాలకు సంబంధించి సూచనలు చేశాం. సంబంధిత పర్యవేక్షకులకు సంబంధించి కట్టుదిట్టమైన ఆదేశాలు సైతం అందించాం.

– పెద్దప్రోలు రవికుమార్, ఆర్ఐఓ, ఉమ్మడి కృష్ణాజిల్లా

స్మృతివనం.. కోలాహలం



స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు దేశమంతా అనేకం ఉన్నా.. అవన్నీ ఒక ఎత్తు.. విజయవాడ నగరం నడిబొడ్డున ఠీవీగా నిలబడిన ఆకాశమంత ఈ విగ్రహం మరొక ఎత్తు.. ఆయన అత్యున్నత ఆశయాలు భవిష్యత్ తరాలకు తెలియపర్చడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్‌ను కనులారా వీక్షించేందుకు జనాలు బారులు తీరుతున్నారు. వీకెండ్ వచ్చిందంటే గ్రామం, పట్టణం అనే తేడా లేకుండా అందరూ అక్కడికి క్యూ కడుతున్నారు. గ్రీనరీ, మ్యూజియం, ఆంపీ థియేటర్ వంటివి తిలకించేందుకు అందరూ ఆసక్తి కనబరుస్తున్నారు. అంబేడ్కర్ స్మృతివనం గేటు వద్ద ఆదివారం సాయంత్రం పెద్ద ఎత్తున వేచి ఉన్న జనాలను చిత్రంలో చూడొచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

13 నుంచి సుబ్బారాయుడి బ్రహ్మోత్సవాలు



స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు, నరసింహారావు

పోస్టర్లు ఆవిష్కరించిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంట్ ఇన్‌చార్జి, అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు వివరాలు వెల్లడించారు.

- 13వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు శ్రీ స్వామివారిని పెండ్లికుమారుని చేస్తారని, స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తామని ఏసీ అన్నారు. రాత్రి 7 గంటలకు యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణ, అంకురారోపణ, వాస్తుపూజ, ధ్వజారోహణ, బలిహరణ, ధ్వజపట ప్రతిష్టాపన, నీరాజన మంత్రపుష్పాలతో పూజలు చేస్తారని చెప్పారు.
- 14వ తేదీ బుధవారం ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత స్నపన, నిత్య హోమం, బలిహరణ, నీరాజన మంత్రపుష్పాలతో పూజలు, మధ్యాహ్నం 2 గంటలకు శేషవాహనంపై స్వామివారి ఊరేగింపు(రావివారిపాలెం వరకు) రాత్రి 7 గంటలకు శ్రీ స్వామివారి ఎదురుకోలు ఉత్సవం, రాత్రి 8 గంటలకు స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవం నిర్వహించిన అనంతరం నందివాహనంపై గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు.
- 15వ తేదీ గురువారం ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత స్నపన, నిత్యహోమం, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం రాత్రి 8 గంటలకు స్వామివారి రథోత్సవం కనులపండువగా వైభవోపేతంగా నిర్వహిస్తామన్నారు.
- 16వ తేదీ శుక్రవారం ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత, నిత్యహోమం, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం ఉదయం 9 గంటలకు వసంతోత్సవం, అవభృతస్నానోత్సవం, సుబ్రహ్మణ్య మాల దీక్ష విరమణ, పూర్ణాహుతి రాత్రి 7 గంటలకు శమీవృక్షపూజ, రాత్రి 8 గంటలకు మయూర వాహనంపై గ్రామోత్సవం (రావివారిపాలెం వరకు) ఉంటుందని తెలిపారు.
- 17వ తేదీ శనివారం ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, పంచామృతస్నపన, నీరాజన మంత్రపుష్పం ఉదయం 10 గంటలకు సుబ్రహ్మణ్య హవనం రాత్రి 7 గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు రాత్రి 8 గంటలకు శ్రీస్వామివారి పుష్పశయ్యాలంకృత పర్యంకసేవతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.
- ఉత్సవాల్లో బాగంగా 13 నుంచి 17వ తేదీ వరకు దేవాలయంలో జరుగు నిత్య ఆర్జిత సేవలు నిలిపివేయనున్నట్లు ఏసీ తెలిపారు. కృష్ణా, గుంటూరు జిల్లాల రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జీ కడవకొల్లు నరసింహారావు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

జీసీజీటీఏ డైరీ ఆవిష్కరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం, జీసీజీటీఏ-2024 ఎక్స్‌క్లూజివ్ డైరీని గుంటూరు, కృష్ణా జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ టి. కల్పలతా రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. దీనిని జీసీజీటీఏ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు డాక్టర్ కేఆర్‌జీ శేషుకుమార్ సమకూర్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ దైనందిన విధి నిర్వహణలోని అకడమిక్ ఇన్ఫర్మేషన్‌ను పొందుపరచుకునేందుకు వీలుగా, సొంతంగా, కాంప్లిమెంటరీగా సభ్యుల సౌకర్యార్థం డైరీని అందిస్తున్న డాక్టర్ కేఆర్‌జీ శేషుకుమార్‌ను అభినందించారు.

97.84 శాతం పింఛన్ పంపిణీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక 97.84 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లాలో మొత్తం 2,39,078 మందికి గాను 2,33,922 మంది పెన్షన్ అందుకున్నారు. జిల్లాలో అత్యధికంగా జి. కొండూరు మండలంలో 99.04 శాతం, కొండపల్లి (అర్బన్)లో 98.4 శాతం, ఇబ్రహీంపట్నంలో 98.22 శాతం, గంపలగూడెం 98.21 శాతం, విజయవాడ అర్బన్‌లో 98.1 శాతం పంపిణీ పూర్తయింది.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

- ఆర్జిత సేవలకు డిమాండ్
- కిటకిటలాడిన క్యూలైన్లు
- సర్వ దర్శనానికి రెండు గంటలు



క్యూలైన్‌లో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గామల్లేశ్వరస్వామి వార్లను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. తెల్లవారుజాము నుంచే ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీచక్రనవార్చన, లక్ష కుంకుమార్చన, యాగశాలలో నిర్వహించిన చండీహోమం, శాంతి కల్యాణంతో పాటు సూర్యోపాసన సేవలో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. ఉదయం నుంచే క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన నిమిత్తం అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయడంతో రద్దీ మరింత పెరిగింది. మహా మండపం వైపు నుంచి వచ్చే భక్తుల క్యూలైన్ ఆరో అంతస్తు వరకు , ఇటు ఘాట్ రోడ్డు వైపు వచ్చే భక్తుల క్యూ సమాచార కేంద్రం వరకు చేరింది. మహా నివేదన అనంతరం క్యూలైన్లు త్వరత్వరగా నడిచేలా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. మధ్యాహ్నం 2 గంటల తర్వాత రూ. 500 అంతరాలయ దర్శనం క్యూలైన్ కాసింత రద్దీ తగ్గడంతో రూ. 300 టికెట్టు తీసుకున్న భక్తులకు బంగారు వాకిలి దర్శనం కల్పించారు. దీంతో క్యూలైన్‌లో భక్తుల తాకిడి తగ్గింది. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి ఆలయం చుట్టూ మూడు పర్యాయాలు ప్రదక్షిణ నిర్వహించే అవకాశం కల్పిస్తుండటంతో భక్తులకు పెద్ద ఎత్తున పల్లకీ సేవలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైద్యుల సమస్యలు పరిష్కరించాలని వినతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్యుల సమస్యలు పరిష్కరించాలని ఐఎంఏతో పాటు పలు సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. విజయవాడలోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఐఎంఏతో పాటు, ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీ జీడీఏ), ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (ఆప్నా), స్పెషాలిటీ ఆస్పత్రుల సంఘం (ఆషా), జూడాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఎంఏ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు డాక్టర్ జి.రవికృష్ణ మాట్లాడుతూ 2008లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన రక్షణ చట్టం సవరించి మరింత కఠినతరం చేయాలన్నారు. రోగి మరణించినప్పుడు బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే వైద్యులు, ఆస్పత్రులపై కేసులు నమోదు చేయడానికి అనుసరించిన విధి విధానాలపై సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. ఆస్పత్రుల రిజిస్ట్రేషన్‌కు ఏకపక్ష విధానం రూపొందించాలని, బయో మెడికల్ వేస్ట్ సేకరణ చార్జీలు ఏపీ పీసీబీ వైద్యులతో సంప్రదించి నిర్ణయించాలని, ఫైర్ అనుమతులను ఐదేళ్లు కొనసాగించాలని కోరారు. సమావేశంలో ఏపీ జీడీఏ ప్రతినిధి డాక్టర్ జయధీర్, ఆప్నా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, ఆషా ఉపాధ్యక్షుడు డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతిపై ఫిర్యాదు

జి.కొండూరు: తండ్రి మృతిపై తనకు అనుమానాలు ఉన్నాయంటూ ఓ మహిళ జి.కొండూరు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. వెలగలేరు గ్రామానికి చెందిన బిట్ర రెడ్డయ్య (75)కు భార్య రెండేళ్ల క్రితం మృతి చెందగా ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాగా రెడ్డయ్య వెలగలేరులోని తన కుమారుడు దుర్గారావు వద్ద ఉంటున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రెడ్డయ్య శనివారం సాయంత్రం మృతి చెందాడు. ఈ క్రమంలో తన తండ్రిది సాధారణ మరణం కాదని, అనుమానాస్పద మృతి అంటూ మృతుడి రెండవ కుమార్తె విజయవాడలో నివాసం ఉంటున్న వట్టూరి పద్మావతి ఆదివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే ఇటీవల రెడ్డయ్య అనారోగ్యంతో బాధపడుతున్న క్రమంలో కొడుకు సక్రమంగా చూడటంలేదని పద్మావతి డయల్ -100కి సమాచారం ఇవ్వడంతో పోలీసులు రెడ్డయ్య వద్దకు వెళ్లి ఆరా తీశారు. ఆ సమయంలో తనకు ఎటువంటి ఇబ్బంది లేదని కొడుకు వద్దనే ఉంటానని రెడ్డయ్య చెప్పినట్లు పోలీసులు చెబుతున్నారు. ఇంతలోనే రెడ్డయ్య మృతి చెందడంతో కూతురు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షబ్బీర్ అహ్మద్ తెలిపారు.

గ్రామ సచివాలయాలతో అద్భుత పాలన

విజయవాడ ఎంపీ కేశినేని నాని

తిరువూరు: గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలకు అద్భుతపాలన అందిస్తున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాసరావు (నాని) అన్నారు. తిరువూరు మండలం ముష్టికుంట్లలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి రూ.39.75 లక్షలతో నిర్మించిన నూతన భవనం, వావిలాల పీఏసీఎస్‌లో స్ట్రాంగ్‌రూమ్‌లను ఆయన ఆదివారం కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తాతినేని పద్మావతి, వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామి దాసులతో కలిసి ప్రారంభించారు. పేదవర్గాలకు ఏదైనా మంచి జరిగిందంటే సీఎం వైఎస్ జగన్‌మహన్‌రెడ్డి పాలనలోనే అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో తీసుకొచ్చిన వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గతంలో ఏమైనా కొత్త సంస్కరణలు చేపడితే వాటి ఫలితాల కోసం ఎంతో కాలం వేచి ఉండాల్సి వచ్చేదని చెప్పారు. జగనన్న చేపట్టిన సంస్కరణలు వెంటనే మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ఇది జగన్ పరిపాలనా దక్షతకు నిదర్శనం అని పేర్కొన్నారు. చంద్రబాబు డబ్బు ఆధారంగా సీట్లు ఇస్తున్నారని ఆరోపించారు. జగన్ మాత్రం అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇస్తూ మంచి నాయకుల్ని ఎంపిక చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తాతినేని పద్మావతి మాట్లాడుతూ రైతుల అవసరాలకు అనుగుణంగా తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. రుణ పరిమితిని కూడా గతంలో కంటే పెంచామని వివరించారు. రైతు రుణాలే కాకుండా వ్యవసాయేతర రుణాలు కూడా ప్రజలు బ్యాంక్ ద్వారా పొందవచ్చన్నారు. లాకర్, ఏటీఎం సౌకర్యాలను కూడా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా సహకార సంఘాల చైర్‌పర్సన్‌లు బండి రవికుమార్, కొమ్మినేని కిషోర్, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి పాల్గొన్నారు.



ముష్టికుంట్ల పీఏసీఎస్‌లో నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని నాని, తాతినేని పద్మావతి, స్వామిదాసులు

నగరాలకు గుర్తింపు ఇచ్చింది జగనన్నే

ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నగరాలకు సామాజికంగా, రాజకీయంగా గుర్తింపు ఇచ్చింది వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. చిట్టినగర్‌లోని మరుపిళ్ళ చిట్టి క్యాంస విగ్రహావిష్కరణ ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ కేశినేని నాని, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజక వర్గ ఇన్‌చార్జి షేక్. ఆసిఫ్, బాయన వెంకట్రావు, కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్, అత్తులూరి ఆదిలక్ష్మి, దుర్గగుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు, పోతిన స్వామి, రామారావు, పోతిన బేసు, ఎన్వీ.రావులతో పాటు నగరాల ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్ర నగరాలు సంఘం అధ్యక్షుడు బాయన బాబూజీ, పోతిన వెంకటేశ్వరస్వామి పర్యవేక్షణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత మరుపిళ్ళ చిట్టి జీవిత చరిత్రను పలువురు కళాకారులు బుర్రకథ రూపంలో ప్రదర్శించారు. విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ భాగ్యలక్ష్మితో పాటు పలువురు కార్పొరేటర్లు ఎంతగానో కృషి చేశారని నిర్వాహకులు పేర్కొన్నారు. అనంతరం ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. స్వాతంత్ర్య సమర యోధులుగా, రెండు పర్యాయాలు స్థానిక ఎమ్మెల్యేగా విశేష కృషి చేసిన మరుపిళ్ళ చిట్టి విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం మనందరి అదృష్టమన్నారు.. నగరాలకు రాజకీయంగా, సామాజికంగా సీఎం జగనన్న ఎంతో గుర్తింపునిచ్చారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. మేయర్, దుర్గగుడి చైర్మన్ పదవులు ఇచ్చారన్నారు. శ్రీశైలంలో నగరాల కోసం కాటేజీ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. రాబోయే రోజుల్లో నగరాలంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. నగరాల దేవస్థానాల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు కేటాయిస్తే కొంత మంది అడ్డుకున్నారన్నారు. 40 ఏళ్లగా ఏ పార్టీ కూడా చిట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు రాలేదని మేయర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. వైఎస్సార్ ప్రభుత్వం విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇచ్చిందన్నారు.



చిట్టి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

బ్యాంక్ మేనేజర్ పరారీ

పెనమలూరు: గంగూరులో బ్యాంకు మేనేజర్‌గా పని చేస్తూ ఖాతాదారుడి సంతకం ఫోర్జరీ చేసి బంగారు ఆభరణాలు కాజేసిన కిలాడీ మేనేజర్ పరారయింది. ఆమె కోసం పోలీసు బృందాలు గాలింపు చేపట్టాయి. యూనియన్ బ్యాంకు మేనేజర్‌గా నూజివీడు మర్రిబంధం గ్రామ నివాసి దావులూరి ప్రభావతి పని చేస్తుంది. అదే గ్రామానికి చెందిన కవులూరి యోగేశ్వరరావుతో ఆమెకు పరిచయముంది. దీంతో హైదరాబాద్‌లో ఆయన బ్యాంకు ఖాతాను గంగూరు శాఖకు బదిలీ చేయించింది. దాదాపు 380 గ్రాముల బంగారు ఆభరణాలు భద్ర పరుచుకోవటానికి యోగేశ్వరరావు గంగూరు శాఖలో లాకర్ అడిగాడు. దీనికి బ్యాంకు మేనేజర్ ప్రభావతి నగలు తాకట్టు పెట్టించి రూ.2 లక్షలు రుణం ఇచ్చింది. గత ఏడాది నవంబర్‌లో రుణం కింద తీసుకున్న సొమ్ము యోగేశ్వరరావు చెల్లించాడు. ఆయనకు తెలియకుండా మేనేజర్ ప్రభావతి సంతకం ఫోర్జరీ చేసి నగలు కాజేసింది. ఈ విషయం తెలుసుకున్న యోగేశ్వరరావు ప్రభావతిని నిలదీయగా తనను పెళ్లి చేసుకోమని కోరింది. పైగా కాజేసిన నగలతో వడ్డానం చేయించుకుంటున్నానని తెలుపటంతో యోగేశ్వరరావు దిక్కుతోచక పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు. సీఐ టీవీవీ రామారావు ఆధ్వర్యంలో విచారణ చేపట్టగా ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. కిలాడీ లేడీ డబ్బు ఉన్న ఖాతాదారులకు ఎరవేస్తుందని తమ విచారణలో తెలిసిందని సీఐ అన్నారు. కేసు నమోదు జరిగిన వెంటనే పరారయిందని తెలిపారు. ఆమె కోసం గాలిస్తున్నామన్నారు.

జంధ్యాల పురస్కారం బాధ్యత పెంచింది

సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్

విజయవాడ కల్చరల్: హాస్య బ్రహ్మ జంధ్యాల పురస్కారం అందుకోవడం మాటల రచయితగా తన బాధ్యతను పెంచిందని సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్ అన్నారు. సుమధుర కళానికేతన్ 50 వార్షికోత్సవం సందర్భంగా మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో నిర్వహిస్తున్న 26 జాతీయ స్థాయి హాస్యనాటికల పోటీలు ఆదివారం ముగిసాయి. స్వర్ణోత్సవం సందర్భంగా సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్‌కు జంధ్యాల పురస్కారం ప్రదానం చేశారు. సాయి మాధవ్ మాట్లాడుతూ కుటుంబ సమేతంగా చూడతగిన సినిమాలకు దర్శకత్వం వహించిన జంధ్యాల కూడా హాస్య సంభాషణల ద్వారా తనదైన ముద్ర వేసుకున్నారని చెప్పారు. చిత్ర విజయానికి మాటలు కూడా ప్రధాన పాత్ర వహిస్తాయని ఆయన మాటల ద్వారానే తెలిసిందని పేర్కొన్నారు. ఆయన తనతో పాటు ఎందరికో స్ఫూర్తి నింపారన్నారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఫ్యాకల్టీ వివేక్ ఇమ్మనేని మాట్లాడుతూ తెలుగు నాటక రంగంలో వస్తున్న మార్పులను స్వాగతించాలని సూచించారు. సుమధుర కార్య నిర్వాహక కార్యదర్శి పిండిప్రోలు సూర్యనారాయణ మూర్తి సంస్థ లక్ష్యాలను వివరించారు. సుమధుర కళానికేతన్ అధ్యక్షుడు సామంతపూడి నరసరాజు మాట్లాడుతూ సున్నితమైన హాస్యానికి చిరునామా సుమధుర నాటిక పోటీల ప్రదర్శనగా గుర్తింపు తెచ్చుకున్నట్లు తెలిపారు. శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన ఇంకానా నాటకం ఆకట్టుకుంది. కథా రచయిత మహ్మద్ ఖదీర్‌బాబు రచించిన న్యూ బాంబే టైలర్స్ నాటికను ప్రదర్శించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి పి. సూర్యనారాయణ మూర్తి, జాయంట్ సెక్రటరీ డాక్టర్ కైలాసరావు, ప్రధాన కార్యదర్శి భాస్కరశర్మ, మీడియా కోఆర్డినేటర్ బోడి ఆంజనేయరాజు పాల్గొన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు కూచిపూడి, భరతనాట్యం, కథక్, కథకళి అంశాలతోపాటు లఘు నాటికలను ప్రదర్శించారు.



సాయి మాధవ్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

నేటి నుంచి భారతీ తీర్థ మహాస్వామి జన్మదిన వేడుకలు

విజయవాడ కల్చరల్: జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి 74 వ జన్మదిన వేడుకలు ఈ నెల 5 వ తేదీ నుంచి 74 రోజులపాటు శివరామకృష్ణ క్షేత్రంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తునట్లు శివరామ కృష్ణ క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. శృంగేరీ పీఠం ఉత్తరాధికారి విదుశేఖర భారతి స్వామి ఆశీస్సులతో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 15 మంది రుత్వికలచే మహాన్యాస పూర్వక ఏకాద రుద్రాభిషేకం, శ్రీ చక్ర నవ రార్చన, సాయంత్రం ఆదిదంపతుల త్రిశతి, సహస్ర నామార్చన, మహా మంగళ హారతి, దాతలకు వేదాశీర్వాద కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. భక్తులు విశేషంగా పాల్గొనాలని కోరారు. శృంగేరీ పీఠం ప్రతినిధి నరహర శెట్టి మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మం వేద సంరక్షణకు శృంగేరీ పీఠం కృషి చేస్తునట్లు వెల్లడించారు. సర్వలోక రక్షణకు యజ్ఞయాగాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శివశంకర్ పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో క్షేత్ర పాలక మండలి సభ్యులు గందూరి చంద్రమౌళి పాల్గొన్నారు. అతిథులు పోస్టర్‌ను ఆవిష్కరించారు.



పోస్టర్ ఆవిష్కరణలో హనుమత్ ప్రసాద్, నరహరిభట్లు, గందూరి చంద్రమౌళి

ఈత పోటీల్లో పేట స్విమ్మర్ల విజయభేరి

జగ్గయ్యపేట అర్బన్: ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన 24 వ కృష్ణా రివర్ క్రాస్ 1.5 కి.మీ ఈతల పోటీల్లో జగ్గయ్యపేట స్విమ్మర్లు విజయభేరి మోగించారు. వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ నుంచి కోచ్ పాట్టాబత్తిన పాండురంగారావు ఆధ్వర్యంలో స్విమ్మర్లు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా భారత క్రికెట్ సంఘం మాజీ అధ్యక్షుడు ఎంఎస్‌కే ప్రసాద్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు పాల్గొని విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేశారు. మొదటి బహుమతిగా 50 గ్రాముల వెండి, ద్వితీయ బహుమతిగా 30 గ్రాముల వెండి, తృతీయ బహుమతిగా 20 గ్రాముల వెండి అందజేశారు. 51–60 మహిళా విభాగంలో కస్తాల యేసుమణి ప్రథమ స్థానం, పాట్టాబత్తిన లక్ష్మి ద్వితీయ స్థానం సాధించారు. 61–70 పురుషుల విభాగంలో గంజి మోహన్‌బాబు తృతీయ స్థానం సాధించారు. పతకాలు సాధించిన స్విమ్మర్స్‌కు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, కృష్ణా స్విమ్మర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఒంగోలు డీఎస్పీ మోటపోతుల కిషోర్‌బాబు, డ్రీమర్స్ స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మండవ శ్రీనివాసరావు, సెక్రటరీ కలాలి నరేష్, కోశాధికారి పరిణం రమ, చిట్యాల మోహన్‌రావు, కుర్ర శ్రీనివాసరావు, అప్పన్న అయ్యప్ప, టీం మేనేజర్ అన్నంనీడి కల్యాణ్, కోఆర్డినేటర్ యలదండి శ్రీనివాసరావు, కృష్ణా స్విమ్మర్స్ అధ్యక్షులు పిన్నెల్లి పాండరంగారావు, సెక్రటరీ కోటేశ్వరరావు,గోగుశెట్టి మహేష్, తుపాకుల పిచ్చయ్య, వీఎస్పీ చలపతిరావు, చెరుకూరి రమేష్ తదితరులు అభినందనలు తెలిపారు.



పతకాలు సాధించిన స్విమ్మర్లు

భార్యాభర్తల అదృశ్యంపై కేసు నమోదు

పెనుగంచిప్రోలు: భార్యాభర్తలు అదృశ్యంపై కేసు నమోదైన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. మోడల్ కాలనీకి చెందిన పద్మాల సురేష్, వత్సవాయి మండలం త్రివేణి భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొంత కాలంగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. శనివారం పిల్లలు స్కూల్‌కు వెళ్లిన తరువాత వేదాద్రి ఆలయానికి వెళ్తున్నామని ఇంటి నుంచి వెళ్లిన భార్యాభర్తలు తిరిగి రాలేదు. దీనిపై ఆదివారం త్రివేణి తండ్రి కోమలి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శంకర్ తెలిపారు.

ఉపాధికి ఉచితంగా శిక్షణ

- శిక్షణ పూర్తి చేసిన వారికి ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగావకాశాలు
- ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు



శిక్షణ పొందుతున్న విద్యార్థులు (ఫైల్)

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటుగా శిక్షణను విజయ వంతంగా పూర్తి చేసిన వారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి సర్టిఫికెట్‌తో పాటుగా జిల్లా పరిధిలోని ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కూడా కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇంటర్, డిప్లమో, డిగ్రీ విద్యార్హతలు ఉన్న వారికి జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. పది, ఐటీఐ విద్యార్హతలున్న వారికి ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషిన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఆసక్తి ఉన్న వారు 9347779032 నంబర్‌లో సంప్రదించవచ్చు.

- నందిగామలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో 5 నుంచి 10వ తరగతి విద్యార్హత ఉన్న మహిళలకు స్వీయింగ్ మెషిన్ ఆపరేటర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆసక్తి ఉన్న వారు 89199 51682 నంబరులో సంప్రదించవచ్చు.
- విజయవాడ మాచవరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డవలపర్ కోర్సులో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. పది, ఇంటర్‌తో పాటుగా ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులు, వివరాలకు 94940 51198 నంబరులో సంప్రదించాలి.
- విజయవాడ విద్యాధరపురంలోని కబేళా దగ్గర ఉన్న నేషనల్ అకాడమీ సెంటర్‌లో ఐటీఐ విద్యార్హత ఉన్న వారికి అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, స్వీయింగ్ మెషిన్ ఆపరేటర్ కోర్సులో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. వివరాలకు 97000 25853 నంబరులో సంప్రదించాలి.
- ఎన్టీఆర్ జిల్లా మైలవరంలోని డాక్టర్ ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్ పైన విద్యార్హతలు ఉన్న వారికి అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. వివరాలకు 95027 57755 నంబరులో సంప్రదించాలి.
- జగ్గయ్యపేటలోని ఎస్‌జీఎస్ కళాశాల ఆవరణలో పదో తరగతి పైన విద్యార్హతలు ఉన్న వారికి డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ తరగతులకు హాజరు కావాలనుకునే వారు 89199 51682 నెంబరులో సంప్రదించాలి.

జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో...

- విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో కటింగ్ అండ్ టైలరింగ్, డ్రెస్ డిజైనింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మిర్రర్ వర్క్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మెషిన్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్ టెక్నిషియన్, ఏసీ, రిఫ్రిజరేషన్ రిపేరింగ్, ఐస్‌క్రీమ్ మేకింగ్, స్క్రీన్ ప్రింటింగ్, జామ్ అండ్ జ్యూస్ తయారు చేయడం, భాతిక్ ప్రింటింగ్, హోమ్ క్రాఫ్ట్స్ మేకింగ్, మిర్రర్ వర్క్ మొదలైన అంశాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కానీ 0866–2470420 నంబరులో కానీ సంప్రదించవచ్చు.

గ్రామీణ వైద్యులతో సమాజానికి మేలు

పెనమలూరు: గ్రామీణ వైద్యులతో సమాజానికి ఎంతో మేలు చేకూరుతుందని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి అన్నారు. కానూరులో ఆదివారం ఏపీ సామాజిక వైద్య సహాయకుల సంఘాల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు వీబీటీ రాజు, ఎంఎస్‌రాజు, సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సేవలు గుర్తించి కమ్యూనిటీ పారామెడిక్స్ శిక్షణ పునఃప్రారంభించాలని కోరారు. కర్నూలు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేజీ గోవిందరెడ్డి మాట్లాడుతూ శిక్షణ ప్రారంభించేందుకు తన పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వీబీటీ రాజు, గౌరవ అధ్యక్షుడు టి.రాధాకృష్ణయ్య మాట్లాడుతూ మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి సంపూర్ణ ఆలోచనలతో పారామెడిక్స్ శిక్షణకు జీవో 429 విడుదల చేశారన్నారు. డాక్టర్ గోపీచంద్, డాక్టర్ ఎం భార్గవరామ్, రాష్ట్ర కార్యదర్శి అనుముల జయప్రకాష్ అవగాహన కల్పించారు. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బల్ల శ్రీనివాసరావు, సలహాదారులు జి.కృష్ణమూర్తి, తోరాటి ప్రభాకరరావు, సభ్యులు కె.కృష్ణమూర్తి, ఎస్‌కె. ఖాజావలి, వర్ల దస్తగిరి, ఎం.శేషసాయి, ఎం.జయరామ్, రఘునాథరెడ్డి, వేణుగోపాల్ తదితరులున్నారు.



బ్రహ్మారెడ్డిని సన్మానిస్తున్న సమాఖ్య సభ్యులు

తూర్పున అభివృద్ధి వెలుగులు

- రూ.650 కోట్ల విలువైన అభివృద్ధి పనులు
- నాలుగున్నరేళ్లలో మారిన రూపురేఖలు
- టీడీపీ కార్పొరేటర్లు ఉన్న డివిజన్లలోనూ అభివృద్ధి పనులు
- దేవినేని అవినాష్ చొరవ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సహకారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గం రూపురేఖలు మారిపోయాయి. ఏ కాలనీకి వెళ్లినా అభివృద్ధి కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. మిల మిల మెరిసే సిమెంటు, బీటీ రోడ్లు, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దిన పార్కులు దర్శనమిస్తాయి. కొండ ప్రాంతాలకు మెట్ల మార్గాలు, మంచినీటి సౌకర్యం, వర్షం నీటి పారుదలకు సైడు డ్రెయిన్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఇలా ఒక్కటేమిటీ నియోజకవర్గంలో ఎన్నడూ లేని అభివృద్ధి నాలుగున్నరేళ్లలో జరిగింది. మన బడి నాడు–నేడు పథకంలో పాఠశాలలు రూపు మారిపోయాయి. పట్టణ ఆరోగ్య కేంద్రాలు సరికొత్తగా రూపుదిద్దుకున్నాయి. అందుకు గాను అక్షరాల రూ.650 కోట్లు ఖర్చు చేశారు.



పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు



అధునాతన యూపీహెచ్‌సీ భవనం



నాడు–నేడు నిధులతో పటమట పాఠశాలలో ఆధునిక హంగులు

రూ.360 కోట్లతో రిటైనింగ్ వాల్..

కృష్ణా నది కరకట్ట దిగువన ఉన్న వేలాది కుటుంబాలు వర్షాకాలం వస్తే చాలు నదిలో నీళ్లు ఎప్పుడు వస్తాయోనని బిక్కు బిక్కు మంటూ కాలం గడిపేవారు. వరద వస్తే ఇంటిలో సామాన్లు కట్టమీద పెట్టి, అక్కడ ఒకరు కాపాలా ఉండి, మిగిలిన వారు పునరావాస శిబిరాలకు తరలివెళ్లేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ సమస్యపై దృష్టి సారించారు. రూ.360 కోట్లు వెచ్చించి రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టారు. దీనిలో నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చొరవ ఎంతో ఉంది.



కాలనీలకు కొత్త హంగులు..

ఒకప్పుడు కరెన్సీనగర్, కనకదుర్గనగర్, కామినేని నగర్ వంటి కాలనీలు వర్షం వస్తే రోడ్లపై నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది పడే వారు. ఇప్పుడు ఆ కాలనీల రూపురేఖలు మారిపోయాయి. సీసీ రోడ్లు, పార్కులు ఏర్పాటయ్యాయి. ఆ కాలనీలే కాదు, భారతీనగర్, అయ్యప్పనగర్, లబ్బీపేట ఇలా నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలు సమాంతరంగా అభివృద్ధి చేశారు. కొండ ప్రాంతాల్లో మెట్ల మార్గాలు ఏర్పాటు చేశారు. రూ.5.50 కోట్ల వ్యయంతో కొండ ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యం కోసం పైపులైన్ ఏర్పాటు చేశారు.

మూడు అధునాతన విద్యుత్ సబ్‌స్టేషన్లు..

నియోజకవర్గంలో లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు మూడు అధునాతన విద్యుత్ సబ్‌స్టేషన్లు అందుబాటులోకి వచ్చాయి. రూ.21 కోట్లు వెచ్చించి వాటిని కనకదుర్గనగర్, మారుతీ కోఆపరేటివ్ కాలనీ, అయ్యప్పనగర్‌లలో ఏర్పాటు చేశారు. దీంతో విద్యుత్ సమస్య తీరింది.

కొత్తగా రెండు రైతు బజార్లు..

ఏపీఐఐసీ కాలనీ, కృష్ణలంకల్లో రెండు రైతుబజార్లు ఏర్పాటు చేశారు. అందుకోసం రూ.2 కోట్లు వెచ్చించారు. దీంతో నియోజకవర్గంలో మూడు రైతు బజార్లు అందుబాటులోకి వచ్చాయి.

మారిన పాఠశాలల రూపురేఖలు..

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మారిపోయాయి. మనబడి నాడు–నేడు పథకం ద్వారా అధునాతనంగా రూపుదిద్దుకున్నాయి. కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా తీర్చిదిద్దారు. డిజిటల్ క్లాస్‌రూమ్స్ ఏర్పాటు చేశారు. పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చారు. జగనన్న గోరు ముద్ద ద్వారా పోషక విలువలు కలిగిన ఆహారం ఇస్తున్నారు. మరోవైపు నియోజకవర్గంలో 13 యూపీహెచ్‌సీలు అధునాతనంగా రూపుదిద్దుకున్నాయి. ఒక్కో యూపీహెచ్‌సీ రూ.కోటిన్నర వ్యయంతో మూడింటిని కొత్తగా నిర్మించారు. ఇలా అనేక రకాలుగా నియోజకవర్గం ఎన్నడూ లేని అభివృద్ధితో దూసుకుపోతుంది.

అభివృద్ధి పనులు..నిధులు..

- రిటైనింగ్‌వాల్– రూ.360 కోట్లు
- బెంజిసర్కిల్ రెండో ఫ్లై ఓవర్ రూ.110 కోట్లు
- మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లు రూ. 21 కోట్లు
- మన బడి నాడు–నేడు రూ.20 కోట్లు

డివిజన్	అభివృద్ధి పనుల ఖర్చు
2వ డివిజన్	రూ. 6.61 కోట్లు
3వ డివిజన్	రూ.18.52 కోట్లు
4వ డివిజన్	రూ.09.83 కోట్లు
5వ డివిజన్	రూ.13.55 కోట్లు
6వ డివిజన్	రూ.04.97 కోట్లు
7వ డివిజన్	రూ.04.69 కోట్లు
8వ డివిజన్	రూ.08.20 కోట్లు
9వ డివిజన్	రూ.02.86 కోట్లు
10వ డివిజన్	రూ.03.00 కోట్లు
11వ డివిజన్	రూ.03.92 కోట్లు
12వ డివిజన్	రూ.05.80 కోట్లు
13వ డివిజన్	రూ.05.23 కోట్లు
14వ డివిజన్	రూ.05.42 కోట్లు
15వ డివిజన్	రూ.14.17 కోట్లు
16వ డివిజన్	రూ.08.04 కోట్లు
17వ డివిజన్	రూ.03.01 కోట్లు
18వ డివిజన్	రూ.09.20 కోట్లు
19వ డివిజన్	రూ.08.42 కోట్లు
20వ డివిజన్	రూ.02.59 కోట్లు
21వ డివిజన్	రూ.02.64కోట్లు
22వ డివిజన్	రూ.04.55 కోట్లు

అన్ని ప్రాంతాల అభివృద్ధి..



నియోజకవర్గంలో వివక్ష లేకుండా అన్ని ప్రాంతాలను సమాంతరంగా అభివృద్ధి చేస్తున్నాం. గత ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ఉన్న డివిజన్‌లకు నిధులు కేటాయించే వారు కాదు. కానీ ఇప్పుడు ఏ డివిజన్‌లో ప్రజలకు సమస్య ఉన్నా, దానిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కులం, మతం, పార్టీలు చూడకుండా, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పారదర్శకమైన పాలన సాగిస్తున్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నారు.

– దేవినేని అవినాష్, ఇన్‌చార్జి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గం

క్లుప్తంగా

నేడు వీఎంసీ 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర వాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయాలన్నారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

దత్తపీఠంలో ఉచిత వైద్యశిబిరం



పటమట(విజయవాడతూర్పు): పటమటలోని గణపతి సచ్చిదానంద ఆశ్రమం దత్తపీఠంలో ఆదివారం భక్తులకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సౌజన్య హాస్పిటల్స్ సౌజన్యంతో వైద్యులు ఆకెళ్ల సూర్యనారాయణ, లక్ష్మీ సౌజన్య, మనోజ్, సావిత్రి డాక్టర్ల బృందం వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరంలో కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, స్త్రీ సంబంధిత వ్యాధులకు, సుగర్, బీపీ, థైరాయిడ్, జ్వరాలు తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

గుడ్ విషెస్‌తో మనో ధైర్యం



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్‌సీజీ క్యాన్సర్ హాస్పిటల్, రెడ్ ఎఫ్ఎం ఆధ్వర్యంలో ఆదివారం ఎంజీ రోడ్డులోని పీవీపీ మాల్‌లో ది పవర్ ఆఫ్ గుడ్ విషెస్ అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తొలుత రెడ్ ఎఫ్ఎం ఆర్‌జేలు ఇస్మార్ట్ స్వీటీ, అన్యలు మాల్‌కు వచ్చిన వారి దగ్గర నుంచి గుడ్ విషెస్ తీసుకుని ఎఫ్ఎంలో ప్రసారం చేశారు. ఈ సందర్భంగా క్యాన్సర్ నిపుణులు డాక్టర్ వీఎస్ఎన్ రావు మాట్లాడుతూ.. ప్రేమతో మీరు బాగుండాలని అని చెప్పే మాటలు ఎంతో మనోధైర్యాన్నిస్తాయన్నారు. ఇలాంటి కార్యక్రమం క్యాన్సర్‌తో బాధపడుతున్న వారికి మనోధైర్యం ఇవ్వడంతో పాటు క్యాన్సర్‌పై అవగాహన పెంచుతుందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ కె.రంగనాథ్, టి.యువకిషోర్, రెడ్ ఎఫ్ఎం స్టేషన్ హెడ్ క్రాంతికుమార్, ప్రోగ్రామింగ్ హెడ్ ఆదిల్‌బాషా పాల్గొన్నారు.

'జిలానీఖాన్ సేవలు వెలకట్టలేనివి'



విజయవాడకల్చరల్: సాంస్కృతిక రంగానికి జిలానీఖాన్ చేసిన సేవలు వెలకట్టలేనివని సీనియర్ పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు అన్నారు. నగరానికి చెందిన కళాకారులు, సాహితీ సంస్థల నిర్వాహకుడు జిలానీఖాన్ మృతికి నగరానికి చెందిన కళా సంస్థల ప్రతినిధులు గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళా వేదికపై ఆదివారం సంతాప సభను నిర్వహించారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ జిలానీఖాన్ పేద కళాకారుల కోసం అనేక కార్యక్రమాలను నిర్వహించారని, వారికి ప్రతీ నెల నిత్యావసరాలను పంపిణీ చేశారని తెలిపారు. సంతాప కార్యక్రమంలో సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చిట్టిబాబు, రమాశంకర్, వీరభద్రరావు, మారేపల్లి జోషి, పి.శ్రీనివాసరావు, ఆదిరాల జయప్రభ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫ్రూట్ జ్యూస్ మేకింగ్ పోటీలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక మధు చౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాల్‌లో తమ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న మహిళా ఉత్సవ్–2024లో భాగంగా సోమవారం సాయంత్రం 4 గంటలకు వివిధ రకాల పండ్లతో జ్యూస్‌ల తయారీ పోటీలను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ ఛైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్నా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు సోమవారం సాయంత్రం 4 గంటలలోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

'మానవత' సంస్థకు వితరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మానవత హనుమాన్‌జంక్షన్ శాఖకు దాత అల్లం దుర్గారావు రూ.33 వేలు విరాళాన్ని ఆదివారం అందించారు. ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో మానవత రాష్ట్ర కన్వీనర్ కోటేశ్వరరావుకు విజయవాడకు చెందిన దుర్గారావు నగదును అందజేశారు. హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బారావు, కళ్లేపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల చించివేతపై ఆందోళన



మారుతీనగర్‌లో ఆందోళన వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్ అమర్‌నాథ్, నాయకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక 6వ డివిజన్ మారుతీనగర్‌లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత డివిజన్‌లో చేసిన అభివృద్ధి వివరాలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను టీడీపీకి చెందిన వారు చించివేశారని 6వ డివిజన్ కార్పొరేటర్ వియ్యపు అమర్‌నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మారుతీనగర్‌లో పెట్రోల్ బంక్ దగ్గర ఏలూరు రోడ్డుపై వైఎస్సార్ సీపీ 6వ డివిజన్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఆందోళన చేశారు. కార్పొరేటర్ అమర్‌నాథ్ మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ డివిజన్‌లో సుమారు ఆరు కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఆ అభివృద్ధి పనులను వివరిస్తూ మారుతీనగర్‌లో ఏర్పాటు చేసిన రెండు ఫ్లెక్సీలను టీడీపీకి చెందిన వారు శనివారం అర్ధరాత్రి చించివేశారన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో ఈ డివిజన్‌లో జరిగిన అభివృద్ధి శూన్యమని, వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేకనే ఈ విధంగా చేస్తున్నారన్నారు. డివిజన్‌లో జరిగిన అభివృద్ధిపై తాము చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. వైఎస్సార్‌సీపీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని టీడీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

క్యాన్సర్ రహిత సమాజానికి కృషి

మధురానగర్(విజయవాడసెంట్రల్): క్యాన్సర్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన ప్రముఖ క్యాన్సర్ నిపుణుడు డాక్టర్ సీహెచ్ మురళీకృష్ణ అభినందన, క్యాన్సర్‌పై అవగాహన కార్యకమాన్ని నిర్వహించారు. క్యాన్సర్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ సీహెచ్ మురళీకృష్ణ వివరించారు. డాక్టర్ మురళీకృష్ణను సత్కరించారు. అనంతరం క్యాన్సర్ బాధితులకు పండ్లు పంపిణీ చేశారు. వాకర్స్ క్లబ్ కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, సభ్యులు పోశవరపు రాజారావు, కె.సత్యనారాయణ, బత్తిన సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

జానపద కళారూపాలను ఆదరించాలి



మాట్లాడుతున్న దామోదర గణపతిరావు, వేదికపై గజల్ శ్రీనివాస్, సుశీల్‌కుమార్, గిరీష్‌కుమార్

విజయవాడకల్చరల్: జానపద కళారూపాలను ఆదరించాలని గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. దామోదర జానపదం, మామ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం జానపదం– సినీ పదం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. శ్రమైక జీవనంలోనే ఆట పాట ఉందన్నారు. జానపద గాయకుడు దామోదర గణపతిరావు మాట్లాడుతూ సంస్థ ద్వారా ఎందరో కళాకారులను వెలుగులోకి తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో మహంతి వాసుదేవరావు, గిరిజన గీత శిల్పి బొండా జగన్మోహన రావు, డాక్టర్ కొండా వేణుగోపాలరెడ్డి పాల్గొని ప్రసంగించారు. కళాకారులు గిరీష్ కుమార్, సుశీల్ కుమార్, చక్రవర్తిలను గజల్ శ్రీనివాస్ సత్కరించారు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు డాక్టర్ జయంతి చక్రవర్తి, భారతి, సిరి మోక్ష, తేజ, హుస్సేన్‌బీ, సాయి, శ్రీనివాస్, సునీల్, గణపతి గీతాలను ఆలపించారు. జానపద గాయకుడు దామోదర గణపతిరావు షష్టి పూర్తి సందర్భంగా అభిమానులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమాన్ని సినీ రంగస్థల నటుడు కొప్పుల ఆనంద్ నిర్వహించారు.

టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేటలోని సీవీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆత్మబంధువుల సేవా సంఘం పదో తరగతి విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన జనరల్ బిపిన్ రావత్ మెమోరియల్ టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. టాలెంట్ టెస్ట్‌ను ప్రారంభించిన ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ బి.ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం అయ్యే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆత్మబంధువుల సేవా సంఘం వ్యవస్థాపకుడు సితల ఉషాకిరణ్, సీవీఆర్ స్కూల్ హెచ్ఎం సీహెచ్‌వి.సుబ్రహ్మణ్యం, వీటీఆర్ నెహ్రూ, తులసీరావు, కుమార్, ఆంజనేయులు, నీలిమ, బత్తిన సుబ్రహ్మణ్యం, డి.వెంకటేశ్వరరావు, డి.సుజాత, మేఘన, మురళీకృష్ణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్విమ్మింగ్ పోటీలు



ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణానదిలో ఆదివారం స్విమ్మింగ్ పోటీలు జరిగాయి. 24వ కృష్ణా రివర్ క్రాస్ 1.5 కిలోమీటర్ల ఈతల పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఇనుప గడ్డర్లను తొలగించరూ !



ఇండస్ట్రియల్ ఎస్టేట్ 3వ రోడ్డులో ఏర్పాటు చేసిన గడ్డర్

ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్‌లోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ రహదారుల్లో పలువురు యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ ఉన్న రోడ్లను వాహనాలు వెళ్లేకుండా ఇనుప గడ్డర్లను శాశ్వతంగా ఏర్పాటు చేశారు. గత కొన్నేళ్లుగా ఈ విధంగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలా ఇనుప గడ్డర్లను ఏర్పాటు చేయడం వల్ల ... చిరు వ్యాపారులు రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు సాగిస్తున్నారు. అంతే కాకుండా లారీల పార్కింగ్‌కు కూడా అనువుగా మారింది. ఎవరికి వచ్చిన విధంగా వ్యవహరిస్తున్నారు. అసలే ఇరుకు రోడ్లు కావడం వల్ల పెద్ద లారీలు లోనికి రావడంలేదు. దీని వల్ల వ్యాపారాలు దెబ్బతింటున్నాయని లారీ బాడీ బిల్డింగ్ షెడ్ యజమానులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఐలా అధికారులు స్పందించి పలు చోట్ల రోడ్డుపై ఏర్పాటు చేసిన గడ్డర్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నగరంలో పోలీస్ ఫుట్‌పెట్రోలింగ్

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న పోలీసు స్టేషన్ పరిధిలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో సీఐ ఎన్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో గత కొద్ది రోజులుగా పోలీసు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఆదివారం పైపులరోడ్డు సెంటర్ నుంచి వాంబేకాలనీ వరకు పోలీస్ ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. రహదారుల్లో రోడ్లు ఆక్రమించుకొని ప్రజలకు అసౌకర్యం కల్గిస్తున్న ఆక్రమణలను తీయించారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలు రోడ్డుపై పార్కు చేసి ప్రజలకు అసౌకర్యం కల్గించవద్దని అవగాహన కల్పించారు. ఫుట్ పెట్రోలింగ్‌లో సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ శేషారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నగర వాసులకు జాతీయ స్థాయి పురస్కారాలు



అవార్డులు పొందిన మేడా సింధుశ్రీ, లోకేష్ బాబు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విజయవాడ నగరానికి చెందిన మేడా సింధుశ్రీ, లంకే లోకేష్ బాబుకు తెలుగు వెలుగు సంస్థ అందజేసే జాతీయస్థాయి పురస్కారాలు దక్కడం చాలా సంతోషంగా ఉందని స్ఫూర్తి క్రియేటివ్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. చిత్రలేఖనం, క్రియేటివ్ క్రాఫ్ట్స్, పేపర్ క్విల్లింగ్ అంశాల్లో ప్రతిభ చూపినందుకు సింధుశ్రీకి తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం, ఫొటోగ్రఫీ, విజువల్ కమ్యూనికేషన్ రంగంలో ప్రతిభ చూపినందుకు లంకే లోకేష్‌బాబుకు తెలుగు వెలుగు స్ఫూర్తి కళారత్న జాతీయ పురస్కారాలు అందుకున్నారన్నారు.

పురస్కారాల అందజేత..

వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఏటా ఈ పురస్కారాలను అందిస్తారని వివరించారు. తెలంగాణలోని యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హన్మకొండలో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ భవనంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాలను సింధుశ్రీ, లోకేష్‌లకు అందజేశారని శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక వ్యవస్థాపక చైర్మన్ పాలోజు రాజ్‌కుమార్, తెలుగు వెలుగు వేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ రంగిశెట్టి రమేష్, యువత చైతన్య వెల్ఫేర్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొని ఈ అవార్డులను అందజేశారని చెప్పారు.


సండే @ స్మృతివనం



నగరంలోని బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంలో సందడి నెలకొంది. ఆదివారం పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలిరావడంతో స్మృతివనం ప్రాంగణమంతా కిటకిటలాడింది. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జీవిత విశేషాల దృశ్యాలు, వివిధ ఆకృతులను సందర్శకులు తిలకించారు. సాయంత్రం స్మృతివనం విశేషంగా ఆకట్టుకుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





భార్య, పిల్లలు అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: పోరంకిలో భార్య, ఇద్దరు పిల్లలు అదృశ్యమైన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి జంగాల బజార్‌లో ఎస్.సత్యనారాయణ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. ఈ నెల 2న తన తండ్రి అమ్మ తలింగాన్ని చూసే విషయంలో తల్లి సముద్రదేవి, భార్య లక్ష్మీప్రసన్నకు మధ్య గొడవ జరిగింది. దీంతో లక్ష్మీప్రసన్న అలిగి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

మురుగు కాల్వలో పడి తాపీ మేస్త్రి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబేకాలనీ సీ బ్లాక్‌కి చెందిన చిన్నం రవి(47) అనే తాపీ మేస్త్రి రవీంద్రభారతి స్కూల్ ఎదురుగా ఉన్న డ్రెయినేజీ కాల్వలో పడి మృతి చెందాడు. దీంతో పోలీసులు ఆదివారం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. తాపీ పని చేస్తున్న చిన్నం రవి శనివారం పనికి వెళ్లి రాత్రికి ఇంటికి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఎటువంటి సమాచారం లేదు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కుటుంబ సభ్యులు రవీంద్రభారతి స్కూల్ వద్ద డ్రెయినేజీ కాల్వలో పడి ఉన్న రవి మృతదేహాన్ని గుర్తుపట్టారు. మృతుని భార్య రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్య నిపుణుడు డాక్టర్ కోనా వీరబ్రహ్మం సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం ఆరోగ్యంపై అవగాహన, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

క్లుప్తంగా...

బీసీలకు మేలు చేసే పార్టీకి ఓట్లు వేయండి

రాజ్యసభ ఎంపీ బీద మస్తాన్‌రావు




తిరుపతి సిటీ: బీసీలకు మేలు చేసిన వ్యక్తి డాక్టర్ వైఎస్సార్ మాత్రమేనని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు తెలిపారు. ఆదివారం తిరుపతిలో జరిగిన బీసీల రాజ్యాధికారం కోసం మరో స్వాతంత్ర్య పోరాట సింహగర్జన ముగింపు సభలో ఆయన ప్రసంగించారు. ఎన్నికల ముందు దేశంలోని ప్రతి పార్టీ బీసీల జపం చేయడం పరిపాటిగా మారిందన్నారు. స్వాతంత్ర్య భారతంలో బీసీలను రాజ్యసభకు పంపిన పార్టీలు లేవని, వైఎస్సార్‌సీపీ ఏకంగా నలుగురు బీసీలను రాజ్యసభకు పంపిందని చెప్పారు. బీసీల రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ తరఫున బీసీల వాణిని వినిపించాలని సీఎం జగన్ చెప్పడం శుభపరిణామమన్నారు. పార్టీలు ఏదైనా బీసీలకు మేలు చేసే పార్టీని ప్రజలు ఆదరించాలని సూచించారు. రాష్ట్ర కేబినెట్‌లో 25 మంది మంత్రులు ఉంటే బీసీలు 11మంది ఉన్నారని చెప్పారు. ఏపీలో బీసీలకు మేలు చేసేందుకు కులగణన చేయిస్తున్నట్లు చెప్పారు. రానున్న ఎంపీ, ఎమ్మెల్యే సీట్లలో కచ్చితంగా బీసీలకు ప్రాధాన్యత నిచ్చేపార్టీలకే బీసీ సోదరులు ఓట్లు వేయాలని సూచించారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించి రాజ్యాధికారానికి దగ్గర చేయాలని బీసీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్ క్రిష్ణయ్యతో కలసి పార్లమెంట్ దగ్గర నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు.

తహశీల్దార్ హత్య నిందితులను కఠినంగా శిక్షించాలి: సీపీఎం

సాక్షి, అమరావతి: విజయనగరం జిల్లా బొండపల్లి తహశీల్దార్ ఎస్.రమణయ్య దారుణ హత్యను ఖండిస్తూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కాలంలో చెలరేగిపోతున్న ల్యాండ్ మాఫియా ఆగడాలకు ఇది ప్రత్యక్ష తార్కాణమన్నారు. ఇంత దారుణానికి ఒడిగట్టిన దోషులను తక్షణం అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రమణయ్య మృతికి సంతాపం తెలిపారు. రాష్ట్రంలో డీఎస్సీ ప్రకటన నిరుద్యోగ యువతను నిరుత్సాహ పరిచిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 25,000 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నా 6,100 పోస్టులే భర్తీ చేస్తామనడం సరికాదన్నారు.

రాజకీయ వ్యభిచారులను తరిమికొట్టాలి: దేవినేని ఉమా



ఇబ్రహీంపట్నం(మైలవరం): మైలవరం ఎమ్మెల్యే వసంతకృష్ణప్రసాద్ అవకాశవాద రాజకీయాలతో ఆస్తులు కూడబెట్టుకున్నారని టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి టౌన్ హాల్‌లో మీటింగ్ విత్ లీడర్ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీలో నాయకులు ఎదుర్కొన్న కష్ట నష్టాలను ఉమా కార్యకర్తలతో పంచుకున్నారు. 2009లో పార్టీ మారాలని లేదంటే నియోజకవర్గం వదిలి వెళ్లిపోవాలని తనను బెదిరించారని వాపోయారు. తనపై దాడులు చేయించి తనను చంపాలని ప్రయత్నించినట్లు ఉమా ఎమ్మెల్యే వసంతపై పరోక్ష వ్యాఖ్యలు చేశారు. పసుపుకండువా కప్పుకొని చచ్చిపోతా తప్ప పార్టీ వీడనని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, సుజనాచౌదరి వంటి వారు అవకాశవాదులుగా పార్టీలు మారుతూ ఆస్తులు కూడబెట్టుకుంటున్నారని దుయ్యబట్టారు. పార్టీ సిద్ధాంతాలకు తిలోదకాలు ఇచ్చి తల్లిలాంటి పార్టీని ఉపయోగించుకుంటూనే వర్గవిభేదాలు సృష్టిస్తున్న వారిని ఒక కంట కనిపెట్టాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఆధిపత్యం కోసం వెన్నుపోటు పొడవాలని చూసే నాయకులను గమనించాలన్నారు. వందల కోట్ల రూపాయలు ఇస్తామని వస్తున్న రాజకీయ వ్యభిచారులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మైలవరం నియోజకవర్గంలో ఎవరైనా దోచుకున్న డబ్బులతో గెలవాలంటే కుదరదని ప్రజాభిమానంతోనే విజయం సాధ్యమని ఉమా అభిప్రాయపడ్డారు. అంతకుముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విశాఖలో చికిత్స పొందుతున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన గొండు నర్సమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ బమ్మిడి రాజారావు



తెనాలికి చెందిన శ్రీనివాసరావుకు దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఉషారాణి



కర్నూలుజిల్లా ఆదోనిలో మైమున్నీసా బేగంకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పరశురామ్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనకాపల్లి జిల్లాకు చెందిన చిటిమిరెడ్డి పైడితల్లమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కర్రి ఈశ్వరరావు



విజయవాడలో వెండిదండి మహేందర్ రెడ్డి, వెండిదండి స్రవంతికి దివ్యాంగ పింఛన్లు అందజేస్తున్న వార్డు వలంటీర్ బడే కావ్య



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన కందిపాటి హేమలతకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సౌజన్య



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బొబ్బిలికి చెందిన పైల రాముకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కె.సంధ్య



శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో లబ్ధిదారుడు ముస్తాఫాకు పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ షేక్ సమీ

మరో చరిత్రాత్మక విజయాన్ని అందుకునేందుకు మీరంతా సిద్ధమా!

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో అద్భుత విజయం దిశగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉరకలేస్తున్నాయి. శనివారం దెందులూరు 'సిద్ధం' సభ జనసునామీని తలపించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలు, ప్రజలనుద్దేశించి 'మరో చరిత్రాత్మక విజయాన్ని అందుకునేందుకు మీరంతా సిద్ధమా? పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చే పాలన అందించేందుకు వైఎస్సార్‌సీపీని మరోసారి గెలుపించుకునేందుకు మీరంతా సిద్ధమా?' అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

చిన్న పరిశ్రమ ధగధగ

కర్షకుడి నుంచి కర్మాగార స్థాపన వరకూ..

నెల్లూరు జిల్లా పొదలకూరులో బయోమాస్ బ్రికెట్స్ పరిశ్రమ స్థాపన

మొక్కవోని దీక్షతో విజయంవైపు అడుగులు



బయో మాస్ బ్రికెట్స్ ఫ్యాక్టరీ

పొదలకూరు: ఆయనో సామాన్య రైతు. వ్యాపారం, పరిశ్రమలపై అవగాహన లేదు. అయినా తాను జీవిస్తూ పది మందికి ఉపాధి కల్పించాలనే దృఢ సంకల్పం ఓ చిన్నతరహా పరిశ్రమ స్థాపన వైపు అడుగులు వేయించింది. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని బయో మాస్ బ్రికెట్స్ పరిశ్రమ స్థాపించి విజయం సాధించారు. మొక్కవోని దీక్షతో వెనుకడుగు వేయకుండా పరిశ్రమను నిర్వహిస్తూ పది మందికి అన్నం పెడుతున్నారు. ఇదీ పొదలకూరు మండలం సూదుగుంట గ్రామానికి చెందిన పెద్దమల్లు శ్రీనివాసులు రెడ్డి విజయప్రస్థానం.

పడిలేచిన కెరటంలా..

గతంలో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు మండలంలో సూదుగుంట షుగర్స్, సోనాక్(రొయ్య పిల్లల మేత) వంటి పెద్ద తరహా పరిశ్రమలు, అల్లోవీర, సిమెంటు బ్రిక్స్ వంటి చిన్న తరహా పరిశ్రమలు పెట్టుబడులు పెట్టి తట్టుకోలేక మూతపడ్డాయి. కానీ పెద్దమల్లు శ్రీనివాసులురెడ్డి 2015లో బయో మాస్ బ్రికెట్స్ పరిశ్రమలను స్థాపించి నష్టాలు, కష్టాలను అధిగమించి ఓ స్థాయికి చేరుకున్నారు. పడి లేచిన కెరటంలా ఎదిగారు. బొగ్గుకు ప్రత్యామ్నాయంగా వినియోగించే బయో మాస్ బ్రికెట్స్(కట్టె ముక్కలు) తయారీ పరిశ్రమను స్థాపించి తయారు చేసి వస్తువును అమ్ముకోలేక అనేక ఇబ్బందులు పడ్డారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చిన్న తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం లేక ఎంఎస్ఎంఈ సర్టిఫికెట్ కూడా పొందలేకపోయారు. ఫలితంగా పరిశ్రమకు ఎలాంటి రాయితీలు పొందలేకపోయారు. బ్రికెట్స్‌ను అమ్ముకోగలిగినా లాభాలు రాక ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేకపోయారు. ఇబ్బందులతో నెట్టుకొస్తున్న సమయంలో 2019 లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడింది. ఎంఎస్ఎంఈ సర్టిఫికెట్ పొంది యూనియన్ బ్యాంకులో రూ.కోటి రుణం పొందగలిగారు. దానితో పరిశ్రమలో ఆధునాతన మెషినరీని ఏర్పాటు చేసి ఉద్యోగుల సంఖ్యను పెంచారు. మార్కెటింగ్ పల్స్ తెలుసుకున్నారు. ఫలితంగా విజయం సాధించి ఇప్పుడు రూ.5 కోట్ల టర్నోవర్‌కు చేరుకున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 70 మందికి ఉపాధి అవకాశం కల్పించి నెలకు రూ.3 లక్షల జీతాలు అందజేస్తున్నారు. బ్యాంకు రుణంలో ప్రభుత్వం 20 శాతం రాయితీ ఇవ్వడం, విద్యుత్ యూనిట్‌కు ఒక రూపాయి సబ్సిడీని అందజేయడంతో నిలదొక్కుకోగలిగారు.

సర్కారు సాయంతోనే నిలదొక్కుకున్నాం



ప్రారంభంలో ఎన్నో బాలారిష్టాలను ఎదుర్కొన్నాను. నిలదొక్కుకునేందుకు దాదాపు నాలుగేళ్లు పట్టింది. నాకు తెలిసి ఈ ప్రాంతంలో ఎలాంటి పరిశ్రమ నిలదొక్కుని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇచ్చింది లేదు. నా అదృష్టం బాగుండి 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడడం వల్ల ప్రోత్సాహాలు లభించాయి. దీంతో ఫ్యాక్టరీకి అవసరమైన టిప్పర్లు, మెషనరీ కొనుగోలు చేయగలిగాను. ఎంఎస్ఎంఈ సర్టిఫికెట్ పొందడం వల్ల పంచాయతీ, టౌన్‌ప్లానింగ్ అనుమతులు లభించాయి. ఫలితంగా పరిశ్రమ గాడిలో పడి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉద్యోగులకు జీతాలు చెల్లించగలుగుతున్నాను. ఎలాంటి కాలుష్యం ఏర్పడనందున ఫార్మాసిటికల్స్ కంపెనీల నుంచి ఆర్డర్లు పెరుగుతున్నాయి.

– పెదమల్లు శ్రీనివాసులురెడ్డి, ఫ్యాక్టరీ యజమాని, పొదలకూరు

డెంటిస్ట్ కల అలా సాకారమైంది

విశాఖలో డెంటల్ ల్యాబ్‌కు శ్రీకారం

సాక్షి, విశాఖపట్నం: ఆయనో దంత వైద్యుడు. వైద్య విద్యను పూర్తి చేసుకుని 2010లో విశాఖపట్నం మురళీనగర్‌లో ఓ డెంటల్ క్లినిక్ ప్రారంభించారు. తాను నడిపే క్లినిక్‌కంటే దానికి సంబంధించిన ఉత్పత్తి పరిశ్రమను స్థాపిస్తే పలువురికి ఉపాధి కల్పించవచ్చని ఆయన భావించారు. దాని వ్యాపార మెలకువలు తెలుసుకునేందుకు ఎంబీఏలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు చేశారు. స్నేహితుడు గోపీకృష్ణతో కలిసి కృత్రిమ దంతాల తయారీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు సమాయత్తమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రోత్సాహంతో ఎంఎస్ఎంఈ సింగిల్ పోర్టల్ విధానంలో నెల రోజుల్లోనే అన్ని అనుమతులతో పాటు రుణమూ మంజూరైంది. రూ.3.50 కోట్ల పెట్టుబడితో 2020 జనవరి నుంచి ఉత్పత్తిని ప్రారంభించారు. వార్షిక టర్నోవర్ రూ.4.80 కోట్లకు చేర్చారు. ఆయన పేరు డాక్టర్ గండి వెంకట శివప్రసాద్. ఆయన స్థాపించిన యూనిట్ పేరు డెంటెలిజెంట్ డెంటల్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్. రాష్ట్ర ప్రభుత్వం ఈ డెంటల్ ల్యాబ్‌కు రూ.20 లక్షలు ఇన్వెస్ట్‌మెంట్ ఇన్సెంటివ్ కూడా మంజూరు చేసింది.



మెటల్ లేజర్ సింటరింగ్ టెక్నాలజీతో...

విశాఖలోని కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఈ డెంటెలిజెంట్ డెంటల్ సొల్యూషన్స్ ల్యాబ్ నడుస్తోంది. ఇందులో కృత్రిమ దంతాలకు అవసరమైన అచ్చులు, క్రౌన్లు, బ్రిడ్జిలు వంటివి తయారు చేస్తారు. వీటిని కాస్టింగ్ టెక్నాలజీతో కాకుండా మెటల్ లేజర్ సింటరింగ్ టెక్నాలజీతో డిజిటల్ త్రీడీ ప్రింటింగ్ విధానంలో చేస్తారు. కొరియన్ టెక్నాలజీతో తయారయ్యే ఇవి మెరుస్తూ ఎంతో అందంగా కనిపిస్తాయి. ఈ ల్యాబ్ తెలుగు రాష్ట్రాల్లోనే అతి పెద్దది. ఇప్పుడు 45 మంది శాశ్వత, 20 మంది తాత్కాలిక, మరో 20 మందికి పైగా క్షేత్రస్థాయి సిబ్బంది పని చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతోనే..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంఎస్ఎంఈలకు మంచి ప్రోత్సాహాన్నిస్తోంది. అతి తక్కువ సమయంలోనే వీటి ఏర్పాటుకవసరమైన అనుమతులను మంజూరు చేస్తోంది. గతంలో ఇలాంటి సౌకర్యం లేదు. మా ల్యాబ్‌ను మరింత విస్తరించడానికి సన్నాహాలు చేస్తున్నాం. ఇందుకు రూ.6.50 కోట్లు అవసరమని అంచనా వేస్తున్నాం. ప్రస్తుతం మా ఉత్పత్తులు శ్రీకాకుళం నుంచి గుంటూరు వరకు, హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్నాం. భవిష్యత్తులో దేశమంతటా విస్తరించాలని యోచిస్తున్నాం. ల్యాబ్ విస్తరిస్తే వెయ్యి మంది ఉపాధి పొందుతారని భావిస్తున్నాం.

– డా. గండి వెంకట శివప్రసాద్, ఎండీ, డెంటెలిజెంట్ డెంటల్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్, విశాఖపట్నం

కరోనా విలయం నుంచి.. విజయపథానికి

గ్రానైట్ ఫ్యాక్టరీతో పది మందికి ఉపాధి.. వ్యవసాయం వదిలి పారిశ్రామిక పయనం

బల్లికురవ: వారిది వ్యవసాయం కుటుంబం. భర్త డిగ్రీవరకూ చదువుకోగా... భార్య పాలిటెక్నిక్ పాసయ్యారు. వారికి వ్యవసాయం ద్వారా తగిన ఆదాయం సమకూరకపోవడంతో పదిమందికి ఉపాధి కల్పించాలనుకున్నారు. తొలుత పౌల్ట్రీ పరిశ్రమతో ప్రస్థానం మొదలైంది. దంపతులు ఇద్దరూ అక్కడే పనిచేసి కొందరికి ఉపాధి చూపారు. అయితే బంధువులు గ్రానైట్ వ్యాపారాలు చేసి లాభాలు పొందడాన్ని చూశాక వీరికీ ఓ ఆలోచన వచ్చింది. బాపట్ల జిల్లా ఈర్లకొండ మల్లాయపాలెం గ్రామాల్లో ముడిరాయి దొరుకుతుండడంతో గ్రానైట్ వ్యాపారం చేద్దామనుకున్నారు. అయితే సాయమందించే ప్రభుత్వం అప్పుడు లేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రాయితీతో రుణం అందించి ఊతం అందించడంతో మారుతి గ్రానైట్స్ ఏర్పాటు చేసుకున్నారు. వారి కల సాకారమైంది. ఇప్పుడు విజయవంతంగా ఆ సంస్థ నడుస్తోంది. ఇదీ బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొత్తమల్లాయపాలెం గ్రామానికి చెందిన లేమాటి నీరజ, హనుమంతరావు దంపతుల విజయప్రస్థానం.

అధికారుల నుంచి సానుకూల స్పందన

పరిశ్రమ స్థాపిస్తామని చెప్పగానే పరిశ్రమల శాఖ అధికారులు సానుకూలంగా స్పందించారు. వెంటనే రూ.1.5 కోట్లు స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ కింద ఎస్ఐడీబీఐ(సిబీ)గా గుర్తించి బ్యాంక్ ద్వారా లోన్ మంజూరు చేశారు. అందులో రూ.90 లక్షలు ప్రభుత్వ రాయితీ కింద వచ్చింది. మొత్తం మూడు కోట్లతో ఫ్యాక్టరీ పెట్టారు. ముడిరాయిని పలకలు కోస్తూ స్థానికంగా విక్రయిస్తున్నారు. 15 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఇక్కడి నుంచి ఉత్పత్తి అయిన రాళ్లను అద్దంకి, మార్టూరు, ఒంగోలు, చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ, చీరాల, బాపట్ల, గుంటూరు, విజయవాడ పట్టణాలకు తరలిస్తున్నారు.



మాకు ఉపాధి దొరికింది



నాకు ఏపనీ దొరక్క తిరుగుతున్న సమయంలో గ్రానైట్ అధినేత పిలిచి ఉపాధి కల్పించాడు. గతంలో క్వారీల్లో చేసిన అనుభవం ఉండడంతో ఇక్కడ లైన్ పాలిష్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాను. నెలా నెలా జీతాలు బాగా ఇస్తున్నారు.

– డేవిడ్, గ్రానైట్ ఆపరేటర్

కోవిడ్ కష్టకాలంలోనూ చేయూత..



రాష్ట్రంలో రెండు సంవత్సరాలు కరోనా మహమ్మారి అందరినీ వణికించింది. గ్రానైట్ పైనా ప్రభావం చూపింది. ఫ్యాక్టరీ మూతపడింది. కరోనాతో వందల మంది మృతి చెందడంతో అన్నీ రెడ్ జోన్‌లే. వ్యాపారాలు లేక ఇబ్బందులు పడ్డాం. అప్పుడు మాకు మరో రూ.28 లక్షల లోన్ ఇచ్చారు. నెలానెలా కంతుల వారీగా రుణం చెల్లిస్తున్నాం. ప్రస్తుతం వ్యాపారం బాగానే ఉంది. పిల్లలను బాగానే చదివించుకుంటున్నాం. పది మందికి ఉపాధి కల్పిస్తున్నానే తృప్తి మిగిలింది. సంవత్సరానికి రూ. 1 కోటి వరకు టర్నోవర్ చేస్తున్నాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాకు బాగా అండగా నిలిచింది.

– లేమాటి నీరజ, ఫ్యాక్టరీ యజమాని

స్థానికంగానే ఉద్యోగం దొరికింది



నేను ఇంటర్ వరకు చదువుకున్నాను. మా ఊరికి చెందిన మారుతీ గ్రానైట్స్ నీరజ, హనుమంతరావు ఫ్యాక్టరీ పెట్టడంతో నాకు అందులో సూపర్‌వైజర్‌గా పని ఇచ్చారు. నమ్మకంగా పనిచేస్తున్నాను. ఇక్కడ గ్రానైట్ ఫ్యాక్టరీ పెట్టడం వల్లే నాకు వేరే ప్రాంతానికి వెళ్లే పని లేకుండా ఉపాధి దొరికింది. నాతోపాటు ఇక్కడ మరో 15 మంది పనిచేస్తున్నారు.

– వెంకటేశ్, సూపర్‌వైజర్

పదేళ్లుగా పనిచేయిస్తున్నా..



మాది రాజస్థాన్. బతుకు తెరువు కోసం వచ్చా. ఇక్కడ మేస్త్రీగా పని చేస్తున్నాను. ఈ ఫ్యాక్టరీ యజమాని మాకు బాగా నచ్చాడు. మమ్మల్ని బాగా చూసుకుంటున్నాడు. నెలా నెలా వేతనాలు అందుతున్నాయి.

– బీరారామ్, మేస్త్రీ

16న ఉమ్మడి ప్రాజెక్టుల అప్పగింతపై భేటీ

గత సమావేశంలోని నిర్ణయాల అమలుపై సమీక్షించనున్న కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి

సాక్షి, అమరావతి: కృష్ణా జలాల వివాదం పరిష్కారమే అజెండాగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో గత నెల 17న నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలును ఈనెల 16న ఢిల్లీలో కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ సమీక్షించనున్నారు. రెండు రాష్ట్రాల జలవనరుల శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొనాలని కేంద్ర జల్ శక్తి శాఖ ఆదేశించింది. కృష్ణా జలాలపై ఏపీ హక్కులను తెలంగాణ ప్రభుత్వం కాలరాస్తుండటంతో వాటిని పరిరక్షించుకోవడానికి నవంబర్ 30న తన భూభాగంలోని సాగర్ స్పిల్ వేలో సగ భాగం, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను ఏపీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దీనిపై అప్పట్లో తెలంగాణ సర్కార్ కేంద్రానికి ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ బల్లా డిసెంబర్ 1న సమావేశం నిర్వహించారు. నాగార్జునసాగర్‌పై నవంబర్ 30 నాటి యథాస్థితిని కొనసాగిస్తూ.. నిర్వహణ బాధ్యతను కృష్ణా బోర్డుకు అప్పగిస్తామంటూ చేసిన ప్రతిపాదనకు రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. కృష్ణా జలాల వివాదాన్నీ పరిష్కరించాలని కేంద్ర జల్ శక్తి శాఖను అజయ్ బల్లా ఆదేశించారు.

అప్పగిస్తాం.. అప్పగించం.. అప్పగిస్తాం


ఈ నేపథ్యంలో జనవరి 17న కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ రెండు రాష్ట్రాల అధికారులతో ఢిల్లీలో సమావేశం నిర్వహించారు. తరుచూ విభేదాలు తలెత్తడానికి కారణమవుతున్న ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను కృష్ణా బోర్డుకు అప్పగించాలని దేబశ్రీ ముఖర్జీ చేసిన ప్రతిపాదనను ఏపీ, తెలంగాణ అధికారులు అంగీకరించారు. నెలలోగా ఉమ్మడి ప్రాజెక్టులు కృష్ణా బోర్డుకు అప్పగించాలని, వారంలోగా ప్రాజెక్టుల అప్పగింత విధి విధానాలను త్రిసభ్య కమిటీ ఖరారు చేయాలని.. దానిపై మళ్లీ రెండు రాష్ట్రాల అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని ఆ సమావేశంలో దేబశ్రీ ముఖర్జీ స్పష్టం చేశారు. కానీ, తెలంగాణ అధికారులు ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకోగానే ఉమ్మడి ప్రాజెక్టుల అప్పగింతకు తాము అంగీకరించలేదని మాట మార్చారు. మరోవైపు 17వ తేదీన నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రాజెక్టుల అప్పగింత విధి విధానాలను ఖరారు చేసేందుకు ఈనెల 1న హైదరాబాద్‌లో కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే అధ్యక్షతన త్రిసభ్య కమిటీ సమావేశమైంది. ఆ సమావేశంలో ఉమ్మడి ప్రాజెక్టుల అప్పగింతకు అంగీకరించినట్లు తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్ మీడియాకు వెల్లడించారు.

మాట మార్చిన తెలంగాణ సర్కార్

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఆ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం మరోసారి మాట మార్చారు. కృష్ణా జలాల్లో వాటాలు తేలే వరకు ఉమ్మడి ప్రాజెక్టుల అప్పగింతకు అంగీకరించబోమని ప్రకటించారు. దీంతో ఈనెల 16న సమావేశం ఆసక్తికరంగా మారనున్నది.

పారిశ్రామిక అభివృద్ధిపై చర్చించేందుకు సిద్ధం

పరిశ్రమలశాఖ మంత్రి అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో జరిగిన పారిశ్రామిక అభివృద్ధి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుకు, పచ్చపత్రికలకు కనిపించలేదా? అని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నిలదీశారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన పారిశ్రామిక అభివృద్ధి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన పారిశ్రామిక అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. విశాఖపట్నంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఎల్లో మీడియాకు, ప్రతిపక్షాలకు తప్ప ప్రజలందరికీ తెలుసని చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వంలో రూ.30 వేల కోట్ల పారిశ్రామిక ఒప్పందాలు జరిగితే.. వైఎస్ జగన్ ప్రభుత్వంలో రూ.90 వేలకోట్లకు పైగా పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని తెలిపారు. బాబు హయాంలో 1.20 లక్షల ఎంఎస్ఎంఈలు వస్తే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 3.50 లక్షల ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేసి 15 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని చెప్పారు. రాష్ట్రంలో భీమిలి, ఏలూరుల్లో నిర్వహించిన 'సిద్ధం' బహిరంగసభలకు లక్షలాదిగా వచ్చిన ప్రజల్ని చూసి ఓర్వలేక తమ ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు.

సగం సీట్లు ప్రకటించి కాపు పౌరుషం నిలబెట్టాలి

చంద్రబాబు పొత్తు ధర్మాన్ని పాటించకుండా తనకు నచ్చినట్టు సీట్లను ప్రకటించుకున్నారని, అందుకు ప్రతిగా పవన్ కళ్యాణ్ కూడా రెండు సీట్లను ప్రకటించడాన్ని చూసి ఆయన నిర్ణయం సరైనదేనని అనుకున్నానని చెప్పారు. అలా కాకుండా నిజంగా కాపు పౌరుషం పవన్‌కల్యాణ్‌కు ఉంటే 175 సీట్లలో సగం సీట్లు జనసేనకు ప్రకటించాలని సూచించారు. అప్పుడు కాపుల పౌరుషం నిలబెట్టినట్లేనని రాష్ట్రంలో కాపు కులస్తులమంతా అనుకుంటామని చెప్పారు. ఇకపై చంద్రబాబు ఎన్ని సీట్లు ప్రకటిస్తే, పవన్ కళ్యాణ్ కూడా అన్ని సీట్లు ప్రకటించాలని సూచించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మధ్య ఎన్ని రోజులు చర్చలు జరిగినా ఒరిగేదేమీ లేదని, వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని చెప్పారు.

సీఎం జగన్ అర్జునుడైతే నేను సైనికుడిని

వచ్చే ఎన్నికల్లో మీరు ఎక్కడి నుంచి పోటీచేయాలన్న అంశంపై స్పష్టత రాలేదంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి అమర్‌నాథ్ సమాధానమిస్తూ.. వచ్చే ఎన్నికల కురుక్షేత్రంలో సీఎం జగన్ అర్జునుడైతే ఆయన సైన్యంలో అమర్‌నాథ్ ఒక సైనికుడిగా పనిచేస్తాడని చెప్పారు. తనకు రాజకీయ భవిష్యత్తు ఇచ్చింది వైఎస్ జగన్ అని పేర్కొన్నారు. తన రాజకీయ తలరాతను సీఎం జగన్ రాస్తారని, ఎప్పటికీ ఆయన వెంట నడుస్తానని చెప్పారు. జగనన్న ఏ బాధ్యత అప్పగించినా తాను సిద్ధం అని తెలిపారు.

క్లుప్తంగా...

'రా కదిలి రా..' అంటూ పెత్తందారులకు బాబు పిలుపు

డిప్యూటీ సీఎం నారాయణస్వామి



శ్రీరంగరాజపురం(చిత్తూరు జిల్లా): చంద్రబాబు తలపెట్టిన 'రా.. కదిలిరా'లో ప్రజలను పిలవడం లేదని, పార్టీలను, దత్తపుత్రుడిని, కమలం పార్టీలో ఉన్న తన వదినమ్మను, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ పార్టీలను అవినీతిపరులను, దోపిడీదారులు, పెత్తందారులను, ప్యాకేజీస్టార్లను మాత్రమే పిలిస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఎద్దేవా చేశారు. పుత్తూరులోని తన నివాసంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాన్ని 14 ఏళ్ల పాలించిన చంద్రబాబు పేదల అభివృద్ధికి కృషి చేసింది ఎంత? రాష్ట్ర సంపదను చంద్రబాబు అండ్ కో దోచుకున్నదెంత.. అని ప్రశ్నించారు. సీఎం జగన్ పేదలకోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి ఈ ఐదేళ్ల పాలనలో స్వర్ణయుగాన్ని తలపించేలా చేశారని కొనియాడారు. ఇంత మంచి చేసిన జగనన్న ప్రభుత్వం కొనసాగడానికి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు. జగనన్నకు ఓటు వేయకపోతే ఇప్పుడున్న స్కీములన్నీ రద్దవుతాయని, ప్రతిపక్షాలకు ఓటు వేస్తే మళ్లీ లంచాలు, వివక్ష మొదలవుతుందని తెలిపారు.

కర్ణాటక మద్యం తరలిస్తూ దొరికిన ఆంధ్రజ్యోతి విలేకరి

అమడగూరు: తన కుటుంబ సభ్యులతో కలిసి కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తీసుకు వస్తున్న శ్రీసత్యసాయి జిల్లా అమడగూరు మండల 'ఆంధ్రజ్యోతి' విలేకరి ఎం.రమణను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ బలరామయ్య తెలిపిన ప్రకారం... అమడగూరు మండలం బిక్లూరు క్రాస్‌లో శనివారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా, ఆంధ్రజ్యోతి విలేకరి రమణ ఆటో నడుపుకుంటూ వచ్చాడు. పోలీసులు ఆటోను ఆపి తనిఖీ చేయడానికి ప్రయత్నించగా... ఆటోలో ఉన్న విలేకరి రమణ, అతని తండ్రి లక్ష్మన్న, అక్క రమణమ్మ, చెల్లెలు విమలమ్మ కిందకు దిగి పోలీసులను పక్కకు నెట్టేశారు. ఆటోలో ఉన్న రెండు కేసుల కర్ణాటక మద్యాన్ని తీసుకుని పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని వెంబడించి రమణ, విమలమ్మ, రమణమ్మను పట్టుకోగా, లక్ష్మన్న పారిపోయాడు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఆటో, మద్యం సీజ్ చేశారు. తమను పక్కకు నెట్టేసి, విధులకు ఆటంకం కలిగించారని నలుగురిపైనా హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేశామని, రమణ, రమణమ్మ, విమలమ్మలను రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న లక్ష్మన్న కోసం గాలిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అమలు చేయని హామీలపై ప్రశ్నించాలి

టీడీపీ శాసనసభాపక్ష సమావేశంలో చంద్రబాబు



సాక్షి, అమరావతి: మేనిఫెస్టో, పాదయాత్రలో ఇచ్చిన 730 హామీల్లో 21 శాతం కూడా సీఎం జగన్ అమలు చేయలేదని చంద్రబాబు విమర్శించారు. అయినా 99 శాతం అమలు చేశానంటూ ప్రజల్ని వంచిస్తున్నారన్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఆదివారం జరిగిన టీడీపీ శాసన సభాపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఊరూరా తిరిగి అడ్డగోలుగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ ప్రజలను మోసం చేశాడని విమర్శించారు. ఈ సమావేశంలో 'ప్రజాకోర్టు–జగన్ నెరవేర్చని హామీలు' పేరుతో ఒక చార్జిషీట్‌ను విడుదల చేశారు. విద్యుత్ చార్జీలు పెంచారని, మద్య నిషేధం అమలు చేయలేదని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ హామీని గాలికి వదిలేశారని ఆరోపించారు. వీటితోపాటు మరికొన్ని అంశాలపై అసెంబ్లీ సమావేశాల్లో టీడీపీ వాదన గట్టిగా వినిపించాలని, అవసరమైతే గొడవకు దిగాలని ఆదేశించారు. పేదలకు రెండు సెంట్ల భూమి, అందులో అన్ని సౌకర్యాలతో ఇంటి నిర్మాణం చేసి ఇద్దామని సమావేశంలో చంద్రబాబు అన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థను మరింత పటిష్టపరిచి అమలు చేసే విషయంపైనా ఆలోచిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ రెండు అంశాలను పూర్తిస్థాయి మేనిఫెస్టోలో చేర్చుదామని చెప్పినట్లు సమాచారం. టీడీపీ నేతలు అచ్చెన్నాయుడు, యనమల, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

ఎంత ఖర్చయినా జనాలను తరలించాల్సిందే..

'రా కదిలి రా'ను విజయవంతం చేయాలంటూ టీడీపీ నేతల హుకుం

పూతలపట్టు(చిత్తూరు జిల్లా): గంగాధర నెల్లూరులో మంగళవారం చంద్రబాబు నిర్వహించనున్న 'రా కదిలి రా' సభకు జనాన్ని తరలించాల్సిందేనని పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మురళీమోహన్, పరిశీలకులు బొమ్మన శ్రీధర్ హుకుం జారీచేశారు. ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జ్, పార్టీ పరిశీలకులు ఐదు మండలాల్లో పర్యటించారు. పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. నియోజకవర్గంలో చంద్రబాబు సభకు ప్రతి ఒక్కరూ చురుగ్గా జనాలను తరలించాలని చెప్పారు. ఎంత ఖర్చయినా సరే జనాలను తరలించాల్సిందేనన్నారు. 'ఒకసారి మీరు చూడండి.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న సమావేశాలకు జనాలు ఎలా వస్తున్నారో'.. మన జిల్లాలో రా కదలి రా.. సభకు జనాలు ఆ విధంగా లేకపోతే మన పరిస్థితి అధోగతే' అన్నారు.

నోరెత్తారా.. అంతు చూస్తాం..



బాపట్లలో యాదవులపై పచ్చ నేతల కిరాతకం
సొంత పార్టీ నాయకులపైనే వరుస దాడులు

- ఇటీవలే జెడ్పీటీసీ అభ్యర్థి తనయుడిపై దాడి చేసి గాయపరచిన ఇన్‌చార్జి వర్మ
- తాజాగా టీడీపీ పట్టణ అధ్యక్షుడిపై ఐటీడీపీ కమ్మ నేత దాడి
- గతంలోనూ ఎస్సీలపై తెగబడిన టీడీపీ మూకలు
- దాడులన్నీ పార్టీ కార్యాలయంలోనే
- ఎన్నికల్లో టీడీపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధమవుతున్న బీసీ, ఎస్సీలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల నియోజకవర్గం పచ్చపార్టీలో వర్గ విబేధాలు భగ్గుమంటున్నాయి. ఆ పార్టీలోని చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన నేతలు రెచ్చిపోతున్నారు. సొంత పార్టీలోని బీసీ, ఎస్సీ నేతలనే లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నారు. బాపట్లలో ఇటీవల టీడీపీలోని యాదవ నేతలపై ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మతోపాటు కమ్మ సామాజికవర్గానికి చెందిన ఐటీడీపీ నేత దాడులకు తెగబడ్డారు. ఏకంగా పార్టీ కార్యాలయంలో దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటనను బీసీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న నరేంద్రవర్మ కమ్మ నేతలకు వంత పాడటంతో బీసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దాడికి ఆజ్యం ఇక్కడే..

ఇటీవల తమకు రావాల్సిన డేకరేషన్‌కు సంబంధించి యాదవ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నాయకుడి కుమారుడు మద్దిబోయిన రాంబాబు డబ్బులు అడిగాడు. దీంతో కోపోద్రేకులైన నరేంద్రవర్మతోపాటు ఆయన తనయుడు రాకేష్‌వర్మలు కలిసి పార్టీ కార్యాలయంలో రాంబాబుపై దాడికి పాల్పడ్డారు. దీనిపై నరేంద్రవర్మ ఆయన తనయుడిపై పోలీసు కేసు నమోదైంది. తాజాగా శనివారం కమ్మ సామాజికవర్గానికి చెందిన ఐ టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు మానం శ్రీనివాసరావు యాదవ సామాజికవర్గానికి చెందిన పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావుపై దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన టీడీపీ సమావేశంలోనే జరిగింది. ఐటీడీపీ క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలను నిర్వహించకపోవడంతోపాటు టీడీపీ అభివృద్ధి కోసం పనిచేయడం లేదని గొలపలి శ్రీనివాసరావు ప్రశ్నించడంతో దాన్ని జీర్ణించుకోలేని మానం శ్రీనివాసరావు ఆగ్రహించి దాడికి తెగబడ్డాడు. దీంతో నేతలు రెండు వర్గాలుగా విడిపోయి బాహాబాహీకి దిగారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడిపైనే కమ్మ సామాజికవర్గం నేత దాడికి దిగడాన్ని ఆ సామాజికవర్గం జీర్ణించుకోలేక పోతోంది.

రగిలిపోతున్న బీసీలు

అటు వర్మ సామాజిక వర్గం... ఇటు కమ్మ సామాజికవర్గం నేతలు సొంతపార్టీ యాదవులపై వరుస దాడులకు దిగడంతో వారు రగిలిపోతున్నారు. ఈ వ్యవహారంపై నియోజకవర్గంతోపాటు జిల్లా వ్యాప్తంగా బీసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ అధ్యక్షుడిపై దాడి జరిగిన మరుక్షణమే యాదవ నేతలతోపాటు, బీసీ కులాల నేతలు సమావేశమై కమ్మ నేతల దాడిని ఖండించారు. ఓట్ల పరంగానూ బాపట్ల నియోజకవర్గంలో 20 వేలకు పైగా యాదవ సామాజికవర్గం ఓట్లు ఉండగా చాలా గ్రామాల్లో వారి ఆధిపత్యం ఉంది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న వర్మ క్షత్రియ సామాజిక వర్గానికి 3వేల ఓట్లు, కమ్మ సామాజికవర్గం ఓట్లు 9వేల లోపే ఉన్నాయి. అయినా తమనే లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని బీసీలు మండిపడుతున్నారు.

గతంలో ఎస్సీలపైనా దాడులు

గతంలో ఎస్సీ నేతలపైనా టీడీపీ నేతలు దాడులు చేసిన సంఘటనలు ఉన్నాయి. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా పనిచేసిన ఎస్సీ సామాజికవర్గానికి చెందిన తానికొండ దయాబాబుపై కమ్మ సామాజికవర్గానికి చెందిన ఇనగంటి శ్రీనివాసరావు పార్టీ కార్యాలయంలోనే దాడిచేశారు. అయినా ఆ నేతకు వర్మ మద్దతు పలకడమే కాకుండా బాధితుడైన దయాబాబును పార్టీ పట్టణ అధ్యక్ష పదవి నుంచి తొలగించారు. దీంతో ఎస్సీ సామాజికవర్గం నేతలు కూడా నరేంద్రవర్మతీరుపై ఆగ్రహంతో ఉన్నారు. ఎస్సీలు, బీసీలు వచ్చే ఎన్నికల వేదికగా వారిపై కక్ష తీర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారు.

'డోన్'టాక్..!



ధర్మవరం సుబ్బారెడ్డికి టీడీపీ మొండిచెయ్యి!

- మాట ఇచ్చి ముఖం చాటేసిన పార్టీ పెద్దలు
- అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వని వైనం
- రెండు రోజులుగా విజయవాడలోనే సుబ్బారెడ్డి
- కోట్లకు టికెట్ ఇస్తే తన పరిస్థితి తేల్చాలని డిమాండ్

సాక్షి, నంద్యాల: అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది నంద్యాల జిల్లా డోన్ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి పరిస్థితి. ఆయనకే టికెట్ అంటూ గతంలో ప్రకటించిన పార్టీ అధిష్టానం ఇప్పుడు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదు. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు, ఆయన తనయుడు నారా లోకేశ్‌ను కలిసేందుకు యత్నించినా అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు. దీంతో సుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లూ పార్టీ కోసం కష్టపడితే ఇలా నమ్మించి మోసం చేస్తారా.. అంటూ మండిపడుతున్నారు. ఫిబ్రవరి 1న శ్రీశైలం దేవస్థానానికి కుటుంబ సభ్యులతో సహా వచ్చిన నారా లోకేశ్ టికెట్ కోసం అయితే తనతో మాట్లాడొద్దని ముఖం మీద చెప్పేయడమే కాకుండా... ఫిబ్రవరి 3న డోన్ నుంచి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి పోటీ చేస్తారని అనుకూల మీడియా నుంచి పార్టీ లీకులు ఇవ్వడంపై సుబ్బారెడ్డి తీవ్ర ఆగ్రహానికి గురైనట్లు సమాచారం. అదేరోజు ఉదయం విజయవాడకు వెళ్లిన ఆయన రెండురోజులుగా అక్కడే మకాం వేశారు. పార్టీ పెద్దలను అపాయింట్ కోరినా పట్టించుకోవట్లేదని సమాచారం. గతంలో చంద్రబాబు స్వయంగా టికెట్ ప్రకటించి ఇప్పుడు మోసం చేయడం ఏమిటని సుబ్బారెడ్డి ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తోంది.

రాత్రికి రాత్రే మారిన సీన్!

ఫిబ్రవరి 3న సుబ్బారెడ్డి విజయవాడ వెళ్లగానే సీటు నీకేనంటూ పార్టీ నుంచి సమాచారం రావడంతో సుబ్బారెడ్డి అనుచరులు పట్టణంలో పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు. బైక్‌లతో హల్‌చల్ చేశారు. ఈ విషయాన్ని కోట్ల వర్గీయులు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడంతో సుబ్బారెడ్డిని తీవ్రంగా మందలించినట్లు సమాచారం. దీంతో ఆయనకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకుండా పొమ్మనకుండా పొగపెడుతున్నారని ఆ పార్టీ నాయకులే చెప్పుకోవడం గమనార్హం.

వాడీవేడిగా విమర్శలు!

మూడు రోజులుగా సోషల్ మీడియా వేదికగా కోట్ల వర్గీయులు, సుబ్బారెడ్డి వర్గీయులు రెండు గ్రూపులుగా ఏర్పడి విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటున్నారు. మరోవైపు టికెట్‌పై స్పష్టమైన హామీ ఇచ్చిన తరువాతే నియోజకవర్గంలో అడుగు పెట్టాలని సుబ్బారెడ్డిపై అనుచరులు ఒత్తిడి తెస్తున్నారు. మొత్తానికి చంద్రబాబును నమ్మి సుబ్బారెడ్డి మోసపోయారని ఆ పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తూ ఉండడం గమనార్హం.

చంద్రబాబుది పదవీ వ్యామోహం

- రాష్ట్రాభివృద్ధిపై ఆయనకు ధ్యాస లేదు
- విజయవాడ ఎంపీ కేశినేని నాని
- కట్టలేరుపై హైబ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ కేశినేని నాని, స్వామిదాసు

గంపలగూడెం(తిరువూరు) : పదవీ వ్యామోహం తప్ప చంద్రబాబుకు రాష్ట్ర అభివృద్ధి పట్టదని విజయవాడ ఎంపీ కేశినేని నాని విమర్శించారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం తోటమూల–వినగడప గ్రామాల నడుమ కట్టలేరుపై హైబ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు ఆర్ అండ్ బీ స్టేట్ ప్లాన్ నిధుల నుంచి రూ.25.60 కోట్లు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో ఎంపీ కేశినేని, తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త నల్లగట్ల స్వామిదాసుతో కలిసి వంతెన నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. ఎంపీ మాట్లాడుతూ టెండర్ ప్రక్రియ పూర్తిచేసుకుని వంతెన నిర్మాణం మార్చి మొదటి వారంలో ప్రారంభించి వచ్చే సంక్రాంతికి పూర్తి చేస్తామన్నారు. వచ్చే ఎన్నికలు టీడీపీకి చివరి ఎన్నికలని, అమరావతి కడతానని కల్లబొల్లి మాటలు చెబుతున్న చంద్రబాబుకు ఏపీలో సొంత ఇల్లు కూడా లేదని ఎంపీ కేశినేని విమర్శించారు. చంద్రబాబు, ఆయన సుపుత్రుడు లోకేశ్ ఎన్నికల అనంతరం పెట్టా బేడా సర్దుకుని హైదరాబాద్‌కు మకాం మార్చేందుకు సిద్ధంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. సాధారణ ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున ఆశావహుల నుంచి సాధ్యమైనంత దండుకునేందుకు చంద్రబాబు యత్నిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించేలా చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు చేస్తున్న అబద్ధపు మాటల్ని పచ్చ పత్రికలు ఈనాడు, ఆంధ్రజ్యోతి, పచ్చ చానళ్లు టీవీ 5, ఈటీవీ, ఏబీఎన్ తమ స్వార్థం కోసం మోస్తున్నాయని విమర్శించారు. చంద్రబాబుకు తన కొడుకును ముఖ్యమంత్రి చేయాలన్న అజెండా తప్ప మరొకటి లేదన్నారు. దెందులూరు సభలో వైఎస్సార్‌సీపీ వారియర్స్‌ను చూసి టీడీపీ నాయకులకు దిమ్మతిరిగి పోయిందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం అమలవుతున్న సంక్షేమ పథకాలు మరో ఐదేళ్లు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలన్నారు. ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నాగనర్సిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో మళ్లీ వైఎస్ జగన్‌దే అధికారం

- సీఎం అందించిన సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ గెలుపునకు సంకేతాలు
- చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల మాయమాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



వాహనాలను ప్రారంభిస్తున్న పెద్దిరెడ్డి, ఆరణి

తిరుపతి మంగళం(తిరుపతి జిల్లా): రాష్ట్రంలో మళ్లీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే వస్తుందని అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. తిరుపతిలోని మంత్రి కార్యాలయం వద్ద ఆదివారం అటవీశాఖ చిత్తూరు సర్కిల్‌కు సంబంధించి కొనుగోలు చేసిన 10 నూతన వాహనాలను మంత్రి పెద్దిరెడ్డి, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లల్లో సీఎం జగన్.. పేదలకు అందించిన సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ గెలుపునకు సంకేతాలన్నారు. దేశ రాజకీయ చరిత్రలోనే ఇంతవరకు ఎవ్వరికీ సాధ్యంకానన్ని సంక్షేమ పథకాలు అందించిన ఏకైక నాయకుడు జగన్ అని చెప్పారు. రాష్ట్రంలోని పేద ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల కోట్లను నేరుగా వారి ఖాతాల్లోకి జమచేసిన నాయకుడు జగన్ మాత్రమేనన్నారు. అలాంటి నాయకుడిని తిరిగి అధికారంలోకి తీసుకురావడం కోసం ప్రజలు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న దురాలోచనతో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ఎన్ని మాయమాటలు చెప్పినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. 14 ఏళ్ల పాలనలో ప్రజలకు ఏం చేశావని మళ్లీ వచ్చి ప్రజలను ఓట్లు అడుగుతున్నావ్ చంద్రబాబు.. అని ప్రశ్నించారు. ఇక రాష్ట్రంలో పూర్తిగా చచ్చిపోయిన కాంగ్రెస్‌ను బతికించాలని షర్మిల, కేవీపీ రామచంద్రరావు, రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజులు విఫల యత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అటవీశాఖ చురుగ్గా పనిచేస్తోందని, మరింత మెరుగ్గా అటవీశాఖ అధికారులు, సిబ్బంది పనిచేసేందుకు కొత్త వాహనాలను అందించినట్టు తెలిపారు. 2010లో తాను అటవీశాఖ మంత్రిగా ఉన్నప్పుడు 350 వాహనాలను అటవీశాఖకు కొనుగోలు చేశామని, మళ్లీ ఇప్పుడు అన్ని సర్కిళ్లకు 70 వాహనాలను కొనుగోలు చేస్తున్నామని, చిత్తూరు సర్కిల్‌కు ప్రస్తుతం 10 వాహనాలను కొనుగోలు చేసినట్టు తెలిపారు.

'సిద్ధం' సభలతో బాబు, పవన్‌లకు వణుకు

మంత్రి చెల్లుబోయిన వేణు



కాకినాడ సిటీ: సీఎం వైఎస్ జగన్ నిర్వహిస్తున్న 'సిద్ధం' సభలకు వస్తున్న అశేష జన సందోహాన్ని చూసి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల వెన్నులో వణుకు పుడుతోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కాకినాడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్ ఎన్ని కుట్రలు పన్నినా.. ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయుల ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్ ప్రజల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని వివరించారు. ఆయన కోసం రాష్ట్రమంతటా ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పేదలకు మంచి చేయడానికే రాజకీయ పార్టీలు ఉండాలనే ఏకైక ఆశయంతో సీఎం జగన్ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన పథకాల్లో అమ్మ ఒడి చిరస్థాయిగా నిలిచిపోతుందని, దీని ద్వారా బాలకార్మిక వ్యవస్థను రూపుమాపారని మంత్రి వేణు చెప్పారు. మహిళలకు గత పాలకులు అన్యాయం చేశారని గుర్తించిన సీఎం జగన్ ఆసరా, చేయూత తదితర పథకాల ద్వారా ఆదుకున్నారని గుర్తు చేశారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు.

టీడీపీకి నే'తలనొప్పి'

- అసమ్మతి గళం తారస్థాయికి..
- మైలవరంలో రోడ్డెక్కిన దేవినేని ఉమా
- నూజివీడులో అడ్డం తిరిగిన ముద్దరబోయిన
- విజయవాడ వెస్ట్‌లో గ్రూపుల గోల
- రచ్చకెక్కుతున్న విభేదాలు



సాక్షి ప్రతినిధి, విజయవాడ: టీడీపీలో ఇంటిపోరు రోడ్డున పడుతోంది. జనసేనతో టికెట్ల పంచాయితీ తేలక ముందే తెలుగు తమ్ముళ్లు రచ్చకెక్కుతున్నారు. టీడీపీ సీనియర్ నేత మాజీ మంత్రి దేవినేని ఉమా అంతర్గత విభేదాలను తట్టుకోలేక పార్టీ నాయకత్వంపై పరోక్షంగా ధ్వజమెత్తారు. పార్టీలో కొత్త వారి చేరికలను వ్యతిరేకిస్తూ ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలో ఆదివారం జరిగిన 'టౌన్ హాల్ మీటింగ్ విత్ లీడర్' అనే కార్యక్రమంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలో అసమ్మతి గళానికి అద్దం పట్టాయి. మైలవరం నుంచి దేవినేని ఉమాకు టికెట్ లేదని ఇప్పటికే చంద్రబాబు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. దానిని బలపరుస్తూ తాజా రాజకీయ పరిణామాలు జోరందుకున్నాయి.

అవమాన భారంతో..

మైలవరం నుంచే పోటీ చేస్తానని ఉమా చెబుతున్నా శ్రేణులు, అధిష్టానం ఏమాత్రం పట్టించుకోవటం లేదు. ఉంటే ఉండు.. పోతే పో.. అన్న రీతిలో పార్టీ పెద్దలు వ్యవహరిస్తుండటంతో ఉమాలో అసహనం పెరిగిపోతోంది. ఫలితంగా అవమానభారంతో ఉమా అధిష్టానానికి పరోక్షంగా హెచ్చరికలు చేస్తూ గుంటుపల్లి సమావేశంలో తన ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. 'వందల కోట్ల రూపాయలు ఇస్తాం అని వస్తున్న రాజకీయ వ్యభిచారులను తరిమి కొట్టాలి' అని ఆయన పిలుపునివ్వడం పార్టీలో కలకలం రేపుతోంది. 'పసుపు కండువా కప్పుకొని చచ్చిపోతాను తప్ప పార్టీని వీడను. ఫిబ్రవరి రెండో వారంలో అన్నేరావుపేట నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తా' అని ఉమా చెప్పడంతో పరోక్షంగా చంద్రబాబు, చినబాబుకే హెచ్చరికలు జారీ చేస్తున్నారని టీడీపీ నేతలు చర్చించుకుంటున్నారు. మరోవైపు 'పార్టీలో నేను పెద్దతోపును. తనది రెండో స్థానం. నేను తలచుకొంటే ఎవరికైనా టికెట్ ఇప్పిస్తాను' అని గొప్పలు చెప్పుకొనే ఉమాకు పట్టిన దుస్థితి చూసి పలువురు నేతలు నవ్వుకొంటున్నారు. తాను తలుచుకొంటే మైలవరంతోపాటు, నందిగామ నియోజకవర్గంలో పార్టీని దెబ్బ తీయగలనని ఆయన అధిష్టానానికి సంకేతాలు పంపినట్టు చర్చ జరుగుతోంది. అయితే ఉమా వ్యవహారశైలిని అధిష్టానం లైట్ తీసుకున్నట్టు తెలుస్తోంది. ఆయనపైన ప్రతిదాడి చేయాలని కొందరు నేతలకు ఇప్పటికే సూచించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ముద్దరబోయిన అసంతృప్తి

నూజివీడు టీడీపీలో అసమ్మతి సెగలు భగ్గుమంటున్నాయి. మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు ఈసారి టికెట్ లేదని చంద్రబాబు తేల్చిచెప్పారు. దీనిపై బాబును కలిసి మాట్లాడేందుకు ముద్దరబోయిన యత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆయన తన వర్గీయులతో అంతర్గత సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరోసారి అధిష్టానంతో మాట్లాడి ఫలితం లేకపోతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు చర్చ సాగుతోంది.

విజయవాడ వెస్ట్‌లో తాప'త్రయం'

విజయవాడ వెస్ట్‌లో టికెట్ కోసం మూడు వర్గాలు కత్తులు దూసుకుంటున్నాయి. పేపరు పులిగా పేరొందిన బుద్దా వెంకన్న ర్యాలీలు చేస్తూ తనకు టీడీపీ టికెట్ ఇవ్వాలని పట్టుపడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ విజయవాడ వెస్ట్ టికెట్ తనదేనని ఇప్పటికే ప్రకటించుకున్నారు. 'అందరూ టికెట్ అడుగుతారు కానీ గెలిచే స్తోమత ఉండాలి. మంచి విలువలు ఉండాలి. నాకు సీటు ఇవ్వకపోతే ముస్లిం మైనార్టీలు ఉరివేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. నేనే ఎమ్మెల్యే అభ్యర్థినవుతా' అంటూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది. జనసేన మాత్రం పొత్తులో భాగంగా సీటు తమకే వస్తుందని చెబుతోంది. ఆ పార్టీ నేత పోతిన మహేష్ నియోజకవర్గంలో తిరుగుతున్నారు. జనసేన, టీడీపీ సీట్లు సర్దుబాటు కాకముందే ఇక్కడ ఆ పార్టీల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి.

మూడు రాజధానులపై చంద్రబాబు చర్చకు రావాలి

- బహుజన పరిరక్షణ సమితి నాయకులు
- 1,225వ రోజుకు నిరాహార దీక్షలు



దీక్షలో పాల్గొన్న బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: చంద్రబాబుకు దమ్ముంటే అసెంబ్లీలో మూడు రాజధానులపై చర్చకు రావాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు సవాల్ విసిరారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం 1,225వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ అమరావతి పేరుతో రాష్ట్రాన్ని నిలువునా దోచుకున్న చంద్రబాబు తన అవినీతిపై చర్చ జరగకుండా ఉండేందుకే అసెంబ్లీ నుంచి పారిపోయాడని, నిజంగా తన నిర్ణయంపై నమ్మకం ఉంటే అసెంబ్లీకి వచ్చి ప్రజాప్రతినిధుల ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా సీఎం వైఎస్ జగన్ నిర్ణయానికి కట్టుబడి ఉన్నారని చెప్పారు. బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి టీడీపీకి అద్దె మైకులాగా మారిందని అన్నారు. బహుజన పరిరక్షణ సమితి నాయకులు ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, పులి దాసు, నూతక్కి జోషి పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

'కదిలిరా'ను...!

- అలిగిన అయ్యన్న–సన్నాహక సమావేశాలకు దూరం
- నేడు కె.కోటపాడు మండలం గొండుపాలెంలో చంద్రబాబు 'రా.. కదిలిరా..' సభ
- సభా ఏర్పాట్లను అయ్యన్న వ్యతిరేక వర్గమైన బండారు, గండి బాబ్జీకి అప్పగించిన లోకేశ్
- కుమారుడు విజయ్‌కి అనకాపల్లి ఎంపీ టికెట్ ఇవ్వలేదని కినుక
- బాబు సభకు డుమ్మాకొట్టే ఆలోచనలో అయ్యన్న
- ఎంపీ సీటుపై ఫలించిన గంటా 'చక్రవర్తి' వ్యూహం



గొండుపాలెంలో చంద్రబాబు సభకు ఏర్పాట్లు

సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి జిల్లాలో టీడీపీ నేతల మధ్య గ్రూపు రాజకీయాలు తారస్థాయికి చేరాయి. మాజీ మంత్రులు అయ్యన్న, గంటా మధ్య లుకలుకలు మరోమారు బయటపడ్డాయి. అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలోని కె.కోటపాడు మండలం గొండుపాలెం గ్రామంలో టీడీపీ అధినేత చంద్రబాబు సోమవారం రా.. కదిలిరా.. సభ నిర్వహించనున్నారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఏర్పాట్లు, సన్నాహక సమావేశాలకు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు దూరంగా ఉంటున్నారు. ఎప్పుడూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసే అయ్యన్న సొంత జిల్లాలో, ఆయన కులస్తులు ఉన్న పక్క నియోజకవర్గంలో 'రా.. కదలిరా..' పేరిట బహిరంగ సభ ఏర్పాట్లు చేస్తుంటే కనీసం కన్నెత్తి చూడకపోవడం చర్చనీయాంశమైంది. సభా ఏర్పాట్ల బాధ్యతను అయ్యన్న వ్యతిరేక వర్గమైన గంటా వర్గీయులుగా చెప్పుకునే వెలమ కులానికి చెందిన మరో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, గండి బాబ్జీలకు అప్పగించారు. దీంతో అయ్యన్నపాత్రుడు మరింత రగిలిపోతున్నట్లు సమాచారం. అనకాపల్లి టీడీపీ ఎంపీ టికెట్ తన కుమారుడికి కాదని.. గంటా వర్గీయులైన దిలీప్ చక్రవర్తికి దాదాపు ఖరారైన నేపథ్యంలో చంద్రబాబుపై అలకపూనినట్లు సమాచారం. కష్టకాలంలో తాను, తన కుమారుడు పార్టీని భుజాన మోస్తే.. నాలుగేళ్లు పార్టీని పట్టించుకోకుండా దూరంగా ఉన్నవారికి, కొత్త వారికి ఎంపీ టికెట్ ఎలా ఇస్తారు.. సభకు తానొచ్చేది లేదని చంద్రబాబుపై మండిపడుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే చంద్రబాబు సభకు రాకూడదనే ఆలోచనలో అయ్యన్న ఉన్నట్టు తెలిసింది.

సభకు ఖర్చు చక్రవర్తిదే...

చంద్రబాబు సభకు ఖర్చంతా దిలీప్ చక్రవర్తిదే. ఇప్పటికే తన కుమారుడికి ఎంపీ టికెట్ లేదనే బాధతో అయ్యన్నపాత్రుడు రగిలిపోతుంటే.. అనకాపల్లి టీడీపీ ఎంపీ అభ్యర్థి దిలీప్ చక్రవర్తి పెత్తనంపై అయ్యన్న మరింత అగ్గిలం మీద గుగ్గిలం అవుతున్నారు. మాడుగుల నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్న వెలమ కులానికి చెందిన వారికే ఈ సభా ఏర్పాటు పరిశీలన పనులు అప్పగించడంతో అయ్యన్నకు అధిష్టానం పరోక్షంగా చెక్ పెట్టినట్లేనని అర్థమవుతోంది. ఇదంతా గంటా శ్రీనివాసరావు తెరవెన ఉండి నడిపిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

ఫలించిన గంటా, చక్రవర్తి వ్యూహం

ఒకవైపు పార్టీ కార్యక్రమాలకు దిలీప్ చక్రవర్తితో ఖర్చు చేయిస్తూ.. మరోవైపు ఎంత ఖర్చు చేశారో టీడీపీ కేడర్‌కు లీకులిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలకు ఇప్పటికే రూ.50 కోట్లు ఖర్చు చేశానని.. టికెట్ ఇవ్వకుంటే తనకు ఆ డబ్బులు ఇచ్చేయాలని దిలీప్ తన సహచరులతో చెబుతుండడం ఈ లీక్‌ల వెనుక ఆంతర్యంగా అయ్యన్న వర్గీయులు అంటున్నారు. పార్టీ అనుకూల పత్రికలో ఇప్పటికే అనకాపల్లి ఎంపీ సీటు దిలీప్ చక్రవర్తికి దాదాపు ఖరారైనట్లు రాయించడం గంటా వ్యూహమేనని టీడీపీలో చర్చించుకుంటున్నారు.

తెలంగాణ

వీళ్లు ఔట్.. వాళ్లు ఇన్

- రాంచీ వెళ్లిపోయిన జార్ఖండ్ శాసన సభ్యులు
- హైదరాబాద్‌కు చేరుకున్న బిహార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

సాక్షి, హైదరాబాద్: జార్ఖండ్ రాజకీయం అయిపోగానే తెలంగాణలో బిహార్ రాజకీయం ప్రారంభమయింది. మూడు రోజుల క్రితం రాంచీ నుంచి వచ్చిన జేఎంఎం, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 38 మంది ఎమ్మెల్యేలు తిరిగి వెళ్లిపోగానే, బిహార్‌కు చెందిన 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కు చేరుకున్నారు. జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సొరేన్‌ను ఈడీ అరెస్టు చేసిన నేపథ్యంలో ఆయన స్థానంలో చంపయీ సొరేన్ కొత్త ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. చంపయీ సొరేన్ బలనిరూపణకు సోమవారం వరకు గడువు ఉండడంతో జేఎంఎం, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను శామీర్‌పేటలోని రిసార్టుకు తీసుకువచ్చారు. శుక్ర, శని, ఆదివారం ఉదయం వరకు అక్కడే ఉన్న జార్ఖండ్ ఎమ్మెల్యేలు సాయంత్రం ప్రత్యేక విమానంలో రాంచీకి వెళ్లిపోయారు. వారు అటు వెళ్లిపోగానే బిహార్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కు చేరుకున్నారు. వారిని ఇబ్రహీంపట్నంలోని ఓ రిసార్ట్‌కు తరలించారు. ఈనెల 10న నితీశ్ ప్రభుత్వం బల నిరూపణ చేసుకోనుండటంతో అప్పటివరకు వీరంతా రిసార్ట్‌లోనే ఉంటారని గాంధీభవన్ వర్గాల ద్వారా తెలిసింది.

బాబ్రీమసీదు కూల్చివేత నేరస్తునికి భారతరత్నా?

- సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

సాక్షి, హైదరాబాద్: బాబ్రీ మసీదు కూల్చివేతలో నేరస్తునిగా ఉన్న అద్వానీకి భారతరత్న ఇవ్వడంపై సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా మండిపడ్డారు. హైదరాబాద్ మగ్దూంభవన్‌లో మూడు రోజులపాటు జరిగిన సీపీఐ జాతీయ సమితి సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సమావేశంలో చర్చించిన విషయాలు, తీర్మానాలు తదితర అంశాలను ఆదివారం సీపీఐ జాతీయ కార్యదర్శులతో కలిసి రాజా మీడియా సమావేశంలో వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మరోసారి గెలుపొందితే దేశానికి విపత్తేనని, ఈ విపత్తు నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజా అన్నారు. ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు సాధ్యమైనంత త్వరగా సీట్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేసుకుని, బీజేపీని ఓడించేందుకు సన్నద్ధం కావాలని సూచించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అనేక నియోజకవర్గాలు ఉన్నప్పటికీ రాహుల్ ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ప్రాతినిధ్యం వహించే కేరళలో పోటీచేయడం ఏంటని ప్రశ్నించారు. కాగా, రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సీపీఐ జాతీయ సమితి ఎన్నికల మేనిఫెస్టో కమిటీని ఏర్పాటు చేసింది. .

19 ఏళ్లక్రితం చొరబడి ఇప్పుడు పట్టుబడ్డారు

ఖమ్మంక్రైం: 19 ఏళ్ల క్రితం భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించి, తమకు తెలిసిన వారి ద్వారా ఖమ్మం చేరుకుని, ఇక్కడే నివాసం ఉంటున్న నలుగురు బంగ్లాదేశీయులను ఖమ్మం పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బంగ్లాదేశ్‌లోని శ్యామ్‌కుర్ యూనియన్‌లోని జెనైద జిల్లా దకాటియా గ్రామానికి చెందిన శాగురి ఖాటూన్ అలియాస్ శిల్ప అనే మహిళ 19 ఏళ్ల క్రితం బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా కోల్‌కతాకు, అక్కడి నుంచి ముంబైకి చేరుకుంది. ఖమ్మం శ్రీనివాసనగర్‌కు చెందిన బోడ రాములుతో ఆమెకు ముంబైలో పరిచయం ఏర్పడగా ఇరువురూ సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం వచ్చి శ్రీనివాసనగర్‌లో నివాసముంటున్నారు. ఖాటూన్ సోదరులైన మహమ్మద్ నూర్‌నబీ అలియాస్ షేక్ నూర్‌నబీ, మహమ్మద్ సాగర్ అలియాస్ బోడ సాగర్‌తో పాటు ఆమె దూరపు బంధువు షేక్ జమీర్ అలియాస్ మహ్మమద్ జమీర్ కూడా భారత్‌కు వచ్చి ఖమ్మంలోనే ఉంటున్నారు. వీరు తప్పుడు సమాచారం ఇచ్చి ఆధార్ కార్డులు తీసుకున్నారు. దీంతో పాన్ కార్డ్, పాస్ పోర్టులు కూడా సంపాదించారు. ఆరేళ్ల క్రితం మహ్మమద్ అమినూర్ మండల్ అనే వ్యక్తిని సైతం ఖమ్మం తీసుకురాగా..అతడు సెంట్రింగ్ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. వీరంతా భారత్‌కు చెందిన వారినే వివాహాలు చేసుకుని ఖమ్మంలోనే జీవిస్తున్నారు. పోలీసులు విచారించడంతో వ్యవహారం బయటపడింది. దీంతో మహమ్మద్ నూర్‌నబీ, బోడ సాగర్, షేక్ జమీర్ అలియాస్ మహ్మమద్ జమీర్, మహ్మమద్ అమినూర్ మండల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీకి అడహాక్ కమిటీ

సాక్షి, హైదరాబాద్: జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ మ్యాక్ హౌసింగ్ సొసైటీకి అడ్‌హాక్ కమిటీ ఏర్పాటైంది. హైదరాబాద్ జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిజాంపేటలోని హౌసింగ్ సొసైటీ స్థలంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా సహకార శాఖ రిజిస్ట్రార్ రమాదేవి ఆధ్వర్యంలో సభ్యుల సమక్షంలో సొసైటీకి అడ్‌హాక్ కమిటీని నియమించారు. ఈ కమిటీకి ముంజేటి రామారావు చైర్మన్‌గా ఎన్నికయ్యారు. సభ్యులుగా పూకంటి శ్రీనివాస్‌రెడ్డి, పామరతి హేమసుందర్, ఎస్‌ఎన్‌సీఎన్ ఆచార్యులు, ఎం.ఎ.సర్వర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ వీరికి నియామక పత్రాలను అందజేశారు. అడ్‌హాక్ కమిటీ జనరల్ బాడీ సమావేశం శాంతియుత వాతావరణంలో జరిగినట్లు రమాదేవి ప్రకటించారు.

ఈనాడు చావు తెలివి..

వ్యక్తిగత కారణాలతో ఉద్యోగిని మరణిస్తే ప్రభుత్వంపై రామోజీ అభాండాలు

చావలి-1 ఆర్బీకే ఎరువుల బకాయి కేవలం రూ.16 మాత్రమే

కానీ, ఈ వాస్తవాలకు ముసుగేసి ఆర్బీకేల సిబ్బంది మనోస్థైర్యం దెబ్బతినేలా నీచపు రాతలు

సాక్షి, అమరావతి: ప్రపంచం మొత్తం వేనోళ్ల కీర్తిస్తున్న ఆర్బీకే వ్యవస్థను అప్రదిష్టపాల్జేయడం, రైతులకు అండగా నిలుస్తూ వారిని చేయిపట్టి నడిపిస్తున్న ఆర్బీకే సిబ్బందిపై ఇప్పుడు రామోజీ కన్నుపడింది. రాష్ట్ర ప్రభుత్వంపై నిత్యం విషం కక్కడమే పనిగా పెట్టుకున్న ఆయన ఈసారి వారి మనోస్థైర్యం దెబ్బతీయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఓ ఆర్బీకే సిబ్బంది మరణాన్ని సైతం రాజకీయం చేస్తూ చావు తెలివితేటలను ప్రదర్శించింది. వ్యక్తిగత కారణాలతో ఆర్బీకే ఉద్యోగిని ఒకరు బలవన్మరణానికి పాల్పడితే, దాన్ని వక్రీకరిస్తూ 'ఆర్బీకే ఉద్యోగిని ప్రాణం తీసిన ఎరువుల విక్రయాలు' అంటూ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ఇష్టారాజ్యంగా అబద్ధాలను అచ్చేసింది. ఈనాడు కథనంలోని అంశాలపై 'ఫ్యాక్ట్‌చెక్' ఏమిటంటే..


ఆర్బీకే ఉద్యోగిని ప్రాణం తీసిన ఎరువుల విక్రయాలు
అద్దె బకాయి కింద సరుకు తీసుకుపోయిన భవన యజమాని
సొమ్ము కోసం అధికారుల ఒత్తిడి
చిరుద్యోగి బలవన్మరణం
బాపట్ల జిల్లా చావలిలో విషాదం

బాపట్ల జిల్లా వేమూరు మండలం చావలి-1 ఆర్బీకేలో గ్రామ వ్యవసాయ సహాయకురాలుగా మూడున్నరేళ్ల నుంచి సమర్ధవంతమైన సేవలందిస్తున్న బి.పూజిత శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. కారణాలు ఏమైనప్పటికీ ఆమె మరణం బాధాకరం. కానీ, ఎరువుల బకాయిలపై

బకాయిలపై ఎలాంటి ఒత్తిడిలేదు

ప్రభుత్వాధికారులు ఒత్తిడిని తట్టుకోలేకే ఆమె అఘాయిత్యానికి ఒడిగట్టిందంటూ ఈనాడు చేసిన ఆరోపణలు విస్మయానికి గురిచేస్తున్నాయి. వాస్తవానికి.. ఈ ఆర్బీకే ద్వారా రైతులకు సరఫరా చేసిన ఎరువులకు సంబంధించిన బకాయిలు అక్షరాల కేవలం రూ.16 మాత్రమే. ఈ కొద్దిపాటి సొమ్ము కోసం ఒత్తిడి తీసుకొచ్చారనడం ఎంతో హాస్యాస్పదం. ఆర్బీకేలో నిల్వచేసిన తడిసి, పాడైన ఎరువుల తాలూకు విలువను ఆర్బీకే సిబ్బంది నుంచి వసూలు కోసం ఉన్నతాధికారులు ఒత్తిడి తీసుకొచ్చారని ఈనాడు మరో ఆరోపణ చేసింది. నిజానికి.. వర్షాలు, ఇతర వైపరీత్యాల సందర్భంలో తడిసిన, గడ్డకట్టిన, పాడైన ఎరువులను సంయుక్త విచారణ ద్వారా నిర్ధారించి వాటిని రద్దుచేసి, ఆ మేరకు సొమ్మును బకాయిల నుంచి మినహాయిస్తున్నారే తప్ప ఏ ఒక్క ఆర్బీకే నుంచి వసూలుచేసిన దాఖలాల్లేవు. ఇప్పటివరకు సంయుక్త విచారణలో ఇలా వైపరీత్యాలవల్ల పాడైనట్లుగా గుర్తించిన రూ.8.4 లక్షల విలువైన 15 టన్నుల ఎరువులను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది.

సకాలంలో అద్దె జమ..

ఇక ఆర్బీకే అద్దెల చెల్లింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.43 కోట్లు ఖర్చుచేసింది. రానున్న మార్చి వరకు సర్దుబాటు చేసేందుకు మరో రూ.32.98 కోట్లు విడుదల చేసింది. ఇప్పటికే రూ.22.98 కోట్లు భవన యజమానుల ఖాతాల్లో జమచేశారు. పెండింగ్‌లో విద్యుత్ బిల్లుల కోసం రూ.12 కోట్లు విడుదల చేయగా, ఇక నుంచి నేరుగా ఈ బడ్జెట్‌ను విద్యుత్ శాఖకే కేటాయించేలా ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, స్టేషనరీ కోసం రూ.3 కోట్లు విడుదల చేయగా ఇప్పటికే ఖర్చుచేసిన సిబ్బందికి రూ.53.48 లక్షలు విడుదల చేశారు. ఇంటర్నెట్ కోసం కూడా రూ.23 కోట్లు విడుదల చేశారు. ఇలా రైతుల అవసరాలను తీరుస్తూ వారికి అడుగడుగునా అండగా నిలుస్తున్న ఆర్బీకేలపై నిత్యం అదే పనిగా బురద జల్లడం, సిబ్బంది మనోస్థైర్యం దెబ్బతీసేలా దుర్మార్గపు రాతలు రాస్తోంది. ఈ క్షుద్ర పాత్రికేయాన్ని ఇకనైనా మానుకోవాలని రైతులు ఈనాడు రామోజీకి సూచిస్తున్నారు.

ఆర్బీకేల్లో ఎరువుల విక్రయం వ్యాపారం కాదు..

ఇక రైతుభరోసా కేంద్రాల్లో ఎరువుల అమ్మకం వ్యాపారం కాదని, రైతులకు గ్రామస్థాయిలో చేసిన ఓ సదుపాయం మాత్రమే. నిజానికి.. రాష్ట్రానికి సరఫరా అయ్యే ఎరువుల్లో 50 శాతం వ్యాపారులకు, మిగిలిన 50 శాతం సహకార కేంద్రాలు, ఆర్బీకేలకు కేటాయిస్తున్నారు. ఆర్బీకేలు ఏర్పాటుచేసిన తొలి ఏడాది 1.07 లక్షల టన్నుల అమ్మకాలు జరగ్గా.. మూడో ఏడాదికి వచ్చేసరికి అది నాలుగు లక్షల టన్నులకు చేరుకుంది. ఈ సదుపాయం వినియోగించుకున్న రైతుల సంఖ్య 2020-21లో 2.55 లక్షల మంది ఉంటే, 2022-23లో ఏకంగా 10.90 లక్షల మందికి చేరింది అంటే.. 428 శాతం వృద్ధి కన్పిస్తోంది. గ్రామస్థాయిలో ఎమ్మార్పీకే ఎరువులు అందుబాటులో ఉంచడంతో.. బ్యాగ్‌పై రూ.20-50 వరకు రవాణ, లోడింగ్, అన్‌లోడింగ్ భారం తగ్గడంతో రైతులు ఆర్బీకేల ద్వారా ఎరువులు తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

ఈ-క్రాప్ నమోదులోనూ ఒత్తిడి లేదు..

మరోవైపు.. వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఉమ్మడి అజమాయిషీ కింద జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు కోసం టైమ్‌లైన్ నిర్దేశించారే తప్ప సిబ్బందిపై ఎలాంటి ఒత్తిడిలేదు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం.. ఖరీఫ్ 2023 నుండి జియో ఫెన్సింగ్ అమలుచేస్తున్నారు. ఆర్బీకే సిబ్బంది అభ్యర్థన, ఫీడ్‌బ్యాక్ మేరకు వరి పంటకు జియో ఫెన్సింగ్‌ను 20 నుంచి 200 మీటర్లకు పెంచడమే కాదు.. అవసరమైతే క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి మినహాయింపు కూడా ఇస్తున్నారు. అలాగే.. వైఎస్సార్ రైతుభరోసా మాస పత్రిక కోసం ఇప్పటివరకు 14,300 మంది రైతులు స్వచ్ఛందంగా బుక్ చేసుకున్నారు. ఈ విషయంలో సిబ్బందిపై ఒత్తిడి చేస్తున్నారనడంలో కూడా ఎలాంటి వాస్తవంలేదు.

'ఈఈఎస్ఎల్' ఈ-కామర్స్‌కు శ్రీకారం

- ఈఈఎస్ఎల్ మార్ట్.ఇన్ పోర్టల్‌లో విద్యుత్ ఆదా చేసే ఉపకరణాల విక్రయం
- మొదటి దశలో విజయవాడ, విశాఖ, తిరుపతిలో అమలు


విశాల్ కపూర్

సాక్షి, అమరావతి: ఇంధన వనరుల ఆదా, పర్యావరణ పరిరక్షణలో ఆదర్శంగా నిలుస్తున్న కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ రంగ సంస్థల జాయింట్ వెంచర్ అయిన ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) మరో ఆవిష్కరణకు నాంది పలికింది. దేశవ్యాప్తంగా ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా 'ఈఈఎస్ఎల్‌మార్ట్.ఇన్' (EESLMart.in)పేరుతో కొత్త ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించింది. ఈ మేరకు ఈఈఎస్ఎల్ సీఈవో విశాల్‌కపూర్ ఆదివారం 'సాక్షి'కి వివరాలు వెల్లడించారు. ఈ ప్లాట్‌ఫామ్‌లో ఎల్ఈడీ బల్బుల నుంచి బీఎల్‌డీసీ ఫ్యాన్లు, ఎయిర్ కండీషనర్ల వరకు అనేక స్టార్ రేటెడ్ ఉత్పత్తులను వినియోగదారులకు అందుబాటులో ఉంచింది. మధ్యవర్తులు లేకుండా స్టార్ రేటెడ్ ఉత్పత్తుల్ని దేశం నలుమూలల్లో ఉన్న ప్రజలకు అందుబాటు ధరల్లో ఈ-మార్ట్ విక్రయించనుంది. ఏపీలో ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ను విజయవంతంగా నిర్వర్తించేందుకు మొదటి దశలో విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి ప్రధాన నగరాలను ఈఈఎస్ఎల్ ఎంపిక చేసుకుంది. ఈ మార్ట్‌లో విక్రయించేందుకు 33% విద్యుత్‌ను ఆదా చేసే 9వాట్స్ బల్బులు, ఇన్వర్టర్ బల్బులు, 40శాతం తక్కువ విద్యుత్‌ను ఖర్చు చేసే 5 స్టార్ రేటెడ్ ఫ్యాన్‌లను మార్కెట్‌లోకి అందుబాటులోకి తీసుకుచ్చింది. ఉత్పత్తులు, సేవలు, ఫైనాన్సింగ్‌ను ఒకే ప్లాట్‌ఫామ్‌పైకి తీసుకువచ్చిందని విశాల్ కపూర్ తెలిపారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు



సాక్షి, అమరావతి: తహశీల్దార్ రమణయ్య హత్యకు కారణమైన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. రమణయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. విజయవాడలో జరిగిన అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ వివాదాలు ఉన్న మండలాల తహశీల్దార్లకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలన్నారు. విధి నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవడానికి కఠినమైన చట్టం తీసుకురావాలని కోరారు. 2024 సాధారణ ఎన్నికలకు సరిపడా నిధులు మంజూరు చేయాలన్నారు. ఇటీవల జరిగిన డిప్యూటీ కలెక్టర్ల పదోన్నతుల్లో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందడం వల్ల ఖాళీ అయిన స్థానంలో కో-ఆప్షన్ ద్వారా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రస్తుత ఏలూరు జిల్లా అధ్యక్షుడు కంచెర్లపల్లి రమేష్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఏడు బంగారం బిస్కెట్లు స్వాధీనం

ఆనందపురం (విశాఖ జిల్లా): మండలంలోని భీమిలి క్రాస్ రోడ్డు వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసుల తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న బంగారు బిస్కెట్లు పట్టుబడ్డాయి. నిందుతులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు వివరాల ప్రకారం భువనేశ్వర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న బస్సులో కొంతమంది బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు, ఎస్ఐ మల్లేశ్వరరావు, సిబ్బందితో భీమిలి క్రాస్ రోడ్డు వద్ద హైదరాబాద్ వెళ్తున్న బస్సును ఆపి తనిఖీ చేయగా అందులో ఇద్దరు యువకుల వద్ద ఏడు బంగారు బిస్కెట్లు (815 గ్రాములు), సిల్వర్ బ్రాస్‌లెట్, రూ.రెండు వేలు, రెండు సెల్ ఫోన్లు లభ్యమయ్యాయి. వారిని విచారించగా ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. నిందితులు మహారాష్ట్రకు చెందిన వారని తెలిపారు. వారిని అరెస్టు చేసి, బంగారం బిస్కెట్లు స్వాధీనం చేసుకున్నారు.

టీడీపీ- జనసేన ప్రభుత్వం కష్టమే

- అయినా.. పోరాటం చేయాల్సిందే: పవన్
- జనసేన తీసుకునే సీట్లు ఎన్ని అనేది ప్రధానం కాదు

సాక్షి, అమరావతి: ''ఈ ఎన్నికల్లో జనసేన - టీడీపీ కూటమిగా పోటీ చేసినా ప్రభుత్వ స్థాపన అంటే కష్టంతో కూడిన పనే..'' అంటూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. ఆదివారం తాడేపల్లిలోని చంద్రబాబు నివాసంలో సీట్ల కేటాయింపుపై సుదీర్ఘ చర్చల అనంతరం సాయంత్రం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో పార్టీ నాయకుల సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి ఈ సందర్భంగా పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. 'విజయం సాధించాలంటే తేలికేమీ కాదు.. జగన్ ఎన్ని మోసాలు చేసినా, ఎన్ని మాయలు చేసినా వాటన్నింటినీ అధిగమించి మనం ప్రభుత్వాన్ని స్థాపించాలి. అదంతా ఈ అలయెన్స్‌లో కొంచెం కష్టంగానే ఉంటది' అంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రతి సీటూ గెలిచే సీటు కావాలని కోరుకుంటున్నప్పుడు పొత్తులో జనసేనకు కేటాయించే సీట్లు ఎన్ని అన్నది ప్రధానం కాదన్నారు. మీరు పడ్డ కష్టానికి జనసేనలో అందరికీ వార్డు మెంబరు స్థాయి నుంచి రాజ్యసభ దాకా పదవులు వచ్చేలా ముందుకెళ్తానంటూ చెప్పారు. సీఎం జగన్‌ను తామందరం కలసి ఇబ్బంది పెడుతున్నట్లు, ఆయన్ను ఓ అర్జునుడిలా పోల్చుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు.

తెలంగాణ

తెలంగాణ తల్లి రూపం మారుస్తాం

- రాష్ట్ర గేయంగా ప్రజాకవి అందెశ్రీ రచన.. కేబినెట్ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పాటు కోసం జరిగిన సుదీర్ఘ ఉద్యమ ప్రస్థానం భావితరాలకు గుర్తుండేలా రాష్ట్ర ప్రభుత్వం పలు మార్పులకు శ్రీకారం చుట్టింది. ఆదివారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరిగింది. సమావేశ నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మీడియాకు వివరించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కనిపించేలా రాష్ట్ర చిహ్నాన్ని తయారు చేయనున్నట్టు వివరించారు. తెలంగాణ తల్లి రూపాన్ని కూడా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు కనిపించేలా మారుస్తామన్నారు.

కేబినెట్ నిర్ణయాలివీ..

అసెంబ్లీ సమావేశాల సమయంలో మరో రెండు గ్యారెంటీ స్కీములు అమలు. రాష్ట్రంలో కులగణనకు ఆమోదం. వాహనాల నంబర్ ప్లేట్లపై టీఎస్‌కు బదులుగా టీజీగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గెజిట్‌కు అనుగుణంగా మార్పు. కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ ఏర్పాటుకు ఆమోదం. రాష్ట్ర గేయంగా అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ' పాట. తెలంగాణ ఆత్మ కనిపించే అన్ని వర్గాల సూచన మేరకు రాష్ట్ర చిహ్నం రూపకల్పన. తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు. రాష్ట్రంలోని 65 ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడేషన్. రాష్ట్ర హైకోర్టు నిర్మాణానికి వంద ఎకరాల భూమి కేటాయింపు.

తెలంగాణ

'పద్మశ్రీ'లకు రూ.25 లక్షలు

- నెలకు రూ.25వేల పింఛను ఇవ్వాలని నిర్ణయం
- రాష్ట్రపతి కావాల్సిన నేత వెంకయ్యనాయుడు
- పున్నమినాగు నుంచి సైరా వరకు చిరంజీవిది ఒకే కమిట్‌మెంట్
- పద్మవిభూషణ్, పద్మశ్రీ అవార్డు గ్రహీతల సన్మాన సభలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: పద్మశ్రీ పురస్కారాలకు ఎంపికైన వారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.25 లక్షల నగదు బహుమతి, ఖర్చుల నిమిత్తం నెలకు రూ.25 వేలు పింఛను ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. పద్మవిభూషణ్ పురస్కారాలకు ఎంపికైన మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, సినీనటుడు చిరంజీవితోపాటు పద్మశ్రీకి ఎంపికైన ఆనందాచార్య, దాసరి కొండప్ప, ఉమామహేశ్వరి, గడ్డం సమ్మయ్య, కేతావత్ సోంలాల్, కూరెళ్ల విఠలాచార్యలను ఆదివారం హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో తెలుగు సంప్రదాయ కళలను కాపాడుతున్న కళాకారులను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాలతో గౌరవించడం సముచితమని, ఈ పరిస్థితుల్లో పురస్కారాలకు ఎంపికైన వారిని సత్కరించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతగా భావించినట్టు తెలిపారు. విద్యార్థి దశ నుంచి తనకు వెంకయ్యనాయుడు ప్రసంగాలు అంటే తనకు ఇష్టమని చెప్పారు. వెంకయ్య నాయుడు రాష్ట్రపతి కావాల్సిన నాయకుడన్నారు. కళాకారుడిగా కమిట్‌మెంట్ ఉన్న వ్యక్తి చిరంజీవి అని.. పున్నమినాగు సినిమా నుంచి సైరా నరసింహారెడ్డి వరకు ఒకే కమిట్‌మెంట్‌తో ఆయన ఉన్నారని కొనియాడారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ బూతులు మాట్లాడటం రాజకీయాల్లో మంచిది కాదని, అలా బూతులు మాట్లాడేవారికి పోలింగ్ బూతుల్లోనే సమాధానం చెప్పాలని అన్నారు. చిరంజీవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పద్మ అవార్డులకు ఎంపికైన వారిని సన్మానించడం ముదావహమన్నారు. రాజకీయాల్లో దుర్భాషలు ఎక్కువయ్యాయని, వ్యక్తిగతంగా దుర్భాషలాడటం మంచిది కాదని, అలాంటి వారికి ప్రజలే గుణపాఠం చెప్పాలన్నారు.

పరువు కోసం 'ఉమ్మడి' సభలు

- తన సభలకు జనం రాకపోవడంతో జనసేనతో కలసి సభల నిర్వహణకు బాబు ప్లాన్
- రెండు దఫాలు చంద్రబాబు, పవన్ చర్చలు
- సుదీర్ఘంగా చర్చించినా సీట్లపై తేల్చకుండా సందిగ్ధం
- బీజేపీ నుంచి స్పష్టత వచ్చే వరకు వేచి చూడాలని నిర్ణయం



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదివారం రెండు విడతలు సుదీర్ఘంగా చర్చలు జరిపినా సీట్లపై కొలిక్కి రాలేదు. 3 గంటలు చొప్పున మంతనాలు జరిపినా సీట్ల సర్దుబాటుపై ఒక నిర్ణయానికి రాలేకపోయారు. ఆదివారం సాయంత్రం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వచ్చిన పవన్ కళ్యాణ్ సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం తిరిగి వెళ్లిపోయి చీకటి పడ్డాక రాత్రి మరోసారి చంద్రబాబు ఇంటికి వచ్చి గంటల తరబడి చర్చలు జరిపారు. పవన్ కళ్యాణ్ 50కిపైగా సీట్లు అడుగుతుండగా చంద్రబాబు ఎటూ తేల్చకుండా ఉత్కంఠ కొనసాగిస్తున్నారు. తమకు కేటాయించే సీట్ల గురించి తేల్చాలని, కనీసం కొన్ని సీట్లనైనా ప్రకటిస్తే బాగుంటుందని పవన్ కోరినా అప్పుడే ప్రకటిస్తే ఇబ్బందులు వస్తాయంటూ చంద్రబాబు దాటవేసినట్లు తెలిసింది. జనసేనకు సీట్లు ఇవ్వడం వల్ల తమ పార్టీ నేతలు ఆందోళనకు దిగే అవకాశం ఉందని, ముందు వారికి నచ్చజెప్పాల్సి ఉంటుందని స్పష్టం చేసినట్లు సమాచారం. అలాంటి వారిని మానసికంగా సిద్ధం చేస్తున్నామని చంద్రబాబు వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

'ఫ్యాన్' ఫుల్ స్పీడ్

ముఖ్యమంత్రి జగన్ దూకుడుగా ముందుకెళుతున్నా తాము ఏమీ తేల్చుకోలేకపోవడంపై సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. జగన్ ఒకవైపు అభ్యర్థుల ఎంపికను వేగంగా పూర్తి చేస్తున్నా టీడీపీ-జనసేన పోటీ చేసే స్థానాలు, అభ్యర్థుల గురించి కనీసం స్పష్టత లేకపోవడం వల్ల క్షేత్రస్థాయిలో ఇబ్బంది నెలకొందనే విషయం చర్చకు వచ్చింది. సీఎం వైఎస్ జగన్ 'సిద్ధం' సభలకు జనం భారీగా వస్తుండడాన్ని పవన్ ప్రస్తావించారు. భీమిలి సభ విజయవంతమవడం, ఆ తర్వాత నిర్వహించిన దెందులూరు సభకు అంతకు మించిన స్పందన వచ్చిందనే అంశం చర్చకు వచ్చింది.

పరువు కాపాడుకునేందుకు..

అభ్యర్థుల ఎంపికలో దూకుడుతోపాటు సిద్ధం సభలతో వైఎస్సార్ సీపీ మంచి ఊపు మీద ఉందని, అదే సమయంలో తమ వైపు ఆ జోరు లేకపోవడం ఇబ్బంది కలిగిస్తుందనే అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. దీంతో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన 'సిద్ధం' సభ స్థాయిలో తాము కూడా ఒక సభను ఉమ్మడిగా నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. అమరావతిలో సభ నిర్వహిస్తే ఎలా ఉంటుందనే చర్చ కూడా జరిగింది. చంద్రబాబు సభలకు జనం మొహం చాటేస్తుండటంతో పవన్ కళ్యాణ్‌ను రప్పించి టీడీపీ - జనసేన కలిసి ఉమ్మడి సభ నిర్వహించాలని నిర్ణయించారు. 'రా కదలిరా' సభలన్నీ పేలవంగా జరుగుతున్న విషయం తెలిసిందే. దీంతో జనసేనతో కలసి ఉమ్మడి సభలపై ప్రణాళిక రూపొందించిన చంద్రబాబు సమావేశంలో దానిపై చర్చించారు.

బీజేపీ స్పష్టత కోసం..

పొత్తుపై బీజేపీ స్పష్టత ఇచ్చే వరకు వేచి ఉండక తప్పదనే అభిప్రాయం ఈ సమావేశంలో వ్యక్తమైంది. ఆ పార్టీ అగ్ర నేతలతో భేటీకి పవన్‌కళ్యాణ్ ప్రయత్నిస్తున్నా అటు నుంచి స్పందన లేదని ఇరువురు చర్చించుకున్నట్లు తెలిసింది. కమలనాథులు తమ నిర్ణయం ప్రకటించే వరకు సీట్ల సర్దుబాటుపై తేలడం కష్టమనే నిర్ణయానికి వచ్చారు. బీజేపీ ముఖ్య నేతలను కలవడానికి ప్రయత్నాలు కొనసాగించాలని, 10వతేదీలోపు ఎలాగైనా కలిసేలా ప్రయత్నించాలని పవన్‌కు చంద్రబాబు సూచించారు.

తెలంగాణ

కృష్ణా జలాల్ని తరలించుకుపోయారు

- ఉమ్మడి రాష్ట్రంలో కంటే పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణకు అన్యాయం
- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: అరవై ఏళ్ల ఉమ్మడి పాలనలో కంటే కేసీఆర్ సీఎంగా ఉన్న పదేళ్లలోనే తెలంగాణకు ఎక్కువ నష్టం జరిగిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ సచివాలయంలో మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండా సురేఖతో కలసి ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ సీఎంలుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబు కృష్ణా నుంచి ఏపీకి నీళ్లు తీసుకెళ్లినా కేసీఆర్ ఏనాడూ నోరు మెదపలేదని ధ్వజమెత్తారు. తెలంగాణకు రావాల్సిన నీటిని ఏపీకి ధారాదత్తం చేసిన దుర్మార్గుడు కేసీఆర్ అని దుమ్మెత్తి పోశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్సార్ హయాంలో టీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు మంత్రులుగా పనిచేశారని గుర్తు చేశారు. అప్పట్లో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 44వేల క్యూసెక్కుల జలాలను పోతిరెడ్డిపాడు ద్వారా తీసుకెళ్లే ప్రయత్నాలను టీఆర్ఎస్ మంత్రులు ఎందుకు అడ్డుకోలేదని నిలదీశారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ముఖ్యమంత్రికి నీటిని తరలించుకెళ్లేలా మరో టన్నెల్ ఏర్పాటు చేసుకునేందుకు కేసీఆర్ కారణమయ్యారన్నారు.

రోజుకు 8 టీఎంసీలను ఏపీ తరలించుకుపోతోంది

ఏపీ సీఎం వైఎస్ జగన్ రాయలసీమ ప్రాజెక్టుతో రోజుకు 8 టీఎంసీల నీటిని శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి తరలించుకుపోతున్నారని.. దీనికి సంబంధించి 2020 మే 5న ఏపీ ప్రభుత్వం జీఓ-203ని కూడా తెచ్చిందని పేర్కొన్నారు. అప్పట్లో ప్రగతిభవన్‌కు వచ్చిన ఏపీ సీఎం జగన్‌తో కేసీఆర్ ఏకాంత చర్చల తర్వాతే ఆ జీఓ జారీ అయిందన్నారు. ఆ ఏడాది ఆగస్టు 5న కృష్ణా బోర్డు సమావేశం నిర్వహించగా కేసీఆర్ బిజీగా ఉన్నానంటూ హాజరు కాలేదని గుర్తు చేశారు. వెంటనే ఆ ప్రాజెక్టు టెండర్లు, కాంట్రాక్టర్ ఎంపిక కూడా పూర్తయ్యాయన్నారు. 15 ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించేందుకు కేసీఆర్ అంగీకరించారన్నారు. ప్రాజెక్టుల నిర్వహణ కోసం 2023-24 బడ్జెట్‌లో గోదావరి బోర్డు, కృష్ణా బోర్డుకు చెరో రూ.200 కోట్ల చొప్పున రూ.400 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారని ధ్వజమెత్తారు. ఇంత చేసిన కేసీఆర్.. ఇప్పుడు నల్లగొండలో నిరసన తెలుపుతాననడం సిగ్గుచేటని పేర్కొన్నారు.



మేడారానికి పోటెత్తిన భక్తులు

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా మేడారంలోని శ్రీ సమ్మక్క- సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. మహా జాతరకు ఇంకా 17 రోజులు మిగిలి ఉండగానే భక్తులు ముందస్తు మొక్కులు చెల్లించడానికి పోటెత్తుతున్నారు. ఆదివారం ఒక్క రోజే 3 లక్షల మందికి పైగా వనదేవతలను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. జనం కిక్కిరిసి పోవడంతో ఉదయం 5 గంటలకే గద్దెలకు తాళం వేశారు. హనుమకొండ నుంచి మేడారానికి 60 ఆర్టీసీ బస్సుల్లో 5 వేల మంది చేరుకున్నారు.

సన్నిధి

మంచిమాట

భయం ప్రకృతి వరం



అన్ని జీవులతో పాటు మనిషికి కూడా భయం పుట్టుకతోనే ఉంది. సహజమైన భయానికి తోడు మానవుడు కృత్రిమమైన భయాన్ని కల్పించుకో గలడు. మనిషి ఆ విధంగా కల్పించుకున్న భయాలు ఎన్నో! అన్నీ భయాలే. రేపటి సంగతి ఏమిటి? ఈ భయం కారణంగానే దాచుకోటాలు, దోచుకోటాలు మొదలైనవి.

ఆహార నిద్రాభయమైథునాలు సర్వజీవులకు సామాన్యమే. ప్రకృతి సిద్ధం. ఆహారం ప్రాణం నిలబడటానికి. శరీరం అనే యంత్రం పని చేయటానికి తగిన శక్తి నిచ్చే ఇంధనం ఆహారం. రక్షణ కోసం ప్రకృతి చేత సమకూర్చ బడింది భయం. తెలియకపోవటం వల్ల భయం కలుగుతుంది. భయపడటం వల్ల రక్షణ జరుగుతుంది. భయం లేకపోతే చీకటిగా ఉన్న చోటుకి అయినా నిస్సందేహంగా వెళ్ళటం జరుగుతుంది. ఎత్తు పల్లాలు తెలియక దెబ్బలు తగలటమో, గోతిలో పడటమో, ముళ్ళో రాళ్ళో కాలికి గుచ్చుకుని గాయాలు కావటమో, ఏ తేలో పామో ఉండి ప్రాణం మీదికి రావటమో జరిగే అవకాశం ఉంది. తెలియని వారెవరైనా ఉండి మీద పడితే ప్రాణ హాని కూడా జరగ వచ్చు. భయం ఇంకా తెలియని పసిపిల్లలు చీమలని, పాములని కూడా పట్టుకునే ప్రయత్నం చేయటం గమనించ వచ్చు. వెలుగుతున్న దీపాన్ని పట్టుకోటానికి చూస్తారు. ఒకసారి వేడి తగిలితే మరొకసారి భయపడతారు.

మానవులకు జంతువుల కన్న అధికంగా మెదడు, దానితో ఆలోచన, విచక్షణాజ్ఞానం కూడా ఇచ్చింది ప్రకృతి. దానిని ఉపయోగించుకుని మేలు పొందటానికి బదులు లేనిపోని భయాలు సృష్టించుకుని బాధ పడటం జరుగుతోంది. తన అభిప్రాయాలని ఇతరులు అంగీకరించరేమో! తన గురించి ఏమనుకుంటారో? అనుకున్నది జరగదేమో! అపజయాన్ని ఎదుర్కోవలసి వస్తుందేమో! ఇవన్నీ కల్పితాలే కాని, సహజసిద్ధం కావు కదా!

ఈ భయాల వల్ల రక్షణ కలగక పోగా దుఃఖం కలుగుతుంది. జంతువులకి భయం ఉంది కాని, దుఃఖం లేదు. అవి భయాలని తాముగా కల్పించుకో లేదు కదా! వాటి భయం వాటికి రక్షణ నిస్తుంది.

ఎదుటివారి భయాన్ని తమకు రక్షణగా చేసుకోగలిగిన తెలివితేటలు కూడా ఉన్నాయి మనిషికి. పొలాల్లో కాపలా ఉండేవారు కాని, అడవిలో సంచరించేవారు కాని, రాత్రిళ్ళు నెగళ్ల (మంటలు) వేసుకుంటారు. అడవి జంతువులు మంటలని చూసి భయపడి సమీపించవు అని.

మృత్యుభయం అన్నింటి కన్న పెద్దభయం. బుద్ధి జీవులైన మానవులకి మృత్యువు తప్పదని తెలుసు. తెలియని జంతువులే నయం. ప్రాణాల మీద ఆశని సునాయాసంగా వదులుకోగలవు. శరీరం కష్టపడుతుంటే దానిని వెంటనే వదిలేస్తాయి అని పశువైద్యులు చెప్పిన మాట. మానవులు స్పృహ లేక పోయినా బతికి ఉండాలని ప్రయత్నం చేస్తారు, కష్టపడతారు. జంతువులు మరణభయాన్ని జయించి నట్టు చెప్పుకోవచ్చును. మనిషి స్వయంకృతంగా తెచ్చి పెట్టుకున్న దుఃఖహేతువయిన భయాలు శారీరక, మానసిక అనారోగ్యాలకి కారణాలు అవుతాయి. అటువంటి భయాలని వదలాలి.

కొన్ని భయాలు ఉండాలి. ధర్మం తప్పుతానేమో, ఇతరులకి నా పనుల వల్ల బాధ కలుగుతుందేమో, కర్తవ్యనిర్వహణలో ఏమరుపాటు కలుగుతుందేమో .. వంటివి ఆరోగ్యకరమైన భయాలు.

భయం అన్నది ప్రమాదాలని కొని తెచ్చుకోకుండా కాపాడటానికి ప్రకృతి సర్వజీవులకు ప్రసాదించిన వరం. జంతువులకు భయం వర్తమాన కాలానికి మాత్రమే పరిమితమై ఉంటుంది తరచుగా. కాని, మనిషి మాత్రం భూత భవిష్యత్ కాలాలలోకి కూడా భయాన్ని విస్తరింప చేయ గలడు. జరిగిపోయిన దానిని తలుచుకుని, మళ్ళీ అట్లా అవుతుందేమోనని భయం. జరిగింది మంచి అయితే మళ్ళీ అట్లా జరగదేమోనని భయం. వృద్ధాప్యంలో పిల్లలు చూడరేమోనని భయం. వాళ్ళ చిన్నతనంలో సరిగా చదవరేమో, అందరిలో అవమానం పాలు అవాలేమో, వాళ్ళకి తగిన ఉద్యోగం వస్తుందో రాదో, సరైన సంబంధాలు కుదురుతాయో లేదో... ఇలా సాగుతూ ఉంటాయి. వాటికోసం తగిన ప్రయత్నం చేయాలి కాని భయపడితే ఏం ప్రయోజనం?

– డా. ఎన్. అనంత లక్ష్మి

వాగ్గేయకార వైభవం

తతః కిం? తతః కిం ?...



శంకరాచార్యులవారు గుర్వష్టకం అని ఒక అష్టకం చేసారు. విచిత్రం ఏమిటంటే ... దానిలో ప్రతి శ్లోకం చివర్లో.. ఒక ప్రశ్న వేసారు. ''శరీరం సురూపం తథా వా కళత్రం/యశశ్చారు చిత్రం ధనమ్ మేరు తుల్యం /మనశ్చేన లగ్నంగురోర ఘ్రిపద్మే/ తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్''... శరీరం సురూపం...చూస్తే మంచి అందమైన రూపం, తథావా కళత్రం.. ఆయన ఎంత అందగాడో భార్య అంత అందగత్తె. వాళ్ళిద్దరూ భార్యాభర్తలు. యశస్ చారు చిత్రం... ఆయన కీర్తి నలుదిక్కులా వ్యాపించింది. అపారమైన కీర్తి గడించాడు... అంటే అన్ని మంచి పనులు చేసాడు. ధనం మేరు తుల్యం... ఆయన దగ్గర సంపద మేరు పర్వతం అంత ఉంది. మనశ్చే న లగ్నం... కానీ గురువు గారి పాదపద్మములమీద మనసు నిలబడకపోతే... ఇన్ని ఉన్నా... తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్... ఏం ప్రయోజనం ? ఏం ప్రయోజనం ? ఏం ప్రయోజనం ?...అని.

''విదేశేషు మాన్యః స్వదేశేషు ధన్యః/సదాచారవృత్తేషు మత్తో చాన్యః/ మనశ్చేన లగ్నంగురోరఘ్రిపద్మే/ తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్''..విదేశాల్లో కీర్తి పొందాడు, స్వదేశంలో ధన్యుడు. ఇలా కనబడితే చాలు.. ఆయనకు చేతులెత్తి నమస్కారం చేస్తారు. అంత ధన్యజీవి... అయితేనేం? గురువుగారి మీద నమ్మకం కుదరనప్పుడు... అంటే సనాతన ధర్మంలో మనిషి తప్పకుండా పొంది తీరాల్సినది – గురు భక్తి. గురువుగారి పేరు వినబడగానే భయభక్తులతో ఆయన పేరు కూడా పలకకుండా అమ్మో ఆయన మా గురువుగారంటూ రెండు చేతులూ అప్రయత్నంగా జోడించి నమస్కరించగలిగిన స్థితి. ఆ భక్తి, ఆ ఆనంద బాష్పాలు ఎవరి కళ్ళల్లో కనబడతాయో వారి జన్మ ధన్యం. ఆ గురు భక్తి వారిని కాపాడుతుంది. దీనిని మనం వాగ్గేయకారులందరిలో గమనించవచ్చు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

గురువుగారు రోజూ నదీ స్నానం చేస్తున్నారు. తనూ వెడుతున్నాడు. ఎప్పుడయినా ..'' గురువు గారూ, రోజూ గంగానదికి వెళ్ళి స్నానం చేయడం ఎందుకండీ... మన ఇంట్లో నూతిలో వచ్చే నీళ్ళు కూడా ఆ గంగలో వేకదా! రోజూ అంత శ్రమపడి అక్కడిదాకా వెళ్ళడం ఎందుకండీ.. అది కూడా మార్గశిర మాసంలో, పుష్య మాసంలో గంగానదీ స్నానం చేయడం అంత తేలిక కాదు కదండీ..''అని ముత్తుస్వామి దీక్షితులు వారు వారి గురువుగారిని అడిగి ఉండ వచ్చు కదా!

కాదు.. ఒరేయ్! గంగకు ఒక గొప్పతనం ఉందిరా. అది మామూలు నీరు మాత్రమే కాదు. ప్రతి నదికి ఒక అధిష్ఠానదేవత ఉంటుంది. అలాగే గంగకు, గోదావరికి కూడా... ఆమె అనుగ్రహించ గలదు...అని గురువుగారు చెబుతారు... అసలు అలా చెప్పే అవసరం లేనంత నమ్మకం గురువుగారి మీద, ఆయన మాట మీద ఉండాలి.

బౌద్ధవాణి

పది రకాల శిక్షణలు



అది అవంతీరాజ్య పొలిమేర. విశాలమైన మైదానం. దాని చుట్టూ చిట్టడవి. ఆ మైదానానికి ఒక పక్కగా చిన్న నదీపాయ ప్రవహిస్తోంది. ఆ నది గట్టు మీద పెద్ద మర్రి చెట్టు. పెద్ద పెద్ద ఊడలు దిగి నలుమూలలకూ విస్తరించింది. ఒక శాఖ కింద చక్కటి పర్ణశాల. పర్ణశాల ముందు చిన్న అరుగు. దానిపై కూర్చుని మైదానం కేసి చూస్తూ ఉన్నాడు బుద్ధుడు. ఎన్నో రోజుల నుండి అక్కడే ఉంటున్నాడు. శిష్యులకు శిక్షణ ఇస్తూ నిరంతరం ధర్మాన్ని బోధిస్తూ ఉన్నాడు. ఆ మైదానంలో అవంతీ రాజ గుర్రాలకు శిక్షణ ఇస్తున్నారు.

వారి దగ్గర బలమైన, ఎత్తైన గాంధార అశ్వాలు ఉన్నాయి. నిరంతరాయంగా వాటి శిక్షణ కొనసాగుతూనే ఉంది.

బౌద్ధ భిక్షువుల జీవితం కూడా నిరంతర శిక్షణతోనే నడిచిపోతూ ఉంటుంది. భిక్షువులకు, భిక్షుణీలకు కొన్ని నియమాలు, నిబంధనలూ ఉంటాయి. వాటిని పాటిస్తూ, క్రమశిక్షణతో జీవించాలి వారు. నిరంతర అధ్యయనం, నిర్దిష్టమైన శిక్షణ వల్ల వారు మంచి జ్ఞానులుగా, గొప్ప భిక్షువులుగా రాణిస్తారు. అయితే కొందరు ఎంత శిక్షణ పొందినా దోషాలు చేసి వాటిని కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తారు.

మన చుట్టూ ఉన్న సమాజంలో దోషాలు ఎక్కువగా ఉండే శిక్షణా నియమాలు ఎక్కువ ఉంటాయి. అలా ఉన్నప్పటికీ తక్కువ మందికి మాత్రమే అంతిమ జ్ఞానం కలుగుతుంది.

ఈ విషయం మీదే ఆరోజు బుద్ధుడు వారితో మాట్లాడుతూ

''భిక్షువులారా! అదిగో అటు చూడండి. అశ్వ శిక్షకుడు ఒక్కో అశ్వానికి ఎలాంటి శిక్షణ ఇస్తున్నాడు? ముందుగా దాని నోటికి కళ్ళెం వేస్తున్నాడు. అంతకు ముందు కళ్ళెం అలవాటు లేకపోవడం వల్ల అది కుచించుకుపోతుంది. తలను అటూ ఇటూ కొట్టుకుంటుంది. కానీ... నిరంతరం దానికి కళ్ళెం వేయడం వల్ల నెమ్మదిగా అలవాటు పడుతుంది. శాంతిస్తుంది.

అది అలా శాంతించిన తర్వాత ఆ శిక్షకుడు దానిపై జీను వేస్తాడు. అంతకుముందు జీను అలవాటు లేకపోవడం వల్ల... మరలా మెలికలు తిరుగుతుంది. గెంతుతుంది. అశాంతిగా ఉంటుంది. నెమ్మదిగా దానికీ అలవాటు పడ్డాక శాంతిస్తుంది. ఆ తర్వాత దూకడం, వెనక్కు నడవడం, సకిలించడం, మెలితిరిగి శత్రువుల నుండి తప్పుకోవడం, వంగి తనపైనున్న రౌతుని రక్షించడం, వేగంగా పరుగు తీయడం, అతి మెల్లగా నడవడం, కవాతు తొక్కడం... ఇలా అనేక విద్యలు ఒకదాని తర్వాత మరొకటి నేర్పుతాడు.. ఇలా ఈ పది రకాలుగా శిక్షణ పొందిన అశ్వం రాజుకు తగినది అవుతుంది. అలాంటి అశ్వం రాజుకు విజయాన్ని తెచ్చిపెడుతుంది.''

''భిక్షువులారా! అలాగే మనం కూడా మన మనస్సుకు శిక్షణ ఇవ్వాలి. దాన్ని అదుపులో ఉంచాలి. సరైన మార్గంలో నడిపించాలి. దానికీ పదిరకాల శిక్షణలు ఉన్నాయి'' అన్నాడు.

''భగవాన్ శెలవియ్యండి'' అన్నారు భిక్షువులు. నది మీది నుండి గాలి తెమ్మెర వచ్చింది. కొమ్మలు ఊగాయి. గలగలలాడాయి. నది నీటిపైన రెండు బారుల్లో అర్ధ చంద్రాకారంగా ఎగురుతూ కొంగల గుంపు దక్షిణం వైపుకు సాగిపోతూ ఉంది.

''భిక్షువులారా! అష్టాంగాలలోని సరైన దృష్టి, సరైన సంకల్పం, సరైన వాక్కు, సరైన కర్మ, సరైన జీవనం, సరైన ప్రయత్నం, సరైన ఎరుక, సరైన సమాధి స్థితి– ఈ ఎనిమిదింటితో పాటు సరైన జ్ఞానం అలవర్చుకుంటే... సరైన చిత్త విముక్తి కల్గుతుంది. చిత్తం దోషరహితమవుతుంది. అలాంటి భిక్షువు మాత్రమే సత్కరించడానికి అర్హుడు. దక్షిణలు తీసుకోవడానికి తగినవాడు. నమస్కరించడానికి యోగ్యుడు. అలాంటి వాని చిత్తం మాత్రమే సాటిలేని పుణ్యక్షేత్రం'' అన్నాడు.

సాధనలో నిర్లక్ష్యం చేసేవారికి తమ తప్పు తెలిసింది. వారు సక్రమంగా సాధన చేసి అనతి కాలంలో పరిపూర్ణులయ్యారు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

బ్యాక్ టు హోమ్



● మహేశ్‌బాబు

మహేశ్‌బాబు జర్మనీ నుంచి హైదరాబాద్ తిరిగొచ్చారు. హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో ఓ భారీ బడ్జెట్ సినిమా అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమాను కేఎల్ నారాయణ నిర్మించనున్నారు. కాగా ఈ సినిమాకు సంబంధించిన ఫిట్‌నెస్ ట్రెనింగ్, ఓ వర్క్‌షాప్‌లో భాగంగా మహేశ్ బాబు ఇటీవల జర్మనీ వెళ్లవారు. ఈ ఫిట్‌నెస్ ట్రెనింగ్‌ను పూర్తి చేసుకుని తిరిగి హైదరాబాద్‌లోని స్వగృహానికి చేరుకున్నారాయన. కాగా ఈ సినిమాలో హీరో నాగార్జున ఓ కీలక పాత్రలో నటిస్తారనే ప్రచారం సాగుతోంది. వేసవిలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమయ్యేలా రాజమౌళి ప్లాన్ చేశారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. ఈ మూవీ గురించిన మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడికానున్నాయి.

మళ్లీ షురూ



● ప్రభాస్

ప్రభాస్ హీరోగా నటిస్తున్న సైంటిఫిక్ ఫ్యూచరిస్ట్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. దీపికా పదుకొనె హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దిశాపటానీ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. హీరోలు నాని, విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్ కీలక పాత్రల్లో కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. కాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ మేజర్ షెడ్యూల్ ఈ నెల రెండో వారంలో చిత్రీకరించేలా ప్లాన్ చేశారట నాగ్ అశ్విన్. ప్రభాస్, కమల్ హాసన్, అమితాబ్ బచ్చన్, దీపికా పదుకొనె.. ఇలా ఈ సినిమా ప్రధాన తారాగణమంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటారని సమాచారం. ఈ షెడ్యూల్‌తో ఈ సినిమా ప్రధాన భాగం చిత్రీకరణ పూర్తవుతుందని టాక్. వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వినీదత్ నిర్మిస్తున్న 'కల్కి 2898 ఏడీ' సినిమా మే 9న విడుదల కానుంది.



● టీజీ విశ్వప్రసాద్, అనుపమా పరమేశ్వరన్, రవితేజ, కావ్యా థాపర్, కార్తీక్ ఘట్టమనేని, వివేక్ కూచిభొట్ల

నేను కూడా సిద్ధం – రవితేజ

''పీపుల్ మీడియా ఫ్యాక్టరీ' బ్యానర్ నాకు హోమ్ ప్రొడక్షన్ లాంటిది. విశ్వ ప్రసాద్, వివేక్‌గార్లతో పనిచేయడం సౌకర్యంగా ఉంటుంది.. ఉన్నది ఉన్నట్టు మాట్లాడతారు.. అన్ని విషయాల్లోనూ చాలా స్పష్టంగా ఉంటారు.. అందుకే వారితో పనిచేయడం నాకు ఇష్టం. నాతో మరిన్ని సినిమాలు చేయాలని ఉందని విశ్వ ప్రసాద్‌గారు అంటున్నారు.. ఈ బ్యానర్‌లో ఎన్ని సినిమాలు చేయడానికైనా నేను కూడా సిద్ధం'' అని హీరో రవితేజ అన్నారు. ఆయన హీరోగా కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో రవితేజ మాట్లాడుతూ– ''ఈగల్' సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ప్రేక్షకుల స్పందన చూసేందుకు నేను కూడా వేచి చూస్తున్నా. ఈ సినిమాకి తన సంగీతంతో ఇరగదీశాడు డేవ్ జాంద్. బాలనటుడు ధ్రువన్ పాత్ర బాగుంటుంది.. పిల్లలందరూ తన పాత్రకి బాగా కనెక్ట్ అవుతారు. 'ఈగల్' కథని నడిపించేది అనుపమ పాత్రే. కావ్యది లవ్లీ క్యారెక్టర్. కార్తీక్ ఘట్టమనేని ఈ చిత్రాన్ని ఎంతో క్లారిటీతో తీశాడు. ఈ సినిమా విజయం సాధించి, తనకు చాలా మంచి పేరు రావాలి. నాకు నేను విపరీతంగా నచ్చిన పాత్ర 'ఈగల్'.. ఈ పాత్ర కోసం చాలా మేకోవర్ అయ్యాను. ఈ చిత్రం రిలీజ్ కోసం వేచి చూస్తున్నా'' అన్నారు. కార్తీక్ ఘట్టమనేని మాట్లాడుతూ–''ఈగల్' కి దాదాపు 200 మంది సాంకేతిక నిపుణులు పనిచేశారు. ఇంతమందితో పనిచేసే అవకాశం నాకు ఇచ్చిన రవితేజ సర్‌కి థ్యాంక్స్. ఈ సినిమా ప్రేక్షకులకు మంచి థియేటర్ అనుభూతిని ఇస్తుంది'' అన్నారు. ''మా సంస్థలో వరుసగా మూడు సినిమాలు చేస్తున్న రవితేజగారికి థ్యాంక్స్. ఆయనతో మరిన్ని సినిమాలు చేయాలనుంది. 'ఈగల్'ని అందరూ ఎంజాయ్ చేస్తారు'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. ''మళ్లీ మళ్లీ రవితేజగారితో పనిచేయాలని కోరుకుంటున్నాను'' అన్నారు అనుపమా పరమేశ్వరన్. ''రవితేజగారు వెర్సటైల్ యాక్టర్. 'ఈగల్' హాలీవుడ్ మూవీలా అద్భుతంగా ఉంటుంది. కానీ, తెలుగు నేటివిటీ ఎక్కడా మిస్ అవదు'' అన్నారు చిత్ర సహ నిర్మాత వివేక్ కూచిభొట్ల.

గోవాలో మాఫియా



● ధనుష్

ధనుష్ హీరోగా దర్శకుడు శేఖర్‌కమ్ముల దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ముంబై నేపథ్యంతో మాఫియా యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో నాగార్జున ఓ లీడ్ రోల్ చేస్తున్నారు. ఇందులో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ తిరుపతిలో ప్రారంభమైంది. కాగా ఈ చిత్రం నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణ గోవాలో జరగనున్నట్లు తెలిసింది. దాదాపు రెండు వారాలపాటు సాగే ఈ షెడ్యూల్‌లో ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లోని సన్నివేశాలను చిత్రీకరిస్తారట దర్శకులు శేఖర్ కమ్ముల. ఈ షెడ్యూల్‌లోనే రష్మికా మందన్నా కూడా జాయిన్ అవుతారట. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.



● శ్రుతీహాసన్

లారెన్స్‌తో జోడీ?

హీరో లారెన్స్‌కి జోడీగా హీరోయిన్ శ్రుతీహాసన్ నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. 'రైడ్, వీర, రాక్షసుడు, ఖిలాడి' వంటి పలు చిత్రాలతో తెలుగులో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు దర్శకుడు రమేష్ వర్మ. ఆయన దర్శకత్వంలో రాఘవ లారెన్స్ హీరోగా ఓ ప్రాజెక్ట్ ఓకే అయిన సంగతి తెలిసిందే. స్టూడియో గ్రీన్ బ్యానర్‌పై జ్ఞానవేల్ రాజా తెలుగు, తమిళ భాషల్లో ఈ మూవీ నిర్మించనున్నారు. ఈ చిత్రానికి 'శ్రీరామరక్ష' అనే టైటిల్‌ను అనుకుంటున్నారట. కాగా ఈ మూవీలో ఇద్దరు కథానాయికలకు చోటు ఉందట. అందులో ఒక హీరోయిన్‌గా ఇప్పటికే నయనతార పేరు వినిపించింది.. మరో కథానాయికగా శ్రుతీహాసన్ నటిస్తారనే వార్తలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఇదిలా ఉంటే ఈ మూవీలో లారెన్స్‌కి జోడీగా 'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్ నటించనున్నారంటూ గత ఏడాది వార్తలు వచ్చినా, ఆ తర్వాత ఎలాంటి ప్రకటన లేదు. తాజాగా నయనతార, శ్రుతీహాసన్ పేర్లు వినిపిస్తున్నాయి. ఈ నెలలోనే ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన రానుందని టాక్. దాదాపు 150 కోట్ల బడ్జెట్‌తో హారర్ నేపథ్యంలో ఈ సినిమా రూపొందనుందని భోగట్టా.

నాకు పదవీకాంక్ష లేదు – వి.సముద్ర



● ప్యానల్ సభ్యులతో వి.సముద్ర

''ఈ ఏడాది జరగనున్న 'తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్' ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి నేను పోటీ చేస్తున్నా. నాకు ఎలాంటి పదవీకాంక్ష లేదు.. అందరికీ సేవ చేయాలనే మంచి ఆలోచనతో పోటీ చేస్తున్నాను'' అని డైరెక్టర్ వి.సముద్ర అన్నారు. 'తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్ 2024' ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో తన ప్యానల్ సభ్యులతో కలిసి మేనిఫెస్టోని ప్రకటించారు వి.సముద్ర. అనంతరం ఆయన మాట్లాడుతూ–''ఈ ఎన్నికల్లో మా ప్యానల్‌ని, అధ్యక్షునిగా నన్ను గెలిపిస్తే మేనిఫెస్టోలోని హామీలను కచ్చితంగా అమలు చేస్తాం'' అన్నారు. ''సముద్ర ప్యానల్ నుంచి జనరల్ సెక్రటరీగా పోటీ చేస్తున్నాను'' అన్నారు డైరెక్టర్ మద్దినేని రమేష్. ఈ సమావేశంలో దర్శకులు మధుసూదన్ రెడ్డి, కస్తూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిజమైన ప్రేమికుడు



● గౌరీప్రియ, మణికందన్

మణికందన్, శ్రీ గౌరీప్రియ, కన్న రవి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ట్రూ లవర్'. ప్రభురామ్ వ్యాస్ దర్శకత్వం వహించారు. డైరెక్టర్ మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ సమర్పణలో నజేరత్ పసీలియన్, మగేష్ రాజ్ పసీలియన్, యువరాజ్ గణేషన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం ట్రైలర్ విడుదల వేడుకలో మారుతి మాట్లాడుతూ–''ఒక జంట మధ్య ఏర్పడిన పరిస్థితుల వల్ల ఒక ప్రేమికుడు తన ప్రేమను కాపాడుకునేందుకు ఏం చేశాడు? అనేది ఈ సినిమా కథ. ప్రభాస్‌గారి అభిమానులు ఆశించిన దానికంటే గొప్పగానే 'రాజా సాబ్' ఉంటుందని మాట ఇస్తున్నా'' అన్నారు. ఎస్‌కేఎన్ మాట్లాడుతూ–''మేము నిర్మించిన 'బేబి' సినిమా చూసినప్పుడు ఎలాంటి అనుభూతి కలిగిందో ఈ 'ట్రూ లవర్' సినిమాలోని కొన్ని సన్నివేశాలు చూస్తున్నప్పుడు అలాంటి ఎగ్జైట్‌మెంట్ వచ్చింది' అన్నారు. ''ట్రూ లవర్' సినిమా యువతకు మాత్రమే కాదు.. కుటుంబ ప్రేక్షకులకు కూడా నచ్చేలా ఉంటుంది'' అన్నారు మణికందన్.

అయ్యో పాపం!



● సుధీర్, దివ్యభారతి

''సండేలాంటి లైఫు.. మండేలా మండుతోంది. ఈ గుండెల్లోన బీటు.. చావు డప్పై మోగుతోంది..'' అంటూ మొదలవుతుంది 'జీ.ఓ.ఏ.టీ' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) సినిమాలోని 'అయ్యో పాపం సారూ..' పాట. 'సుడిగాలి' సుధీర్, దివ్యభారతి జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి 'పాగల్' ఫేమ్ నరేష్ కుప్పిలి దర్శకత్వం వహిస్తున్నారు. చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ సినిమా చిత్రీకరణలో సుధీర్, దివ్యభారతిలపై కీలక సన్నివేశాలను తీస్తున్నారు. ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా చిత్రీకరిస్తారు. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా 'అయ్యో పాపం సారూ.. ఎట్టా బుక్కయ్యారు.. లారీ గుద్దిన ఆటోలా డెబ్బైపోయారు..' అనే పాటని రిలీజ్ చేశారు. ఈ పాటకి లియోన్ జేమ్స్ సంగీతం అందించగా, సురేష్ బనిశెట్టి సాహిత్యం అందించారు. సీన్ రోల్డాన్ పాడారు. ''ఈ సినిమా సుధీర్ కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలుస్తుంది'' అన్నారు నిర్మాత చంద్రశేఖర్ రెడ్డి.



మెయిన్ 'డ్రా'కు రష్మిక అర్హత

ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ-125 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడి పాటి శ్రీవల్లి రష్మిక మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. ముంబైలో ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ క్వాలిఫయింగ్ రెండో రౌండ్‌లో ప్రపంచ 521వ ర్యాంకర్ రష్మిక 6-3, 3-6, 6-3తో ప్రపంచ 482వ ర్యాంకర్ విక్టోరియా మొర్వా యోవా (స్లొవేకియా)పై విజయం సాధించింది. 2 గంటల 28 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఆరు ఏస్‌లు సంధించింది.



ఆసీస్‌ను గెలిపించిన సీన్ అబాట్

వెస్టిండీస్‌తో సిడ్నీలో ఆదివారం జరిగిన రెండో వన్డేలో ఆస్ట్రేలియా 83 పరుగుల తేడాతో గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సీన్ అబాట్ (63 బంతుల్లో 69; 1 ఫోర్, 4 సిక్స్‌లు; 3 వికెట్లు, 2 క్యాచ్‌లు) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆసీస్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ముందుగా ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 9 వికెట్లకు 258 పరుగులు సాధించగా... వెస్టిండీస్ 43.3 ఓవర్లలో 175 పరుగులకే ఆలౌటై ఓడిపోయింది.

గెలుపు తలుపు తట్టేదెవరు!


డకెట్ క్యాచ్ అందుకుంటున్న భరత్

రసపట్టులో రెండో టెస్టు • ఇంగ్లండ్ విజయ లక్ష్యం 399 • ప్రస్తుతం 67/1
• భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 255 ఆలౌట్ • శుబ్‌మన్ గిల్ సెంచరీ

విశాఖ స్పోర్ట్స్: నేడో రేపో ఫలితం గ్యారంటీ! ఎలాంటి 'డ్రా' మలుపులు లేకుండా ఈ టెస్టును బౌలర్లు నడిపిస్తున్నారు. నాలుగో రోజు కూడా బౌలింగ్ కుదిరితే భారత్ గెలుపు తలుపు తట్టడం ఖాయమవుతుంది. అలాగని టెస్టుల్లో ఇంగ్లండ్ 'బజ్‌బాల్' ఆటతీరును తక్కువ అంచనా వేస్తే మాత్రం హైదరాబాద్‌లో ఎదురైన చేదు ఫలితం తప్పదు. ఈ ప్రమాదం నుంచి బయట పడాలంటే ఇంగ్లండ్ స్పిన్ మ్యాజిక్‌తో ఎలాగైతే భారత రెండో ఇన్నింగ్స్‌ను బోల్తా కొట్టించిందో... మన స్పిన్నర్లు అదే మాయాజాలంతో దెబ్బకుదెబ్బ తీయాల్సిందే! వికెట్ల వేట భారత్‌ను గెలిపిస్తుందా... లేదంటే ఇంగ్లండ్ పరుగుల బాట లక్ష్యానికి చేరుస్తుందా అనేది నాలుగో రోజే తేలుతుంది.

రెండు రోజుల ఆతిథ్య జట్టు ఆధిపత్యానికి ఎట్టకేలకు మూడో రోజు బ్రేక్ పడింది. భారత రెండో ఇన్నింగ్స్‌ను ఇంగ్లండ్ బౌలర్లు సమష్టిగా దెబ్బ తీశారు. చేతిలో 10 వికెట్లున్న టీమిండియా మరో భారీ స్కోరు చేస్తుందనుకుంటే పర్యాటక బౌలర్లు సమర్థంగా కట్టడి చేశారు. ఇంగ్లండ్ స్పిన్ సవాలుకు ఎదురు నిలిచిన ఒకే ఒక్కడు శుబ్‌మన్ గిల్ (147 బంతుల్లో 104; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకం సాధించడంతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 78.3 ఓవర్లలో 255 పరుగుల వద్ద ఆలౌటైంది. మిగతా వారిలో అక్షర్ పటేల్ (84 బంతుల్లో 45; 6 ఫోర్లు) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేశాడు. ఏమాత్రం అనుభవం లేని స్పిన్‌త్రయం టామ్ హార్ట్‌లీ (4/77), రేహన్ అహ్మద్ (3/88), షోయబ్ బషీర్ (1/58) భారత్‌ను ఇబ్బందుల్లో పడేయడం ఇక్కడ పెద్ద విశేషం. వెటరన్ సీమర్ అండర్సన్ 2 వికెట్లు తీశాడు. అయితే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 143 కలుపుకొని ప్రత్యర్థి ముందు టీమిండియా 399 పరుగుల కఠిన లక్ష్యాన్ని నిర్దేశించింది. తర్వాత రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ ఆట నిలిచే సమయానికి 14 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 67 పరుగులు చేసింది. అశ్విన్ బౌలింగ్‌లో 'లోకల్ బాయ్' కేఎస్ భరత్ అద్భుతమైన డైవింగ్ క్యాచ్‌తో డకెట్ (28; 6 ఫోర్లు) పెవిలియన్ చేరగా... క్రాలీ (29 బ్యాటింగ్; 3 ఫోర్లు, 1 సిక్స్), రేహన్ (9 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. ఇంగ్లండ్ విజయానికి 332 పరుగుల దూరంలో ఉంది.

శుబ్‌మన్ పోరాటం

ఓవర్‌నైట్ స్కోరు 28/0తో ఆదివారం ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన టీమిండియా రెండు పరుగుల వ్యవధిలోనే ఓపెనర్లిద్దరినీ కోల్పోయింది. పేసర్ అండర్సన్ ఈ రెండు వికెట్లు తీశాడు. అండర్సన్ వేసిన అద్భుత బంతికి రోహిత్ శర్మ (13; 3 ఫోర్లు) బౌల్డ్ అవ్వగా... యశస్వి (17; 3 ఫోర్లు) రూట్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కష్టాలతో మొదలైన రెండో ఇన్నింగ్స్‌ను శుబ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ (29; 2 ఫోర్లు) కాసేపు ఆదుకున్నారు. జట్టు స్కోరు వంద దాటాక అయ్యర్, రజత్ పటిదార్ (9) స్పిన్ ఉచ్చులో పడ్డారు. కుదురుగా ఆడుతున్న గిల్ అర్ధ సెంచరీ పూర్తిచేసుకోగా 130/4 స్కోరు వద్ద తొలి సెషన్ ముగిసింది. రెండో సెషన్‌లో శుబ్‌మన్, అక్షర్ పటేల్ భాగస్వామ్యం ఊరటనిచ్చింది. ఇద్దరు కలిసి ఐదో వికెట్‌కు 89 పరుగులు జోడించారు. జట్టు స్కోరు 200 దాటగా... శుబ్‌మన్ శతకాన్ని సాధించాడు. చక్కగా సాగిపోతున్న ఈ జోడీని బషీర్... గిల్ వికెట్ తీసి విడగొట్టాడు. కాసేపటికే అక్షర్‌ను హార్ట్‌లీ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. టీ విరామానికి 227/6 స్కోరుతో ఉన్న భారత్ ఆఖరి సెషన్‌లో స్పిన్‌కు దాసోహమైంది. అనూహ్యంగా 14.3 ఓవర్లలోనే మిగిలున్న 4 వికెట్లను కోల్పోయి కష్టంగా 28 పరుగులు మాత్రమే చేసింది. సొంతగడ్డపై రెండో ఇన్నింగ్స్‌లోనూ భరత్ (6) నిరాశపరిచాడు. కుల్దీప్ (0), బుమ్రా (0) ఖాతా తెరువకపోయినా... అశ్విన్ (29; 2 ఫోర్లు, 1 సిక్స్) వల్లే భారత్ 250 పైచిలుకు స్కోరు చేయగలిగింది.


గిల్ సెంచరీ అభివాదం

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 396; **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** 253; **భారత్ రెండో ఇన్నింగ్స్:** యశస్వి (సి) రూట్ (బి) అండర్సన్ 17; రోహిత్ (బి) అండర్సన్ 13; గిల్ (సి) ఫోక్స్ (బి) బషీర్ 104; అయ్యర్ (సి) స్టోక్స్ (బి) హార్ట్‌లీ 29; పటిదార్ (సి) ఫోక్స్ (బి) రేహన్ 9; అక్షర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హార్ట్‌లీ 45; భరత్ (సి) స్టోక్స్ (బి) రేహన్ 6; అశ్విన్ (సి) ఫోక్స్ (బి) రేహన్ 29; కుల్దీప్ (సి) డకెట్ (బి) హార్ట్‌లీ 0; బుమ్రా (సి) బెయిర్‌స్టో (బి) హార్ట్‌లీ 0; ముకేశ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (78.3 ఓవర్లలో ఆలౌట్) 255. వికెట్ల పతనం:** 1-29, 2-30, 3-111, 4-122, 5-211, 6-220, 7-228, 8-229, 9-255, 10-255. **బౌలింగ్:** అండర్సన్ 10-1-29-2, బషీర్ 15-0-58-1, రేహన్ 24.3-5-88-3, రూట్ 2-1-1-0, హార్ట్‌లీ 27-3-77-4. **ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** క్రాలీ (బ్యాటింగ్) 29; డకెట్ (సి) భరత్ (బి) అశ్విన్ 28; రేహన్ (బ్యాటింగ్) 9; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (14 ఓవర్లలో వికెట్ నష్టానికి) 67. వికెట్ల పతనం:** 1-50. **బౌలింగ్:** బుమ్రా 5-1-9-0, ముకేశ్ 2-0-19-0, కుల్దీప్ 4-0-21-0, అశ్విన్ 2-0-8-1, అక్షర్ 1-0-10-0.

వైజాగ్‌లో మంచి శకునములే

గతంలో వైజాగ్‌లో ఆడిన రెండు టెస్టుల్లోనూ భారత జట్టే గెలిచింది. ఈ రెండు సందర్భాల్లోనూ లక్ష్యాన్ని నిర్దేశించిన టీమిండియా ప్రత్యర్థిని ఆలౌట్ చేసి భారీ విజయాలు నమోదు చేసింది. 2016లో ఇంగ్లండ్‌పై 246 పరుగుల తేడాతో... 2019లో దక్షిణాఫ్రికాపై 203 పరుగుల తేడాతో భారత్ ఘనవిజయం సాధించింది.

హైదరాబాద్ 'టాప్'

మిజోరం జట్టుపై ఘనవిజయం


తనయ్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్‌లో హైదరాబాద్ జట్టు ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ ఇన్నింగ్స్ విజయాలు సాధించి 35 పాయింట్లతో టాపర్‌గా నిలిచింది. ఆరు జట్లున్న ప్లేట్ డివిజన్‌లో భాగంగా మిజోరం జట్టుతో ఉప్పల్ స్టేడియంలో జరిగిన చివరి మ్యాచ్‌లో హైదరాబాద్ ఇన్నింగ్స్ 73 పరుగుల తేడాతో ఘనవిజయం అందుకుంది. ఆట మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 458/8తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 9 వికెట్లకు 465 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. అనంతరం 266 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన మిజోరం 43.1 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ 74 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. ఈనెల 9 నుంచి జరిగే సెమీఫైనల్స్‌లో నాగాలాండ్‌తో హైదరాబాద్; మేఘాలయతో మిజోరం ఆడతాయి. ఫైనల్ చేరిన రెండు జట్లు వచ్చే ఏడాది రంజీ ట్రోఫీ సీజన్‌లో ఎలైట్ డివిజన్‌లో ఆడతాయి.

గెలుపు ముంగిట ఆంధ్ర

నితీశ్ కుమార్ సెంచరీ



పట్నా: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ ఎలైట్ డివిజన్‌లో భాగంగా బిహార్ జట్టుతో జరుగుతున్న గ్రూప్ 'బి' మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు విజయానికి రెండు వికెట్ల దూరంలో నిలిచింది. 352 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బిహార్ ఆట ముగిసే సమయానికి 8 వికెట్లు కోల్పోయి 111 పరుగులు చేసింది. ఆంధ్ర బౌలర్లలో లలిత్ మోహన్ 4 వికెట్లు, శశికాంత్ 3 వికెట్లు తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 313/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు 119.2 ఓవర్లలో 463 పరుగులకు ఆలౌటై 352 పరుగుల ఆధిక్యం సంపాదించింది. నితీశ్ కుమార్ రెడ్డి (159; 16 ఫోర్లు, 5 సిక్స్‌లు) అద్భుత సెంచరీ సాధించాడు.

భారత్‌కు మరో ఓటమి

భువనేశ్వర్: మహిళల ప్రొ లీగ్ హాకీ టోర్నీలో భారత జట్టు మరో ఓటమి చవిచూసింది. నెదర్లాండ్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 1-3తో ఓడింది. భారత్ తరఫున నవనీత్ కౌర్ ఏకైక గోల్ చేసింది. నెదర్లాండ్స్ తరఫున యిబ్బీ జాన్సెన్ రెండు గోల్స్, ఫేవాన్‌డెర్ ఒక గోల్ సాధించారు.

వరల్డ్ గ్రూప్-1లో భారత్

పాకిస్తాన్‌పై 4-0తో విజయం



ఇస్లామాబాద్: లాంఛనం పూర్తి చేసిన భారత పురుషుల టెన్నిస్ జట్టు డేవిస్‌కప్ టోర్నీలో మళ్లీ వరల్డ్ గ్రూప్-1లో చోటు సంపాదించింది. పాకిస్తాన్‌తో ఆదివారం ముగిసిన వరల్డ్ గ్రూప్-1 ప్లే ఆఫ్ పోటీలో భారత్ 4-0తో విజయం సాధించింది. తొలి రోజు 2-0తో ఆధిక్యంలో నిలిచిన భారత్ రెండో రోజు రెండు మ్యాచ్‌ల్లో గెలిచింది. పురుషుల డబుల్స్‌లో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ ద్వయం 6-2, 7-6 (7/5)తో అకీల్ ఖాన్-ముజమ్మిల్ జంటను ఓడించడంతో భారత్‌కు 3-0తో విజయం ఖరారైంది. నామమాత్రమైన నాలుగో మ్యాచ్‌లో నికీ పునాచా 6-3, 6-4తో షోయబ్ మొహమ్మద్‌పై గెలవడంతో భారత్ ఆధిక్యం 4-0కు చేరింది. అప్పటికే ఫలితం తేలిపోవడంతో ఐదో మ్యాచ్‌ను నిర్వహించలేదు.

రచిన్, విలియమ్సన్ సెంచరీలు



మౌంట్ మాంగనుయ్: దక్షిణాఫ్రికాతో ఆదివారం మొదలైన తొలి టెస్టులో న్యూజిలాండ్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 86 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 258 పరుగులు సాధించింది. కేన్ విలియమ్సన్ (112 బ్యాటింగ్; 15 ఫోర్లు), రచిన్ రవీంద్ర (118 బ్యాటింగ్; 13 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీలు చేశారు.

రన్నరప్ సుమీత్-సిక్కి జోడీ



టెహ్రాన్: ఫజర్ ఓపెన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తెలంగాణకు చెందిన సుమీత్ రెడ్డి-సిక్కి రెడ్డి జోడీ రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్లో సుమీత్-సిక్కి రెడ్డి ద్వయం 20-22, 14-21తో భారత్‌కే చెందిన సతీశ్-ఆద్యా జోడీ చేతిలో ఓడిపోయింది.

భవిత

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఎన్‌సీఎల్‌లో ట్రైనీ సూపర్‌వైజర్

ప్రభుత్వరంగ సంస్థ.. నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎన్‌సీఎల్) ఉద్యోగ ప్రకటన విడుదల చేసింది. దీని ద్వారా 150 ట్రైనీ సూపర్‌వైజరీ పోస్టులకు భర్తీ చేయనుంది. రాత పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

పోస్టులు- అర్హతలు

- అసిస్టెంట్ ఫోర్‌మ్యాన్ (ఈ అండ్ టీ) ట్రైనీ (గ్రేడ్-సి)-9 పోస్టులు. **అర్హత:** మూడేళ్ల మెట్రిక్యులేషన్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ డిప్లొమా పాసవ్వాలి.
- అసిస్టెంట్ ఫోర్‌మ్యాన్ (మెకానికల్) ట్రైనీ (గ్రేడ్-సి)-59. **అర్హత:** మెట్రిక్యులేషన్, మూడేళ్ల మెకానికల్ ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేయాలి.
- అసిస్టెంట్ ఫోర్‌మ్యాన్ (ఎలక్ట్రికల్) ట్రైనీ (గ్రేడ్-సి)-82. **అర్హత:** మెట్రిక్యులేషన్, మూడేళ్ల ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత ఉండాలి.
- డిగ్రీ /పీజీ /డిప్లొమాలను దూరవిద్య /పార్ట్ టైమ్ ద్వారా పూర్తిచేసినవారు దరఖాస్తు చేయడానికి అనర్హులు.
- **వయసు:** 18-30 ఏళ్లు ఉండాలి. గరిష్ఠ వయోపరిమితిలో ఎస్సీ/ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీలకు, ఎక్స్-సర్వీస్‌మెన్‌కు 3 ఏళ్లు, పీడబ్ల్యూబీడీలకు 10-15 ఏళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం

ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహించే రాత పరీక్ష, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. పోస్టులను అనుసరించి పరీక్షలను వేర్వేరుగా నిర్వహిస్తారు.

రాత పరీక్ష ఇలా

- ఈ పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. రెండు సెక్షన్‌లుగా ప్రశ్నపత్రం ఇస్తారు. పరీక్ష సమయం 90 నిమిషాలు.
- **సెక్షన్-ఎ:** ఈ విభాగంలో టెక్నికల్ పరిజ్ఞానానికి సంబంధించిన 70ప్రశ్నలుంటాయి.
- **సెక్షన్-బి:** ఇందులో జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్, వెర్బల్ అండ్ మెంటల్ ఎబిలిటీ అండ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లకు సంబంధించిన 30 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి సరైన సమాధానానికి 1 మార్కు ఉంటుంది.రుణాత్మక మార్కులు లేవు.
- ప్రశ్నపత్రం ఇంగ్లిష్,హిందీ భాషల్లో ఉంటుంది.

అర్హత మార్కులు

జాబ్స్ ఇన్ఫో

అన్‌రిజర్వ్‌డ్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు కంప్యూటర్ ఆధారిత రాత పరీక్షలో 50 మార్కులు, ఎస్సీ/ఎస్టీ/ఈఎస్ఎం/ఓబీసీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులు 40శాతం కనీస అర్హత మార్కులుగా సాధించాల్సి ఉంటుంది.

ప్రిపరేషన్ ఇలా

- సెక్షన్-ఎ నుంచి 70 ప్రశ్నలకు పరీక్ష ఉంటుంది. ఈ ప్రశ్నలన్నీ కూడా సంబంధిత సబ్జెక్టు అంశాల నుంచే ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు ఆయా సబ్జెక్టులను రివిజన్ చేసుకోవాలి.
- సెక్షన్-బికి సంబంధించి జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్, వెర్బల్ మెంటల్ ఎబిలిటీ అండ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ కోసం వివిధ రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన గత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయాలి.
- పరీక్ష సన్నద్ధతలో భాగంగా వీలైనన్నీ ఎక్కువ మాక్‌టెస్టులు,ప్రాక్టీస్ టెస్టులు రాయాలి.దీనివల్ల ఏయే అంశాల్లో వెనకబడి ఉన్నారో తెలుస్తుంది.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 05.02.2024
- **వెబ్‌సైట్:** www.nclcil.in

విద్య, ఉద్యోగ సమాచారం

డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో బీఈడీ ఓడీఎల్ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఈడీ ఓడీఎల్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** కనీసం 50శాతం మార్కులతో బీఏ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీబీఏ, బీబీఎం, బీఈ, బీటెక్ ఉత్తీర్ణతతోపాటు ప్రాథమిక విద్యలో శిక్షణ పొందిన ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులై ఉండాలి. లేదా ప్రాథమిక విద్యలో టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ పూర్తిచేసి ఉండాలి.
» **కోర్సు వ్యవధి:** రెండేళ్లు. బోధనా మాధ్యమం: తెలుగు.
» **వయసు:** అభ్యర్థి 01.07.2023 నాటికి 21 ఏళ్లు పూర్తిచేసి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి లేదు.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** 21.02.2024
» **రూ.500 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది:** 26.02.2024.
» **ప్రవేశ పరీక్ష తేదీ:** 05.03.2024.
» **వెబ్‌సైట్:** www.braou.ac.in

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ కొలువులు

» 223 పోస్టుల భర్తీకి ఎన్‌టీపీసీ నోటిఫికేషన్
» ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాల్లో ఉద్యోగాలు
» ఎంపికైతే నెలకు రూ.55 వేల వేతనం

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్.. ఎన్‌టీపీసీ! మహారత్న హోదా కలిగిన ప్రభుత్వ రంగ సంస్థ. ఈ పీఎస్‌యూ కంపెనీ ఆపరేషన్స్ విభాగంలో.. 223 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. స్క్రీనింగ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ ఆధారంగా నియామకాలు ఖరారు చేయనుంది. ఎంపికైతే ప్రారంభం నుంచే ఆకర్షణీయ వేతనాలు అందుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో.. ఎన్‌టీపీసీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల వివరాలు, ఎంపిక విధానం తదితర వివరాలు..



నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ) దేశంలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థగా గుర్తింపు పొందింది. మహారత్న పీఎస్‌యూ హోదాను సైతం సొంతం చేసుకుంది. దేశవ్యాప్తంగా పలు ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పిన ఎన్‌టీపీసీ.. వాటిలో అవసరమైన మానవ వనరుల నియామకానికి నోటిఫికేషన్లు ఇస్తోంది. సాధారణంగా గేట్ స్కోర్ ఆధారంగా ఎంట్రీ లెవల్‌లో ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగాలను భర్తీ చేస్తుంది. తాజాగా ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

మొత్తం 223 పోస్టులు

ఎన్‌టీపీసీ తాజా నోటిఫికేషన్ ద్వారా ఆపరేషన్స్ విభాగంలో 223 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్(ఆపరేషన్స్) పోస్టులను భర్తీ చేయనుంది. ఓపెన్ కేటగిరీలో 98 పోస్టులు; ఈడబ్ల్యూఎస్‌లో 22; ఓబీసీ కేటగిరీలో 40; ఎస్సీ అభ్యర్థులకు 39; ఎస్టీ కేటగిరీలో 24 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- ఎలక్ట్రికల్/మెకానికల్ బ్రాంచ్‌లతో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి. బీటెక్ తర్వాత ఏదైనా పవర్ ప్లాంట్‌లో కనీసం ఏడాది పని అనుభవం తప్పనిసరి.
- **వయసు:** 2024, ఫిబ్రవరి 8 నాటికి 35 ఏళ్లకు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఐదేళ్లు, ఓబీసీ వర్గాలకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

పని అనుభవం తప్పనిసరి

ఎన్‌టీపీసీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ (ఆపరేషన్స్) పోస్టులకు పని అనుభవం తప్పనిసరి. 100 మెగావాట్లు అంతకంటే ఎక్కువ ఉత్పత్తి సామర్థ్యం ఉన్న పవర్ ప్లాంట్‌లలో.. ఆపరేషన్ లేదా మెయింటనెన్స్ విభాగాల్లో కనీసం ఏడాది పని అనుభవం పొంది ఉండాలని స్పష్టం చేశారు.

మూడేళ్ల వ్యవధి

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్స్(ఆపరేషన్స్) పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఎన్‌టీపీసీ తొలుత మూడేళ్ల కాల వ్యవధికి నియామకాలు ఖరారు చేస్తుంది. ఆ తర్వాత మరో రెండేళ్లు పొడిగించే అవకాశం ఉంది. అంటే.. ఈ పోస్టులకు ఎంపికైన వారు గరిష్ఠంగా అయిదేళ్లపాటు ఎన్‌టీపీసీలో పని చేసే వీలుంది.

రూ.55 వేల వేతనం

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ (ఆపరేషన్స్) పోస్టులకు ఎంపికైన వారికి నెలకు రూ.55 వేల వేతనం లభిస్తుంది. దీంతోపాటు ఇంటి అద్దె భత్యం, నైట్ షిఫ్ట్ అలవెన్స్, ఉద్యోగికి, అతని కుటుంబానికి వైద్య సదుపాయాలను సైతం అందిస్తారు.

విధులు ఇవే

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ (ఆపరేషన్స్) పోస్టులలో నియమితులైన వారు.. ఎన్‌టీపీసీకి చెందిన పవర్ స్టేషన్స్, ప్రాజెక్ట్‌లలో.. మెయింటనెన్స్, ఆపరేషన్స్ విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ప్లాంట్ ఆపరేషన్స్ పర్యవేక్షణ, నియంత్రణ; భద్రత, నాణ్యత ప్రక్రియలను నిర్వహించడం, సమస్యలను పరిష్కరించడం, ప్లాంట్ రికార్డ్స్, రిపోర్ట్స్ నిర్వహణ వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

స్క్రీనింగ్ టెస్ట్ ఇలా

నోటిఫికేషన్‌లో మెరిట్ ప్రాతిపదికన నియామకాలు ఖరారు చేస్తామని పేర్కొంటూనే.. తప్పనిసరి అయితే స్క్రీనింగ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలను సైతం నిర్వహిస్తామని ఎన్‌టీపీసీ పేర్కొంది. స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించడానికే ఎక్కువ అవకాశం ఉంటుంది. ఈ స్క్రీనింగ్ టెస్ట్‌లో రెండు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. టెక్నికల్ సబ్జెక్ట్ విభాగం నుంచి 120 ప్రశ్నలు; ఆప్టిట్యూడ్ టెస్ట్ విభాగం నుంచి 30 ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 150 మార్కులకు ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుంది. పరీక్షకు లభించే వ్యవధి 2 గంటలు.

పర్సనల్ ఇంటర్వ్యూ

ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్‌లో పొందిన మార్కుల ఆధారంగా.. కటాఫ్ నిబంధనల మేరకు మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో చోటు సాధించిన వారికి మలిదశలో పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూ 50 మార్కులకు ఉంటుంది. ఇందులో అభ్యర్థుల పని అనుభవం, అకడమిక్ నేపథ్యం, సబ్జెక్ట్ నాలెడ్జ్ వంటి అంశాలను పరిశీలిస్తారు.

వెయిటేజీ విధానం

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్(ఆపరేషన్స్) పోస్టులకు అభ్యర్థులను ఖరారు చేసే క్రమంలో.. వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తారు. రాత పరీక్షలో పొందిన మార్కులకు 85 శాతం; పర్సనల్ ఇంటర్వ్యూ మార్కులకు 15 శాతం వెయిటేజీ ఇచ్చి.. దానికి అనుగుణంగా అభ్యర్థులు పొందిన మార్కులతో తుది జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు.

స్క్రీనింగ్ టెస్ట్‌లో రాణించేలా

ఎన్‌టీపీసీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల గత నోటిఫికేషన్లను పరిశీలిస్తే.. స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించడం అనివార్యంగా మారుతోంది. కాబట్టి అభ్యర్థులు దరఖాస్తు దశ నుంచే స్క్రీనింగ్ టెస్ట్‌ను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. సబ్జెక్ట్ వారీగా దృష్టి సారించాల్సిన అంశాలు..

- **మెకానికల్ ఇంజనీరింగ్:** ఈ విభాగంలో థర్మల్ ఇంజనీరింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ మెకానిక్స్ అండ్ స్ట్రెంగ్త్ ఆఫ్ మెటీరియల్స్, మెషీన్ డిజైన్, ఇంజనీరింగ్ మెటీరియల్స్, హైడ్రాలిక్స్ అండ్ హైడ్రాలిక్స్ మెషినరీ, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్:** బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ బ్యాటరీస్, ఎలక్ట్రికల్ సర్క్యూట్స్, డీసీ మెషీన్స్, మెజరింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఏసీ మెషీన్స్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, పవర్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్ అండ్ ఎస్టిమేషన్, యుటిలైజేషన్ అండ్ ట్రాక్షన్, పవర్ ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించిన అన్ని అంశాలపై పరిపూర్ణ అవగాహన పొందాలి.
- **ఆప్టిట్యూడ్ టెస్ట్:** ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు సంబంధించి జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, వొకాబ్యులరీలపై పట్టు సాధించాలి.
- జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించి సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- డేటా ఇంటర్‌ప్రిటేషన్‌కు సంబంధించి గ్రాఫ్స్, డేటా అనాలిసిస్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి.
- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో బేసిక్ మ్యాథమెటిక్స్ తోపాటు,అర్థమెటిక్ అంశాలపై పట్టు సాధించాలి.
- జనరల్ ఇంగ్లిష్, వొకాబ్యులరీలో రాణించేందుకు బేసిక్ గ్రామర్ అంశాలు, రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

అన్వయ దృక్పథం

స్క్రీనింగ్ టెస్ట్‌కు అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ప్రిపరేషన్ సాగించాలి. ముఖ్యంగా.. టెక్నికల్ సబ్జెక్ట్ విషయంలో అభ్యర్థులు తమ బ్రాంచ్‌కు సంబంధించిన సబ్జెక్ట్‌లకు బీటెక్ స్థాయి పుస్తకాల ఆధారంగా ప్రిపరేషన్ సాగించాలి. మోడల్ పేపర్లు, మాక్ టెస్ట్‌లు రాయడం కూడా పరీక్షలో మెరుగైన ప్రతిభ చూపేందుకు దోహదం చేస్తుంది. ప్రిపరేషన్‌ను అప్లికేషన్ అప్రోచ్‌తో సాగిస్తే.. ప్రాక్టికల్ థింకింగ్ అలవడి, ప్రశ్నను ఎలా అడిగినా సమాధానం ఇవ్వగలిగే నేర్పు లభిస్తుంది. అదే విధంగా ఎన్‌టీపీసీ నిర్వహించిన గత పరీక్షల ప్రశ్న పత్రాలను సాల్వ్ చేయడం, వాటిని మూల్యాంకన చేసుకోవడం పరీక్షలో విజయానికి దోహదం చేస్తుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** ఫిబ్రవరి 8, 2024
- **కాల్ లెటర్స్:** మార్చి రెండు లేదా మూడో వారంలో
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** careers.ntpc.co.in, www.ntpc.co.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	440	72,086
నిఫ్టీ ▲	156	21,854

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	15,629	▲ 267
డోజోన్స్	38,654	▲ 135
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,616	▽ 7
డాక్స్	16,918	▲ 59
హాంగ్‌సెంగ్	2,730	▽ 41
నికాయ్	36,158	▲ 110


అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎఫెక్ట్	82.52	83.54
£	బ్రిటన్ పౌండ్	ఎఫెక్ట్	104.56	107.13
€	యూరో	ఎఫెక్ట్	89.12	91.48
¥	జపాన్ ఎన్ (100)	ఎఫెక్ట్	56.10	57.38
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎఫెక్ట్	53.74	55.71
S$	సింగపూర్ డాలర్	ఎఫెక్ట్	63.01	64.26
SAR	సౌదీ రియాల్	క్యాష్	21.16	22.78
UAE D	యూఏఈ దిర్హామ్	క్యాష్	21.68	23.47
¥	చైనా యువాన్	క్యాష్	10.43	12.50

యులిప్.. లోతుగా తెలుసుకున్నాకే!

- వీటిలో చార్జీల బాదుడు ఎక్కువే • ఎండోమెంట్ ప్లాన్ల కంటే అధిక రాబడి
- ఈక్విటీలతో పోలిస్తే ప్రతిఫలంలో వెనుకే • ప్రీమియంతో పోలిస్తే పరిమిత బీమా రక్షణ
- ప్రీమియం, రాబడిపైనా పన్ను ప్రయోజనాలు • మెరుగైన ప్రత్యామ్నాయాలు వేరే ఉన్నాయ్



ఆర్యన్ (60) క్రమం తప్పకుండా ఆదాయం కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) చేద్దామని బ్యాంక్‌కు వెళ్లాడు. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి (ఎఫ్‌డీ), దానిపై ప్రతి నెలా వడ్డీ రాబడి తీసుకోవాలన్నది ఆయన ప్రణాళిక. కానీ, బ్యాంక్ ఉద్యోగి చేసిన పనికి అతడు నష్టపోవాల్సి వచ్చింది. అనుకున్నది ఒకటి అయింది మరొకటి. ఎఫ్‌డీ పేరు చెప్పి బ్యాంక్ ఉద్యోగి ఆర్యన్‌తో యులిప్ పథకంపై సంతకం చేయించాడు. ఆ తర్వాతే అది ఎఫ్‌డీ కాదని అతడికి తెలిసొచ్చింది. దీంతో క్రమం తప్పకుండా ఆదాయం పొందాలన్న అతడి ప్రణాళిక దారితప్పింది. ఇలా తప్పుదోవ పట్టించి బీమా పాలసీలు, పెట్టుబడి పథకాలను అంటగట్టే ప్రయత్నాలు సహజంగానే కనిపిస్తూనే ఉంటాయి. యస్ బ్యాంక్ కేసులోనూ ఇదే చోటు చేసుకుంది. ఏటీ–1 (అడిషనల్ టైర్) బాండ్లను ఎఫ్‌డీ పేరు చెప్పి లక్షలాది మంది నుండి పెట్టుబడులు సమీకరించింది. యస్ బ్యాంక్ సంక్షోభంలో పడినప్పుడు ఏటీ–1 బాండ్లను రైటాఫ్ చేసేశారు. అంటే పెట్టుబడి పెట్టిన వారికి రూపాయి ఇవ్వలేదు. ఎఫ్‌డీల్లో అధిక రాబడి ఇస్తుందని చెప్పారే కానీ, ఏటీ–1 బాండ్లలో ఉండే రిస్క్ గురించి చెప్పలేదు. మన దేశంలో పెట్టుబడి సాధనాలను మార్కెట్ చేసే వారు కేవలం రాబడులు, ఆకర్షణీయమైన ఫీచర్ల గురించే చెబుతుంటారు. ఆయా సాధనాల్లోని రిస్క్ ల గురించి తెలుసుకోవడం ఇన్వెస్ట్ చేసే వారి బాధ్యత అని గుర్తించాలి.



బీమా పాలసీలను తప్పుడు సమాచారంతో విక్రయించే ధోరణులు ఎక్కువగా కనిపిస్తుంటాయి. అందులో యులిప్‌లు కూడా ఒకటి. ''ఇవి ఏజెంట్లకు ఎక్కువ కమీషన్‌ను అందిస్తాయి. దీంతో పాలసీ తీసుకునే వారికి గరిష్ట ప్రయోజనం కల్పించడానికి బదులు, ఏజెంట్‌కు ఎక్కువ ప్రయోజనం కలిగించే ఉత్పత్తి విక్రయానికి దారితీస్తుంది'' అని ఆనంద్‌రాతి వెల్త్ ప్రొడక్ట్ అండ్ రీసెర్చ్ హెడ్ చేతన్ షెనాయ్ వివరించారు. ఎండోమెంట్ బీమా ప్లాన్లలో కమీషన్ మొదటి ఏడాది 10–35 శాతం మేర ఏజెంట్లకు అందుతుంది. యులిప్ ప్లాన్ల ప్రీమియంలో 10 శాతం ఏజెంట్ కమీషన్‌గా వెళుతుంది. అదే మ్యూచువల్ ఫండ్స్‌లో ఎక్స్‌పెన్స్ రేషియో కేవలం 0.3–1.5 శాతం మధ్యే ఎక్కువ పథకాల్లో ఉంటుంది. మ్యూచువల్ ఫండ్స్ మాదిరే పనిచేస్తాయంటూ యులిప్‌లను మార్కెట్ చేస్తుంటారు ఏజెంట్లు. కానీ, పూర్తిగా తెలుసుకోకుండా అంగీకారం తెలపకపోవడమే మంచిది.

యులిప్‌లు - మ్యూచువల్ ఫండ్స్



యులిప్‌లు, మ్యూచువల్ ఫండ్స్ ఒక్కటి కావు. వీటి మధ్య సారూప్యత కొంత అయితే, వైరుధ్యాలు బోలెడు. యులిప్‌లు అంటే యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు. అంటే పెట్టుబడులతో ముడిపడిన బీమా పథకాలు. చెల్లించే ప్రీమియంలో కొంత బీమా కవరేజీకి పోను, మిగిలిన మొత్తాన్ని తీసుకెళ్లి ఈక్విటీ, డెట్ సాధనాల్లో (ఇన్వెస్టర్ ఎంపిక మేరకు) పెట్టుబడిగా పెడతారు. కనుక ఇందులో రిస్క్‌లు, రాబడుల గురించి స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి. బీమా కంపెనీల ఫండ్ మేనేజర్లు యులిప్ పాలసీలకు సంబంధించిన పెట్టుబడులను మార్కెట్ లింక్డ్ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేస్తుంటారు. యులిప్‌ల ప్లాన్లను మ్యూచువల్ ఫండ్ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్‌వో)గా కొందరు మార్కెట్ చేస్తుంటారు. నెట్ అసెట్ వేల్యూ (ఎన్ఏవీ)ని చూపిస్తుంటారు. యులిప్‌లను మ్యూచువల్ ఫండ్స్‌కు ప్రత్యామ్నాయం అంటూ విక్రయిస్తుంటారు. దీంతో మ్యూచువల్ ఫండ్స్ మాదిరే రాబడులు వస్తాయని కొనుగోలు చేసే వారూ ఉన్నారు. కానీ వాస్తవంలో మెరుగ్గా పనిచేసే యులిప్‌ల రాబడులను గమనించినప్పుడు.. మ్యూచువల్ ఫండ్స్ కంటే తక్కువే ఉండడాన్ని చూడొచ్చు. దీనికి కారణం యులిప్‌లలో పలు రకాల చార్జీల పేరుతో పాలసీదారుల నుంచి బీమా సంస్థలు ఎక్కువ రాబట్టుకునే చర్యలు అమలు చేస్తుంటాయి.

సంక్లిష్టత.. పారదర్శకత

లిక్విడిటీ (కొనుగోలు, విక్రయాలకు కావాల్సినంత డిమాండ్), చార్జీలు అనేవి యులిప్‌లు, ఫండ్స్‌లో పూర్తిగా భిన్నం. యులిప్‌లు ఐదేళ్ల లాకిన్ పీరియడ్‌తో వస్తాయి. ఫండ్స్ పెట్టుబడులను కోరుకున్నప్పుడు ఉపసంహరించుకోవచ్చు. యులిప్‌లలో విధించే చార్జీలు ఎక్కువగా ఉంటాయి. ''మ్యూచువల్ ఫండ్స్‌లో ఎక్స్‌పెన్స్ రేషియో సాధారణంగా అయితే 0.5–1.5 శాతం మధ్య ఉంటుంది. అదే యులిప్‌లలో 20 ఏళ్ల కాలానికి లోడింగ్ 60 శాతంగా ఉంటుంది. అంటే ఏటా 3 శాతం చార్జీల రూపంలో కోల్పోవాల్సి వస్తుంది'' అని ఇన్వెస్ట్ ఆజ్ ఫర్ కల్ అనే ఫైనాన్షియల్ అడ్వైజరీ సంస్థ వ్యవస్థాపకుడు అనంత్ లోధా తెలిపారు. చార్జీల పరంగా సంక్లిష్టత ఇందులో కనిపిస్తుంది. ప్రీమియం అలోకేషన్ చార్జీలు, మోర్టాలిటీ చార్జీలు, ఫండ్ మేనేజ్‌మెంట్ చార్జీలు, పాలసీ అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు, ఫండ్ స్విచింగ్ (ఫండ్‌ను మార్చుకున్నప్పుడు) చార్జీలు, పాక్షిక ఉపసంహరణ చార్జీలు, ప్రీమియం రీడైరెక్షన్ చార్జీలు, ప్రీమియం నిలిపివేత చార్జీలు.. ఇన్నేసి చార్జీలు మరే పెట్టుబడి సాధనంలో కనిపించవు. యులిప్ ప్లాన్లను తీసుకున్న వారిలోనూ చాలా మందికి ఈ చార్జీల గురించి తెలియదు. ఫండ్ మేనేజ్‌మెంట్ చార్జీల గురించే ఎక్కువ మందికి తెలుసు. ఎందుకంటే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడుల నిర్వహణకు గాను ఎక్స్‌పెన్స్ రేషియో విధిస్తుంటారు. దీన్నే ఫండ్ మేనేజ్‌మెంట్ చార్జీగానూ భావించొచ్చు. యులిప్ ప్లాన్లలో దీర్ఘకాలంలో రాబడులు 7–9 శాతం మధ్య ఉంటాయి. కానీ, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాలంలో వార్షిక రాబడిని 12 శాతానికి పైనే ఆశించొచ్చు.

రాబడులపై గ్యారంటీ లేదు



మ్యూచువల్ ఫండ్స్ మాదిరే యులిప్‌లు సైతం రాబడికి హామీ ఇవ్వవు. వీటిల్లో పెట్టుబడులు మార్కెట్ రిస్క్‌లపై ఆధారపడి ఉంటాయి. కాకపోతే దీర్ఘకాలంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ కంటే మెరుగైన రాబడి యులిప్‌లలో ఉంటుందని భావించొచ్చు. ఎందుకంటే ఇవి పెట్టుబడులను తీసుకెళ్లి ఈక్విటీల్లో పెడుతుంటాయి. దీర్ఘకాలంలో ఈక్విటీలు మెరుగైన రాబడులు ఇస్తాయని చారిత్రక గణాంకాలు చెబుతున్నాయి. కనుక అన్ని రకాల చార్జీల పేరుతో బాదిన తర్వాత కూడా ఎఫ్‌డీ కంటే కొంచెం ఎక్కువ రాబడి యులిప్‌లలో ఉంటుంది. పైగా ఎఫ్‌డీ రాబడిపై పన్ను ఉంటుంది. యులిప్ మెచ్యూరిటీ మొత్తంపై పన్ను మినహాయింపు పొందొచ్చు. అందుకే బీమా ఏజెంట్లు ఎఫ్‌డీల కంటే మెరుగైనవిగా మార్కెట్ చేస్తుంటారు. యులిప్ పెట్టుబడులను సైతం మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు డెట్, ఈక్విటీ మధ్య మార్చుకునే స్వేచ్ఛ ఉంటుంది. మ్యూచువల్ ఫండ్స్‌లో డైనమిక్ అస్సెట్ అలోకేషన్ ఫండ్స్ కూడా ఇదే పనిచేస్తుంటాయి. పన్ను పరిధిలో ఉన్న వారికి యులిప్‌లు అనుకూలమేనని చెప్పుకోవాలి. ఎందుకంటే వీటిల్లో పెట్టుబడులు, రాబడులపైనా పన్ను ప్రయోజనాలు ఉండడమే. 'బెనిఫిట్ ఇలస్ట్రేషన్' (ఎంత రావచ్చన్న అంచనాలు)లో రాబడిని 4–8 శాతం మించి చూపించకూడదు. యులిప్‌లలోనూ కన్జర్వేటివ్, బ్యాలన్స్‌డ్, అగ్రెస్సివ్ ఫండ్స్ ఉంటాయి. వీటిల్లో రాబడి, రిస్క్ వేర్వేరు. ఏ ఫండ్ ఎంపిక చేసుకుంటున్నారన్నదాని ఆధారంగానే రాబడులు ఆధారపడి ఉంటాయి. అగ్రెసివ్ ఫండ్‌తో దీర్ఘకాలంలో రాబడి అధికంగా ఉంటుంది. రిస్క్ కూడా ఎక్కువగా ఉంటుంది.

ఆకర్షణలు కాదు.. అవసరాలు

కుటుంబ పెద్దకు అనుకోనిది ఏదైనా జరిగితే కుటుంబాన్ని ఆదుకుంటుందనే మార్కెటింగ్ ప్రచారం కూడా యులిప్ ప్లాన్ల విషయంలో కనిపిస్తుంది. కానీ, ఇందులో వాస్తవం పాళ్లు కొంతే. ఎందుకంటే యులిప్ ప్లాన్లలో బీమా రక్షణ తగినంత ఉండదు. అచ్చమైన కవరేజీ కోసం అనువైనది టర్మ్ ఇన్సూరెన్స్. అలాగే, యులిప్‌లో చెల్లించే ప్రీమియం సెక్షన్ 80సీ కింద మినహాయింపు పరిధిలోకి వస్తుందని, మెచ్యూరిటీ మొత్తంపైనా పన్ను ఉండదని కూడా చెబుతారు. కానీ, 2021 ఫిబ్రవరి 1 తర్వాత కొనుగోలు చేసిన యులిప్ ప్లాన్లకు సంబంధించి అందుకునే మెచ్యూరిటీపై పన్ను ఉండకూడదని కోరుకుంటే, ప్రీమియం రూ.2.5 లక్షలు మించకూడదు. మరీ ముఖ్యంగా యులిప్ ప్లాన్ల విషయంలో వృద్ధులను ఏజెంట్లు లక్ష్యంగా చేసుకోవడాన్ని గమనించొచ్చు. ఎందుకంటే వారికి వీటిపై తగినంత అవగాహన లేకపోవడమే. సింగిల్ ప్రీమియం పాలసీలు, గ్యారంటీడ్ ఇన్‌కమ్ (హామీతో కూడిన రాబడి) పాలసీల గురించి వృద్ధులు అడుగుతుంటారని, అవి వారి అవసరాలకు అనుకూలమైనవి కావని నిపుణుల సూచన. అలాగే, యులిప్ ప్లాన్లలో పెట్టుబడికి ఐదేళ్ల పాటు లాకిన్‌లో ఉంటుంది. దీన్ని కూడా వృద్ధులు గమనించాలి. సీనియర్ సిటిజన్లలో ఎక్కువ మందికి వారు చెల్లించే ప్రీమియానికి పది రెట్ల బీమా కవరేజీ ఇతర ప్లాన్లలో రాకపోవడం ఆకర్షణకు ఒక కారణం.



మార్గమేంటి..?

అది యులిప్ అయినా, ఎండోమెంట్ ప్లాన్ అయినా సరే బీమాను, పెట్టుబడిని కలపకూడదన్నది ప్రాథమిక సూత్రం. అచ్చమైన బీమా రక్షణ కోరుకుంటే అందుకు టర్మ్ ఇన్సూరెన్స్ మెరుగైన సాధనం. పెట్టుబడి కోసం ఈక్విటీ, డెట్ సాధనాల్లో ఎన్నో ఉన్నాయి. అటు బీమా, ఇటు పెట్టుబడిపై గరిష్ట ప్రయోజనాన్ని పొందాలంటే వీటిని విడివిడిగానే తీసుకోవాలి. పన్ను ఆదా కోరుకునేట్టు అయితే, టర్మ్ ఇన్సూరెన్స్ కోసం చెల్లించే ప్రీమియంపై సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు కోరుకోవచ్చు. టర్మ్ ప్లాన్లలో గడువు ముగిసే వరకు జీవించి ఉంటే ఎలాంటి ప్రయోజనం అందదు. ఇక పెట్టుబడులపై పన్ను ఆదా కోరుకునే వారు ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. వీటిలో చేసే పెట్టుబడిని సెక్షన్ 80సీ కింద చూపించి పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇందులో దీర్ఘకాలంలో సగటు రాబడి 15 శాతానికి పైనే ఉంది. అయితే ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సిన అంశం.. ఈఎల్ఎస్ఎస్ నుంచి వచ్చే రాబడిపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది. యులిప్‌లో అయితే మెచ్యూరిటీపైనా పన్ను మినహాయింపు ప్రయోజనం లభిస్తుంది. కానీ, ఈఎల్ఎస్ఎస్‌లో అది లేదు. కాకపోతే యులిప్‌తో పోలిస్తే ఈక్విటీ ఫండ్స్ రాబడులు ఎంతో మెరుగ్గా ఉంటాయి. దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్షకు మించిన మొత్తంపై 10 శాతం పన్ను చెల్లించిన తర్వాత కూడా నికర రాబడి, యులిప్‌లలో కంటే ఈఎల్ఎస్ఎస్ ప్లాన్లలో ఎక్కువే ఉంటుందని గణాంకాలు చెబుతున్నాయి. డెట్‌లో పీపీఎఫ్ సాధనంలో మెచ్యూరిటీ మొత్తంపై పన్ను ఉండదు. ఇంత చెప్పినా, యులిప్ ప్లాన్ తీసుకోవడానికే మొగ్గు చూపేవారు.. బ్యాంకుల నుంచి కాకుండా నేరుగా బీమా సంస్థల నుంచి తీసుకోవడం వల్ల సరైన మార్గనిర్దేశం లభిస్తుందనేది నిపుణుల సూచన.



2024-25 ఐటీఆర్‌ల నోటిఫై

న్యూఢిల్లీ: ఆదాయపన్ను శాఖ 2024–25 అసెస్‌మెంట్ సంవత్సరానికి సంబంధించి దాఖలు చేయాల్సిన రిటర్నుల పత్రాలు.. ఐటీఆర్ 2, 3, 5ను నోటిఫై చేసింది. ఇవి ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని సీబీడీటీ ప్రకటించింది. పన్ను చెల్లింపుదారులు సులభంగా రిటర్నులు దాఖలు చేసేందుకు వీలుగా రిటర్నుల పత్రాల్లో మార్పులు చేశారు. రూ.50 లక్షల వరకు ఆదాయం కలిగిన వ్యక్తులు ఐటీఆర్–1 దాఖలు చేయాల్సి ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-2-2024	
విశాఖ	555–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	538–00
విజయవాడ	538–00
4-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	535–00
వరంగల్	537–00

ఎస్‌బీఐ లాభం 35% డౌన్

క్యూ3లో రూ.9,164 కోట్లు • వేతనాలు, పెన్షన్ ఏరియర్ల ఎఫెక్ట్



ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (2023–24, క్యూ3)లో రూ. 9,164 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.14,205 కోట్లతో పోలిస్తే లాభం 35 శాతం తగ్గింది. ప్రధానంగా వేతనాలు, పెన్షన్ల కోసం వన్ టైమ్ ప్రొవిజనింగ్ బ్యాంక్ లాభదాయకతకు గండి కొట్టింది. ఉద్యోగ సంఘాలతో కుదుర్చుకున్న 17% వేతన సెటిల్‌మెంట్ కారణంగా వేతనాలు, పెన్షన్ల కోసం అదనపు వన్‌టైమ్ ప్రొవిజనింగ్‌ను చేయాల్సి వచ్చిందని, ఇది గనుక లేకపోతే నికర లాభం రూ.16,264 కోట్లుగా ఉండేదని ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా పేర్కొన్నారు. ప్రస్తుత లాభదాయకత ప్రకారం, రూ.40,000 కోట్లను సులభంగా సమీకరించగమని ఖారా చెప్పారు. అవి లేకుండా కూడా అదనంగా రూ.7.5 లక్షల కోట్ల రుణాలిచ్చే లిక్విడిటీ బఫర్ ఉందని ఆయన వివరించారు.

మొండి బకాయిలు దిగొచ్చాయ్...

క్యూ3లో స్థూల మొండి బకాయిలు 72 బేసిస్ పాయింట్లు దిగొచ్చి 2.42 శాతానికి (రూ.86,749 కోట్లు) తగ్గాయి. / క నికర మొండి బకాయిలు కూడా 13 బేసిస్ పాయింట్లు తగ్గి 0.64 శాతానికి (రూ.22,408 కోట్లు) చేరాయి. ఇది పదేళ్ల కనిష్ట స్థాయి అని ఖారా పేర్కొన్నారు. కాగా, బ్యాంక్ నికర వడ్డీ మార్జిన్ 1 శాతం తగ్గి 3.28 శాతానికి పరిమితమైంది. మొత్తం రుణాలు 14.38 శాతం ఎగబాకి రూ.35.84 లక్షల కోట్లకు చేరగా, మొత్తం డిపాజిట్లు 13.02 శాతం పెరిగి రూ. 47.62 లక్షల కోట్లకు ఎగిశాయి.

పేటీఎం కస్టమర్లకు స్వాగతం...

మార్చి 1 నుండి పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ కార్యకలాపాలను దాదాపు నిలిపేయాలంటూ ఆర్‌బీఐ ఆదేశించిన నేపథ్యంలో, పేటీఎం కస్టమర్లకు (ఎక్కువ మంది వ్యాపారులే) సాయపడేందుకు ఎస్‌బీఐ సిద్ధంగా ఉందని చైర్మన్ ఖారా చెప్పారు.

• బ్రాండ్ గార్డియన్‌షిప్ ఇండెక్స్..

ముకేశ్ అంబానీ టాప్



న్యూఢిల్లీ: పారిశ్రామిక దిగ్గజం ముకేశ్ అంబానీకి బ్రాండ్ గార్డియన్‌షిప్ ఇండెక్స్‌లో వరుసగా రెండో ఏడాది ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నారు. బ్రాండ్ గార్డియన్‌షిప్ ఇండెక్స్ 2024 వివరాలు విడుదలయ్యాయి. మైక్రోసాఫ్ట్ సత్య నాదెళ్ల, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, యాపిల్ టిమ్ కుక్, టెస్లా ఎలాన్ మస్క్‌ను ముకేశ్ అంబానీ వెనక్కి నెట్టేశారు. టెన్సెంట్ హువాతెంగ్‌మా తర్వాతి స్థానంలో ఉన్నారు. ఇదే సూచీలో టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖర్ గతేడాది ఉన్న 8వ స్థానం నుంచి ఈ ఏడాది 5వ స్థానంలోకి వచ్చేశారు. మహీంద్రా అండ్ మహీంద్రా గ్రూప్ సీఈవో అనీష్ షా 6వ స్థానం, ఇన్ఫోసిస్ సీఈవో సలీల్ పరేఖ్ 16వ స్థానంలో నిలిచారు. 2023 ర్యాంకుల్లోనూ ముకేశ్ అంబానీ అంతర్జాతీయంగా రెండో స్థానంలో ఉండడం గమనార్హం. డైవర్సిఫైడ్ దిగ్గజ కంపెనీల పరంగా చూస్తే అంతర్జాతీయంగా 2024 సంవత్సరానికి ముకేశ్ అంబానీ మొదటి స్థానంలోఉన్నారు.

ఎల్‌అండ్‌టీ	ప్రభుదాస్ లీలాధర్	కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 3,381
టార్గెట్: రూ. 4,071
ఎందుకంటే: 2023–24 ఆర్థిక సంవత్సరంలో గత కాంట్రాక్టుల ప్రభావం లాభదాయకతపై పడటం, అలాగే 2024–25 ఆర్థిక సంవత్సరం (ఎఫ్‌వై) నుండి ఆర్డర్ బుక్, టెండర్ అవకాశాలు పటిష్టంగా ఉంటాయన్న అంశాలను పరిగణనలోకి తీసుకొని, మా ఎఫ్‌వై24/25/26 ఈపీఎస్ వృద్ధి అంచనాలను వరుసగా –7.6%/+5%/+8% మేర సవరిస్తున్నాం. ఈ ఏడాది ఇప్పటిదాకా పటిష్టమైన ఆర్డర్లతో పాటు భవిష్యత్తులో వచ్చే ఆర్డర్లపై బలమైన అంచనాల నేపథ్యంలో కంపెనీ యాజమాన్యం 2023–24 ఆర్డర్లు/ఆదాయ వృద్ధి అంచనాలను సవరించింది. మెరుగైన దేశీ మౌలిక ప్రాజెక్టులు, హైడ్రోకార్బన్లు అలాగే మౌలికసదుపాయాలపై (సౌదీ విజన్ 2030 దన్నుతో) జీసీసీ పెట్టుబడులు పెరగడం వల్ల అవకాశాలు దండిగా కనబడుతున్నాయి. తక్కువ మార్జిన్ గల పాత కాంట్రాక్టులతో పాటు గాడిలో పెట్టాల్సిన కొత్త ప్రాజెక్టుల అమలును పరిగణనలోకి తీసుకొని ప్రధాన మార్జిన్ గైడెన్స్‌ను కూడా యాజమాన్యం 8.5–9% నుండి 8.25–8.5 శాతానికి తగ్గించింది. పటిష్టమైన టెండర్ అవకాశాలు, హైడ్రోకార్బన్లలో గణనీయమైన కార్యకలాపాలు, సౌదీ అరేబియా వంటి అంతర్జాతీయ మార్కెట్ల నుండి పునరుత్పాదక ఇంధన రంగంలో ఆర్డర్లు, దేశీయంగా ప్రైవేటు పెట్టుబడులు పుంజుకోవచ్చన్న అంచనాలతో దీర్ఘకాలంలో ఎల్‌అండ్‌టీకి భారీగా ప్రయోజనం చేకూరనుంది.


పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ	ఎమ్‌కే గ్లోబల్	కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 270
టార్గెట్: రూ. 300
ఎందుకంటే: పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ ఎబిటా 2023–24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో (13% వృద్ధి చెంది, రూ.1320 కోట్లుగా నమోదైంది. అంచనాలను మించిన స్పాట్ మార్జిన్లు దీనికి దన్నుగా నిలిచాయి. దహేజ్/కోచి టెర్మినల్ సామర్థ్య వినియోగం అంచనాల కంటే కాస్త అధికంగా 97%/22%గా ఉంది. క్యూ3లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ.1,191 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. సర్దుబాటు చేసిన ఎబిటా క్రితం ఏడాదితో ఇదే కాలంతో పోలిస్తే 15%, గత త్రైమాసికంతో పోలిస్తే 5% చొప్పున వృద్ధి చెందింది. అమ్మకాలు కొద్దిగా పుంజుకోనున్న నేపథ్యంలో 2024–25 ఆర్థిక సంవత్సరం లాభాల అంచనాలను 1–4 శాతం మేర పెంచుతున్నాం. ఖతార్ గ్యాస్ త్వరలో రెన్యూవల్ ప్రకటన చేయనున్న నేపథ్యంలో 2027–28 ఆర్థిక సంవత్సరం తర్వాత కాలానికి సంబంధించి వార్షిక టారిఫ్‌ను 2–3 శాతం మేర సవరించే అవకాశం ఉంది. ఈ సానుకూలతల కారణంగా 2024 డిసెంబర్ నాటికి షేరు టార్గెట్ ధరను రూ.300గా నిర్ణయించాం.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

రిటైర్మెంట్ ఫండ్‌కు మెరుగైన మార్గం..?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

Q & A

నా వయసు 35 ఏళ్లు? 55 ఏళ్లకే రిటైర్ అవుదామని అనుకుంటున్నాను. ఆ సమయానికి రిటైర్మెంట్ ఫండ్‌ను సిద్ధం చేసుకోవడం ఎలా? – కీర్తిలాల్

మీ రిటైర్మెంట్‌కు ఇంకా 20 ఏళ్ల వ్యవధి మిగిలి ఉంది. 55 లేదా 60 ఏళ్లకు రిటైర్ అవుదామని అనుకుంటే పెట్టుబడులకు ఇంకా 20–25 ఏళ్ల వ్యవధి మిగిలి ఉంటుంది. ఈక్విటీలో పెట్టుబడులు మంచి ప్రతిఫలాన్ని ఇవ్వడానికి ఈ సమయం చాలు. మీరు ఏ వయసులో రిటైర్ అయినా.. ఈక్విటీ పెట్టుబడులకు రిటైర్మెంట్ లేదని గుర్తు పెట్టుకోవాలి. ఈక్విటీల్లో ఉన్న పెట్టుబడులు అన్నింటినీ వెనక్కి తీసుకుని డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం సరైన విధానం కాదు. రిటైర్మెంట్ తర్వాత కూడా కొంత మొత్తాన్ని ఈక్విటీల్లో కొనసాగించాలి. అప్పటి వరకు సమకూర్చుకున్న ఈక్విటీ పోర్ట్‌ఫోలియో నుంచి మీకు సగటు రాబడి వచ్చినా విశ్రాంత జీవనాన్ని సాఫీగా సాగించొచ్చు. ఇప్పటికైనా మించిపోయింది లేదు కనుక ఈక్విటీల్లో పెట్టుబడులు ప్రారంభించండి. ఒకటి రెండు ఫ్లెక్సీక్యాప్ (ఫోకస్డ్) ఫండ్స్‌ను ఎంపిక చేసుకుని ఇన్వెస్ట్ చేసుకోవాలి. ఆ తర్వాత పెట్టుబడులను క్రమంగా (ఏటా) పెంచుకునే ప్రయత్నం చేయండి. అప్పుడు కాంపౌండింగ్ ప్రయోజనం కనిపిస్తుంది. ఇప్పటి నుంచి వీలైనంత అధిక మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టాలని గుర్తుంచుకోవాలి. తగినంత ఇన్వెస్ట్ చేయనప్పుడు మీ అవసరాలకు సరిపడా నిధి ఎలా మారుతుంది? కనుక ఇప్పటి నుంచి వీలైనంత మేర దూకుడుగా పెట్టుబడులు పెట్టుకుంటూ వెళ్లడమే ముందున్న మార్గం.

నిఫ్టీ ఇండెక్స్ ఫండ్‌లో మంచిది ఏదనే విషయంలో సందేహం నెలకొంది. ఏ పథకం మంచిది? – రమేష్

ఇండెక్స్ ఫండ్‌ను ఎంపిక చేసుకునే విషయంలో పరిశీలించాల్సిన ముఖ్య అంశాలు రెండున్నాయి. ఒకటి ఎక్స్‌పెన్స్ రేషియో. ప్రస్తుతం ఇండెక్స్ ఫండ్స్ మధ్య చాలా పోటీ ఉంది. 10–15 బేసిస్ పాయింట్ల (0.1–0.15 శాతం) ఎక్స్‌పెన్స్ రేషియోకే ఇండెక్స్ ఫండ్స్ డైరెక్ట్ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. కనుక అంతకంటే ఎక్కువ చెల్లించాల్సిన అవసరం లేదు. రెండోది ట్రాకింగ్ ఎర్రర్. ఒక ఇండెక్స్ ఫండ్.. తాను పెట్టుబడులను అనుసరించే ఇండెక్స్‌తో పోలిస్తే రాబడుల విషయంలో ఎంత మెరుగ్గా పనిచేసిందన్నది ఇది చెబుతుంది. ఇండెక్స్ ఫండ్ నిర్వహణ బృందం సామర్థ్యాన్ని ఇది ప్రతిఫలిస్తుంది. తక్కువ ఎక్స్‌పెన్స్ రేషియోతోపాటు.. ట్రాకింగ్ ఎర్రర్ తక్కువగా ఉన్న పథకం మెరుగైనది అవుతుంది. ఈ రెండు అంశాలను ప్రామాణికంగా చేసుకుని చూసిన తర్వాత నచ్చిన పథకాన్ని ఎంపిక చేసుకోవచ్చు.

కుప్పకూలిన మూడంతస్తుల లాడ్జి



ప్రకాశం జిల్లా పెద్దదోర్నాలలో కుంగిన లాడ్జి భవనం

పెద్దదోర్నాల: ప్రకాశం జిల్లా పెద్దదోర్నాలలో భారీ ప్రమాదం తప్పింది. మండల కేంద్రం లోని శ్రీశైలం రహదారిలో 12 ఏళ్ల క్రితం నిర్మించిన ఓ లాడ్జి భవనం కూలిపోయింది. అమెరికాలో నివాసముండే పరుచూరి సుబ్బారావుకు చెందిన ఈ లాడ్జి పక్కనే అతడి సోదరుడు రామారావు నూతన అండర్ గ్రౌండ్ భవన నిర్మాణం కోసం ఇటీవల 12 అడుగుల లోతులో భారీ పునాది గుంత ఏర్పాటు చేసి పిల్లర్లు, కాంక్రీట్ పనులు మొదలు పెట్టాడు. శనివారం సాయంత్రం నుంచి లాడ్జి భవనం గోడల నుంచి చిన్న పాటి శబ్దాలు వస్తుండటాన్ని లాడ్జి నిర్వాహకుడు వెంకటేశ్వరరెడ్డి గుర్తించాడు. దీంతో ఏదో ప్రమాదం జరగబోతుందన్న ఆందోళనతో లాడ్జిలో ఉన్న వారిని ఖాళీ చేయించి లాడ్జిని మూసివేశాడు. శనివారం అర్ధరాత్రి నుంచి లాడ్జి కొద్దిగా పక్కనున్న పునాదుల్లోకి కుంగటం మొదలు పెట్టింది. అర్ధరాత్రి సమయంలోనే విద్యుత్ శాఖకి సమాచారమిచ్చి విద్యుత్ సరఫరా తీగలను కట్ చేయించటంతో పాటు, లాడ్జి ముందు పార్క్ చేసిన వాహనాల యజమానులకు సమాచారమిచ్చి వాహనాలను ఆ ప్రాంతం నుంచి తొలగించారు. ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో ఒక్కసారిగా లాడ్జి పేక మేడలా కుప్పకూలింది. ఈ ఘటనలో రూ.కోటి వరకు నష్టం వాటిల్లినట్లు నిర్వాహకుడు తెలిపారు.

విద్యార్థుల ఎదుగుదలే

ప్రభుత్వ ‘సంకల్పం’

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు లైఫ్ స్కిల్స్‌పై ప్రభుత్వం శిక్షణ

నిత్య జీవితంలో సమస్యలను అధిగమించేలా తర్ఫీదు



సాక్షి, అమరావతి: విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు, కనీవినీ ఎరుగని పథకాలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపింది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసింది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలను సమూలంగా తీర్చిదిద్దిన ప్రభుత్వం.. వాటిలోని పేదింటి పిల్లలు ప్రపంచ స్థాయి పోటీని ఎదుర్కొనేలా తీర్చిదిద్దనుంది. ఇందుకోసం రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై శిక్షణనివ్వడానికి ‘సంకల్పం’ పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించింది. ‘భవిష్యత్తులో ఏదైనా సమస్య ఎదురైతే పారిపోవడం కాదు.. ఎదుర్కొని పరిష్కారం వెతకాలి.. భిన్న మనస్తత్వాలు ఉన్న బృందాన్ని కలుపుకుని విజయవంతంగా పనిచేయగలగాలి.. ఇందుకు భావోద్వేగాలను నియంత్రించుకోగలగాలి’.. వంటి వాటిపై శిక్షణ మేనేజ్‌మెంట్ స్కూళ్లకు మాత్రమే ఇన్నాళ్లూ పరిమితమైంది. ఇప్పుడు దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలోనూ ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులోకి వచ్చింది. తొలిదశలో భాగంగా 1,300 ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 8వ తరగతి వరకు శిక్షణ మొదలైంది. పాఠశాల విద్యాశాఖ, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ కలిసి ఉచితంగా ఈ శిక్షణను అందిస్తున్నాయి. మూడు దశల్లో మూడేళ్లపాటు దాదాపు 13 లక్షల మంది విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ శిక్షణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ.. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 1,300 పాఠశాలల్లో (జిల్లాకు 50 స్కూళ్లు) సంకల్పం పథకాన్ని అమలు చేస్తోంది. ప్రతి శుక్రవారం ఒక గంట సమయాన్ని ఇందుకు కేటాయించారు. మొదటి దశలో 26 జిల్లాల్లోని 1,011 పాఠశాలల్లో గతేడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో సంకల్పం కార్యక్రమాన్ని ప్రారంభించగా, ఇటీవల మరో 289 పాఠశాలలకు విస్తరించారు. వచ్చే రెండేళ్లలో మొత్తం 6,790 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని విస్తరించాలని విద్యాశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా వచ్చే ఏడాది మరో 2,600 స్కూళ్లలో ప్రవేశపెట్టనుంది.

సంకల్పం అమలు ఇలా..



- జిల్లాకు 50 చొప్పున 26 జిల్లాల్లో హైస్కూళ్ల ఎంపిక
- మొత్తం 1,300 ప్రభుత్వ హైస్కూళ్లలో కార్యక్రమం
- వచ్చే విద్యా సంవత్సరంలో 2,600 స్కూళ్లకు విస్తరణ
- మూడో ఏడాది మొత్తం 6,790 స్కూళ్లలో శిక్షణ
- 6-8 తరగతుల విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై తర్ఫీదు
- మూడేళ్లల్లో మూడు దశల్లో 13 లక్షల మందికి శిక్షణ

2,600 మంది ఉపాధ్యాయులకు శిక్షణ

గతేడాది ఫిబ్రవరిలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఏపీఎస్‌సీఈఆర్‌టీ)తో ఒప్పందం కుదుర్చుకుంది. ‘సంకల్పం’ శిక్షణను ఉచితంగా అందించేందుకు ముందుకొచ్చింది. ఇందుకోసం 130 మంది మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చింది. ఈ మాస్టర్ ట్రైనర్లు 13 జిల్లా ఉపాధ్యాయ శిక్షణా కేంద్రాలు (డైట్స్) నుంచి 52 మంది ఫ్యాకల్టీలు, ఒక్కో స్కూల్‌కు ఇద్దరు చొప్పున 26 జిల్లాల నుంచి 2,600 మంది ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణనిచ్చారు. వీరు ఆయా స్కూళ్లలో విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించిన సిలబస్ ప్రకారం శిక్షణనిస్తారు. శిక్షణ రోజు ఇచ్చిన టాస్క్‌లను విద్యార్థులు స్వయంగా మ్యాజిక్ షీట్ల ఆధారంగా పూర్తి చేస్తున్నారు. తద్వారా వారు నేర్చుకున్న అంశాలను శిక్షకులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ విద్యార్థులకు స్వీయ-నిర్వహణ, సమస్య-పరిష్కారం, సరైన నిర్ణయం తీసుకోవడం, భావవ్యక్తీకరణ సామర్థ్యాలు వంటి వివిధ కార్యాచరణ-ఆధారిత జీవిత నైపుణ్యాలను విద్యలో అంతర్భాగం చేయడం దేశంలో మన రాష్ట్రంలోనే ప్రారంభమైందని పాఠశాల విద్యా కమిషనర్ సురేష్ కుమార్ తెలిపారు. ఈ శిక్షణ కౌమారదశలో ఉన్న విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి, వారి ఉజ్వల భవిష్యత్‌కు దోహదం చేస్తుందన్నారు.

ఈ 11 అంశాలపై శిక్షణ..

సమాజంలో అనేక సందర్భాల్లో వివిధ సమస్యలు ఎదురవుతుంటాయి. ఇవి ప్రాంతాన్ని బట్టి మారుతుంటాయి. అయితే ఇంటి నుంచి మొదలుపెట్టి ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా సాధారణంగా ఎదురయ్యే అంశాలు 11 ఉన్నట్టు అంతర్జాతీయ సర్వే ద్వారా గుర్తించారు. ఆ అంశాలపై వివిధ దశల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని ‘కాగ్నిటివ్, సోషల్, ఎమోషనల్’ అనే మూడు భాగాలుగా విభజించింది. ఏడాదికి ఒక అంశంపై మూడేళ్లపాటు శిక్షణ ఇవ్వనుంది.

- కాగ్నిటివ్‌లో.. సమస్యల పరిష్కారం, సరైన నిర్ణయం తీసుకోవడం, సెల్ఫ్ మేనేజ్‌మెంట్, సృజనాత్మకతపై శిక్షణ ఉంటుంది. విద్యార్థులు తమ ఇల్లు, పరిసరాల్లో గుర్తించినవి, వారికి అవగాహన ఉన్న అంశాలపై తొలి ఏడాది శిక్షణనిస్తున్నారు.
- సోషల్ విభాగంలో.. ఎదుటివారిపై సానుభూతి ఎప్పుడు చూపాలి (ఎంపతి), నిశ్చయత (అసెర్టివ్‌నెస్), చర్చించి సమస్యను పరిష్కరించడం (నెగోషియేషన్), పరస్పర సహకారం (కొలాబరేషన్), కమ్యూనికేషన్ వంటి అంశాలు ఉన్నాయి. రెండో ఏడాది మొత్తం ఈ అంశాలపైనే శిక్షణ ఉంటుంది.
- ఎమోషనల్ (భావోద్వేగాలు) విభాగంలో.. స్వీయ అవగాహన (సెల్ఫ్ అవేర్‌నెస్), అనుకూలత అంశాలపైనా శిక్షణ ఉంటుంది. వీటన్నింటిపైనా కార్యాచరణ ఆధారిత (క్రీడలు, పరిశీలన) ద్వారా మూడో ఏడాది శిక్షణ ఉంటుంది.

నేడు తెలుగు భాషా రత్న పురస్కారాలు ప్రదానం

సాక్షి, అమరావతి: పత్రికా రంగంలో విశిష్ట సేవలందిస్తున్న పలువురికి సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం చైర్మన్, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షుడు పి.విజయబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రవాసాంధ్ర తెలుగు సంఘం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సౌజన్యంతో.. పత్రికా రంగంలో మూడున్నర దశాబ్దాల నుంచి ఐదు దశాబ్దాల పాటు సేవలందించిన నిష్ణాతులైన కొందరికి జీవన సాఫల్య పురస్కారాలు అందజేస్తామన్నారు. అలాగే తెలుగు భాషా సేవలో ప్రతిభ కనబరుస్తున్న వారికి విశిష్ట సేవా పురస్కారాలు, జర్నలిజంలో దశాబ్దానికి పైగా తెలుగు భాషా సేవ చేస్తున్న వారికి సేవారత్న పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులైన సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ, దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజను కూడా జీవన సాఫల్య పురస్కారాలతో సత్కరించనున్నట్లు తెలిపారు.

కొలకలూరికి మరో సాహిత్య పురస్కారం

ఏలూరు (ఆర్ఆర్ పేట): పద్మశ్రీ అవార్డు గ్రహీత కొలకలూరి ఇనాక్ మరో సాహిత్య పురస్కారం అందుకున్నారు. ఏలూరులో గుప్త ఫౌండేషన్ ఆధ్వర్యంలో మదుపల్లి కృష్ణమూర్తి సాహిత్య పురస్కార ప్రదాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇనాక్‌కు రూ.3 లక్షల నగదు పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ద్రవిడ యూనివర్సిటీ ఉపకులపతి మధుజ్యోతి, మదుపల్లి మల్లీశ్వరి గుప్త, ఆడిటర్ సుబ్బారావు పాల్గొన్నారు.

రైతులపై అభాండాలు వేయడం దారుణం

- డబ్బులు ఇచ్చి నీళ్లు కొంటున్నారన్న ‘ఈనాడు’ కథనంపై తీవ్ర ఆగ్రహం
- ఈనాడు ప్రతులను దహనం చేసి రైతుల నిరసన

నంద్యాల(అర్బన్)/ దొర్నిపాడు: శ్రీశైలం ప్రాజెక్టు ముచ్చుమర్రి ఎత్తిపోతల నుంచి కేసీ కెనాల్‌కు వచ్చే సాగునీటిని రైతులు డబ్బులు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారంటూ ఈనాడు పత్రిక అభాండాలు వేయడం దారుణమని నంద్యాల మండలం మిట్నాల, గుంతనాల, గోస్పాడు మండలం తేళ్లపురి గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. డబ్బులు ఇచ్చి నీళ్లు కొంటున్నారంటూ ‘ఈనాడు’లో ఆదివారం ప్రచురితమైన వార్తా కథనంపై మండిపడ్డారు. కేసీ కెనాల్ ప్రధాన కాలువ వద్ద ఈనాడు ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. మరోసారి ఇటువంటి కథనాలు రాస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. నంద్యాల నియోజకవర్గంలోని పొన్నాపురం స్లూయిస్ కింద గత నెల 21 నుంచి 26వ తేదీ వరకు అధికారులు సాగునీటిని విడుదల చేశారు. అయితే, కొందరు పెద్ద రైతులు డబ్బులు ఇచ్చి నీరు విడుదల చేయించుకున్నారని ఈనాడు రాసిన కథనాన్ని ఆయా గ్రామాల రైతులు తీవ్రంగా ఖండించారు. నియోజకవర్గంలో మిరప పంటకు చివరి తడి సాగునీరు అందించడాన్ని పచ్చ పత్రికలు తప్పుపట్టడం అన్యాయమని రైతులు తిరుపతిరెడ్డి, రాజేశ్వరరెడ్డి, మణిరెడ్డి, రమణారెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాసులు, త్యారెడ్డి, పుల్లయ్య, హుస్సేన్, పురుషోత్తమరెడ్డి, శివరామిరెడ్డిలు ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుల మధ్య గొడవలు సృష్టించేలా కథనాలు రాయడం దుర్మార్గమన్నారు. డబ్బులు ఇచ్చి సాగునీరు కొనుక్కునే దుస్థితి రైతులకు లేదని, తాము ఎప్పుడూ ఏ అధికారికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని స్పష్టంచేశారు. రైతులు పంటలు సక్రమంగా పండించుకుంటే ముఖ్యమం



ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేసి నిరసన తెలియజేస్తున్న రైతులు

త్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జై కొడతారనే అక్కసుతోనే పచ్చపత్రిక అబద్ధాలు రాస్తోందన్నారు. తమ గ్రామాల పేర్లతో విషపురాతలు రాస్తే ఊరుకునేది లేదన్నారు. అధికారులు స్వచ్ఛందంగా కాల్వల వెంట తిరిగి రైతుల అవస్థలను గుర్తించి న్యాయబద్ధంగా నీళ్లు వదిలారని తెలిపారు.

పంటలు ఎండకూడదనే...

తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా జలాశయాల్లో పూర్తి స్థాయిలో నీరులేక పోయినా ప్రస్తుతం పంటలకు చివరి తడులు అందించేందుకు, రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని కుంటలు, చెరువులు నింపుకొనేందుకు అధికారులు కేసీ కాల్వకు నీటిని విడుదల చేశారని ఎంపీపీల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు గోపవరం అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. బడా వాణిజ్య రైతులతో అధికారులు కుమ్మక్కై నీటిని తెచ్చుకుంటున్నారని ఈనాడు పత్రిక రాయడం సరికాదన్నారు. పంటలు ఎండిపోకుండా జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి జోక్యం చేసుకుని నీరు విడుదల చేయించారని చెప్పారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.